


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 247

సోమవారం 28-11-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

రైతన్నా, నేనున్నా.. హామీ ఇచ్చా, అమలు చేస్తున్నా...

రైతన్నలకు నేడు అందిస్తున్న **"ఇన్ పుట్ సబ్సిడీ",**
"వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల వడ్డీ రాయితీ"

మొత్తం రూ. **200** కోట్లను బటన్ నొక్కి నేరుగా రైతన్నల ఖాతాల్లో జమ చేస్తున్న
గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వైఎస్. జగన్ మోహన్ రెడ్డి..





ఏ సీజన్లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే నష్ట పరిహారం చెల్లిస్తామన్న మాట మరోసారి నిలబెట్టుకుంటూ..

రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ

2022 జూలై-అక్టోబర్ మధ్య (ఖరీఫ్‌లో) కురిసిన అధిక వర్షాలు, వరదలకు పంట నష్టపోయిన **45,998** మంది వ్యవసాయ, ఉద్యానవన రైతన్నలకు రూ. **39.39** కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని ఖరీఫ్ 2022 ముగియక ముందే నేడు నేరుగా వారి ఖాతాలకు జమ..

నేడు జమ చేస్తున్న రూ. **39.39** కోట్లతో కలిపి జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన **21.31** లక్షల మంది రైతన్నలకు అందించిన మొత్తం ఇన్‌పుట్ సబ్సిడీ అక్షరాల రూ. **1,834.78** కోట్లు..

ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతన్నలకు సత్వర ఉపశమనం కల్పిస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఏ సీజన్ లో జరిగిన పంట నష్టానికి అదే సీజన్ ముగిసేలోగానే నష్ట పరిహారం పంపిణీ..

విపత్తుల సమయంలో జరిగిన నష్టానికి ఇప్పటివరకు జగనన్న ప్రభుత్వం రైతులకు అందించిన ఇన్‌పుట్ సబ్సిడీ...

పంట నష్ట కాలం	పరిహారం అందించిన తేది	రైతుల సంఖ్య	పెట్టుబడి సాయం (రూ. కోట్లలో)
2019-20 (భారీ వర్షాలు)	26th ఏప్రిల్, 2020	1.57 లక్షలు	123.70
ఏప్రిల్ - సెప్టెంబర్, 2020 (భారీ వర్షాలు)	27th అక్టోబర్, 2020	1.74 లక్షలు	146.24
అక్టోబర్, 2020 (భారీ వర్షాలు)	17th నవంబర్, 2020	1.97 లక్షలు	132.63
నవంబర్, 2020 (నివర్ తుఫాన్)	29th డిసెంబర్, 2020	8.34 లక్షలు	645.99
సెప్టెంబర్, 2021 (గులాబ్ తుఫాన్)	16th నవంబర్, 2021	0.35 లక్షలు	22.10
నవంబర్, 2021 (భారీ వర్షాలు)	15th ఫిబ్రవరి, 2022	5.97 లక్షలు	542.10
2018 (గత ప్రభుత్వం) లో తిత్లీ తుఫాన్ వల్ల నష్టపోయిన ఉద్యానవన పంటలకు అదనపు పరిహారం	22nd జూన్, 2022	0.91 లక్షలు	182.63
జులై - అక్టోబర్, 2022 (భారీ వర్షాలు)	28th నవంబర్, 2022	0.46 లక్షలు	39.39
మొత్తం సాయం		21.31 లక్షలు	1,834.78


పంటలు వేసే ప్రతిసారి రైతన్న పెట్టుబడి ఖర్చుల కోసం అధిక వడ్డీల వలలో చిక్కుకూడదన్న ఉద్దేశంతో సన్న, చిన్నకారు రైతులతో పాటు వాస్తవ సాగుదారులకు పంట రుణాలపై వడ్డీ భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా..

వరుసగా మూడో ఏడాది

వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు

రబీ 2020-21, ఖరీఫ్ 2021 లో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన **8,22,411** మంది రైతన్నలకు రూ. **160.55** కోట్ల వడ్డీ రాయితీ సొమ్ము వారి ఖాతాల్లో నేడు నేరుగా జమ..

గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు రూ. **1,180** కోట్లు, నేడు అందిస్తున్న రూ. **160.55** కోట్లతో కలిపి మన జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు "వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు" క్రింద **73.88** లక్షల మంది రైతన్నలకు అందించిన వడ్డీ రాయితీ రూ. **1,834.55** కోట్లు..



అన్నదాతలు అధిక వడ్డీలతో అప్పుల ఊబిలో కూరుకుపోకుండా వారికి అండగా నిలుస్తూ, ఈ-క్రాప్ డేటా ఆధారంగా లక్ష రూపాయల లోపు పంట రుణాలు తీసుకొని ఏడాది లోపు తిరిగి చెల్లించిన రైతన్నలకు పూర్తి వడ్డీ రాయితీని క్రమం తప్పకుండా అందిస్తున్న జగనన్న ప్రభుత్వం..

ఇది జగనన్న ప్రభుత్వం ఈ మూడేళ్ల ఐదు నెలల్లో రైతన్నలకు అందించిన సాయం...

పథకం	రైతుల సంఖ్య (లక్షల్లో)	ఆర్థిక సాయం (రూ. కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా	52.38	25,971.33
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	44.28	6,684.84
ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ)	21.31	1,834.78
ధాన్యం కొనుగోలు (నేటి వరకు)		48,793.87
ఇతర పంటల కొనుగోలు (నేటి వరకు)		7,156.00
ఉచిత వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ		27,800.00
ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ		2,647.00
పగటి పూట 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించేందుకు ఫీడర్ల సామర్థ్యం పెంపుకు..		1,700.00
శనగ రైతులకు బోనస్		300.00
సూక్ష్మ సేద్యం, పండ్ల తోటల అభివృద్ధి	13.58	1,264.24
ఆయిల్ పామ్ రైతులకు సబ్సిడీ	0.32	85.47
వైఎస్సార్ యంత్ర సేవా పథకం		690.87
విత్తన సబ్సిడీ	60.76	1,023.52
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు (మనం చెల్లించిన గత ప్రభుత్వ బకాయిలతో సహా)	73.88	1,834.55
మనం చెల్లించిన గత ప్రభుత్వ ధాన్యం సేకరణ బకాయిలు		960.00
గత ప్రభుత్వ కరెంటు బకాయిలు (మనం మన మీద వేసుకున్నది)		8,845.00
గత ప్రభుత్వం చెల్లించాల్సిన విత్తన బకాయిలు (మనం చెల్లించింది)		384.00
మొత్తం సాయం		1,37,975.47

శ్రీ. కాకాణి గోవర్ధన రెడ్డి, వ్యవసాయ, సహకార, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ శాఖామాత్యులు


గత ప్రభుత్వం	మన ప్రభుత్వం
• అశాస్త్రీయంగా పంట నష్టాల అంచనా.. రైతన్నలు మధ్యదళారులు, క్షేత్రస్థాయి ఉద్యోగుల చుట్టూ ఏళ్ళ తరబడి తిరిగినా పరిహారం అందుతుందో లేదో తెలియని దుస్థితి.. కొన్ని సందర్భాల్లో పూర్తిగా ఎగ్గొట్టి, మరికొన్ని సందర్భాల్లో రెండు మూడు సీజన్ల తరువాతే సాయం అందించేవారు.. అదీ అరకొరగానే..	• ఈ-క్రాప్ డేటా ఆధారంగా శాస్త్రీయంగా పంట నష్టాలు అంచనా.. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ సోషల్ ఆడిట్ కొరకు రైతు భరోసా కేంద్రాల్లో లబ్ధిదారుల జాబితాల ప్రదర్శన.. గ్రామ స్థాయిలోనే రైతులు తమ వివరాలు చూసుకొని, పేర్లు లేకపోతే ఫిర్యాదు చేసుకొనే వెసులుబాటు.. వెరిఫై చేసి పొరపాటు జరిగితే సరిదిద్దే కార్యక్రమం ..
• 2014 ఖరీఫ్‌లో వచ్చిన కరువుకు నవంబరు 2015లో, 2015 కరువుకు నవంబరు 2016లో, 2016 కరువుకు జూన్ 2017 లో, 2017 కరువుకు ఆగస్టు 2018 లో, 2018 పెథాయి సైక్లోన్ నష్టాలకు ఫిబ్రవరి 2019 లో సాయం.. అదీ అరకొరగా... • 2015 నవంబరు, డిసెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు జరిగిన రూ. 260.43 కోట్ల పంట నష్టానికి, 2018లో కరువు వల్ల ఖరీఫ్‌లో జరిగిన రూ. 1,832.28 కోట్ల పంట నష్టానికి, రబీలో రూ. 356.45 కోట్ల నష్టం అంటే మొత్తం రూ. 2,449.16 కోట్ల పంట నష్టానికి గాను అందించిన ఇన్‌పుట్ సబ్సిడీ "సున్నా"..	• ఏ సీజన్ లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగా క్రమం తప్పకుండా ఇన్‌పుట్ సబ్సిడీ నేరుగా రైతన్నల ఖాతాల్లోనే జమ చేస్తున్న జగనన్న ప్రభుత్వం.. • మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడేళ్ల ఐదు నెలల్లో 21.31 లక్షల మంది రైతన్నలకు అందించిన ఇన్‌పుట్ సబ్సిడీ రూ.1,834.78 కోట్లు..
• కౌలు రైతులకు ఎలాంటి మేలు జరగలేదు..	• ఈ-క్రాప్ డేటా ఆధారంగా శాస్త్రీయంగా పంట నష్టాలు అంచనా వేసి కౌలు రైతులతో సహా వాస్తవ సాగుదార్లకు లబ్ధి..
• 2014 నుండి 2019 వరకు మొత్తం రూ.1,180.66 కోట్ల పంట రుణాల వడ్డీ రాయితీ సొమ్ము ఏటేటా బకాయిలు పెట్టిన వైనం.. పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన దుస్థితి..	• గత ప్రభుత్వ బకాయిలతో కలిపి ఈ మూడేళ్ల ఐదు నెలల్లో 73.88 లక్షల మంది రైతన్నలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల క్రింద అందించిన మొత్తం వడ్డీ రాయితీ రూ.1,834.55 కోట్లు..

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైఎస్. జగన్ మోహన్ రెడ్డి 28 నవంబర్, 2022 నాడు ఉదయం 11 గంటలకు సీఎం క్యాంపు కార్యాలయం నుండి బటన్ నొక్కి "రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ", "వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల వడ్డీ రాయితీ" ని వారి ఖాతాల్లో నేరుగా జమ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్ల లైవ్‌లో వీక్షించవచ్చు...

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

గురువాణి

ఐరాసను మెప్పించిన మహాస్వామి సందేశం



పరమాచార్యగా పేరు గాంచిన కంచికామకోటి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామివారు ఒకానొకప్పుడు ఐక్యరాజ్యసమితి దినోత్సవం సందర్భంగా సర్వ ప్రతినిధి సభలో ప్రపంచ దేశాల సఖ్యత కోరుతూ స్వయంగా సంస్కృతంలో రాసి పంపిన ఒక సందేశాన్ని ప్రఖ్యాత గాయని శ్రీమతి ఎం.ఎస్. సుబ్బులక్ష్మిగారు ఆలపిస్తే... అనువాదసహితంగా విన్న సభ్య దేశాల ప్రతినిధులందరూ ప్రశంసాపూర్వకంగా లేచి నిలబడి చేసిన కరతాళ ధ్వనులతో సభాప్రాంగణం మార్మోగిపోయింది. ఆ శ్లోకం– మైత్రీం భజత, అఖిల హృత్ జైత్రీం ఆత్మవదేవ పరాన్నపి పశ్యతః యుద్ధం త్యజత, స్పర్ధాం త్యజతః త్యజత పరేషు అక్రమ ఆక్రమణం జననీ పృథివీ కామదుహాస్తే జనకో దేవః సకల దయాళుః 'దామ్యత, దత్త, దయధ్వం' జనతాః శ్రేయో భూయాత్ సకల జనానాం

అంటే... ఎప్పుడూ స్నేహభావంతో మెలగండి. పక్కవాడిని ప్రేమించండి తప్ప ద్వేషించకండి. ద్వేషించడం మొదలుపెడితే ప్రతివారిలో ఏదో లోపం చూడాలి.. లోపం లేని వారెవరుంటారు. ఒకరోజు అంటే పగలు, చీకటి రెండూ ఉంటాయి. కాబట్టి లోపాలను, ద్వేషాలను ఎంచకుండా వ్యక్తులయినా, దేశాలయినా మిత్రభావంతో మెలగండి. మీలో ఏ ఆత్మ ఉంటుందో అందరిలో అదే ఉంటుందనే భావన చేసుకుంటూ ఉండండి. నా కాలికి దెబ్బ తగిలితే నేనెంత బాధపడతానో ఇతరులకు కూడా అంతే అని గ్రహించండి.

యుద్ధం చేయడం సమస్యలకు పరిష్కారం కాదు. ప్రేమతో కలిసిమెలిసి జీవించాలని చేసుకొన్న సంధి మాత్రమే శాశ్వతంగా ఉంటుంది. పైగా యుద్ధంలో ఈవేళ ఒకరిది పైచేయి అయితే రేపు మరొకరిది పై చేయి అవుతుంది. ఆ సూక్ష్మం తెలుసుకొని వైషమ్యాలు విడనాడండి. ఒకళ్ళ మీద మరొకళ్ళు దురాక్రమణ చేసుకొనే సిద్ధాంతాన్ని వదిలిపెట్టండి.

ఎవరు ఎక్కడ ఏ దేశంలో ఉన్నా అందరం బతుకుతున్నది ఒకే మట్టిలోనే. కలిసిపోయేది దానిలోనే. దానిలోంచే వచ్చిన ఆహారం తినే బతుకుతున్నాం. ఎన్నో వైభోగాలకు దానినుంచి లభించిన ముడిపదార్థాలే మనకు ఆధారమవుతున్నాయి. అందుకని మనందరికీ తల్లి ఆ భూమాత. అలాగే మనం ఏ పేరుతో పిలిచినా పలికే ఆ భగవంతుడు ఒక్కడే.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఆయన దయామయుడు. మనం సుఖంగా బతకడానికి అవకాశమిస్తున్న ఆయన బిడ్డలుగా మనం ఆయన మనకిచ్చిన ప్రేమ భావాన్ని పెంపొందించుకోవాలిగదా !

అని చెబుతూ ఈ శ్లోకంలో 'దామ్యత, దత్త, దయధ్వం'అనే ఒక ఉపనిషత్ వాక్యాన్ని కూడా స్వామివారు చేర్చారు. దాని ప్రకారం ... దేవతలు, మనుషులు, రాక్షసులు ఆ ప్రజాపిత సంతానం. ఒకసారి ఏదయినా మంచిమాట చెప్పమని వారు ప్రజాపిత బ్రహ్మను కోరినప్పుడు...ఆయన ముగ్గురికీ 'ద' అనే ఒకే అక్షరంతో వేర్వేరుగా పాఠం చెప్పారు. దాన్ని ఎలా అర్థం చేసుకొన్నారని వారిని అడిగితే 'ద' అంటే 'దమం' అనీ, ఇంద్రియ నిగ్రహంతో, మనో నిగ్రహంతో ఉండమని చెప్పారని దేవతలు, 'దత్త' అంటే లోభ గుణం వదిలి దానగుణంతో పదిమందిని సంతోషపెట్టేలా బతకమని చెప్పారని మనుషులు, 'ద' అంటే 'దయ'తో పదిమందికి ఉపకారం చేస్తూ దయాగుణంతో బతకమని చెప్పారని రాక్షసులు జవాబిస్తారు.

జగద్గురువులన్న పేరుకు తగ్గట్టుగా మహాస్వామి లోకకళ్యాణం కోరుతూ ప్రపంచదేశాలకు ఇచ్చిన ఈ సందేశాన్ని ఆ సభకు హాజరయిన ప్రతినిధులందరూ ఎంతో స్ఫూర్తిదాయకంగా తీసుకొన్నారు.

అమృత బిందువులు

జీవితం ఆనందంగా గడపాలంటే ...,
క్షమించలేని వారిని మరచిపోవాలి.
మరచిపోలేని వారిని క్షమించెయ్యాలి.

కోల్పోయిన వాటి గురించే ఆలోచిస్తుంటే
ఉన్నవాటిని కూడా కోల్పోవాల్సి వస్తుంది.

అందమైన రూపం ఉన్న ప్రతి ఒక్కరూ
ఆనందంగా ఉండకపోవచ్చు.
కానీ... అందమైన మనసు ఉన్న ప్రతి
ఒక్కరూ ఆనందంగా ఉండగలరు.



ఇస్లాం వెలుగు

ఇహలోక జీవితం పరీక్ష

ప్రాపంచిక జీవితం ఒక పరీక్ష. ఇది మానవుడు పరీక్షింపబడే స్థలం. ఎవరు ఏస్థితిలోఉన్నా ఆ స్థితిలోనే వారు పరీక్షించబడుతున్నారు. ఎవరు విశ్వాసులో, ఎవరు అవిశ్వాసులో, ఎవరు విధేయులో, ఎవరు తిరస్కారులో, ఎవరు ధర్మానువర్తనులో, ఎవరు దుర్మార్గులో తెలుసుకోడానికే పరీక్ష. ఒకవైపు సత్యం, మరోవైపు అసత్యం, ఒకవైపు ధర్మం, మరోవైపు అధర్మం – మనిషి ఎటువైపు మొగ్గుతాడన్నదే పరీక్ష. మంచీ చెడు, ధర్మం అధర్మం.. మనిషి ఇందులో ఏదో ఒక మార్గాన్ని ఎంచుకోవాలి. మరోమార్గంలేదు. దేవుడు మానవుడికి ఈ పరీక్ష పెట్టేముందే సత్యాసత్యాలను, అతనికి ఎరుక పరిచాడు. ధర్మాధర్మాలను బోధపరిచాడు. ప్రవక్తలద్వారా, గ్రంథాలద్వారా విషయాన్ని విశదీకరించాడు. అంతేకాదు, విచక్షణా జ్ఞానాన్ని, స్వేచ్ఛను, నిర్ణయాధికారాన్నీ ప్రసాదించాడు. మానవుడు దైవాదేశాలకనుగుణంగా ధర్మబద్ధమైన జీవితం గడిపితే ఇహ పరలోకాల్లో సాఫల్యం పొందుతాడు. కాదంటే దేవుని ఆగ్రహానికి గురై ఇహంలోనూ, పరంలోనూ పరాభవం పాలవుతాడు. దేవుని ఆగ్రహాన్నుండి, ఆయన శిక్ష నుండి తప్పించుకోడానికి మరే మార్గమూ లేదు. ఎందుకంటే, దేవుడు అతనికి ముందే బుద్ధిజ్ఞానాలను ప్రసాదించి, ధర్మాధర్మాలను విడమరిచాడు. ఇది మంచీ, అది చెడు, ఇది ధర్మం, అది అధర్మం, ఇది న్యాయం, అది అన్యాయం అని స్పష్టంగా వివరించి, ఈ మార్గంపై నడిస్తే స్వర్గానికి పోతావని, ఆ మార్గాన్ని అనుసరిస్తే నరకానికి వెళతావని స్పష్టంగా చెప్పేశాడు. కనుక తప్పించుకునే దారి లేదు. అందుకని బుద్ధి జీవి అయిన మానవుడు దైవం తనకు మాత్రమే ప్రసాదించిన విచక్షణా జ్ఞానాన్ని, ఆలోచనా శక్తిని, స్వయం నిర్ణయాధికార స్వేచ్ఛను దుర్వినియోగం చేయకుండా ధర్మబద్ధంగా దైవాభీష్టమైన జీవితం గడపాలి. తాత్కాలికమైన ఈ ప్రాపంచిక జీవితాన్ని శాశ్వతమైన సాఫల్య జీవితానికి ఆలంబనగా చేసుకోవాలి. విజయం కోసం తపించే విద్యార్థి ఎలా శ్రమిస్తాడో, పరీక్ష హాలులో రెండున్నర, మూడుగంటల సమయాన్ని ఎంత తెలివిగా సద్వినియోగం చేసుకుంటాడో, అంతకన్నా ఎక్కువ దీక్షతో ఇహలోక జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పరీక్ష రాసే విద్యార్థికి ఆ కొద్ది పాటి సమయం ఎంత విలువైనదో, చాలా చిన్నదైన ఈ ప్రాపంచిక జీవితం అంతకన్నా అమూల్యమైనది.

సమాజ హితం, సర్వమానవ సంక్షేమమే ధ్యేయంగా పెట్టుకుంటే అంతకన్నా ధార్మికత, అంతకన్నా మానవత మరేమీ ఉండదు. అన్యాయం, అక్రమాలు, అవినీతి, దుర్మార్గాలకు దూరంగా నిజాయితీగా విలువలతో కూడిన జీవితం గడిపితేనే దేవుడు సంతోషిస్తాడు. సమాజమూ హర్షిస్తుంది. ఇదేమీ పట్టకుండా భౌతిక ప్రగతే ప్రధానంగా ఇష్టానుసార జీవితం గడిపితే, పరీక్షా సమయం ముగిసిపోతుంది కాని, విజయం మాత్రం అందని ద్రాక్షగానే మిగులుతుంది. ఇహ పరాల్లో వైఫల్యం చవిచూడవలసి వస్తుందన్న నిజాన్ని గుర్తించి దైవభీతితో నడుచుకోవాలి.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

మంచి మాట



పాతుకుపోయినా... తప్పు తప్పే!

సంస్కరణలకూ, కచ్చితత్వానికీ మన జీవన విధానంలోనూ సమాజంలోనూ, కళారంగంలోనూ వ్యతిరేకత ఎదురౌతూనే ఉంటుంది. తప్పులకూ, అనర్థాలకూ అలవాటుపడ్డ పాతబృందం సంస్కరణలనూ, నిర్దుష్టతనూ స్వీకరించనూ లేదు, హర్షించనూ లేదు. పాతుకునిపోయి ఉన్నాయి కదా అని పాత తప్పుల్ని గుడ్డిగా అందుకుని ఆచరించకూడదు.

పాతది కాబట్టి అదంతా మంచిది కాదు; కొత్తదైనందువల్ల అది అధమమైనది లేదా పనికిమాలినది కాదు; తెలివైనవాళ్లు పలు పరిశీలనలు చేసి (విషయాన్ని) తీసుకుంటారు; మూఢులు పరులను అనుసరిస్తారు అన్న ఎరుకను కాళిదాసు ఎప్పుడో తెలియజెప్పారు. ఈ సత్యాన్ని మనం ఎప్పటికప్పుడు గుర్తు చేసుకుంటూనే ఉండాలి. సంస్కరణలను, నిర్దుష్టత్వాన్ని ఎంత మాత్రమూ స్వీకరించలేని, హర్షించలేని పాత బృందానికి అతీతంగా నేటి తరమైనా సంస్కరణలతో కచ్చితత్వాన్ని సాధించగలగాలి. 'పాత అడుగుజాడలు తొలగిపోయినప్పుడు అద్భుతాలతో కొత్తదేశం వ్యక్తమౌతుంది' అని రవీంద్రనాథ్ ఠాగూర్ చెప్పిన దాన్ని మనం ఆలోచనల్లోకి తీసుకోవాలి.

అలవాటయ్యాయి కదా అని తప్పుల్ని ఆచరించడం, కొనసాగించడం సరికాదు. అలవాట్ల ఏట్లో పడి కొట్టుకుపోతూ ఉండడం మనిషి జీవనానికి పరమార్థం కాదు. 'మనం చూడం; ఎందుకంటే మనకు చూడడం గురించి అభిప్రాయాలున్నాయి' అని జిడ్డు కృష్ణమూర్తి ఉన్న లోపాన్ని చెప్పారు. అందుబాటులో ఉన్నవి సరైనవి అనే అభిప్రాయానికి అతీతంగా మనం కళ్లు తెరుచుకుని చూడాలి. తప్పుల్ని దాటుకుని కచ్చితత్వంలోకి వెళ్లడానికీ ఆపై సరిగ్గా ఉండడానికీ ధైర్యం, సాహసం ఈ రెండూ మనకు నిండుగా ఉండాలి. ఇవి లేకపోవడం వల్లే మనలో చాల మంది పాత తప్పుల్లో బతుకుతూ ఉంటారు. తప్పులకు అలవాటుపడి కొనసాగడం ఒక రకమైన బానిసత్వం. ఆ బానిసత్వం నుంచి మనం ధైర్యసాహసాలతో విముక్తమవ్వాలి. సరిగ్గా ఉండడం కోసం మనం ప్రయత్నిస్తూనే ఉండాలి. మనలో చలామణి అవుతున్న తప్పుల్ని మనం తెలుసుకోవాలి. వాటి నుంచి తప్పించుకోవాలి. వాటిని మనం తప్పించెయ్యాలి. తప్పుల వల్ల గతంలో జరిగిన కీడును వర్తమానంలోనూ, భవిష్యత్తులోనూ జరగకుండా పరిశ్రమించాలి.

నీళ్లవల్ల శరీరం శుభ్రపడుతుంది; సత్యంవల్ల మనస్సు శుభ్రపడుతుంది; జ్ఞానం వల్ల బుద్ధి శుభ్రపడుతుంది; విద్యవల్లా, తపస్సువల్లా స్వభావం శుభ్రపడుతుంది. నీళ్లతో శరీరాన్ని శుభ్రం చేసుకోవడం మనకు తెలిసిందే. సత్యంతో మనస్సును శుభ్రంచేసుకోవడం మనం నేర్చుకోవాలి. జ్ఞానం వల్ల బుద్ధి శుభ్రపడుతుంది అన్న దాన్ని మనం అనుభవంలోకి తెచ్చుకోవాలి. విద్యవల్లా, తపస్సు(సాధన)వల్లా స్వభావం శుభ్రపడుతుందనడానికి మనమే ఋజువులుగా నిలవాలి. ముందటి తరాల ద్వారా చింతన, చేష్టల పరంగా మనకు తప్పులు అంటుకున్నాయి. దురదృష్టవశాత్తు కొన్ని విషయాల్లో ఆ తప్పులే ఒప్పులుగా రూఢీ అయిపోయాయి. దాని వల్ల జీవన, సామాజిక, కళల ప్రమాణాలు, ప్రయోజనాలు దెబ్బతిన్నాయి. ఈ వాస్తవాన్ని ఇకనైనా అవగతం చేసుకోవాలి. ఈ అవాంఛనీయమైన పరిస్థితిని ఎదిరించి పోరాడి విజయం సాధించాలి.

> పాతుకుని పోయి ఉన్నాయి కదా అని పాత తప్పుల్ని గుడ్డిగా అందుకుని ఆచరించకూడదు

తప్పులకూ, అనర్థాలకూ అలవాటుపడ్డ పాత వాళ్ల దగ్గర మేలు, మంచి ఈ రెండూ లేవు కాబట్టి వాళ్లు అవి జరగకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. జీవనవిధానంలోనూ, సామాజికంగానూ, కళలలోనూ నిర్దుష్టతను వీళ్లు వ్యతిరేకిస్తూ ఉంటారు. ఎందుకంటే వీళ్లు సరైన దాన్ని స్వీకరిస్తే వాళ్లు తప్పుడు వాళ్లు అన్న నిజం స్థిరపడిపోతుంది కాబట్టి. చెడ్డవాళ్లకు సంస్కరణలతో శత్రుత్వం ఉంటుంది, ప్రతి సంస్కర్తా చెడ్డవాళ్లకు విరోధే!

కల్మషమైన పాతనీరు బురద అవుతుంది. హానికరమైన పాత బురదను మినహాయించుకోవాలి. కొత్త నడులను ఆహ్వానించాలి. కొత్త సంస్కరణల్ని మిళితం చేసుకుంటూ మునుముందుకు సాగడమే మనిషికి మేలైన జీవితం అవుతుంది. మూర్ఖత్వాన్ని వదిలించుకుని జ్ఞానాన్ని పొందడానికి ప్రపంచంలోకి ప్రవహించాలి మనం. సంస్కరణలు మనతో మొదలవ్వాలి. 'తమతో మొదలుపెట్టేవాళ్లే ఈ ప్రపంచం చూసిన ఉత్తమ సంస్కర్తలు' అని జార్జ్ బెర్నాడ్ షా అన్నారు. మనల్ని మనం సంస్కరించుకుంటూ కచ్చితత్వాన్ని సాధించుకుంటూ సరైన, ఉన్నతమైన మనుషులమౌదాం.

– రోచిష్మాన్

సినిమా



● గుత్తా జ్వాల, ఐశ్వర్య లక్ష్మి, విష్ణు విశాల్, రవితేజ, చెల్లా అయ్యావు, జస్టిన్ ప్రభాకరణ్

నిర్మాతగానూ నన్ను ప్రోత్సహించండి – రవితేజ

''మట్టి కుస్తీ' వేడుకకి నేను హీరోగా రాలేదు.. నేను కూడా ఒక నిర్మాతగా మాట్లాడుతున్నా. ఈ వేడుకకి మీరే(అభిమానులు) ముఖ్య అతిథులు. హీరోగా నన్ను ఎంతో సపోర్ట్ చేశారు.. అలాగే నిర్మాతగానూ ప్రోత్సహించండి'' అని రవితేజ అన్నారు. విష్ణు విశాల్, ఐశ్వర్య లక్ష్మి జంటగా చెల్లా అయ్యావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మట్టి కుస్తీ'. హీరో రవితేజతో కలిసి విష్ణు విశాల్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 2న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్‌లో రవితేజ మాట్లాడుతూ– ''విష్ణు విశాల్ చాలా పాజిటివ్ పర్సన్. తనని కలిసిన మొదటిసారి ఎన్నాళ్లో పరిచయం ఉన్న వాడిలా అనిపించాడు. సింగిల్ సిట్టింగ్‌లోనే 'మట్టి కుస్తీ' చిత్రం ఓకే అయిపోయింది. చెల్లా అయ్యావు ఈ చిత్ర కథ చెప్పినప్పుడు నవ్వి నవ్వి చచ్చాను. తనతో కచ్చితంగా ఓ సినిమా చేయాలి.. చేస్తాను. జస్టిన్ ప్రభాకరణ్‌తోనూ పనిచేస్తాను. రిచర్డ్ అద్భుతమైన విజువల్స్ ఇచ్చాడు. అందం, ప్రతిభ కలిస్తే ఐశ్వర్య లక్ష్మి. ఇందులో తన పాత్ర చాలా బాగుంటుంది. ఇది కేవలం స్పోర్ట్స్ ఫిలిం మాత్రమే కాదు. లవ్, ఫ్యామిలీ, యాక్షన్, ఎమోషన్.. ఇలా అన్నీ ఉన్నాయి. 'మట్టి కుస్తీ' చాలా బాగా వచ్చింది.. కచ్చితంగా అందరూ ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. ''రవితేజగారికి మంచి మానవత్వం, మనసు ఉంది. అలాంటి ఆయనకు అభిమానులైన మీరందరూ లక్కీ'' అన్నారు విష్ణు విశాల్. ''మట్టి కుస్తీ' కథ విష్ణువిశాల్‌గారికి బాగా నచ్చింది. ఈ సినిమాని తెలుగులోనూ తీయడానికి కారణం రవితేజసర్ ఇచ్చిన ప్రోత్సాహమే.. ఆయనకు రుణపడి ఉంటాను'' అన్నారు చెల్లా అయ్యావు. ''విష్ణుపై నమ్మకంతో ఒక్క మీటింగ్‌లోనే ఈ సినిమాను నేను నిర్మిస్తానని చెప్పారు రవితేజగారు.. అలా చెప్పాలంటే చాలా ధైర్యం ఉండాలి'' అన్నారు బ్యాడ్మింటన్ స్టార్, విష్ణు విశాల్ సతీమణి గుత్తా జ్వాల. ఈ వేడుకలో డైరెక్టర్స్ సుధీర్ వర్మ, వంశీ, ఐశ్వర్య లక్ష్మి, సంగీత దర్శకుడు జస్టిన్ ప్రభాకరణ్, కెమెరామేన్ రిచర్డ్ ఎం.నాథన్, రచయితలు రాకేందు మౌళి, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



● గాదరి కిశోర్, ఐశ్వర్య, ఇంద్రసేన, షణ్ముగం, రోజా, వేణు మడికంటి, తులసీరామ్, రవి బస్రూర్

శాసనసభ విజయం సాధించాలి – మంత్రి రోజా

''శాసనసభ' టైటిల్ ఆసక్తిగా ఉంది. ట్రైలర్ చాలా బాగుంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి, నటి రోజా అన్నారు. ఇంద్రసేన, ఐశ్వర్యారాజ్ జంటగా వేణు మడికంటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శాసనసభ'. తులసీ రామ్ సాప్పని, షణ్ముగం సాప్పని నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 16న రిలీజ్ కానుంది. హైదరాబాద్‌లో జరిగిన వేడుకలో ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను రోజా, కన్నడ ట్రైలర్‌ను తుంగతుర్తి ఎమ్మెల్యే గాధరి కిశోర్‌కుమార్, మలయాళ ట్రైలర్‌ను దర్శక–నటుడు చిన్నికృష్ణ, తమిళ ట్రైలర్‌ను నిర్మాత సతీష్ వర్మ విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ సాంగ్‌ను వైజాగ్ ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ– ''నా బ్రదర్‌లాంటి షణ్ముగంపై అభిమానం, సంగీత దర్శకుడు రవిబస్రూర్ వల్లే నేను ఈ వేడుకకు వచ్చాను. ఈ సినిమా హిట్ సాధించి నిర్మాతలు మరిన్ని సినిమాలు తీయాలి'' అన్నారు. ''ఈ సినిమా యూనివర్సల్ సబ్జెక్ట్'' అన్నారు తుంగతుర్తి ఎమ్మెల్యే గాధరి కిశోర్ కుమార్. ''శాసనసభ' చాలా స్ట్రాంగ్ టైటిల్'' అన్నారు ఇంద్రసేన. ''సురేష్ వర్మ, చిన్నికృష్ణగార్ల ద్వారా ఈ సినిమా చేసే అవకాశం వచ్చింది. అవకాశం ఇచ్చిన నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు వేణు మడికంటి. ''మంచి సబ్జెక్ట్, మంచి కమిట్‌మెంట్‌తో ఈ సినిమా తీశాం'' అన్నారు తులసీరామ్. ''నిర్మాతగా నా లాంచింగ్‌కు ఇంత మంచి ప్రాజెక్ట్ ఇచ్చిన ఇంద్రసేన, జగదీశ్వర్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డిలకు రుణపడి ఉంటాను'' అన్నారు షణ్ముగం సాప్పని. సంగీత దర్శకుడు రవి బస్రూర్, కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్ రైటర్ రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్, నిర్మాత సురేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



● రిషికా శర్మ, నిహాల్, ఆనంద్ శంకేశ్వర్, సిరి ప్రహ్లాద

విజయానంద్‌కి మహానటి స్ఫూర్తి – రిషికా శర్మ

''రెండున్నర సంవత్సరాల క్రితం 'విజయానంద్' సినిమా ప్రయాణం మొదలైంది. బయోపిక్స్‌లో తెలుగులో వచ్చిన 'మహానటి' వంటి సినిమా మళ్లీ రాదు. ఒకవిధంగా 'విజయానంద్' సినిమాకు 'మహానటి'యే ఓ స్ఫూర్తి. దర్శకులు రాజమౌళిగారికి నేను పెద్ద అభిమానిని'' అని డైరెక్టర్ రిషికా శర్మ అన్నారు. వీఆర్ఎల్ లాజిస్టిక్స్ అధినేత విజయ్ శంకేశ్వర్ బయోపిక్‌గా రూపొందిన చిత్రం 'విజయానంద్'. నిహాల్ రాజ్‌పుత్ హీరోగా నటించారు. రిషికా శర్మ దర్శకత్వంలో వీఆర్ఎల్ ఫిలింస్ పతాకంపై విజయ్ శంకేశ్వర్ తనయుడు డా.ఆనంద్ శంకేశ్వర్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, కన్నడ, తమిళ్, మలయాళం, హిందీ భాషల్లో డిసెంబర్ 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో నిహాల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ–''విజయ్ శంకేశ్వర్ గారి పాత్ర చేయడం చాలా పెద్ద బాధ్యత. 'విజయానంద్'అనేది మాకు సినిమా కాదు.. ఓ ఎమోషన్. 'మహానటి'లో కీర్తీసురేష్‌గారి తరహా పెర్ఫార్మెన్స్ చేయాలనుకున్నాను. తెలుగు సినిమాలు చాలా బాగుంటాయి. రాజమౌళిగారికి నేను బిగ్ ఫ్యాన్'' అన్నారు. ''రెండున్నర గంటల్లో ఈ కథను అద్భుతంగా చూపించిన రిషికాగారికి, బాగా నటించిన నిహాల్‌కి థ్యాంక్స్'' అన్నారు ఆనంద్ శంకేశ్వర్. నటీనటులు సిరి ప్రహ్లాద, భరత్, అనీష్ కురివిల్లా, యూఎఫ్ఓ లక్ష్మణ్ పాల్గొన్నారు.

తుపాకులగూడెంలో రెబల్స్

ప్రవీణ్ కండెలా, శ్రీకాంత్ రాథోడ్, జయేత్రి మకానా, శివరామ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రెబల్స్ ఆఫ్ తుపాకులగూడెం'. సంతోష్ మురారికర్ కథతో వారధి క్రియేషన్స్ పతాకంపై జైదీప్ విష్ణు దర్శకత్వం వహించిన ఈ సినిమా జనవరి 26న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను దర్శకుడు హనురాఘవపూడి విడుదల చేసి, చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. 'వెయ్యి అబద్ధాలు ఆడైనా ఓ పెళ్లి చేయమన్నారు కానీ మనం ఆడింది వందే..', 'ఈ పని ఆ ఒక్కడే చేయగలడు..సార్' వంటి డైలాగ్స్ టీజర్లో ఉన్నాయి. ''ఈ చిత్రంలో దాదాపు నలభైమంది నూతన నటీనటులు నటించారు. మణిశర్మగారి మ్యూజిక్, బ్యాగ్రౌండ్ స్కోర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ చివరి దశలో ఉన్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



● ప్రవీణ్, హను రాఘవపూడి, శ్రీకాంత్, జయేత్రి మకానా


క్రైమ్ థ్రిల్లర్



● కార్తీక్, సిమ్రాన్, మహేష్‌రెడ్డి

కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి జంటగా మహేష్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో పెగ్గో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సుభాష్ నూతలపాటి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా మహేష్ రెడ్డి మాట్లాడుతూ– ''వాస్తవ ఘటనలతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'అథర్వ'. రెగ్యులర్ ఇన్వెస్టిగేషన్ సినిమాల్లా మా చిత్రం ఉండదు.. ఎంతో ఇంటెన్సిటీ ఉంటుంది. ఆడియెన్స్ థ్రిల్ అవుతారు'' అన్నారు. ''అథర్వ' మూవీ నాకు ప్రత్యేకమైన అనుభూతిని ఇచ్చింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఫిబ్రవరిలో సినిమాని రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు సుభాష్ నూతలపాటి. ''కౌసల్యా కృష్ణమూర్తి' తర్వాత 'అథర్వ' చేశాను. క్లూస్ డిపార్ట్‌మెంట్‌పై ఈ సినిమా కథ సాగుతుంది'' అన్నారు కార్తీక్ రాజు. ''ఈ సినిమాలో నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పాను'' అన్నారు సిమ్రాన్ చౌదరి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: చరణ్ మాధవనేని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: విజయ, ఝాన్సీ.

రామాపురంలో ఏం జరిగింది?



● నందు, అఖిల, రామ్ జాక్కల, సోహైల్

రామ్ జాక్కల, అఖిల ఆకర్షణ, పి.యస్. రాజ్, సునీల్ మల్లెం ప్రధాన పాత్రల్లో హేమా రెడ్డి దర్శకత్వంలో రామ్ రెడ్డి అందూరి నిర్మించిన చిత్రం 'ఏపీ 04 రామాపురం'. ఈ సినిమా డిసెంబరు 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. అతిథిగా హాజరైన సోహైల్ మాట్లాడుతూ– ''ప్రతి ఒక్కరికీ టైమ్ వస్తుంది. ఈ దర్శకుడు ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చాడు. ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''ఈ చిత్రం ట్రైలర్ బాగుంది'' అన్నారు 'బిగ్ బాస్' ఫేమ్ జెస్సీ. 'ఈ మూవీకి మంచి వసూళ్లు రావాలి'' అన్నారు హీరో నందు. ''నాకు 19 ఏళ్లప్పుడు ఈ సినిమా కథ రాయడం స్టార్ట్ చేశాను. 23 సంవత్సరాలకు డైరెక్షన్ చేశాను. కొత్తవారికి ఇండస్ట్రీలో సపోర్ట్ ఉండదంటారు, కానీ నా సినిమా కోసం ఇంతమంది వచ్చి ప్రోత్సహించడం చాలా సంతోషంగా ఉంది'' అన్నారు. ''ఈ సినిమాను చిన్న బడ్జెట్‌లో చేశాం. ఎక్కువ బడ్జెట్ ఉంటే ఇంకా బాగా తీసేవాళ్లం'' అన్నారు రామ్ రెడ్డి అందూరి.

ఒక మాతృభాష కథ



● స్టెఫీ పటేల్, యష్ పూరి

సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఆర్‌బీ చౌదరి సమర్పణలో రూపొందిన 94వ చిత్రం 'చెప్పాలని ఉంది'. 'ఒక మాతృభాష కథ' అనేది ఉపశీర్షిక. యష్ పూరి, స్టెఫీ పటేల్ జంటగా అరుణ్ భారతి ఎల్. దర్శకత్వంలో తెరకెక్కింది. వాకాడ అంజన్ కుమార్, యోగేష్ కుమార్ నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 9న విడుదలవుతోంది. అస్లాం కీ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చెప్పాలని ఉంది..' అంటూ సాగే పాటను చిత్ర యూనిట్ విడుదల చేసింది. కృష్ణ చైతన్య సాహిత్యం అందించగా, హరిచరణ్ పాడారు. తనికెళ్ల భరణి, సునీల్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: ఆర్‌పీ డీఎఫ్పీ.

సందేశాత్మక ధర్మచక్రం



● మోనిక చౌహాన్

సంకేత్ తిరుమనీడి, మోనిక చౌహాన్ జంటగా నాగ్ ముంతా దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'ధర్మచక్రం'. పద్మ నారాయణ ప్రొడక్షన్స్‌పై జీపీ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా నాగ్ ముంతా మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో హీరోయిన్ మోనిక చౌహాన్ ద్విపాత్రాభినయం చేశారు. మహిళలపై సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు, అకృత్యాల నేపథ్యంలోనే ఈ చిత్ర కథ ఉంటుంది. అమ్మాయిల స్వీయ రక్షణ ఎలా ఉండాలో ఈ సినిమాలో చూపిస్తున్నాం. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసి, త్వరలోనే విడుదల తేదీ అనౌన్స్ చేస్తాం'' అన్నారు. చైతన్య, ప్రవీణ్ కుమార్, ధృవ, జానీ ఫీవర్ మైలవరం, నరసింహా రావు కీలక పాత్రలు చేసిన ఈ సినిమాకు ప్రణయ్ రాజపూటి స్వరకర్త.

సత్యమేవ జయతే

సాక్షి


'ప్రజాసేవలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా చిరునవ్వుతో ఎదుర్కొంటా'

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 247

సోమవారం 28-11-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అర్జెంటీనా నిలిచింది

మెక్సికోపై 2–0తో విజయం.. ప్రీక్వార్టర్ ఫైనల్ చేరే అవకాశాలు సజీవం - 12లో



అనుభవమా.. రాబడా..?

మార్కెట్లో పెట్టుబడులకు ముందు చేయాల్సిన కసరత్తుపై కథనం - 13లో



'అంతరిక్షం'లో సూర్యోదయం

'విక్రమ్–ఎస్' రాకెట్ ప్రయోగం గర్వకారణమని.. ప్రైవేట్ అంతరిక్ష రంగంలో నూతన సూర్యోదయమని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో



తిరగబడ్డ చైనా

కరోనా కట్టడి పేరుతో చైనాలోని జిన్‌పింగ్ ప్రభుత్వం విధించిన ఆంక్షలపై ప్రజలు కన్నెర్రజేశారు. స్వేచ్ఛ కావాలని నినదించారు.

వివరాలు 6లో



రిషి తోటలో రూ.12 కోట్ల శిల్పం

బ్రిటన్ ప్రధాని రిషి అధికార నివాసంలోని తోటలో ప్రభుత్వ సొమ్ముతో రూ.12 కోట్ల శిల్పాన్ని ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది.

వివరాలు 6లో



గుజరాత్‌లో గెలుపు మాదే..

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ గెలుపు ఖాయమని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ధీమా వ్యక్తం చేశారు.

వివరాలు 6లో

'సంఘ'టితంగా..

ఏపీలో పొదుపు సంఘాల ఆర్థిక కార్యకలాపాల నిర్వహణ అద్భుతం

నెలకు రూ.30 వేలు–రూ.40 వేల మేర వ్యాపారాలు నిర్వహించే స్థాయికి అక్కచెల్లెమ్మలు

- నూటికి నూరు శాతం రుణాల రికవరీ
- గ్రామీణ ఉపాధి కల్పనలో ఆంధ్రప్రదేశ్ భేష్
- పల్లెల్లో పెద్ద ఎత్తున సామాజిక ఆస్తుల కల్పన
- వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సదుపాయం, అనుబంధ మౌలిక వసతులు
- పేదల ఇళ్ల కోసం ఏకంగా రూ.23 వేల కోట్లు వెచ్చించి ప్రైవేట్ భూముల సేకరణ
- తొమ్మిది రంగాలను ప్రాధాన్యతగా గుర్తించి అభివృద్ధి, సంక్షేమం పరుగులు
- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర నిపుణుల కమిటీ అభినందన..
- వివిధ రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి కేంద్రానికి నివేదిక



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పొదుపు సంఘాలు ఆర్థిక ప్రగతితో కాంతులీనుతున్నాయని, మహిళల ఆధ్వర్యంలో పలు వ్యాపారాల నిర్వహణ అద్భుతంగా ఉందని కేంద్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ ప్రశంసించింది. రాష్ట్ర ప్రభుత్వం అందించిన తోడ్పాటుతో పొదుపు సంఘాల మహిళలు నెలకు రూ.30 వేల నుంచి రూ.40 వేల దాకా వివిధ వ్యాపారాలు నిర్వహించే స్థాయికి ఎదిగారని కమిటీ నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది ప్రాధాన్యత రంగాలను గుర్తించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తోందని అభినందించింది. ఆరోగ్యం (ఆరోగ్యశ్రీ), విద్య (అమ్మ ఒడి), విద్య (ఫీజు రీయింబర్స్‌మెంట్), గృహ నిర్మాణం (పేదలందరికీ ఇళ్లు), జీవనోపాధి, (వైఎస్సార్ చేయూత – వైఎస్సార్ ఆసరా), సంక్షేమం (పెన్షన్ల పెంపు), వ్యవసాయం (వైఎస్సార్ రైతు భరోసా), సాగునీరు (జలయజ్ఞం), మద్య నియంత్రణను ప్రాధాన్యత అంశాలుగా గుర్తించి అమలు చేస్తూ కేంద్ర నిధులను సద్వినియోగం చేసుకుంటోందని తెలిపింది. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, పథకాలను ప్రజలకు

మిగతా 2వ పేజీలో ▶

ఏది నిజం?

3 అబద్ధాలు 6 అభాండాలు

- ఎక్కడ చూసినా బెల్టు షాపులే అంటూ 'ఈనాడు' మరో విష కథనం
- చంద్రబాబు హయాంతో పోలిస్తే ఏకంగా 40 శాతం తగ్గిన మద్యం విక్రయం
- అప్పటితో పోలిస్తే ఏకంగా 73% పడిపోయిన బీర్ల విక్రయాలు
- దీనర్థం రాష్ట్రంలో మద్య నియంత్రణ సమర్థంగా అమలవుతున్నట్టేగా?
- పైపెచ్చు అక్రమంగా అమ్మేవారిపై ఈ ఏడాది ఇప్పటికే 62,800 కేసులు
- 97వేల మంది అరెస్టు.. 8,740 వాహనాలనూ సీజ్ చేసిన సెబ్
- ఎక్కడైనా ఒకటీ అరా బెల్టు షాపులున్నట్లు తమ దృష్టికొస్తే వెంటనే దాడులు
- సమర్థ నియంత్రణ కోసం దుకాణాల్ని, వేళల్ని కూడా తగ్గించిన ప్రభుత్వం
- వీటన్నిటినీ ఏమాత్రం ప్రస్తావించకుండా రామోజీ విషపు రాతలు
- బాబు హయాంలో పర్మిట్ రూములతో సహా 4,380 దుకాణాలు
- వాటికి అనుబంధంగా రాష్ట్రమంతటా 43వేల బెల్టుషాపులు

4లో

ఈ ప్రభుత్వాన్ని కూల్చే వరకు వదలం



- జనసేన అధినేత పవన్ కళ్యాణ్
- 2024లో వైఎస్సీపీ ఎలా గెలుస్తుందో మేమూ చూస్తాం
- 175కు 175 తెచ్చుకుంటే మేం నోట్లో వేలు వేసుకుని చూస్తామా?
- ఇప్పటంలో కూల్చివేతలు కచ్చితంగా కక్షపూరిత చర్యే
- మా ప్రభుత్వం వచ్చిన రోజు వైఎస్సీపీ వాళ్ల గడపలు కూలుస్తాం

3లో

పవన్.. నోట్లో వేలు పెట్టుకుని చూడు

వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ ఖాయం

- జనసేన అధ్యక్షుడి తీరుపై మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం
- చంద్రబాబు 29 గ్రామాలకు సరి.. నువ్వు ఇప్పటంకే పరిమితం
- ఒక్క గడపా కూల్చలేదని ఇప్పటం వాసులు చెబుతుంటే వినిపించదా?
- గుడ్డలూడదీసి తంతా అనేది ప్రజాస్వామ్యమా..రౌడీయిజమా?



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు, పార్టనర్ చంద్రబాబు 29 గ్రామాలతో సరిపెట్టుకుంటే.. దత్తపుత్రుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇప్పటం గ్రామానికే పరిమితమైపోయారని మాజీ మంత్రి పేర్ని నాని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాల్లోనూ క్లీన్ స్వీప్ చేయడం ఖాయం అని, పవన్ కళ్యాణ్ నోట్లో వేలు పెట్టుకుని చూస్తూం డాల్సిందేనని అన్నారు. తాడేపల్లిలోని

మిగతా 3వ పేజీలో ▶

జన సైనికులే 420లు

- చెక్కులు నిరాకరించిన పలువురు ఇప్పటం గ్రామస్తులు
- గ్రామాభివృద్ధి కోసం ఇస్తామన్న రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్


3లో

ఐరాస ప్రధాన కార్యాలయం వద్ద

గాంధీజీ విగ్రహం

న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయానికి భారతదేశం గాంధీజీ విగ్రహాన్ని బహూకరించింది. డిసెంబర్ 14వ తేదీన భద్రతా మండలి అధ్యక్ష పదవి బాధ్యతలు చేపట్టనున్న సందర్భంగా భారత విదేశాంగ మంత్రి జై శంకర్ ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత రామ్ సుతార్ ఈ శిల్పాన్ని మలిచారు.

6లో





నేడు రైతుల ఖాతాల్లోకి

రూ.199.94 కోట్లు

రబీ 2020–21, ఖరీఫ్–21 సీజన్‌ల సున్నా వడ్డీ రాయితీ జమ

- ఖరీఫ్–2022 సీజన్‌కు చెందిన ఇన్‌పుట్ సబ్సిడీ కూడా..
- బటన్ నొక్కి జమ చేయనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: రబీ 2020–21, ఖరీఫ్–2021 సీజన్లకు చెందిన వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ ఖరీఫ్–2022 సీజన్‌లో వివిధ రకాల వైపరీత్యాలవల్ల దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు గతంలో సాంకేతిక కారణాలతో చెల్లింపులు పొందని వారి ఖాతాల్లో మొత్తం రూ.199.94 కోట్లు జమచేసేందుకు

మిగతా 2వ పేజీలో ▶

ఎర్రచందనంపై ఉక్కుపాదం



వైఎస్సార్ జిల్లా పోలీసుల అదుపులో ఉన్న నిందితులు, స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

ఎర్రచందనం స్మగ్లింగ్‌పై వైఎస్సార్ జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. లంకమల్ల అటవీ ప్రాంతంలో తనిఖీలు చేసి 16 మందిని అరెస్ట్ చేశారు. 49 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు, లారీని స్వాధీనం చేసుకున్నారు. కీలక సూత్రధారుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నామని ఎస్పీ అన్బురాజన్ తెలిపారు.

- వివరాలు 10లో

సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు

ప్రభుత్వానికి కళ్లు, చెవులు



సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు

- ప్రభుత్వ ఉద్యోగుల్లో 20 శాతం మంది ఈ వ్యవస్థల వారే
- సీఎం జగన్ మానసపుత్రిక 'సచివాలయం'
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్రస్థాయి ప్రథమ మహాజన సభలో మంత్రి బొత్స

11లో



చలి తీవ్రత పెరిగే అవకాశం!

రెండు రోజుల్లో క్షీణించనున్న ఉష్ణోగ్రతలు

- రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టి.. మళ్లీ పొడి వాతావరణం నెలకొనే పరిస్థితులేర్పడ్డాయి. తూర్పు, ఈశాన్య గాలుల వల్ల కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా క్షీణిస్తూ చలి తీవ్రతను పెంచుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే కోస్తాంధ్రలో కొన్ని చోట్ల కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒకటి, రెండు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి.

- వివరాలు 3లో



పర్యాటకుల బస్సులో చెలరేగిన మంటలు

- పూర్తిగా దగ్ధమైన ప్రైవేట్ బస్సు
- సురక్షితంగా బయట పడిన 24 మంది
- అరకు ఘాట్ రోడ్డుపై ఘటన

3లో



మీరు పాదయాత్ర అంటే.. వాళ్లు బస్సు యాత్ర అంటారు! మీరు బస్సు యాత్ర అంటే వాళ్లు పాదయాత్రకు ప్రిపేరవుతారు సార్!!

ఎగుమతుల్లో పైపైకి..

ఏటేటా దూసుకెళ్తున్న ఆంధ్రప్రదేశ్

రికార్డు స్థాయిలో ఆహార, ఆక్వా ఉత్పత్తుల ఎక్స్‌పోర్టులు

- ఎక్కువగా నాన్ బాస్మతీ బియ్యం, పండ్లు, కూరగాయలు, బెల్లం, ఆక్వా ఉత్పత్తులే
- ప్రభుత్వ ప్రోత్సాహమే కారణమంటున్న అధికారులు, ఎగుమతిదారులు
- ఈ ఏడాది కోటి లక్షల టన్నుల ఎగుమతుల మార్క్‌ను అందుకునే అవకాశం
- టీడీపీ హయాంలో 2018–19లో రూ.8,929 కోట్ల విలువైన 31.48 లక్షల టన్నుల ఎగుమతే అత్యధికం

➤ 2020–21లో రూ.13,781 కోట్ల విలువైన 52.88 లక్షల టన్నుల ఎగుమతి

➤ 2021–22లో రూ.19,902 కోట్ల విలువైన 79.33 లక్షల టన్నులు..

➤ 2022–23లో ఇప్పటికే రూ.9,782 కోట్ల విలువైన 35.90 లక్షల టన్నులు..



సాక్షి, అమరావతి: ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ ఆకాశమే హద్దుగా దూసుకుపోతోంది. ఎగుమతులను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు.. గ్రామస్థాయిలో ప్రభుత్వం కల్పిస్తున్న మార్కెటింగ్ సౌకర్యాలు సత్ఫలితాలిస్తున్నాయి. తొలి రెండేళ్లు కరోనా మహమ్మారికి ఎదురొడ్డి మరీ ఎగుమతులు సాగాయి. లాక్‌డౌన్ ఆంక్షలు ఎత్తివేసిన తర్వాత ఊపందుకున్నాయి. ఉదా.. 2018–19లో రూ.8,929 కోట్ల విలువైన 31.48 లక్షల టన్నుల ఆహార ఉత్పత్తులు, రూ.13,855 కోట్ల విలువైన 2.62 లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి జరిగితే.. 2021–22 నాటికి అవి రూ.19,902 కోట్ల విలువైన 79.33 లక్షల టన్నుల ఆహార ఉత్పత్తులు, రూ.20వేల కోట్ల విలువైన 3.24 లక్షల టన్నుల ఆక్వా ఎగుమతులు జరిగాయి. ఇది అరుదైన రికార్డు అని వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (ఎపెడా) చెబుతోంది. ఇక ఈ ఏడాది (2022–23) తొలి అర్ధ సంవత్సరంలో రూ.9,782 కోట్ల విలువైన 35.90 లక్షల టన్నుల ఆహార ఉత్పత్తులు, రూ.13వేల కోట్ల విలువైన 2.15 లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తులు

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా

ఏపీ మెడ్‌టెక్ జోన్ ఆధ్వర్యంలో సీ సైడ్ సమ్మిట్

- ఫిబ్రవరి 12 నుంచి 18 వరకు నిర్వహణ
- హాజరుకానున్న 400 సంస్థల ప్రతినిధులు



సాక్షి, విశాఖపట్నం: ప్రపంచంలో అతి పెద్ద వైద్య పరికరాల తయారీ సంస్థల్లో ఒకటైన ఏపీ మెడ్‌టెక్ జోన్ మరో అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు రంగం సిద్ధం చేసింది. విశాఖ వేదికగా 'ట్రిపుల్ ఎస్ హాలిడేస్' పేరుతో సీ సైడ్ స్టార్టప్ సమ్మిట్‌ను ఫిబ్రవరి 12 నుంచి 18 వరకు నిర్వహించనుంది. స్టార్టప్ ఆర్మేనియా ఫండ్ సంస్థతో కలిసి ఈ భారీ సమ్మిట్‌కు మెడ్‌టెక్ జోన్ ఏర్పాట్లు చేస్తోంది. ప్రపంచం నలుమూలల నుంచి 400 మంది వరకు పారిశ్రామికవేత్తలు, పలు సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారు. కేవలం స్టార్టప్స్ మాత్రమే కాకుండా వైద్య పరికరాల తయారీ, ఫార్మా, హెల్త్‌టెక్, బయోటెక్, ఫిన్‌టెక్, పరిశోధన రంగంలో ఉన్న పరిశ్రమలకు కూడా ఈ సమ్మిట్ ఆహ్వానం పలుకుతోంది. ముందస్తుగా ఎంపిక ప్రక్రియలో ఉత్తీర్ణులైన వారికి మాత్రమే ఈ సమ్మిట్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు తెలిపారు. ఇందులో నిర్వహించే పోటీల్లో బహుమతులు పొందిన సంస్థలకు 35వేల యూఎస్ డాలర్ల నుంచి గ్రాంట్ అవార్డులు, ఆర్మేనియన్, ఇండియన్ ఫండ్స్ ద్వారా యాక్సలరేటర్ ప్రోగ్రామ్స్, పెట్టుబడుల ప్రోత్సాహకాలు ఉంటాయని వెల్లడించారు. ఈ ట్రిపుల్ ఎస్ సమ్మిట్‌ను స్టార్టప్ ఆర్మేనియా ఫౌండేషన్ తొలిసారిగా 2021లో యూఏఈలో విజయవంతంగా నిర్వహించింది.

ఆదా చేయండి.. అవార్డు పొందండి

- సెకా అవార్డులకు డిసెంబర్ 9 వరకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, అమరావతి: ఇంధన పొదుపును ప్రోత్సహించడంలో భాగంగా వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇంధన పరిరక్షణ అవార్డులను ప్రకటించనుంది. ఇంధన పరిరక్షణ, పొదుపుపై ప్రజల్లో చైతన్యం తీసుకురావటమే లక్ష్యంగా ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డ్స్ (సెకా)–2022 వేడుకను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీ ఎస్ఈసీఎం) ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది.

మూడు కేటగిరీల్లో అవార్డులు

రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న ఇంధన పరిరక్షణ వారోత్సవాలలో భాగంగా పరిశ్రమలు, భవనాలు, సంస్థల్లోని వివిధ వర్గాల వినియోగదారుల మధ్య ఈ సంవత్సరం పోటీ నిర్వహించనున్నారు. పరిశ్రమల కేటగిరీ కింద టెక్స్‌టైల్, సిమెంట్, ఎంఎస్ఎంఈ.. సంస్థల కేటగిరీ కింద మునిసిపాలిటీలు, పంచాయతీలు.. భవనాల కేటగిరీ కింద 50 కిలోవాట్ల (కేడబ్ల్యూ) లోడ్ గల హోటళ్లు, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్, ప్లాజాలు, యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కాలేజీలు, ఆర్టీసీ బస్టాండ్స్, బస్ డిపోలు, వివిధ వాణిజ్య, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల భవనాల్లో ఇంధన పరిరక్షణ కార్యక్రమాలను అమలు చేస్తున్న వారు సెకా–2002 అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను విజయవాడ విద్యుత్ సౌధలో ఉన్న ఏపీఎస్ఈసీఎం కార్యాలయంలో నేరుగా లేదా seca.apsecm-@gmail.com,ceo.secm@gmail.com కు మెయిల్ ద్వారా డిసెంబర్ 9లోగా అందజేయాల్సి ఉంటుంది. కాగా, ఇంధన సంరక్షణ వారోత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ శాఖల అధికారులను ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కోరారు.

వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫాకు 2,049 దరఖాస్తులు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,049 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా అమల్లోకి వచ్చాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, మైనార్టీ వర్గాలకు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు ఈ పథకాలు వర్తింపజేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అర్హత గల వారికి దరఖాస్తు చేసిన పదిహేను రోజుల్లో డిజిటల్ వివాహ ధృవీకరణ పత్రాలను జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శి ఈ ధృవీకరణ పత్రాలను ఆమోదించాలని తెలిపింది. వరుడు, వధువు తప్పనిసరిగా పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని, వివాహ తేదీనాటికి వధువు వయస్సు 18 సంవత్సరాలు, వరుడి వయస్సు 21 సంవత్సరాలు నిండి ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రామాల్లో నెలకు రూ. 10 వేలు, పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.12 వేల లోపు ఆదాయం గల వారు ఈ పథకానికి అర్హులు. జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ డాక్టర్ సమీర్ శర్మ వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా దరఖాస్తుల పరిష్కార పురోగతిని సమీక్షించారు. దరఖాస్తులు 15 రోజులకు మించి పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని ఆయన చెప్పారు. ఇందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

పేదల ఇళ్ల నిర్మాణంలో చిత్తూరు టాప్

- ఈ జిల్లాలో 63 వేల ఇళ్లకు శంకుస్థాపన
- 52 వేల ఇళ్ల నిర్మాణం పునాది ఆపై దశల్లో..
- తర్వాతి స్థానాల్లో అన్నమయ్య, విజయనగరం జిల్లాలు
- రాష్ట్రవ్యాప్తంగా రెండుదశల్లో 21.25 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతి
- మరింత వేగంగా నిర్మాణాలు చేపట్టడానికి ప్రతి శనివారం 'హౌసింగ్ డే'



చిత్తూరు జిల్లాలో నాగరాజకుప్పం లేఅవుట్-1లో నిర్మాణంలో ఉన్న పేదల ఇళ్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద నిరుపేదల ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణంలో చిత్తూరు జిల్లా ఉత్తమ పనితీరుతో రాష్ట్రంలోనే తొలి నుంచి మొదటి స్థానంలో నిలుస్తోంది. ఈ జిల్లాలో 73,496 ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఇప్పటివరకు 63,517 ఇళ్లకు శంకుస్థాపన చేశారు. ఇందులో 52,386 ఇళ్లు (82 శాతం) పునాది, ఆపై దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. శంకుస్థాపన చేసిన 67,437 ఇళ్లలో 42,964 (64 శాతం) ఇళ్లు, 70,221 ఇళ్లలో 42,554 (61 శాతం) ఇళ్లు పునాది, ఆపై దశల నిర్మాణంతో అన్నమయ్య, విజయనగరం జిల్లాలు రెండు, మూడుస్థానాల్లో ఉన్నాయి. విశాఖ జిల్లాలో 1.35 లక్షల ఇళ్లకు ప్రభుత్వం అనుమతులు జారీచేసింది. వీటిలో 63,389 ఇళ్లకు శంకుస్థాపన చేయగా 9,043 ఇళ్లు పునాది, ఆపై దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. దీంతో ఈ జిల్లా ప్రస్తుతం ఇళ్ల నిర్మాణంలో చివరిస్థానంలో ఉంది. న్యాయపరమైన చిక్కులు వీడటంతో విశాఖపట్నం కార్పొరేషన్ పరిధిలో నిర్మిస్తున్న 1.24 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఈ ఏడాదిలోనే అనుమతులు లభించాయి. ఈ ఇళ్ల నిర్మాణాలు ఇటీవల ప్రారంభం కావడం విశాఖ చివరిస్థానంలో ఉండటానికి ప్రధాన కారణం.

పుంజుకున్న నిర్మాణాలు

రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీవర్షాల ప్రభావం ఇళ్ల నిర్మాణంపై పడింది. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టి, వాతావరణం కూడా సహకరిస్తుండటంతో ఇళ్ల నిర్మాణాలు పుంజుకున్నాయి. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ప్రభుత్వం రెండుదశల్లో 21.25 లక్షల ఇళ్ల నిర్మాణం చేపడుతోంది. ఇందులో 2.62 లక్షలు టిడ్కో ఇళ్లు. మిగిలిన 18.63 లక్షల ఇళ్లకుగాను 15.15 లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వీటిలో 8.70 లక్షల ఇళ్లు పునాది ముందుదశలో, 2.85 లక్షల ఇళ్లు పునాది, 73,622 ఇళ్లు రూఫ్ లెవల్, 1.05 లక్షల ఇళ్లు ఆర్సీ దశలో నిర్మాణంలో ఉన్నాయి. 1,79,263 ఇళ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. ఇందులో 95 వేలకుపైగా ఇళ్లకు కనీస మౌలిక సదుపాయాలు కరెంటు, నీటిసరఫరా కనెక్షన్లు ఇప్పటికే ఇచ్చారు. మిగిలిన ఇళ్లకు ఇస్తున్నారు.

హౌసింగ్ డే రోజు సచివాలయ సిబ్బంది నుంచి కలెక్టర్ వరకు లేఅవుట్‌ల సందర్శన

పేదల ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం తొలినుంచి ప్రత్యేకదృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రతి శనివారాన్ని హౌసింగ్ డేగా పరిగణిస్తోంది. ఈ క్రమంలో శనివారం కలెక్టర్లు, జేసీలు, డివిజన్, మండలస్థాయి అధికారులు, సచివాలయాల సిబ్బంది లేఅవుట్‌లను సందర్శిస్తున్నారు. అధికారులు తాము లేఅవుట్‌లను సందర్శించిన ఫొటోలను గృహనిర్మాణ సంస్థ రూపొందించిన హౌసింగ్ డే యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. లేఅవుట్‌లలో తమదృష్టికి వచ్చిన సమస్యలు, ఇబ్బందులను యాప్ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చే అవకాశం కల్పించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన సమస్యలు, ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 19న 961 లేఅవుట్‌లను 5,548 మంది మండల స్థాయి అధికారులు, 3,051 మంది సచివాలయాల స్థాయి అధికారులు సందర్శించారు.

రోజువారీ లక్ష్యాలు ఇస్తున్నాం



ఇళ్ల నిర్మాణాలు మరింత వేగంగా చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాల వారీగా రోజువారీ లక్ష్యాలను ఇస్తున్నాం. వెనుకబడిన జిల్లాలపై ప్రత్యేకదృష్టి పెడుతున్నాం. స్వయంగా ఆయా జిల్లాలకు రాష్ట్రస్థాయి అధికారులం వెళ్లి నిర్మాణాలు ఆలస్యం అవడానికి కారణమైన సమస్యల్ని తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నాం. హౌసింగ్ డే రోజున పథకంతో ముడిపడి ఉన్న అధికారులు రెండు లేఅవుట్‌లు సందర్శించాల్సి ఉంటుంది. లేఅవుట్‌లో సందర్శించినట్టుగా ఫొటోలను హౌసింగ్ డే యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించాం.

– అజయ్‌జైన్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, గృహనిర్మాణ శాఖ

ఎగుమతుల్లో దూసుకెళ్తున్న ఏపీ

▶ మొదటి పేజీ తరువాయి

ఎగుమతయ్యాయి. ఆహార, ఆక్వా ఉత్పత్తులు కలిపి టీడీపీ ఐదేళ్లలో గరిష్టంగా 2018–19లో రూ.22,784 కోట్ల విలువైన 34.10లక్షల టన్నులు ఎగుమతి అయితే 2021–22లో ఏకంగా రూ.39,921 కోట్ల విలువైన 82.57 లక్షల టన్నులు ఎగుమతి అయ్యాయి. టీడీపీ హయాంలో జరిగిన గరిష్ట ఎగుమతులను ఈ ఏడాది తొలి అర్ధ సంవత్సరంలోనే సీఎం వైఎస్ జగన్ సర్కార్ అధిగమించడం విశేషం. చరిత్రలో ఎప్పుడూ ఇంత పెద్దఎత్తున ఎగుమతులు జరగలేదని అధికారులతో పాటు ఎగుమతిదారులూ చెబుతున్నారు. ఇదే ఊపు కొనసాగితే ఈ ఏడాది కోటి లక్షల టన్నుల మార్క్‌ను అందుకోవచ్చని అంచనా వేస్తున్నారు.

ఐదేళ్లలో పెరిగిన ఎగుమతులిలా..

	2018-19	2019-20	2020-21	2021-22	2022-23 (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు)
ఆహార ఉత్పత్తులు (టన్నుల్లో)..	31,47,779	17,41,986	52,88,526	79,32,915	35,89,721
విలువ (రూ.కోట్లలో)	8,929	5,429	13,782	19,902	9,782
ఆక్వా ఉత్పత్తులు (టన్నుల్లో)	2,61,618,	2,93,314	2,79,993	3,24,008	2,16,879
విలువ (రూ.కోట్లలో)..	13,855	15,498	15,832	20,020	13,874

ఎగుమతుల్లో నాన్ బాస్మతీ రైస్‌దే సింహభాగం

రాష్ట్రం నుంచి ప్రధానంగా నాన్ బాస్మతీ రైస్, మొక్కజొన్న, జీడిపప్పు, బెల్లం, అవరాలు, గోధుమలు, శుద్ధిచేసిన పండ్లు, పండ్ల రసాలు, కూరగాయలతో పాటు పెద్దఎత్తున ఆక్వా ఉత్పత్తులు ఎగుమతవుతున్నాయి. నాన్ బాస్మతీ రైస్ ఉత్పత్తుల ఎగుమతులకు కేరాఫ్ అడ్రస్‌గా ఏపీ నిలిచింది. మొత్తం ఎగుమతుల్లో సింహభాగం నాన్ బాస్మతీ రైస్‌దే. 2018–19లో రూ.7,324కోట్ల విలువైన 29.22 లక్షల టన్నులు ఎగుమతి అయితే.. 2021–22లో రూ.17,225 కోట్ల విలువైన 68.57 లక్షల టన్నులు ఎగుమతి అయ్యాయి. ఇక ఈ ఏడాది తొలి అర్ధ సంవత్సరంలోనే రూ.7,718 కోట్ల విలువైన 29.48 లక్షల టన్నుల నాన్ బాస్మతీ రైస్ ఎగుమతి అయ్యింది. ఏపీ నుంచి ఎక్కువగా మిడిల్ ఈస్ట్, దక్షిణాసియా దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతుండగా, గతేడాది అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూరోపియన్, అరబ్ దేశాలకు ఎగుమతైంది.

ప్రభుత్వ ప్రోత్సాహంతో పోటీపడుతున్న వ్యాపారులు

ఇక రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇస్తున్న ప్రోత్సాహం, గ్రామస్థాయిలో కల్పించిన సౌకర్యాలతో గత మూడు సీజన్లలో వ్యవసాయ విస్తీర్ణంతో పాటు నాణ్యమైన దిగుబడులు పెరిగాయి. మూడేళ్లలో ఏటా సగటున 14 లక్షల టన్నుల ఆహార ఉత్పత్తుల దిగుబడులు అదనంగా వచ్చాయి. కేంద్రం మద్దతు ధర ప్రకటించని ఆహార ఉత్పత్తులకూ రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలు ప్రకటించడం, ధరలు తగ్గిన ప్రతీసారి మార్కెట్‌లో జోక్యం చేసుకోవడంతో వ్యాపారులు సైతం పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. ఎందుకంటే..

- మూడేళ్ల క్రితం క్వింటాల్ రూ.4,500 కూడా పలకని పసుపు ఈ ఏడాది ఏకంగా రూ.10 వేలకు పైగా పలికింది.
- రెండేళ్ల క్రితం రూ.4,800 ఉన్న పత్తి నేడు రూ.9,500 పలుకుతోంది.
- అలాగే, రూ.5 వేలు పలకని మినుములు రూ.7వేలు, వేరుశనగ సైతం రూ.6వేల నుంచి రూ.7వేల వరకు పలుకుతున్నాయి.
- కందులు, పెసలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు సైతం ఎమ్మెస్పీకి మించి ధర పలుకుతున్నాయి.
- అరటి, బత్తాయి వంటి ఉద్యాన ఉత్పత్తులకు కూడా మంచి ధర లభిస్తోంది.
- ఇక దేశం నుంచి ఎగుమతి అయ్యే సముద్ర ఉత్పత్తుల్లో 36 శాతం, రొయ్యల్లో 67 శాతం మన రాష్ట్రం నుంచే విదేశాలకు వెళ్తున్నాయి. నాణ్యతకు ప్రభుత్వం పెద్దపీట వేయడంతో యాంటీబయోటిక్స్ రెసిడ్యూల్స్ శాతం కూడా గణనీయంగా తగ్గడం ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు పెరిగేందుకు కారణంగా చెబుతున్నారు.

14వేల టన్నులు ఎగుమతి చేశాం



2021–22లో ఏపీ నుంచి 50 వేల నుంచి 60 వేల టన్నుల అరటి ఎగుమతులు జరిగాయి. మా కంపెనీ ఒక్కటే 14 వేల టన్నులు ఎగుమతి చేసింది. ఇరాన్, మలేసియా, దుబాయ్ దేశాలకు ఎగుమతి చేశాం. ఈ ఏడాది కూడా ఎగుమతులు ఆశాజనకంగా ఉండబోతున్నాయి.

– ఎం. ప్రభాకరరెడ్డి, ఏపీ కోఆర్డినేటర్, దేశాయ్ ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్ కంపెనీ

ఎగుమతులు పెరగడం రైతుకు లాభదాయకం



గతేడాది రికార్డు స్థాయిలో ఆక్వా ఎగుమతులు జరిగాయి. రైతులకు కూడా మంచి రేటు వచ్చింది. రొయ్యలతో పాటు సముద్ర మత్స్య ఉత్పత్తులను కూడా వ్యాపారులు పోటీపడి కొన్నారు. విశాఖ, కాకినాడ, నెల్లూరు పోర్టుల నుంచి ఆక్వా ఉత్పత్తులు భారీగా ఎగుమతి అయ్యాయి.

– ఐసీఆర్ మోహన్‌రాజ్, అధ్యక్షుడు, జాతీయ రొయ్య రైతుల సమాఖ్య

'గాప్' తో మరిన్ని ఎగుమతులు



గతంలో ఎన్నడూలేని విధంగా 79 లక్షల టన్నుల ఆహార ఉత్పత్తులతో పాటు 20వేల టన్నుల ఆక్వా ఉత్పత్తులు ఏపీ నుంచి ఎగుమతి అయ్యాయి. వచ్చే సీజన్ నుంచి రైతులకు 'గాప్' (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్) సర్టిఫికేషన్ జారీచేసేందుకు ఏర్పాట్లుచేస్తున్నాం. అది ఉంటే యూరోపియన్ దేశాలకు ఎగుమతులు పెరుగుతాయి.

– పూనం మాలకొండయ్య, స్పెషల్ సీఎస్, వ్యవసాయ శాఖ

సీఎం జగన్ ప్రోత్సాహం వల్లే..



సీఎం వైఎస్ జగన్ తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా ఎగుమతులు పెరిగాయి. ఏటా సాగు విస్తీర్ణం, దిగుబడులు పెరుగుతున్నాయి. రికార్డు స్థాయి ఎగుమతులు నమోదవడం సంతోషదాయకం. ఆహార, ఆక్వా ఉత్పత్తులకు అదనపు విలువను జోడించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నాం.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి

'సంఘ'టితంగా...

▶ మొదటి పేజీ తరువాయి

చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున టెక్నాలజీని వినియోగిస్తోందని కమిటీ పేర్కొంది. కాగా గత సర్కారు హయాంలో డ్వాక్రా రుణమాఫీ అందక డిఫాల్టర్లుగా మారి అప్పుల ఊబిలో కూరుకుపోయిన పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఆదుకున్న విషయం తెలిసిందే. ఎన్పీఏలుగా మారిన డ్వాక్రా సంఘాలు దీంతో పునరుజ్జీవమయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న 14 పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర రిటైర్డ్ కార్యదర్శితో పాటు తమిళనాడు రిటైర్డ్ సీఎస్‌ల నేతృత్వంలో వివిధ రంగాలకు చెందిన 32 మంది నిపుణులతో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ 6వ కామన్ మిషన్ రివ్యూ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, అరుణాచల్ ప్రదేశ్, జమ్ము కాశ్మీర్, నాగాలాండ్ రాష్ట్రాల్లో కమిటీ పర్యటించింది. ఫిబ్రవరి 17–27 తేదీల మధ్య నలుగురు ప్రతినిధులతో కూడిన బృందం శ్రీకాకుళం, విశాఖ, చిత్తూరు జిల్లాలోని 23 గ్రామ పంచాయతీలను సందర్శించింది. క్షేత్ర స్థాయి పర్యటనలో స్వయంగా పరిశీలించిన అంశాలను విశ్లేషిస్తూ కమిటీ నివేదికను రూపొందించింది. అందులో ముఖ్యాంశాలు..

ఆత్మవిశ్వాసం.. టెక్నాలజీ వినియోగం

రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల నిర్మాణం సంతృప్త స్థాయిలో ఉంది. అపార సామాజిక మూలధన రూపంలో సభ్యులు ఆత్మ విశ్వాసంతో, శక్తివంతంగా ఉన్నారు. రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించడంతో పాటు సంక్షోభంలో పరస్పరం సాయం చేసుకుంటున్నారు. సంఘాల కార్యకలాపాల కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు.

- రాష్ట్రంలో పొదుపు సంఘాలు కిరాణా, బ్యూటీ పార్లర్, కలంకారీ, చెక్క క్రాఫ్టింగ్, చీపుర్ల తయారీ, వివాహ వస్తువుల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పూల పెంపకం, వ్యవసాయం, పశువులు, మిల్లెట్స్ ఉత్పత్తి, చిన్న వ్యాపారాలు, ఉద్యానవనాలు లాంటి పలు రకాల జీవనోపాధి కార్యకలాపాలలో నిమగ్నమయ్యాయి.

సేంద్రియ వ్యవసాయంలోనూ..

పొదుపు సంఘాలు సభ్యులు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు తీసుకుని పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. పొదుపు సంఘాల రుణాల రికవరీ రేటు నూటికి నూరు శాతంగా ఉంది. సాధికారత, ఆర్థిక నిర్వహణలో బాగా ప్రావీణ్యం ఉంది. పొదుపు సంఘాలు సేంద్రీయ వ్యవసాయంతో పాటు న్యూట్రిగార్డెన్స్‌లో కూడా పాల్గొంటున్నాయి.

మెరుగైన ఆదాయం..

పొదుపు సంఘాల సభ్యులు మెరుగైన ఆదాయ స్థాయి కలిగి ఉన్నారు. ఉదాహరణకు పొదుపు సంఘంలోని ఓ సభ్యురాలు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా శిక్షణ పొంది రుణం తీసుకుని టైలరింగ్ దుకాణాన్ని ప్రారంభించింది. నెలకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు వ్యాపారం జరుగుతోంది.



శ్రీకాకుళం జిల్లాలో కంప్యూటర్ శిక్షణ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కేంద్ర నిపుణుల కమిటీ సభ్యులు

అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్

పొదుపు సంఘాల ఉద్యమంలో ఏపీ అగ్రగామిగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సెర్ప్ ద్వారా సంఘాలకు తగిన మద్దతు ఇస్తుండటంతో గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలు శక్తివంతంగా ఉన్నాయి. సంఘాల సభ్యులకు గ్రామీణాభివృద్ధి పథకాలు, కార్యక్రమాల పట్ల పూర్తి అవగాహన ఉంది.

- పొదుపు సంఘాలు సామాజిక చైతన్య కార్యక్రమాలైన పల్స్ పోలియో, కోవిడ్ వ్యాక్సినేషన్, కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పిస్తూ చురుగ్గా వ్యవహరిస్తున్నాయి.

ఉపాధి, మౌలికం.. భేష్

రాష్ట్రంలో గ్రామీణ ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పన బాగుందని నిపుణుల కమిటీ నివేదికలో పేర్కొంది. వైవిధ్యమైన సామాజిక సంపదను సృష్టించినట్లు క్షేత్రస్థాయి సందర్శనలో గుర్తించామని తెలిపింది. వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని ప్రశంసించింది. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ భవనాలు, గ్రామ సచివాలయాల భవనాలు, ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్లు లాంటి వాటిపై దృష్టి పెట్టి సామాజిక సంపద సృష్టించటాన్ని ప్రస్తావించింది. 'నేషనల్ రూర్బన్ మిషన్' పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభావవంతంగా నిర్వహిస్తోందని తెలిపింది. 70%డిపార్ట్‌మెంట్ నిధులతో పాటు 30% క్రిటికల్ గ్యాప్ నిధులను ఏకీకృతం చేసి వాటర్ ట్యాంక్‌లు, అంగన్‌వాడీ భవనాలు, హెల్త్ సబ్ సెంటర్లు, బ్లడ్ బ్యాంకులు, కాలేజీ భవనాల నిర్మాణం తదితరాలను నిర్దేశిత ప్రణాళికతో అమలు చేస్తున్నట్లు పేర్కొంది.

- సాధారణంగా ఉపాధి హామీ కింద జాబ్ కార్డులను డిమాండ్ ఆధారంగా ఇస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లను నియమించిన తరువాత గ్రామ పంచాయతీ స్థాయిలోనే జాబ్ కార్డులను ఇస్తున్నారు. గతంలో బ్లాక్ స్థాయిలో ఇచ్చేవారు. ఇప్పుడు జాబ్ కార్డుల మంజూరు గణనీయంగా మెరుగుపడింది.
- కోవిడ్, లాక్‌డౌన్ సమయంలో ముందుగానే జాబ్ కార్డులను జారీ చేశారు. ముఖ్యంగా వలస కూలీలు తిరిగి రాగానే జాబ్ కార్డులిచ్చారు. లబ్ధిదారుల ఫొటోలతో సహా జాబ్ కార్డులను జారీ చేశారు. రాష్ట్రంలో ఉపాధి హామీకి సంబంధించి ప్రతి పని వివరాలు ఫైల్ రూపంలో ఉన్నాయి. మెజర్‌మెంట్ బుక్‌తో సహా రికార్డులన్నీ సక్రమంగా నిర్వహిస్తున్నారు.
- కూలీలకు వేతనాలు నూటికి నూరు శాతం డీబీటీ చెల్లింపులు చేస్తున్నారు. పనులను నూరు శాతం జియో ట్యాగింగ్ చేస్తున్నారు. కూలీలకు వేతనాలను సమయానికి ఇస్తున్నారు.

యువతకు నైపుణ్య శిక్షణ బాగుంది

యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రాష్ట్రంలో బాగా అమలవుతున్నాయని నిపుణుల కమిటీ తెలిపింది. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన కింద గ్రామీణ యువతకు మంచి మౌలిక సదుపాయాలున్న సంస్థ ద్వారా రెసిడెన్షియల్ శిక్షణను ప్రభుత్వం అందచేస్తోంది. శిక్షణ భవనాలు, తరగతి గదులు, ప్రాక్టికల్ ల్యాబ్‌లు, ఐటీ శిక్షణ ల్యాబ్స్ చాలా బాగున్నాయని, 40 గంటల కాలం పాటు శిక్షణ అందుతోందని కమిటీ పేర్కొంది. అర్హత కలిగిన శిక్షకులు, రిసోర్స్‌పర్సన్‌లు అందుబాటులో ఉంటున్నారు. ప్లేస్‌మెంట్స్ 70–80 శాతం వరకు ఉన్నాయని తెలిపింది. కొందరు లబ్ధిదారులు రెండు మూడేళ్ల పని అనుభవం తరువాత నెలకు రూ.లక్ష వేతనం ఆర్జిస్తున్నారని, కోవిడ్ సమయంలోనూ శిక్షణ కేంద్రాలను కొనసాగించారని పేర్కొంది.

రూ.వేల కోట్లతో పేదలకు ఇళ్లు

పేదలందరికీ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ద్వారా దశాబ్దాలుగా సొంత గూడు లేని నిరుపేద కుటుంబాలకు గృహాల మంజూరుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కమిటీ తెలిపింది. పేదల ఇళ్ల కోసం అందుబాటులో ఉన్న చోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను ఉచితంగా కేటాయించింది. ఇళ్ల స్థలాల కోసం ప్రైవేట్ వ్యక్తుల నుంచి రిజిస్టర్డ్ భూములను సేకరించేందుకు రూ.23 వేల కోట్లను ఖర్చు చేసి పేదలకు ఇళ్ల పట్టాలిస్తోందని కమిటీ పేర్కొంది.

'ప్రాసెసింగ్'లో ఉత్తమ విధానాలు

ఘన వ్యర్థాల ప్రాసెసింగ్‌లో ఏపీ ఉత్తమ పద్ధతులను అనుసరిస్తోంది. ప్రాసెసింగ్ కేంద్రాలకు తరలించి వివిధ వస్తువులను వేరు చేసి వర్మీ కంపోస్ట్ ఎరువు తయారు చేస్తున్నారు. కిలో రూ.10 చొప్పున విక్రయించే ఈ ఎరువులను తోటల సాగుదారులతోపాటు స్థానిక రైతులు కొనుగోలు చేస్తున్నారు.

4న విశాఖకు రాష్ట్రపతి రాక

- నేవీ డే ఉత్సవాల్లో పాల్గొననున్న ద్రౌపదీ ముర్ము
- 7 ప్రాజెక్టుల్ని వర్చువల్‌గా ప్రారంభించనున్న రాష్ట్రపతి



సాక్షి, విశాఖపట్నం: భారత ప్రథమ పౌరాలు ద్రౌపదిముర్ము రాష్ట్రపతి హోదాలో తొలిసారిగా విశాఖపట్నంలో పర్యటించనున్నారు. భారత నౌకాదళ దినోత్సవాల్లో నేవీ డే విన్యాసాల్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. అదే సందర్భంలో ఏడు కీలక ప్రాజెక్టుల్ని కూడా వర్చువల్‌గా ప్రారంభిస్తారు. రాష్ట్రపతి పర్యటన షెడ్యూల్‌ను రాష్ట్రపతిభవన్ సెక్రటేరియట్ విడుదల చేసింది. రాష్ట్రపతి డిసెంబర్ 4వ తేదీ మధ్యాహ్నం 2.15 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. 2.25 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖపట్నం బయలుదేరి 3.25 గంటలకు నేవల్ ఎయిర్ స్టేషన్ ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. 3.35 గంటలకు డేగా నుంచి బయలుదేరి తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలోని చోళ సూట్‌కు చేరుకుని కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 4.05 గంటలకు చోళా సూట్ నుంచి బయలుదేరి ఆర్‌కేబీచ్‌కి చేరుకుంటారు. నేవీ డే సందర్భంగా భారత నౌకాదళం నిర్వహించే యుద్ధ విన్యాసాల్ని ఆమె ప్రారంభించి తిలకిస్తారు. విన్యాసాలు ముగిసిన అనంతరం అదే వేదిక నుంచి కేంద్రప్రభుత్వ శాఖలకు సంబంధించిన ప్రాజెక్టుల్ని వర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఒక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 6.10కి తూర్పు నౌకాదళానికి చెందిన అనంతగిరి కేంద్రానికి చేరుకుని నేవీ డే రిసెప్షన్‌కు హాజరవుతారు. అక్కడి నుంచి రాత్రి 7.30 గంటలకు బయలుదేరి ఐఎన్ఎస్ డేగాకు చేరుకుని 8 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖపట్నం నుంచి తిరుపతి బయలుదేరతారు. రాత్రి 8.40 గంటలకు రాష్ట్రపతి తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు.

విశాఖలో రాష్ట్రపతి వర్చువల్‌గా ప్రారంభించే ప్రాజెక్టులు ఇవే..

- రక్షణ శాఖకు సంబంధించి కర్నూలులో నిర్మించిన నేషనల్ ఓపెన్ ఎయిర్ రేంజ్ (ఎన్‌వోఏఆర్), నిమ్మలూరులో నిర్మించిన అడ్వాన్స్‌డ్ నైట్‌విజన్ ప్రొడక్ట్స్ ఫ్యాక్టరీ
- కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ ఎన్‌హెచ్–340లో రాయచోటి నుంచి అంగళ్లు వరకు నిర్మించిన హైవే, ఎన్‌హెచ్–205లో నిర్మించిన నాలుగు లైన్ల ఆర్‌వోబీ
- ఎన్‌హెచ్–44లో కర్నూలు టౌన్‌లోని ఐటీసీ జంక్షన్‌లో ఆరులైన్ల గ్రేడ్ సెపరేటెడ్ స్ట్రక్చర్, స్లిప్‌రోడ్స్, డోన్ నగర శివారులోని కంబాలపాడు జంక్షన్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో నిర్మించిన సర్వీస్ రోడ్లు, రహదారులు
- గిరిజన శాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, సైన్స్ సెంటర్.

శంకుస్థాపన చేసే ప్రాజెక్టు..

కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్–342లో ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి వరకు రహదారి విస్తరణ పనులు

నేడు రైతుల ఖాతాల్లోకి రూ.199.94 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి



రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్ సోమవారం బటన్ నొక్కి నేరుగా రైతన్నల ఖాతాల్లో ఈ మొత్తాన్ని జమచేయనున్నారు. రబీ 2020–21 సీజన్‌లో అర్హత పొందిన 2.54 లక్షల మందికి రూ.45.22 కోట్లు, ఖరీఫ్–2021 సీజన్‌లో అర్హత పొందిన 5.68 లక్షల మందికి సున్నా వడ్డీ రాయితీ కింద రూ.115.33 కోట్లు జమచేయనున్నారు. అదే విధంగా ఖరీఫ్–2022 సీజన్‌లో జూలై నుంచి అక్టోబర్ మధ్య గోదావరి వరదలు, అకాల వర్షాలవల్ల దెబ్బతిన్న 45,998 మంది రైతులకు రూ.39.39 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని ఖరీఫ్ సీజన్ ముగియక ముందే జమచేయనున్నారు.

ఇప్పటివరకు రూ.1,795కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ జమ..

ఇక గడిచిన మూడేళ్లలో 20.85 లక్షల మందికి రూ.1,795.40 కోట్ల పంట నష్టపరిహారం జమ చేయగా, తాజాగా జమచేయనున్న మొత్తంతో కలిపి 21.31 లక్షల మంది రైతన్నలకు రూ.1,834.79 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేసినట్లవుతుంది.

- అలాగే, గడిచిన మూడేళ్లలో 65.65 లక్షల మందికి రూ.1,282.11 కోట్ల సున్నా వడ్డీ రాయితీ సొమ్ములు చేయగా, తాజాగా జమచేయనున్న మొత్తంతో కలిపి 73.88 లక్షల మంది రైతన్నలకు రూ.1,834.55 కోట్ల సున్నా వడ్డీ రాయితీ అందినట్లు అవుతుంది.
- గడిచిన మూడేళ్ల ఐదు నెలల్లో వివిధ పథకాల కింద రైతన్నలకు రూ. 1,37,975.48 కోట్ల సాయం అందించారు.

గతంలో అంతా గందరగోళమే..

గత ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా పంట నష్టాల అంచనా, రైతన్నలు మధ్య దళారులు, క్షేత్రస్థాయి ఉద్యోగుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగినా పరిహారం అందుతుందో లేదో తెలియని దుస్థితి. కొన్ని సందర్భాల్లో పూర్తిగా ఎగ్గొట్టి, మరికొన్ని సందర్భాల్లో రెండు మూడు సీజన్ల తర్వాతే అరకొరగా సాయం అందించేవారు. కానీ, ప్రస్తుతం ఈ–క్రాప్ ఆధారంగా నమోదైన వాస్తవ సాగుదారులకు నేరుగా వారి ఖాతాల్లోనే ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగా పరిహారం అందిస్తున్నారు. అంతేకాక.. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ సోషల్ ఆడిట్ కింద రైతుభరోసా కేంద్రాల్లో లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శించడమే కాదు.. అర్హత ఉండి జాబితాల్లో తమ పేర్లు లేకపోతే ఫిర్యాదు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

క్లుప్తంగా

చలి తీవ్రత పెరిగే అవకాశం!

రెండు రోజుల్లో క్షీణించనున్న ఉష్ణోగ్రతలు



సాక్షి, విశాఖపట్నం: ఉపరితల ఆవర్తనం, అల్పపీడనం, వాయుగుండాల ప్రభావంతో కొద్దిరోజుల నుంచి రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుతం అల్పపీడనం గానీ, ఉపరితల ఆవర్తనం గానీ, ద్రోణుల జాడ గానీ లేవు. దీంతో వర్షాలు తగ్గుముఖం పట్టి మళ్లీ పొడి వాతావరణం నెలకొనే పరిస్థితులేర్పడ్డాయి. సోమవారం గుంటూరు, ప్రకాశం, ఎస్పీఎస్సార్ నెల్లూరు జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని, మిగిలిన ప్రాంతాల్లో వాతావరణం పొడిగా ఉంటుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం రాత్రి విడుదల చేసిన నివేదికలో తెలిపింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ మంగళ, బుధ, గురువారాల్లో పొడి వాతావరణం కొనసాగుతుందని పేర్కొంది. మరోవైపు రాష్ట్రంలోకి దిగువ స్థాయి నుంచి తూర్పు, ఈశాన్య గాలులు వీస్తున్నాయి. ఫలితంగా రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా క్షీణిస్తూ చలి తీవ్రతను పెంచుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే కోస్తాంధ్రలో కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంకంటే ఒకట్రెండు డిగ్రీలు తక్కువగా, రాయలసీమలో పలుచోట్ల సాధారణ కంటే 2–4 డిగ్రీలు అధికంగాను నమోదవుతున్నాయి. కాగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు రాష్ట్రంలోకెల్లా అత్యల్పంగా కళింగపట్నంలో 16.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

పర్యాటకుల బస్సులో చెలరేగిన మంటలు

- అరకు ఘాట్ రోడ్డుపై ఘటన



పూర్తిగా దగ్ధమైన బస్సు

అనంతగిరి: అరకు–విశాఖ ప్రధాన రహదారిలో అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి పర్యాటకులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు టైర్ల నుంచి మంటలు వ్యాపించగా బస్సు దగ్ధమైంది. ఈ ప్రమాదం నుంచి 24 మంది పర్యాటకులు క్షేమంగా బయటపడ్డారు. విజయనగరం గొల్లాలపేటకు చెందిన 24 మంది పర్యాటకులు రణదీప్ ట్రావెల్స్‌కు చెందిన బస్సులో అరకు అందాలను తిలకించేందుకు ఆదివారం వచ్చారు. తిరుగు ప్రయాణంలో అనంతగిరి ఘాట్‌రోడ్డు దిగుతుండగా.. టైడ సమీపంలో బస్సు చక్రాలు వేడెక్కి టైర్లనుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డుపక్కన నిలిపివేసి.. బస్సులోని 24 మంది పర్యాటకులను అప్రమత్తం చేశారు. బస్సులోని వారంతా బయటకు దిగి పరుగులు తీశారు. మంటలు వ్యాపించిన కొద్దిసేపటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పర్యాటకులు ప్రైవేట్ వాహనాల్లో శివలింగపురం గ్రామ సమీపంలో గల ఓ రిసార్ట్స్‌కు చేరుకున్నారు.

బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారు

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్



ఏలూరు (టూటౌన్): స్వాతంత్య్రం వచ్చిన నాటినుంచి బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ చెప్పారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఏలూరులో ఆదివారం నిర్వహించిన సామాజిక చైతన్యసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీసీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రధాని మోదీ పెద్దపీట వేస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా గత పాలకుల విధానాల కారణంగా చేతివృత్తులు అంతరించిపోయే పరిస్థితి దాపురించిందని చెప్పారు. బీసీలను లక్ష్యంగా చేసుకుని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు తర్వాత వారిని చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో తమ మిత్రపక్షమైన జనసేనతో కలిసి పనిచేస్తామని ఆయన చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి సహకరించిన కేఈ కృష్ణమూర్తిని టీడీపీ నేత చంద్రబాబు నాయుడు పక్కనబెట్టారన్నారు. ఏపీలో బీసీలను అభివృద్ధి చేయడంలో, రాజకీయంగా ముందుంచడంలో బీజేపీ కృషిచేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో 56 కార్పొరేషన్లు ఉన్నాయని, బీజేపీ అధికారంలోకి వస్తే కార్పొరేషన్లకు రూ.10 వేలకోట్లు, కాంట్రాక్టులు ఇస్తామని చెప్పారు. రూ.3 వేల కోట్లతో మొక్కలు పెంచే కార్యక్రమాన్ని బీసీ కార్పొరేషన్లకే ఇస్తామన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీశ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఆరుజిల్లాలకు చెందిన మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వచ్చేస్తోంది 'పాతాళ విద్యుత్'

విద్యుత్ ఉత్పత్తికి వినూత్న విధానాలు

భూమికి 20 కిలోమీటర్ల అడుగున ఉద్భవించే ఉష్ణానికి రాళ్లు కూడా కరిగిపోతాయి. అక్కడ జనించే వేడిని శక్తివంతమైన తరంగాల ద్వారా బయటకు తెచ్చి విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చంటున్నారు అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన శాస్త్రవేత్తలు. ఇప్పటికే ప్రయోగాలను పూర్తి చేసిన ఆ శాస్త్రవేత్తలు వచ్చే ఏడాది నుంచి 'పాతాళ విద్యుత్' ఉత్పత్తి చేసేందుకు వేగంగా ముందుకెళ్తున్నారు. మరోవైపు టర్కీలో రోడ్లపై వచ్చిపోయే వాహనాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ.. ఇస్తాంబుల్ నగరంలో వీధి లైట్లను వెలిగిస్తున్నారు. మన దేశంలోని పంజాబ్‌లో గడ్డి, ఇతర పంట వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. భారత్, అమెరికా, టర్కీ దేశాల్లో ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ఉత్పత్తి కోసం కొత్త ప్రయోగాలపై ఓ లుక్కేద్దాం పదండి.



అమెరికాలో జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం



ట్రాఫిక్‌లో సోలార్, విండ్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్

- వచ్చే ఏడాది నుంచి 'జియో థర్మల్' విద్యుత్ ఉత్పత్తి
- ఇప్పటికే ప్రయోగాలు పూర్తి చేసిన మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్
- టర్కీలో ట్రాఫిక్ నుంచి సౌర, పవన విద్యుత్ సృష్టి
- ఎండుగడ్డితోనూ ఇంధనం

సాక్షి, అమరావతి: జల విద్యుత్.. థర్మల్ విద్యుత్.. పవన విద్యుత్.. సౌర విద్యుత్.. హైడ్రోజన్ విద్యుత్.. అణు విద్యుత్.. ప్రపంచం మొత్తం మీద విద్యుత్ ఉత్పత్తి కోసం ఇప్పటివరకు అనుసరిస్తున్న విధానాలివి. వీటికి తోడు కొత్త రకం విద్యుత్ ఉత్పత్తి విధానాలు అందుబాటులోకి వస్తున్నాయి. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూనే.. పరిమిత వనరులను వినియోగించుకుని.. అధిక ఫలితాలను సాధించే దిశగా చేస్తున్న ప్రయోగాలు ఫలిస్తున్నాయి.

భూమి పొరల మధ్య వేడిని ఒడిసిపట్టి..

ఉపరితలం నుంచి భూమి లోపలికి 20 కిలోమీటర్ల మేర రంధ్రం చేసి.. అక్కడ ఉండే అపరిమిత వేడిని బయటకు తీసుకువచ్చి నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి చేయడమే జియో థర్మల్ విద్యుత్ విధానం. భూమి పొరల్లోకి అంత లోతున రంధ్రం చేస్తే అక్కడ ఉష్ణోగ్రత దాదాపు 500 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉంటుంది. అంత వేడికి రాళ్లు కూడా కరిగిపోతాయంటారు. అంత వేడిని తట్టుకుని పనిచేసే డ్రిల్స్ ప్రపంచంలో ఎక్కడా అందుబాటులో లేవు. అందుకే డ్రిల్స్ స్థానంలో శక్తిమంతమైన తరంగాలను వాడాలని నిర్ణయించారు. అక్కడి నుంచి ఉష్ణాన్ని పైకి రప్పించి.. భూమి ఉపరితలంపై ప్రత్యేక ప్లాంట్లను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. చీకటైతే సోలార్ పవర్ ఉండదు. నదులు ఎండిపోతే జలవిద్యుత్ ఉండదు. బొగ్గు లేకపోతే థర్మల్ ఉత్పత్తి జరగదు. కానీ, ఇవేమీ లేకపోయినా జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ఆగదు. ఈ ప్రాజెక్టుకు ఎక్కువ స్థలం కూడా అవసరం ఉండదు. కాబట్టి అడవులు, ప్రకృతి వనరులను ధ్వంసం చేయాల్సిన అవసరం రాదు. భూమిపై ఎక్కడైనా.. సమయంలోనైనా కరెంటును ఉత్పత్తి చేయొచ్చు. ఈ టెక్నాలజీపై అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని ప్రయోగశాలలో పరీక్షలు కూడా పూర్తి చేశారు. 2024 నాటికి జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలనుకుంటున్నారు.

ట్రాఫిక్ నుంచీ విద్యుత్ ఉత్పత్తి

టర్కీలోని ఇస్తాంబుల్ నగరంలో ట్రాఫిక్‌తో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. రోడ్ల మధ్యలోని డివైడర్ దగ్గర ప్రత్యేక పరికరాన్ని ఉంచుతున్నారు. ఆ పరికరంపై సోలార్ పవర్ ప్లేట్ అమర్చుతున్నారు. వాహనాలు వెదజల్లే వేడి ద్వారా ఆ సోలార్ ప్లేట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. అదే పరికరానికి ఫ్యాన్ రెక్కల లాంటి వంపు తిరిగిన మూడు రెక్కలు అమర్చి, వాటికి టర్బైన్స్ పెడుతున్నారు. ఏదైనా వాహనం రోడ్డుపై వేగంగా వెళ్లినప్పుడు వచ్చే అధిక గాలి తగలగానే ఆ రెక్కలు గుండ్రంగా తిరుగుతున్నాయి. వాటికి సెట్ చేసిన టర్బైన్ కూడా తిరుగుతుంది. దాంతో విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఇలా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌తో వీధి లైట్లను వెలిగిస్తున్నారు. మిగిలిన కరెంటును ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నారు. ఈ పరికరాల్లో వాతావరణాన్ని పరిశీలించే సెన్సార్లు కూడా ఉన్నాయి. ఇవి భూకంపాల్ని కూడా గుర్తిస్తాయట. వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ స్థాయి ఎంత ఉందో కూడా కనిపెడతాయట.

వ్యవసాయ వ్యర్థాలతో విద్యుత్

మన దేశంలోని పంజాబ్ రాష్ట్రంలో పంట వ్యర్థాలను విద్యుత్ ఉత్పత్తికి ఇంధనంలా వినియోగిస్తున్నారు. ఇన్నాళ్లూ ఇక్కడి రైతులు పంట వ్యర్థాలను తగలబెట్టేవారు. దీనివల్ల ఢిల్లీతో పాటు ఉత్తరాది రాష్ట్రాల్లో కాలుష్య సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలో ఆ వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి చేయడం వల్ల కాలుష్య సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు రైతులకు ప్రయోజనం చేకూరుతోంది. ముందుగా పంట వ్యర్థాలను పొగ రాకుండా మండించి బాయిలర్ నుంచి ఉత్పత్తి అయ్యే నీటి ఆవిరి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఈ విద్యుత్‌తో పంజాబ్‌లో పరిశ్రమలను నడిపిస్తున్నారు.

ఈ ప్రభుత్వాన్ని కూల్చే వరకు వదలం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని కూల్చే వరకు జనసేన పార్టీ వదిలిపెట్టబోదని ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. ఆదివారం ఆయన మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ నియోజకవర్గ పరిధిలోని ఇప్పటం గ్రామానికి చెందిన 39 మందికి రూ.లక్ష చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మీరు కలలు కంటున్నారేమో.. మీకు ఛాలెంజ్ చేస్తున్నా.. మీరు ఎలా గెలుస్తారో మేమూ చూస్తాం. వాళ్ల కోరిక ఏంటంటే.. 175కు 175 వస్తాయంట. ఆ.. వచ్చేస్తాయి. తీసేసుకోండి. అలాగైతే మేం ఏమీ చేయకుండా నోటిలో వేలు పెట్టుకొని కూర్చుంటాం' అని వ్యాఖ్యానించారు. ఇప్పటం కూల్చివేతలు కచ్చితంగా కక్షపూరిత చర్యేనని స్పష్టం చేశారు. 'మీరు ఏ కారణం చూపి మా వాళ్ల ఇళ్లు కూల్చారో.. 2024లో మా ప్రభుత్వం వచ్చిన రోజున అప్పుడు మేము కూడా లీగల్‌గానే వైసీపీ వాళ్ల గడపలు కూల్చుతాం. ఇప్పటం గ్రామ ప్రజలు చూపిన తెగింపు, తెగువ.. అమరావతి రైతులు చూపి ఉంటే రాజధాని ఇక్కడి నుంచి కదిలేది కాదు. 2024లో జనసేనకు మీరు మద్దతుగా నిలబడాలని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను' అని అన్నారు. పవన్ ఇంకా ఏమన్నారంటే..

ప్రధానికి చెప్పి చేయను..
నా యుద్ధం నేనే చేస్తా

- మాది రౌడీ సేన కాదు.. విప్లవసేన. ప్రజల దృష్టిలో మేము విప్లవకారులం. రౌడీయిజం చేసే వారికి ఎదురు తిరిగితే ఎలా ఉంటుందో మీకు తెలియదు కాబట్టి మేము రౌడీల్లా కనబడుతున్నాం. వైసీపీ రాజకీయ పార్టీనా.. లేక ఉగ్రవాద సంస్థా?
- మీ ఫ్యూడలిస్టిక్ కోటలు బద్దలు కొట్టి చూపుతాం. మీ తాటాకు చప్పుళ్లకు మేము బెదరం. నేను అన్నింటికీ సిద్ధపడే రాజకీయాల్లోకి వచ్చాను.
- ప్రధాని మోదీతో ఏమి మాట్లాడానని సజ్జల వంటి వారు అడుగుతున్నారు. ఆయన వస్తే చెవిలో చెబుతా ఏం మాట్లాడానో. వైసీపీని దెబ్బ కొట్టాలి అంటే నేను ప్రధాన మంత్రికి చెప్పి చేయను. ఏదైనా నేనే చేస్తాను.
- నేను ఆంధ్రుణ్ణి. ఆంధ్రలో పుట్టా.. ఆంధ్రలోనే తేల్చుకుంటా. మాట్లాడితే ఢిల్లీకి వెళ్లి ఫిర్యాదు చేయం. బీజేపీ పెద్దలను అడగం. నా యుద్ధం నేనే చేస్తా. మేము అధికారంలోకి వస్తే ఏం చేస్తానో చెప్పను.. చేసి చూపిస్తా.

పవన్.. ఈ 39 మంది ఎవరు?

ఇప్పటంలో రోడ్డు ఆక్రమించుకున్నారని అధికారులు 53 మందికి నోటీసులిచ్చారు. ఒకరు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో మిగతా 52 మంది ప్రహరీలను మాత్రమే కూల్చివేశారు. ఒక్క ఇల్లు కూడా కూల్చలేదు. అయితే మార్చి 14న జనసేన పార్టీ ఆవిర్భావ సభకు భూములిచ్చినందుకే ఇళ్లు కూల్చి వేశారని పవన్ నానా యాగీ చేస్తున్నారు. ఇప్పుడు బాధితుల పేరుతో పవన్ చెక్కులు ఇచ్చిన 39 మందిలో ఆ రోజు సభకు భూములిచ్చిన వారిలో ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. జనసేన ఆవిర్భావ సభను ఇప్పటంలో 6.70 ఎకరాల్లో నిర్వహించామని ఆ పార్టీ నేత ఎస్.మనోహర్ చెప్పారు. వింటా సాంబిరెడ్డి, తిరుమలశెట్టి సామ్రాజ్యం, ఎల్.ఆదినారాయణ, గాజుల సాంబయ్య, శంకరశెట్టి శ్రీనివాసరావు, శంకరశెట్టి పిచ్చయ్య, శంకరశెట్టి రాయుడు, ఉమామహేశ్వరరావు, గాజుల నరసయ్యల భూమి అది. ఇందులో 8మంది పేర్లు ఆక్రమణల జాబితాలోనే లేవు. వాళ్లలో ముగ్గురు అసలు ఆ గ్రామంలోనే ఉండరు. ఇంకొకరు ఆక్రమణల పరిధిలోకి వచ్చినా, అతడు ముందే హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో అతని ప్రహరీని తొలగించలేదు. అయితే ఆదివారం పవన్ చెక్కులు పంపిణీ చేసిన వాళ్లలో వీళ్లెవరూ లేరు. ప్రహరీలు తొలగించిన రోడ్డులో ఇల్లు లేని వారికి, నోటీసులు కూడా అందుకోనివారికి చెక్కులు పంపిణీ చేశారని ఇప్పటం గ్రామస్తులు చెబుతున్నారు.

జన సైనికులే 420లు

- చెక్కులు నిరాకరించిన పలువురు ఇప్పటం గ్రామస్తులు
- గ్రామాభివృద్ధి కోసం ఇస్తామన్న రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్
- న్యాయస్థానమే తప్పు పట్టినా మారరా?
- అసలు ఇళ్లే తొలగించలేదు.. ఇప్పటికైనా కళ్లు తెరవండి
- పవన్ కళ్యాణ్‌పై ఇప్పటం ప్రజల మండిపాటు

తాడేపల్లి రూరల్: 'జనసైనికుల మాట వినలేదని రైతుల్ని, ఇప్పటం గ్రామస్తుల్ని 420 అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. 420 లాగా వ్యవహరించి, కోర్టును పక్కదోవ పట్టించింది జనసేన పార్టీ వారు. అందుకే కోర్టుకు వెళ్లిన ప్రతి ఒక్కరికీ రూ.లక్ష జరిమానా పడింది. కోర్టును సైతం తప్పుదోవ పట్టించిన వారు 420లా? లేక గ్రామస్తులా? అనేది పవన్ కళ్యాణే చెప్పాలి' అని ఇప్పటం ప్రజలు ప్రశ్నించారు. రోడ్డును ఆక్రమించిన వారి ప్రహరీలు మాత్రమే తొలగిస్తే, ఇళ్లు తొలగించారని పవన్ కళ్యాణ్ నానాయాగీ చేస్తూ వారికి ఆదివారం రూ.లక్ష చొప్పున చెక్కులు పంపిణీ చేయగా, పలువురు ఆ చెక్కులు తీసుకునేందుకు నిరాకరించారు. ముస్నంగి వెంకటరెడ్డి, ముస్నంగి జగన్‌మోహన్‌రెడ్డి, ముస్నంగి శ్రీకాంత్‌రెడ్డి, లచ్చి వెంకటేశ్వర్లు, లచ్చి సాంబయ్య, ముస్నంగి బాలకోటిరెడ్డి, ముస్నంగి శివారెడ్డి, రెడ్డిబత్తుల సుబ్బారెడ్డి, ముస్నంగి శివశంకరరెడ్డిలు తమకు ఆ సాయం అవసరం లేదని స్పష్టం చేశారు.

ఇకనైనా విష ప్రచారం మానండి

'అసలు పోలీస్‌స్టేషన్ గుమ్మం ఎక్కని ఇప్పటం గ్రామాన్ని హైకోర్టు వరకు తీసుకువెళ్లి విష ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆ ప్రచారాలు మానుకుని వాస్తవాలు మాట్లాడితే బాగుంటుంది. పవన్ కళ్యాణ్ ఆ రోజు సభలో ఇప్పటం అభివృద్ధికి రూ.50 లక్షలు ఇస్తానని ప్రకటించారు. ఆ డబ్బులు అడుగుతున్నందుకే పంటపొలాలు ఇచ్చిన రైతుల ఇళ్లను కూల్చారంటూ విషప్రచారం చేశారు. ఇప్పటికే ప్రభుత్వం రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసింది. మరో రూ.6కోట్లు కేటాయించింది. మంగళగిరి నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ప్రహరీలు, షాపులను తొలగించారు. వారందరికీ కూడా పవన్ కళ్యాణ్ లక్ష రూపాయల చొప్పున కేటాయిస్తే ఎంతో సంతోషిస్తాము. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 325 చిన్న చిన్న గుడిసెలను తొలగించారు. వారికి కూడా లక్ష రూపాయలు ఇస్తే ఆ కుటుంబాలు మీ పేరు చెప్పుకుంటాయి' అని ఇప్పటం వాసులు వ్యాఖ్యానిస్తున్నారు.

మొదట తొలిగించింది నా ప్రహరీనే



ఇప్పటంలో మొట్టమొదటగా తొలగించింది నా ప్రహరీనే. గతంలో పంచాయతీగా ఉన్నప్పుడు రోడ్డును ఆక్రమించి ప్రహరీ గోడలను కట్టాం. ఇప్పుడు కార్పొరేషన్ అయ్యింది. కార్పొరేషన్‌కు అనుగుణంగా అభివృద్ధి పనులు చేస్తున్నారు. గతంలో మా గ్రామానికి రూ.10 లక్షల నిధులు ఇస్తే ఎక్కువ. ఏకంగా ఈ మూడు సంవత్సరాల్లో రూ.3 కోట్లు ఖర్చుపెట్టారు. మరో రూ.6 కోట్లు కేటాయించారు. రహదారులు అభివృద్ధి చేస్తే ప్రజలందరికి ఎంతో మేలు జరుగుతుంది.

– లచ్చి వెంకటేశ్వర్లు, ఇప్పటం

మా కుటుంబాన్ని అవమానిస్తున్నారు



పవన్ కళ్యాణ్ ఇచ్చిన చెక్కులను మేము నిరాకరించాం. మేము గ్రామ అభివృద్ధి కోరుకున్నాం. రోడ్డును ఆక్రమించి మేము ప్రహరీ నిర్మించిన మాట వాస్తవమే. అందువల్లే ప్రహరీని తొలగించారు. మాకేం బాధ లేదు. మా ఇంటి మీద ఒక్క ఇటుకను కూడా కదిలించలేదు. అదేమాట చెప్పినందుకు మా కుటుంబ సభ్యులపై 420లు, ప్యాకేజీ బాబులు అంటూ జనసేన పార్టీ సోషల్ మీడియా వారు మా కుటుంబాన్ని అవమానిస్తున్నారు.

– ముస్నంగి వెంకట రమణమ్మ, ఇప్పటం

రాష్ట్ర ప్రజలందరికీ అర్థమవుతోంది



ఎక్కడో మండలానికి చివరన ఉన్న ఇప్పటం గ్రామంలో గతంలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. పవన్ కళ్యాణ్ మూలంగా ఇప్పటాన్ని హైకోర్టుకు పరిచయం చేశారు. నోటీసులు ఇచ్చినా ఇవ్వలేదంటూ కోర్టుకు వెళ్లారు. కోర్టు మొట్టికాయలు వేసినా ఇంకా అసత్యాలు మాట్లాడుతున్నారంటే ఏమనాలి? గ్రామాల్లో పవన్ కళ్యాణ్ చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నాలు చేస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజలకు అర్థమవుతోంది. గోడలు తొలగిస్తే ఇళ్లు తొలగించారని టీడీపీ, జనసేన ప్రచారం చేయడం విడ్డూరం.

– లచ్చి సాంబయ్య, ఇప్పటం

పవన్.. నోట్లో వేలు పెట్టుకుని చూడు

▶ మొదటి పేజీ తరువాయి

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుదారు. తమ గ్రామంలో గడపలే కూల్చలేదని ఇప్పటం గ్రామస్తులు చెబుతుంటే.. పవన్ కళ్యాణ్ మాత్రం గోల చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో పవన్ కళ్యాణ్ ఆదివారం మరోసారి తన నటనా కౌశల్యాన్ని ప్రదర్శించారని అన్నారు. పేర్ని నాని ఇంకా ఏమన్నారంటే..

రూ.14 లక్షల జరిమానా మాటేంటి?

- 'హైకోర్టు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.14 లక్షలు జరిమానా వేసింది. ఆ డబ్బు ఎవరిస్తారో పవన్ కళ్యాణ్ చెప్పాలి. హైకోర్టులో కూడా అబద్ధాలు ఆడుతున్నారు. ఆ 14 లక్షలు చీకట్లో ఇస్తావా? నేరుగా కోర్టుకు కడతావా? గతంలో ఇప్పటంకు ఇస్తానన్న రూ.50 లక్షలు ఎప్పుడిస్తావో కూడా చెప్పాలి.
- చంద్రబాబు ప్రభుత్వం ఉన్నప్పుడు అమరావతి గ్రామాల్లో కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా పొలాల్లో రోడ్లు వేసినప్పుడు.. పచ్చటి పొలాలను తగుల పెట్టినప్పుడు.. భూములు ఇవ్వని రైతులను పోలీసులు లాఠీలతో కుళ్లబొడిసినప్పుడు, గుళ్లు.. గోపురాలను కూల్చినప్పుడు పవన్ కళ్యాణ్‌కు గుండు సూది కూడా గుచ్చుకోలేదా?

టెన్షన్‌తో చచ్చిపోతున్న చంద్రబాబుకు చెప్పు..

- మోదీతో ఏం మాట్లాడుకున్నావో సజ్జల చెవిలో చెప్పడం కాదు.. ఏం మాట్లాడుకున్నారో అని టెన్షన్‌తో చచ్చిపోతున్న చంద్రబాబుకు వెళ్లి చెవిలో చెప్పండి. పవన్ కళ్యాణ్ లేచినప్పటి నుంచి వైఎస్ జగన్‌పై పడి ఏడుస్తున్నాడు. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను గెలవనివ్వం.. అన్నప్పుడు వైఎస్సార్‌సీపీకి 151 సీట్లొచ్చాయి. అప్పుడు పవన్ కళ్యాణ్ నోట్లో వేలు పెట్టుకుని చూశాడు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 175 సీట్లు వచ్చినా నోట్లో వేలేసుకుని చూడాల్సిందే.
- పవన్ కళ్యాణ్.. మీ అభిమానులు మాత్రమే కాదు.. చిరంజీవి, మహేష్, ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్, బన్నీ, చరణ్, నాగార్జున అభిమానులు రాజకీయాల్లో వైఎస్ జగన్‌ను గుండెల్లో పెట్టుకుని తిరుగుతారు. ఎందుకో తెలుసుకోకుండా చంద్రబాబు వెంట తిరగడం వల్లనో.. ఓ లక్ష పుస్తకాలు చదివేస్తేనో ఉపయోగం ఉండదు.

చంద్రబాబు–పవనా? బీజేపీ–పవనా?

- వచ్చే ఎన్నికల్లో మాకు మద్దతివ్వండి అంటున్న పవన్.. 'నాకు' అని మాత్రం అనడం లేదు. మాకు అంటే ఎవరు? చంద్రబాబు, పవన్ కళ్యాణా? లేక బీజేపీ– పవనా?
- మొన్నటి వరకు నాకు కులాలు లేవు అన్నాడు. ఇప్పుడు రాయలసీమ వెళ్లి బలిజలను, కోస్తా వచ్చి కాపులను.. ఇప్పుడు తూర్పు కాపులను కూడా రెచ్చగొట్టి చంద్రబాబు చేతిలో పెట్టాలని చూస్తున్నాడు. ఓబీసీ సర్టిఫికెట్ ఎవరిస్తారో కూడా పవన్ కళ్యాణ్‌కి తెలియదా? బొత్స సత్యనారాయణ ఏ పార్టీలో ఉన్నా కాపు కులస్తుల్లో పెద్దోడనే గౌరవం ఇస్తారు.
- పవన్ కళ్యాణ్ తెగువ, గుండె ధైర్యం సినిమాల్లో కాదు.. రాజకీయాల్లో చూపించాలి. దమ్ముంటే 175కి 175 స్థానాల్లో పోటీ చేయాలి. సాటి కాపు కులస్తుడిగా, కాపుల్లో ఒక మంత్రిగా చేసిన వాడిగా మనోడు ఇలా చెడిపోతున్నాడేమిటీ అని.. చంద్రబాబు సంక ఎక్కవద్దు అని చెబుతున్నాం. గుడ్డలూడదీసి తంతా.. కాలర్ పట్టుకుంటాను.. అనడం ప్రజాస్వామ్యం అంటారా? రౌడీయిజం అంటారా? అందుకే అది జనసేన కాదు.. రౌడీ సేన, కిరాయి సేన అంటున్నాం.
- చంద్రబాబు ఫ్యాన్స్ అసోసియేషన్‌కు అధ్యక్షుడు రామోజీరావు.. ప్రధాన కార్యదర్శి పవన్ కళ్యాణ్. దేశంలో ఎక్కడా మద్యం ఉండకూడదు కానీ తారా, సితారాలో మాత్రం ఉండాలంటాడు రామోజీ. రాష్ట్రానికి బీజేపీ పార్టీ వల్ల దమ్మిడి ఆదాయం లేదు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, కడప స్టీల్ ఫ్యాక్టరీ ఏవీ ఇవ్వలేదు.' అని పేర్ని నాని అన్నారు.

2024 నాటికి అన్ని కాలేజీలకు

నాక్ గుర్తింపు!

కాలేజీల్లో ప్రమాణాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు


సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికే జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన వంటి పథకాల ద్వారా పేద విద్యార్థులకు సైతం ఉన్నత చదువులు అందిస్తోంది. ఇక్కడితోనే ఆగిపోకుండా విద్యార్థులు మంచి కొలువులు సాధించేలా ప్రముఖ సంస్థలతో జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇప్పిస్తోంది. తద్వారా చదువులు పూర్తి కాగానే మంచి వేతనాలు పొందేలా బాటలు పరుస్తోంది. ఈ క్రమంలో అన్ని కళాశాలల్లో ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో చర్యలు చేపట్టింది. 2024 నాటికి డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలతో పాటు అన్ని ఉన్నత విద్యాసంస్థలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) గుర్తింపును తప్పనిసరి చేసింది. నాక్‌తో పాటు ఇంటర్నేషనల్ ర్యాంకింగ్స్‌లోనూ రాష్ట్ర విద్యాసంస్థలు స్థానం సంపాదించేలా చర్యలు చేపట్టింది. ఇందుకనుగుణంగా కాలేజీలకు నాక్ గుర్తింపు రావడంలో సహకారం అందించేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలిలో ప్రత్యేకంగా క్వాలిటీ అస్యూరెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయించింది. దీని ద్వారా అన్ని కాలేజీలు నాక్ 'ఎ' గ్రేడ్‌తో పాటు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్) ర్యాంకులు సాధించేలా కార్యాచరణ చేపట్టింది. క్వాలిటీ అస్యూరెన్స్ సెల్‌లో వర్సిటీలు, స్వయం ప్రతిపత్తి పొందిన కాలేజీలు, పరిశ్రమల ప్రముఖులతోపాటు ఉన్నత విద్యాశాఖ నుంచి సలహా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ సెల్ ద్వారా ఇప్పటికే కాలేజీలు నాక్ గుర్తింపు సాధించేలా మార్గనిర్దేశం చేస్తోంది. విద్యా ప్రమాణాల పెంపు, నాక్ గుర్తింపునకు అవసరమైన వనరుల కల్పన, ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌కు అవసరమయ్యే అంశాల్లో కాలేజీలను ముందుకు తీసుకువెళ్తోంది. జిల్లాల వారీగా వెనుకంజలో ఉన్న వాటిని పై స్థాయికి చేరేలా చేస్తోంది. ఇందుకనుగుణంగా ఇప్పటికే రాష్ట్రంలో క్వాలిటీ లీడర్లుగా 164 ఇంజనీరింగ్, డిగ్రీ, ఫార్మసీ కాలేజీలు, వర్సిటీలను అధికారులు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా కాలేజీలు నాక్ గుర్తింపు సాధించేలా సహకారం అందిస్తున్నారు.

ప్రమాణాల పెంపునకు అత్యధిక ప్రాధాన్యం..

తొలి అడుగుగా నాక్ 'బీ' కేటగిరీలో ఉన్న కాలేజీలను గుర్తించి.. వాటి ద్వారా అసలు నాక్ గుర్తింపు లేని కాలేజీలకు మార్గనిర్దేశం చేస్తున్నారు. ఇలా ఇప్పటికే 72 నాక్ గుర్తింపు ఉన్న కాలేజీలను, 13 వర్సిటీలను గుర్తించి వాటిని క్యూ (క్వాలిటీ) మెంటార్లుగా ఏర్పాటు చేశారు. వీటితోపాటు మరో 117 కాలేజీలను కూడా క్వాలిటీ మెంటార్లుగా గుర్తించి 346 కాలేజీలు నాక్ గుర్తింపు సాధించేలా వాటిని అనుసంధానించారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాములు, శిక్షణ, ఈ–కంటెంట్ ప్రిపరేషన్ తదితర అంశాల్లో ఆయా కాలేజీలకు సహాయమందిస్తున్నారు.

ఉద్యోగాలు కొల్లగొట్టేలా ఉచిత శిక్షణ..

కాగా ప్రభుత్వం అన్ని కోర్సుల్లో ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. దీంతోపాటు విద్యార్థులకు వివిధ ఇంటర్న్‌షిప్‌లు, సర్టిఫికేషన్ కోర్సులను కూడా ఉచితంగా అందిస్తోంది. ఇంటర్న్‌షిప్ కోసం కాలేజీలను పరిశ్రమలతో అనుసంధానించారు. మైక్రోసాఫ్ట్, సిస్కో, సేల్స్‌ఫోర్స్, ఏడబ్ల్యూఎస్ వంటి సంస్థల ద్వారా లక్ష మందికి వర్చువల్ ఇంటర్న్‌షిప్‌నకు చర్యలు చేపట్టారు. ఐసీఐసీఐ, విప్రో, ఐబీఎం, ఎడెల్‌వైస్, హీరో, హోండా, మారుతి సుజుకీ వంటి సంస్థల్లో ఫుల్‌స్టేక్, హెచ్‌ఆర్, మార్కెటింగ్, సేల్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ వంటి అంశాల్లో 50 వేల మందికి వర్చువల్ ఇంటర్న్‌షిప్‌ను అందిస్తున్నారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి కల్పించిన అవకాశంతో నేషనల్ ఎడ్యుకేషనల్ అలయెన్స్ ఫర్ టెక్నాలజీ (నీట్) ద్వారా 2 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), పైథాన్, క్లౌడ్, డేటా ఎనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, బిగ్‌డేటా, అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), క్యాడ్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. పరిశ్రమలతో కాలేజీల అనుసంధానం ద్వారా 2.5 లక్షల మందికి ఇంటర్న్‌షిప్ అందించేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే 58 వేల మందికి ఇంటర్న్‌షిప్ ప్రారంభమైంది. దీనివల్ల విద్యార్థులు నైపుణ్యాల పెంపుతో పాటు మంచి ఉద్యోగాలు దక్కించుకోనున్నారు.



విద్య లేనిదే వికాసం లేదు. వికాసం లేనిదే
పురోగతి లేదు. పురోగతి లేనిదే ప్రగతి లేదు.
విద్యే అన్నిటికీ మూలం.
- జ్యోతిబా పూలే

సాక్షి
సోమవారం, నవంబర్, 28

తోడుదొంగ?

''అనువాదకుడనేవాడు మూలరచయితకి తోడుదొంగ!'' అన్నాడు హోర్హే గాంజాలిజ్ మోర్. అనువాదాలు చదువుకునేవాళ్ళలో చాలామందికి తెలిసిన విషయమే ఈ బహుముఖ ప్రజ్ఞావంతుడు చెప్తున్నాడు! అతను చెప్పని మాటొకటి వుంది– ఈ తోడుదొంగలు ఉమ్మడిగా దోచుకునేది పాఠకుల హృదయాలను!! అవును మరి, రచయితలన్నాకా అన్ని విషయాలూ విప్పిచెప్పేస్తారా? కాస్తా అర చాటుగానో, తెరచాటుగానో వాళ్ళు చెప్పే మాటల్లోని సారాంశాన్ని గ్రహించాల్సిన రసజ్ఞత వినే వాడిది. పోతే, రచయితలు – అనువాదకుల గురించి మోర్ చెప్పిన విషయం తెలుగుజాతికి బాగా తెలుసు. ఎందుకంటే, మన ''ప్రామాణిక సాహిత్యం మొదలయిందే ఓ అనువాదంతో. వ్యాసుడనే కృష్ణ ద్వైపాయనుడు సంస్కృతంలో రాసిన మహాభారతాన్ని 'కవిత్రయం' అనే నన్నయ, తిక్కన, ఎర్రన తెలిగించడంతోనే ప్రామాణిక సాహిత్య సృజన మొదలయిందని మన పెద్దలు చెప్పారుగా! కాకపోతే, భారతానువాదం పూర్తయ్యేసరికి పాఠకులకు దక్కేది మూలపాఠంలోని 21.5 శాతమేనని వాళ్లు చెప్పలేదు. తర్వాతి రోజుల్లో మరో పెద్దాయన ఆ లెక్కతీశాడు!

అయినా, అనువాదమంటే ఆషామాషీ వ్యవహారమా? శ్రీనాథుడు ఆరేడువందల సంవత్సరాల కిందట అదేమాట అన్నాడు కదా! శబ్దాన్ని అనుసరించి–భావాన్ని ఉపలక్షించి – అభిప్రాయాన్ని గ్రహించి – రసాన్ని పోషించి–అలంకారాన్ని భూషించి – ఔచిత్యాన్ని ఆదరించి – అనౌచిత్యాన్ని పరిహరించి మరీ తాను అనువాదం సాగించానన్నాడా పండిత కవి. మనలో మనమాట – విద్వదౌషధం అనిపించుకున్న నైషధాన్ని తెనిగిస్తూ, ''గమికర్మీకృత నైకనీవృతుడనై'' అంటూ పదబంధాలకు పదబంధాలను ఎత్తుకొచ్చి మెత్తేసిన శ్రీనాథుడు చెప్పినట్లే చేసివుంటే, ''మీ 'దుమువులు' మీరు తీసేసుకుని, మా నైషధం మాకు ఇచ్చెయ్యం''డని సంస్కృత విద్వాంసులు ఎందుకంటారు? అయితే, కవిగా ఏం చేసినా, పండితుడిగా శ్రీనాథుడికి అనువాదం కేవలం భాషాంతరీకరణం మాత్రమే కాదని బాగా తెలుసు! ''అనువాదం మాటలకే పరిమితమయిన వ్యవహారం కాదు సుమా! ఒకానొక సంస్కృతిని సంపూర్ణంగా బోధపరచడమే అనువాదమవుతుం''దని మనకాలపు బహుముఖ ప్రజ్ఞావంతుడు యాంటనీ బర్జెస్ అదే మాట మనకర్థమయ్యేలా – ఆంగ్లంలో– అన్నాడు!

'అనువాదమనే ప్రక్రియే లేకపోతే, మనం సరిహద్దులకే పరిమితమైపోతాం! అంచేత అనువాదకుడే నా కీలక సహచరుడు. అతగాడే, నన్ను విశాల విశ్వానికి పరిచయం చేస్తా''డన్నాడు ఇటాలో కాల్వినో – పశ్చిమాంధ్ర భాషలో. (అనగా, ''ఇటాలియన్లో'' అని వివరించాలంటారా?) ప్రపంచానికి ఈ కొసన ఉన్న దక్షిణాంధ్ర ప్రాంతంలో, ఏడెనిమిది వందల సంవత్సరాల కిందట పుట్టిన ధూర్జటి రాసిన ''శ్రీకాళహస్తీశ్వర శతకం'' ఆంగ్లంలోకి అనువాదమయి, అనేక విదేశ భాషలకు పరిచయం కావడం చూస్తే కాల్వినో మాటలు ఎంత వాస్తవాలో బోధపడుతుంది! ఎక్కడో ఐరోపా ఖండం ఉత్తరాంచలంలో పొడుగ్గా వ్యాపించి వుండే దేశం నార్వే. అక్కడ పుట్టిన హెన్రిక్ ఇబ్సెన్, పందొమ్మిదో శతాబ్దిలోనే ప్రపంచమంతటా ఆధునిక నాటక కళను వ్యాపింపచేశాడంటే, అది అనువాదకుల సహాయంతోనే సాధ్యమయింది. అలాగే, పందొమ్మిదో శతాబ్దిలోనే ప్రపంచాన్నంతటినీ ప్రభావితం చేసిన మార్క్స్–ఎంగెల్స్ లాంటి అసాధారణ మేధావులనే ప్రభావితులను చేసినవాడు ఫ్రెంచ్ నవలారచయిత, నాటకకర్త ఆనరే ద బాల్జాక్. బాల్జాక్ రచనలు కూడా అనువాదకుల పుణ్య మానే అన్ని దేశాల్లోనూ భావవిప్లవాన్ని రగిలించగలిగాయి. ''మాటలు ప్రపంచమంతా పర్యటిస్తాయి; వాటికి అనువాదకులే చోదకు''లంది ఆనా రుస్కోనీ. అది అక్షర సత్యం!! ఆమె స్వయంగా ఓ అనువాదకురాలు కావడం వల్లనే అంత చక్కగా చెప్పగలిగిందనిపిస్తుంది.

ఇరవయ్యో శతాబ్దం ఉత్తరార్థంలో చాలా దేశాల గురించిన సమాచారం దూరదేశాలకు సైతం వ్యాపించినందువల్ల ఉన్నదున్నట్లుగా అనువాదాలు చేసినా పాఠకుల ఆదరణకు పాత్రం కాగలుగుతున్నాయి. కానీ, అంతకుముందు – ముఖ్యంగా రెండో ప్రపంచ యుద్ధానికి ముందు – చాలామంది అనువాదకులు అనువాదాలను అనుసృజనల రూపంలో చేయవలసివచ్చింది. కానీ, రచయితలు ఈ తరహా అనుసృజనలను మెచ్చలేదు. ''మూలంలోని ఏ విషయమూ మార్చకుండానే, ఆ భాషలో చెప్పిందాన్ని అంతటినీ మరో భాషలోకి మార్చడమే అనువాద''మని గ్యుంథర్ గ్రాస్ అన్నమాట రచయితలకు అనువాదకుల మీద ఉన్న ఫిర్యాదును ప్రతిధ్వనిస్తోంది. ఉదాహరణకు, ఆలివర్ గోల్డ్‌స్మిత్ నవల ''ద వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్''ను, కందుకూరి వీరేశలింగం కొంతవరకూ అనువాదమే చేశారు. కానీ, తన ప్రయత్నం సఫలం కాదనిపించి, 'రాజశేఖర చరిత్రము' పేరిట అనుసృజనగా వెలువరించారు. అది పాఠకుల సౌకర్యార్థం చేస్తున్న పనేనని ఆయన త్రికరణశుద్ధిగా నమ్మారు. ఆయన అనుసృజన 'ద ఫార్చ్యూన్స్ వీల్' పేరిట యథామూలంగా ఆంగ్లంలోకి అనువాదం కావడం ఓ విశేషం! సృజనాత్మక సాహిత్యం విషయంలో అనుసృజనలను –ఒక మేరకు– కవిత్వంలో ఏమైనా సహిస్తున్నారేమో కానీ, ఇతరత్రా ఈ ఆచారం అంతరించిందనే చెప్పాలి.

చివరిగా ఒక్కమాట– 'విద్వత్వంచ నృపత్వంచ న ఏవతుల్యే కదాచన– స్వదేశే పూజ్యతే రాజా, విద్వాన్ సర్వత్ర పూజ్యతే!' అని చిన్నప్పుడు మనమందరం చదువుకున్న ఓ సుభాషితం చెబుతోంది. ఈ ఏడాది శతజయంతి జరుపుకొంటున్న రాచమల్లు రామచంద్రారెడ్డి అలా అన్నిచోట్లా ఆరతు లందుకున్న విద్వాంసుడు. ఆయనకి మనమూ అర్పిద్దాం నీరాజనం!

కవిత – శాక కబేళా

ఒక్కొక్క మాంసపు ముక్క వొక్కో జీవగీతమై మార్మోగుతుంది, వొకప్పుడు ముక్కలు ముక్క లుగా వుండిన నేలను దేవ దేశంగా చేసిన దురాగ తాన్ని తలచుకొని తప్త కంఠమవుతుంది, ప్రేమ దేహగతమైనప్పుడు యెంత తీపి తీగగా సరాగి స్తుందో బంధం కావాలన్న హక్కు ఘాతానికి హత అహమై వజ్ర ఖడ్గమవుతుంది, యిప్పుడు 35 మాత్రమే రేపటి నాడు 35,000 శకలాలుగా యీ భూమికీ నింగికీ నారీ రక్తాభిషేకం చేస్తుంది, అదెప్పుడో మొలిచిన మొగుళ్ళ గద క్షణాని కొక ఆడబలి తీసుకొంటున్నది, దాని పేరు శైశవతాళో, వరశుల్కమో, పరువు హత్యో, ఖాప్ పంచాయితో, యేమైనా గానీ అది జాజుల పాడె, నాజూకుల నయగారాల, నయాగరాల శిలువ, సమ సమాధి, ఆదిమహా పురుషుడి అమస్తక పాదమూ యెవ రెక్కడో చెప్పారు గాని నువ్వెక్కడో చెప్పలేదు, బహుశా... పృష్ఠమా! నీ నోములన్నీ జమదగ్నిలో దూకి చావడానికే, నీవొక దేహానివే అందమయిన మోహ బిలానివి, అవసరం తీరిన తర్వాత పారేసే చెత్త కుప్పవు, వాడిన కండోమ్‌ల దీవివి, నిన్ను పొడిచిన ప్రతి కత్తిపోటూ బానిసల దేశాన్ని మరింత మెరిపి స్తుంది, బహుజన ముఖం మీది మచ్చను యింకా పెద్దది చేస్తుంది, వాడి మోచేతి కింద బతకమనే కదా అమ్మ బోధించింది తన తను మనస్సుల కున్న ఆరని అసంఖ్యాక గాయాలను చూపిస్తూ, కోటి దీపార్చనను నిష్ఠగా నిన్ను నువ్వు నిర్మూ లించుకొనే వరకూ చేయమంది కదా... నాన్న బలిపీఠం మీది తనను అనుసరించమంది కదా కదా! మృగాలకు అర్పించుకోడమే సగాల బతు కన్నది మరచిపోయావా, అనుదిన ప్రతి క్షణ ప్రవంచకుల బోధల్లోని మోక్ష బావుల్లో దూకమని చెప్పలేదా, అంతెందుకు ఆరెస్సెస్సెస్సెస్సారే మన్నారు, నీ దేహం కామోద్దీపమే కాదు మగోత్కృష్టమూ అనలేదా?

– నిజం

3 అబద్ధాలు 6 అభాండాలు

- బాబు హయాంలో పర్మిట్ రూములతో సహా 4,380 దుకాణాలు
- వాటికి అనుబంధంగా రాష్ట్రమంతటా 43వేల బెల్టుషాపులు
- దుకాణాలన్నీ ప్రయివేటు మాఫియా చేతుల్లో; ఎమ్మార్పీని మించి ధరలు
- దానివల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- అందుకే విక్రయాల్ని ప్రభుత్వపరం చేసిన వైసీపీ సర్కారు
- దీంతో ఏదో ఒక రూపంలో విష ప్రచారానికి దిగుతున్న 'ఈనాడు'
- చీప్ బ్రాండ్లు... కల్తీ లిక్కర్... అనయాయుల డిస్టిలరీలు అంటూ కథనాలు
- కానీ అవన్నీ చంద్రబాబు పుణ్యమే అని తేలటంతో ఇపుడు 'బెల్టు' కథ





ఆయనే కర్త... కర్మ... క్రియ
1990ల మొదట్లో... మద్య నిషేధ ఉద్యమానికి...
1996 నుంచీ రాష్ట్రంలో అక్రమ మద్యం పెరిగిపోవటానికి... అలా పెరిగిపోయిందంటూ 'ఈనాడు'విచ్చలవిడిగా రాయడానికీ...
రైల్వే స్టేషన్లో రెండు బాటిళ్లు దొరికినా ఓ పేద్ద వార్త ప్రచురించడానికి...
1997లో చంద్రబాబు మద్య నిషేధం ఎత్తివేయటానికి...
అన్నిటికీ ఆయనే కర్త..కర్మ... క్రియ.
ఆయనే రామోజీరావు!!.

ఏది నిజం?



రామోజీరావు చాలా నికార్సయిన మనిషి. సిద్ధాంతానికి కట్టుబడే తత్వం. కాకపోతే ఆ సిద్ధాంతమే కాస్త తేడా!. అదేంటంటే తన చంద్రబాబు అధికారంలో ఉంటే మద్య నిషేధం అక్కర్లేదు. వేరెవ్వరు అధికారంలో ఉన్నా... మద్య నిషేధం కావాలి. లేదంటే ఊరుకోరు. అందుకే...

విచిత్రమేంటంటే ఈ 86 ఏళ్ల మద్య నిషేధ ఉద్యమకారుడు 1997లో చంద్రబాబు నిషేధాన్ని ఎత్తివేసినపుడు తన పత్రిక 'ఈనాడు'లో ఓ విచిత్రమైన సంపాదకీయం రాశాడు. ప్రభుత్వాలు నిషేధాన్ని అమలు చేయటం సాధ్యం కాదని, జనం ఎవరికి వారు తాగటం మానేస్తే తప్ప ఈ మహమ్మారిని అంతం చేయలేమని సూత్రీకరించాడు..

నాడు: బాబు హయాంలో ఊరూరా విరగకాసిన 43,000 బెల్టు షాపుల్ని 'ఈనాడు' ఏనాడూ చూడలేదు.
నేడు: ప్రస్తుత ప్రభుత్వం దృష్టికి రాకుండా ఎక్కడో ఒకటీ అరా నడుస్తున్నా... '3 పెగ్గులు–6 గ్లాసులు' అంటూ తాగినట్లే ఊగిపోతారు.

నాడు: అప్పట్లో ఏకంగా 4,380 మద్యం దుకాణాలు... పక్కనే పర్మిట్ రూమ్‌లతో సహా మందు పోస్తుంటే అది విచ్చలవిడితనమని 'ఈనాడు'కు అనిపించలేదు.
నేడు: షాపులో కొనుక్కుని ఎక్కడో పొలాల్లో తాగుతున్న వారిని కూడా ఫోటోలు తీసి... బెల్టు షాపులో కొని తాగుతున్నట్లుగా చిత్రీకరిస్తాడు.

నాడు: బాబు హయాంలో అమ్మే ఏ మద్యమైనా ఆయన దృష్టిలో అమృతమే.
నేడు: అవే డిస్టిలరీలు, అదే మద్యాన్ని తయారు చేసి విక్రయిస్తుంటే... అది విషమంటూ నీచపు రాతలు రాస్తాడు. కోవర్టులతో కలిసి దొంగ టెస్టులు చేయించి మరీ దుష్ప్రచారానికి దిగుతాడు.

నాడు: చంద్రబాబు ఏ బ్రాండుకు అనుమతిచ్చినా అది చాలా గొప్పదని 'ఈనాడు' భావం. ప్రెసిడెంట్ మెడల్, గవర్నర్ రిజర్వ్ ఆ పత్రిక దృష్టిలో అప్పట్లో గొప్పపేర్లు.
నేడు: బాబు దిగిపోవటంతో... ఇవన్నీ ప్రస్తుత ప్రభుత్వం పెట్టిన ఘోరమైన పేర్లంటూ ఆందోళన వ్యక్తం చేస్తుంది. అంతేకాదు!! త్రీ క్యాపిటల్స్, స్పెషల్‌స్టేటస్ అంటూ లేని పేర్లను కూడా ఉన్నట్టుగా ఎల్లో రాతలు రాసి యాగీ చేస్తుంది.

- ఇక ఏ డిస్టిలరీ నుంచి ప్రభుత్వం ఎంత మద్యం కొంటోందన్న విషయంలోనూ విషప్రచారమే. రాష్ట్రంలో చంద్రబాబు అనుమతిచ్చిన 20 డిస్టిలరీలుండగా... వాటిలో ఒక డిస్టిలరీకి 6 శాతం ఆర్డర్లు ఇవ్వటం కూడా రామోజీరావు దృష్టిలో 'అడ్డగోలు' వ్యవహారమే. బాబు హయాంలో ఒకే డిస్టిలరీకి 15–20 శాతం ఆర్డర్లిచ్చినా అందులో ఎలాంటి తప్పూ కనిపించదు.
- ఇవన్నీ ఎందుకంటే... బేసిగ్గా చంద్రబాబు తప్ప వేరెవ్వరూ పదవిలో ఉండకూడదన్నది రామోజీరావు సిద్ధాంతం. కానీ ప్రజాస్వామ్యంలో ప్రజలందరూ వద్దనుకున్నాక రామోజీ అభీష్టంతో పనిలేదు కదా? కాకపోతే ఆ వాస్తవం రామోజీకి మూడున్నరేళ్లు గడిచినా జీర్ణం కావటంలేదు. ఎప్పుడో ఎన్టీఆర్ కాలం మాదిరిగా తాను తలచుకుంటే ఎవరినైనా పదవిలో కూర్చోబెట్టగలనన్న అహం ఇప్పటికీ చావలేదు. విషపు రాతలతో ప్రభుత్వానికి మద్యంపై పైసా ఆదాయం రాకుండా చేయాలని... అలా ప్రభుత్వ ఆదాయ వనరును దెబ్బతీస్తే ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలూ అమలు చేయలేని పరిస్థితిలో పడి ప్రజాభిమానాన్ని కోల్పోతుందనేది ఆయన పరమోద్దేశం. కాకపోతే ఇక్కడొక చిన్న లాజిక్‌ను రామోజీరావు మిస్సవుతూనే ఉన్నాడు.





అలా నిషేధాన్ని ఎత్తేశాక తన రామోజీ ఫిలిం సిటీలోని ఫైవ్‌స్టార్ హోటళ్లలో దేశ, విదేశీ బ్రాండ్ల మద్యాన్ని విచ్చలవిడిగా అమ్మకానికి పెట్టాడు. వాటిని మరింత తాగించడానికి బెల్లీ డ్యాన్సులు పెట్టాడు. వారానికో ప్రత్యేక కార్నివాల్‌ను పెట్టి... తన పత్రికలో ప్రకటనలిచ్చి మరీ జనాన్ని రప్పించి తాగించాడు. ఎందుకంటే ఆయన దృష్టిలో నిషేధం అనేది ఎవరికి వారు విధించుకోవాలి తప్ప ప్రభుత్వమో... అమ్మకం దార్లో చేయటం కష్టం!. అంటే... ఎవరికి వారు తాగటం మానేయాలి తప్ప తాను మాత్రం అమ్ముతూనే ఉంటానని, ఇష్టం వచ్చిన వాళ్లు తాగొచ్చని చాలా పద్ధతిగా చెప్పారు. ఇదీ... ఈయన గారి పాత్రికేయ పాతివ్రత్యం!.



మద్యంపై చెప్పింది చెప్పినట్టే...

రామోజీ మిస్సయిన లాజిక్కేంటంటే... అధికారంలో ఉన్నది వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. మాటకు కట్టుబడే వైఎస్సార్ లక్షణానికి అక్షరాలా వారసుడు. రాష్ట్రంలో మద్యాన్ని నియంత్రిస్తూ వెళతానని ఎన్నికలకు ముందే చెప్పారాయన. ఆ నియంత్రణలో భాగంగానే... తాను ఎన్నికల్లో గెలిస్తే మద్యం ధరలు షాక్ కొట్టేలా నిర్ణయిస్తానని, అమ్మకాలను తగ్గిస్తానని చెప్పారు. అన్నట్టే ధరలు పెంచటంతో మద్యం అమ్మకాలు గణనీయంగా తగ్గాయి. 2018–19లో చంద్రబాబు హయాంలో 384.36 లక్షల మద్యం కేసులు విక్రయిస్తే 2021–22లో ఆ సంఖ్య ఏకంగా 277.16 లక్షలకు తగ్గింది. ఇక బీర్ల విక్రయానికొస్తే 2018–19లో ఏకంగా 278.50 లక్షల కేసులు విక్రయించగా... 2021–22లో ఆ సంఖ్య కేవలం 82.60 లక్షలకు తగ్గిపోయింది. కాకపోతే ఇదేదీ రామోజీరావుకు కనిపించదు. బాబు హయాంలో చాలా పక్కాగా పరిమితంగా మద్యం విక్రయాలు జరిగినట్లు... ఇప్పుడేమో విచ్చలవిడిగా అమ్మేస్తున్నట్లు ఆయనకు కలలు వస్తుంటాయి. అవి 'ఈనాడు'లో రాతల రూపంలో ప్రత్యక్షమవుతుంటాయి.

ఈ చర్యలు 'ఈనాడు'కు ఎన్నడూ కనిపించవా?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 43 వేల బెల్ట్ దుకాణాలను పూర్తిగా తొలగించింది. మద్యం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉంటే బెల్టు షాపులను అడ్డుకోవడం అసాధ్యం కనక... ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వమే పరిమితంగా మద్యం దుకాణాలను నిర్వహించాలని నిర్ణయించింది. 4,380 మద్యం దుకాణాలను ఏకంగా 2,934కి తగ్గించడంతోపాటు విక్రయ వేళలను కుదించారు. అందుకే విక్రయాలు గణనీయంగా తగ్గాయి. 2018–19తో పోలిస్తే 2020–21లో మద్యం విక్రయాలు 40%, బీర్ విక్రయాలు 73% తగ్గడమే ఇందుకు నిదర్శనం. కాకపోతే ఇలా తగ్గిన విషయాన్ని 'ఈనాడు' ఏనాడూ ప్రస్తావించదు. ఇంత తగ్గినా... మద్యం ఏరులై పారుతోందని, విచ్చలవిడిగా బెల్టుషాపులు పెట్టి అమ్మేస్తున్నారని చేతికొచ్చిన రాతలు రాసి అచ్చేస్తుంటుంది. బెల్టు షాపులు రాష్ట్రంలో ఎక్కడా కనిపించకూడదని, పొరుగు రాష్ట్రాల నుంచి తెచ్చి అక్రమంగా మద్యం విక్రయించకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను (సెబ్) ఏర్పాటు చేసింది. సెబ్‌కు ఎవ్వరైనా ఫిర్యాదు చేసేలా ఆ ఫోన్ నెంబర్‌ను మద్యం దుకాణాల వద్ద కూడా ప్రదర్శిస్తోంది.

రాష్ట్రంలో మద్యానికి సంబంధించిన వ్యవస్థ చాలా పెద్దది. ఎన్ని చర్యలు తీసుకున్నా ఒకటో రెండో చోట్ల అనధికారికంగా విక్రయించటం జరుగుతూ ఉండొచ్చు. కాకపోతే ఇది 1 శాతానికన్నా తక్కువే. కాకపోతే రామోజీరావు మాత్రం దీన్నే వంద శాతంగా చిత్రించడానికి ప్రయత్నిస్తుంటాడు. ఒకటో రెండో చోట్ల జరిగిన సంఘటనలను చూపిస్తూ... మొత్తం రాష్ట్రమంతటా ఇలాగే ఉందని చెప్పే ప్రయత్నం చేస్తుంటాడు. అదే చంద్రబాబు హయాంలో మాత్రం మొత్తం 100 శాతం అక్రమ విక్రయాలు జరిగినా పెన్నెత్తి రాయడు. ఒక్కచోట కూడా అక్రమం జరిగినట్లు చెప్పడు. అసలు బాబు హయాంలో బెల్టు షాపుల్ని నియంత్రించడానికి గానీ, షాపుల్లో మద్యం ధరలను పెంచి విక్రయిస్తే అడ్డుకోవటానికి గానీ ఏదైనా వ్యవస్థ ఉందా? ఇప్పుడలా కాదు కదా? గడిచిన మూడేళ్లలో రాష్ట్రంలో మద్యానికి సంబంధించి ఎన్ని కేసులు బుక్ చేశారో తెలుసా? ఎందరిని అరెస్టు చేశారో తెలుసా? ఎన్ని వాహనాలను సీజ్ చేశారో తెలుసా? మరి ఇన్ని చేస్తున్నారంటే అక్రమంగా విక్రయించే వారిని వెతికి వెతికి పట్టుకుంటున్నారనే కదా అర్థం? ఈ వాస్తవాలనెందుకు రాయరు రామోజీరావు గారూ? ప్రభుత్వంపై బురద జల్లేటపుడు ఆ ప్రభుత్వం తాలూకు చిత్తశుద్ధిని కూడా ప్రస్తావించాలి కదా? మీ పాఠకులేం పాపం చేశారు?

ఎన్ని కేసులు బుక్ చేశారు (సెబ్/ ఎక్సయిజ్)

	బుక్ చేసిన కేసులు	అరెస్టులు	వాహనాల సీజ్
2020 (మే-డిసెంబర్)	65,718	81,266	20,152
2021 (జనవరి -డిసెంబర్)	1,06,933	1,47,592	21,654
2022 (జనవరి - అక్టోబర్)	62,800	97,643	8,741

మీ సూత్రం ఇప్పుడు వర్తించదా రామోజీ?


రామోజీరావు సూత్రం ప్రకారం మద్య నిషేధాన్ని అమలు చేయటం ప్రభుత్వాలకు అసాధ్యం. నిషేధమే కాదు... మద్యాన్ని నియంత్రించటం కూడా సాధ్యం కాదు. ఎవరికి వారు మద్యం మానేయాలి తప్ప... వారి చేత మద్యం మాన్పించటం ప్రభుత్వాలతో అయ్యే పనికాదు. నిజానికి 1995లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన నాటి నుంచీ రామోజీరావు ఈ సూత్రానికే కట్టుబడ్డారు. 2004లో దిగిపోయి... మళ్లీ చంద్రబాబు 2014లో ముఖ్యమంత్రి అయినప్పుడు కూడా ఇదే వైఖరి. అందుకే బెల్టు షాపుల జోలికి వెళ్లలేదు. మద్యం దుకాణాలన్నీ ప్రయివేటు మాఫియా చేజిక్కించుకుని ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయిస్తున్నా పెన్నెత్తలేదు. ఇప్పుడు మాత్రం ప్రభుత్వమే ఎమ్మార్పీ ధరలకు ఖచ్చితంగా కట్టుబడి విక్రయిస్తున్నా... బెల్టు షాపుల్ని నామరూపాల్లేకుండా చేసినా ఆయనకు లోపాలు కనిపిస్తున్నాయి. ఎక్కడో ఒకటీ రెండు చోట్ల చిన్న దుకాణాల్లో మద్యం అమ్ముతున్నారని, దీన్ని ప్రభుత్వం నియంత్రించటం లేదు కాబట్టి... రాష్ట్రమంతటా '3 పెగ్గులు– 6 గ్లాసుల' మాదిరి ఉందని బురద జల్లేశారు. మరి రామోజీ లాజిక్ ప్రకారమే చూసుకుంటే వీటిని ప్రభుత్వమెలా నియంత్రిస్తుందని ఆయన అనుకోవాలి కదా? ఎవరికి వారు మద్యం మానాలి తప్ప ప్రభుత్వం వారిచేత ఎలా మాన్పిస్తుందని చెప్పింది ఆయనే కదా? కాకపోతే ఈ ప్రభుత్వ వైఖరి చంద్రబాబులా లేదు. కఠినంగా నియంత్రించడానికే ఎస్‌ఈబీని ఏర్పాటు చేసింది. ఎస్‌ఈబీ దాడులు చేసి కఠినంగా వ్యవహరిస్తోంది. ఇదిగో... ఇప్పుడు 'ఈనాడు' రాసిన వ్యవహారంపై కూడా కచ్చితంగా ఎస్‌ఈబీ తనిఖీలు చేసి తన బాధ్యత తాను నిర్వహిస్తుంది. కాకపోతే ఇదే పరిస్థితి రాష్ట్రమంతటా ఉన్నట్టుగా చిత్రీకరిస్తూ దుర్మార్గపు రాతలు రాయటమే ఈ రాష్ట్రం చేసుకున్న దౌర్భాగ్యం. ''బాబు కళ్లలో సంతోషం కోసం'' అన్న రీతిలో టైమ్ టేబుల్ పెట్టుకుని మరీ ప్రతి పక్షం రోజులకోసారి ఇలా మద్యంపై విషపు రాతలు రాస్తున్న రామోజీకి... ఇది 'ఈనాడు' చెబితే నమ్మేసే కాలం కాదని అర్థమయ్యేదెప్పుడో..?

మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయనేందుకు ఈ అంకెలే సాక్షి...

	లిక్కర్ (కేసులు.. లక్షల్లో)	బీర్ (కేసులు.. లక్షల్లో)
2018-19	384.36	277.16
2021-22	278.50	82.60
వృద్ధి /తగ్గుదల (మైనస్)	-40	-73

తెలుగు స్త్రీలకు వెలుగునిచ్చిన విద్యాలయం

సందర్భం



ఎమ్. వి. శాస్త్రి

20వ శతాబ్దం ప్రారంభం నాటికి అవిద్య, బాల్య వివాహాలు, నిర్బంధ వైధవ్యం వంటి అనేక సమస్యలతో భారత స్త్రీలు కొట్టుమిట్టాడుతుండేవారు. ఇంటి నాలుగు గోడల మధ్య బందీలై, బాహ్య ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలియని స్థితి వారిది. దీనికి తోడు ఆనాటికి ప్రబలి ఉన్న మూఢ విశ్వాసాలు వారికి మరిన్ని ఇబ్బందులు తెచ్చిపెట్టేవి. ఈ స్థితిలో స్త్రీలను ఉద్ధరించడానికి కందుకూరి వీరేశలింగం వంటివారు నడుం బిగించారు. ఆ కోవకు చెందినవారే ఉన్నవ లక్ష్మీనారా యణ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ దంపతులు కూడా. వారు స్త్రీవిద్య కోసం గుంటూరులో 'శారదా నికేతనం' స్థాపించారు. దానికి నూరు వసంతాలు నిండాయి.

ఉన్నవ దంపతులు గుంటూరు కేంద్రంగా జాతీయోద్యమం, స్త్రీ జనోద్ధరణ, సంస్కరణోద్యమాలకు తమ జీవితాలను అంకితం చేసి చరితార్థులయ్యారు. స్త్రీలకై ఒక విద్యాలయం నడపాలని భావించిన వారి ఆశయ ఫలితంగా... గుంటూరు గాంధీపేటలో సనాతన ధర్మమండలి హాలులో 1922 నవంబరు 22న, దేశో ద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ప్రారంభకులుగా 'శారదా నికేతనము' స్థాపితమైంది. స్త్రీలలో జాతీయ భావాన్ని రేకెత్తించే పద్ధతులను అనుసరించి విద్య నేర్పటానికి ఏర్పాటైన 'శారదా నికేతనము'లో సంస్కృతము, తెలుగు, హిందీ, సంగీ తము, చిత్ర లేఖనము, నూలు వడకుట, నేత, కుట్టు పని మొద లగు వృత్తి విద్యలు ప్రవేశపెట్టారు. విద్యార్థినులకు వసతి గృహం కూడా ఏర్పాటు అయింది.

1922లో గుంటూరు అరండల్‌పేటలో ప్రారంభించిన శారదా నికేతనము... తరువాతి సంవత్సరంలో మునగాల జమీందారు నాయని వెంకట రంగారావు, బ్రాడీపేట 2వ లైనులో కొండా వెంక టప్పయ్య నివాసానికి (దేశభక్త భవనము) చేరువలో విరాళంగా ఇచ్చిన రెండు ఎకరాల స్థలం స్థలంలోకి మార్చబడింది. ఇప్పటికీ అదే స్థలంలో ఈ నికేతనం కొనసాగుతోంది. శారదా నికేతనంలో ఆంధ్రదేశం నలుమూలల నుండేకాక, దక్షిణాఫ్రికా, రంగూన్, ఖరగ్పూర్, హైదరాబాదు వంటి పలు నగరాల నుండి తెలుగు విద్యార్థినులు ఇక్కడికి వచ్చి గురుకుల వాసం చేస్తూ విద్యాభ్యాసం చేసేవారు.





ఉన్నవ లక్ష్మీనారాయణ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ

ఈ విద్యాలయం రెండు స్థాయిల్లో కోర్సులను నిర్వహించేది. మొత్తం ఎనిమిదేళ్ల కాల వ్యవధి. మొదటి 5 ఏళ్లు సాహితీ ప్రకరణమనీ, మిగిలిన 3 ఏళ్లు విదుషీ ప్రకరణమనీ విభజిం చారు. బాగా చదవటం, రాయటం వచ్చి ప్రైమరీ తరగతి వరకు చదివిన బాలికలను 5 ఏళ్ల సాహితీ ప్రకరణ కోర్సులో చేర్చుకునేవారు. 5 సంవత్సరాలు పూర్తి అయేసరికి బాలికలకు సంస్కృతాంధ్రాలలో కొంత కావ్యజ్ఞానం అలవడి, సంగీత – చిత్రలేఖనాలలో ఒకదానిలో మంచి జ్ఞానం సంపాదించేవారు. అలాగే చేతిపనులలో ఒకటి నేర్చుకుని, భూగోళము, వైద్యము, చరిత్రలో మంచి పరిచయం పొందేవారు. ఈ పరీక్షలలో ఉత్తీర్ణులయిన వారు 'సాహితీ' బిరుదమును పొందేవారు. తరువాతి 3 ఏళ్ల సంస్కృతాంధ్ర భాషలలో ఒకటీ, ఆంగ్ల, హిందీ భాషలలో ఒకటీ అభిమాన భాషలుగా చదివి పరీక్షలో ఉత్తీర్ణులయినవారు 'విదుషీ' పట్టభద్రులు అయ్యేవారు. గవర్న మెంటు వారి పరీక్షలతో గానీ, పర్యవేక్షణతోగానీ సంబంధం లేకుండా విద్యాలయం వారే తరగతులన్నిటికీ వార్షిక పరీక్షలు జరిపి, పట్టాలను ఇచ్చేవారు.

బాలికలకు విద్యా బోధనతో పాటూ... అనాథలకు, బాల వితంతువులకు, వితంతువులకు, భర్త వదిలి పెట్టినవారికి ఉచితంగా భోజన వసతి, వస్త్ర సదు పాయాలు కల్పించి; అభాగ్య స్త్రీల పాలిట ఆశ్రిత కల్పవృక్షంగా శారదా నికేతనం పేరు ప్రఖ్యాతులు పొందింది. 1927 ఏప్రిల్ 17వ తేదీన గాంధీమహాత్ముడు ఈ సంస్థని దర్శించి, ఇటువంటి సంస్థ ఆంధ్రదేశంలోనే కాదు, యావద్భారత దేశంలోనే లేదని ప్రశంసించారు.

పూరిపాకలలోను, చెట్ల నీడలోను ప్రారంభంలో తరగతులు నిర్వహించినా... కాలక్రమంలో స్త్రీ విద్యాభిమానులయిన వదా న్యుల సహకారంతో సొంత భవనాలను, భూమి తదితర స్థిరాస్తులను సంపాదించుకోగలిగింది. ఆంధ్రదేశంలోని మున్సి పాలిటీలు, తాలూకా బోర్డులు, జిల్లా బోర్డులు తగిన విధంగా ఈ విద్యాలయానికి ఆర్థిక సహకారం అందించేవి. 1937లో ఆంధ్ర విశ్వ విద్యాలయం వారిచే ఈ సంస్థలోని సంస్కృతాంధ్రశాఖ– 'ప్రాచ్య భాషాకళాశాల'గా గుర్తింపునొందింది.

తరువాత కాలంలో ఇందలి పారిశ్రామిక శాఖను ప్రత్యేక పాఠశాలగా గవర్నమెంటు గుర్తించింది. ఒక స్వతంత్ర సంస్థగా రిజిష్టరైన 'శ్రీశారదా నికేతన్' ప్రయివేటు యాజమాన్యంలో ప్రధా నంగా ఉన్నవ దంపతులచే నిర్వహింపబడింది. 1955లో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ దేవాదాయ, ధర్మాదాయశాఖ అధీనంలోకి తీసు కునేవరకూ ఈ సంస్థకు ముఖ్యదాత అయిన మునగాల జమీం దారు రాజా నాయని వెంకట రంగారావు బహద్దరు అధ్యక్షులుగా కొనసాగారు. ప్రస్తుతం ఏపీ దేవాదాయ, ధర్మాదాయ శాఖ నియమించిన కార్య నిర్వహణాధికారి ఆధ్వర్యంలో శారదా నికేతనం విద్యాసంస్థల నిర్వహణ సాగుతోంది.

దరిశి అన్నపూర్ణమ్మ (గదర్ విప్లవ వీరుడు దరిశి చెంచయ్య భార్య), సంగెం లక్ష్మీబాయమ్మ (నిజామాబాద్ బాన్సువాడ నియోజకవర్గం నుండి గెలుపొంది, విద్యాశాఖ ఉప మంత్రిగా బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో పనిచేసిన ప్రథమ తెలంగాణ మహిళ), బొందలపాటి శకుంతలాదేవి (త్రిపురనేని గోపీచంద్ భార్య), భారతీదేవి (ఆచార్య ఎన్.జి.రంగా భార్య) వంటి పేరెన్నికగన్న స్త్రీ మూర్తులు శ్రీశారదా నికేతనం పూర్వ విద్యార్థినులే. ఇంతటి చరిత్ర గలిగిన శారదానికేతనం 2022 నవంబరు 22 తేదీన వందేళ్లు పూర్తి చేసుకుంది.

ప్రస్తుతం శారదానికేతనంలో– ప్రాథమిక పాఠశాల (బాల బాలికలకు), ఉన్నత పాఠశాల (బాలికలకు), ఓరియంటల్ డిగ్రీ కళాశాల(బాలికలకు) నిర్వహిస్తున్నారు. ఈ మూడింటా సుమారు 500 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. తెలుగు ఆడపడుచులకు విద్యా, విజ్ఞానాలను అందించి వారి కాళ్లపై వారు నిలబడగలమనే ధైర్యాన్ని నింపిన శారదా నికేతన్... ఒక చారిత్రక పాత్ర పోషించిందనడంలో అతిశయోక్తి లేదు. దాని స్ఫూర్తిని అందు కోవలసిన బాధ్యత మన తరానిదే!

వ్యాసకర్త సింగరేణి కాలరీస్ హెచ్‌ఆర్ మేనేజర్ (రిటైర్డ్)
మొబైల్: 94413 42999

గ్రహం అనుగ్రహం శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: శు.పంచమి సా.6.11 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: ఉత్తరాషాఢ ప.3.24 వరకు, తదుపరి శ్రవణం, వర్జ్యం: రా.7.06 నుండి 8.36 వరకు, దుర్ముహూర్తం: ప.12.09 నుండి 12.55 వరకు, తదుపరి ప.2.23 నుండి 3.06 వరకు, అమృతఘడియలు: ప.12.32 నుండి 2.04 వరకు: రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు: సూర్యోదయం 6.15 : సూర్యాస్తమయం 5.20.

క్లుప్తంగా

కాచిగూడ-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాజీపేట, విజయవాడ మీదుగా కాచిగూడ నుంచి తిరుపతికి, తిరుపతి నుంచి కాచిగూడకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాచిగూడ-తిరుపతి (07473) ప్రత్యేక రైలు డిసెంబర్ 2, 9, 16, 23, 30 తేదీల్లో, తిరుపతి-కాచిగూడ (07474) డిసెంబర్ 3, 10, 17, 24, 31 తేదీల్లో నడపనున్నట్లు పేర్కొన్నారు.

దురంతో ఎక్స్‌ప్రెస్‌లో పొగలు

- కుప్పంలో 40 నిమిషాలు నిలిపివేత
- మరమ్మతులు చేసి రైలును పంపిన సిబ్బంది



కుప్పం రైల్వే స్టేషన్‌లో ఆగిన హౌరా ఎక్స్‌ప్రెస్ నుంచి వస్తున్న పొగ

కుప్పం/రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఎస్ఎంవీటీ బెంగళూరు-హౌరా దురంతో ఎక్స్‌ప్రెస్‌లోని ఓ బోగీలో పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. అయితే, సాంకేతిక సమస్య కారణంగా వచ్చిన పొగను రైల్వే సిబ్బంది సకాలంలో గుర్తించి రైలును నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. ఎస్ఎంవీటీ బెంగళూరు నుంచి హౌరా వెళుతున్న దురంతో ఎక్స్‌ప్రెస్ (12246) రైలు ఆదివారం మధ్యాహ్నం 12.50 గంటలకు కుప్పం స్టేషన్ సమీపంలోకి రాగానే ఎస్-9 బోగీలో పొగ వచ్చింది. ఈ విషయాన్ని గుర్తించిన రైలు గార్డ్ తక్షణమే డ్రైవర్‌కు సమాచారం ఇవ్వడంతో కుప్పం స్టేషన్‌లో రైలును నిలిపివేశారు. వెంటనే సిబ్బంది ఎస్-9 కోచ్‌ను పరిశీలించారు. ఒత్తిడి కారణంగా బ్రేక్ బైండింగ్‌లో పొగలు వ్యాపించినట్లు గుర్తించిన సిబ్బంది మరమ్మతులు చేయడంతో 1.30 గంటలకు రైలు బయలుదేరి వెళ్లింది. ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం లేదని, అందరూ సురక్షితంగా ఉన్నారని రైల్వే అధికారులు ప్రకటించారు. ఎస్ఎంవీటీ బెంగళూరు-హౌరా దురంతో ఎక్స్‌ప్రెస్‌లో మంటలు చెలరేగాయని, ప్రయాణికులు గాయపడ్డారని కొన్ని ప్రసారమాధ్యమాల్లో వార్తలు వచ్చాయని, అది అవాస్తవమని తెలిపారు.

త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం

- ముందు వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొన్న అయ్యప్ప భక్తుల బస్సు
- ఇద్దరు డ్రైవర్లతో సహా 28 మందికి స్వల్ప గాయాలు

ఒంగోలు: అయ్యప్ప భక్తులకు త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. ముందు వెళ్తున్న గ్రానైట్ లోడుతో ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి అయ్యప్ప భక్తులు ప్రయాణిస్తున్న వాహనం ఢీకొనడంతో 28 మందికి గాయాలయ్యాయి. శనివారం అర్ధరాత్రి ఒంగోలు సమీపంలోని జాతీయ రహదారిపై ఘటన చోటుచేసుకుంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం డీఎల్‌పురానికి చెందిన 30 మంది, సునిపూడికి చెందిన మరో పది మంది అయ్యప్ప భక్తులు శబరిమలకు బయలు దేరారు. చీమకుర్తి నుంచి గ్రానైట్ లోడుతో ఉన్న ఓ లారీ ఒంగోలు నగరంలోని హైవే మీదకు వచ్చింది. ఇదే సమయంలో హైవే బ్రిడ్జిపైనుంచి వస్తున్న బస్సు.. టిప్పర్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఘటనలో గాయపడిన వారిని రిమ్స్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ప్రయాణికులను మరో బస్సులో శబరిమలకు పంపించేందుకు చర్యలు చేపడుతున్నారు. కాగా, ప్రమాదంలో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఐనంపూడి అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మార్కెట్లోకి 2023 టీటీడీ డైరీలు, క్యాలెండర్లు

తిరుమల: టీటీడీ ప్రతిష్టాత్మకంగా ముద్రించిన 2023 సంవత్సర క్యాలెండర్లు, డైరీలు భక్తులకు తగినన్ని అందుబాటులో ఉన్నాయి. తిరుమలలోని శ్రీవారి ఆలయం ఎదురుగా, లేపాక్షి ఎదుట, అన్నదాన భవనంలోని పుస్తక విక్రయశాలలతో పాటు తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయం వద్దగల ధ్యానమందిరం, రైల్వేస్టేషన్, శ్రీనివాసం, విష్ణు నివాసం, తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం వద్దగల పుస్తక విక్రయశాలల్లో క్యాలెండర్లు, డైరీలు ఉన్నాయి. విజయవాడ, వైజాగ్, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, న్యూఢిల్లీ, ముంబయిలోని టీటీడీ సమాచార కేంద్రాల్లోనూ క్యాలెండర్లు, డైరీలను టీటీడీ భక్తులకు అందుబాటులో ఉంచింది. అదేవిధంగా ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామివారి ఆలయం, దేవుని కడపలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాలతో పాటు నెల్లూరు, రాజమండ్రి, కాకినాడ, కర్నూలు, నంద్యాల, హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపాల్లో అందుబాటులో ఉన్నాయి. 12 పేజీల క్యాలెండర్ రూ.130, డీలక్స్ డైరీ రూ.150, చిన్న డైరీ రూ.120, టేబుల్ టాప్ క్యాలెండర్ రూ.75, శ్రీవారి పెద్ద క్యాలెండర్ రూ.20, శ్రీ పద్మావతి అమ్మవారి క్యాలెండర్ రూ.20, శ్రీవారు, శ్రీపద్మావతి అమ్మవారి క్యాలెండర్ రూ.15, తెలుగు పంచాంగం క్యాలెండర్ - రూ.30గా నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో, తపాలా శాఖ ద్వారా కూడా బుక్ చేసుకోవచ్చు. వివరాలకు 99639 55585, 0877-2264209 నంబర్లలో సంప్రదించవచ్చు.

గడప గడపకు మన ప్రభుత్వం



కర్నూలు నగరంలోని జొహరాపురంలో మహిళల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



అనకాపల్లి జిల్లా మల్లాం భూపతిపాలెంలో సమస్యలను తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



కృష్ణా జిల్లా మంటాడలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



పల్నాడు జిల్లా నల్లమల అటవీ ప్రాంత సమీపంలోని బొటుకులపాయ తండాలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

అడవుల్లోనూ ఆహార పంటలు

- ఇతర రైతులతో పోటీపడుతున్న అడవిబిడ్డలు
- అటవీ ఉత్పత్తుల సేకరణ నుంచి వ్యవసాయం వైపు జోరుగా..
- ఆయా ప్రాంతాలు, పరిస్థితులకు అనుగుణంగా సాగుతో లాభాల ఆర్జన
- పట్టాల పంపిణీతో ప్రభుత్వ ప్రోత్సాహం
- రైతుభరోసా, విత్తన రాయితీతోపాటు సాగుకు సర్కారు అన్ని విధాలా తోడ్పాటు

సాగులో 'ఆహా' అనిపిస్తున్న గిరిజనులు



"నేను నా రెండెకరాల్లో వరి సాగుచేస్తున్నాను. ప్రభుత్వం అందించిన రైతుభరోసా సాగు పెట్టుబడికి ఎంతో ఉపయోగపడుతోంది. రాయితీ విత్తనాలు కూడా అందించి అండగా నిలుస్తోంది. ఈ ఏడాది 1070 వరి రకాన్ని సాగుచేశా. మంచి దిగుబడులు సాధిస్తున్నా. అటవీ ఫలాలు సేకరణతోనే కుటుంబాన్ని పోషిస్తూ గతంలో అవస్థలుపడ్డ నేను ఇప్పుడు ప్రభుత్వ సహకారంతో ఆహార పంటలూ పండిస్తూ సమాజంలో గౌరవంగా జీవిస్తున్నాను." - కుర్సం రాజు, మెరకగూడెం, బుట్టాయగూడెం మండలం, ఏలూరు జిల్లా

సాక్షి, అమరావతి: నిన్న మొన్నటి వరకు కేవలం అటవీ ఫలాల సేకరణపైనే ఆధారపడ్డ గిరిపుత్రులు ఇప్పుడు అద్భుతాలు సృష్టిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు, సహకారంతో ఇతర అన్ని ప్రాంతాల్లోని రైతుల మాదిరిగానే ఆహార పంటలు పండిస్తూ వారితో సాగులో పోటీపడుతున్నారు. వీరికి ప్రభుత్వం పెద్దఎత్తున ఆర్వోఎఫ్ఆర్ పట్టాల ద్వారా భూమిని పంపిణీ చేయడంతో అడవి బిడ్డలు ఇప్పుడు ఉద్యాన, వ్యవసాయ పంటల సాగువైపు మళ్లుతున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతులను అవలంబిస్తూ మేలైన దిగుబడులు సాధిస్తున్నారు. పోడు వ్యవసాయం, వంతుల సాగు, టెర్రస్ సాగు, వర్షాధార సాగు, మిశ్రమ పంటలు వేయడం, అంతర్ పంటలు, ఆర్గానిక్ వ్యవసాయం, జీరో బడ్జెట్ వ్యవసాయం వంటి విధానాలను ఆయా ప్రాంతాలు, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా చేపట్టి లాభాలు ఆర్జిస్తున్నారు.

గిరిజనులు సాగుచేస్తున్న ప్రాంతాలివే..

సీతంపేట, పార్వతీపురం, పాడేరు, రంపచోడవరం, చింతూరు, కోట రామచంద్రపురం, కృష్ణా, నెల్లూరు, శ్రీశైలం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లతోపాటు గుంటూరు, ప్రకాశం, వైఎస్సార్ కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో అనేక గిరిజన తెగలు వ్యవసాయ సాగులో రాణిస్తున్నాయి.

సాగుతో రైతులుగా మారిన గిరిజన తెగలు..

సవర, కాపు సవర, జతాపు, సవర గదబ, భగత, వాల్మీకి, కొండదొర, కొండరెడ్డి, వాల్మీకి, కొండ కమ్మర, కోయనైకపాడు, కోయ, లంబాడీ, చెంచు, సుగాలి, యానాది, ఎరుకల, నక్కల తెగలు.

గిరిజన తెగలు సాగుచేస్తున్న పంటలు..





వరి, రాగి, జొన్నలు, బాజ్రా, కందులు, వేరుశనగ, జీడిపప్పు, కాఫీ, మిరియాలు, మామిడి, అనాస (పైనాపిల్), సీతాఫలం, రామాఫలం, పనస, బొప్పాయి, అరటి, టమాటా, పసుపు, చింతపండు, నిమ్మ, అల్లం, మిరప, పత్తి, పొద్దుతిరుగుడు, పొగాకు, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు.





ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది

నేను సొంతంగా రెండున్నర ఎకరాల్లో వరి సాగుచేస్తున్నాను. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం బాగుంది. ఏటా రైతుభరోసాతోపాటు రాయితీతో కూడిన విత్తనాలు అందిస్తున్నారు. కోతుల బెడద నుంచి రక్షణగా పొలం చుట్టూ గ్రీన్ కర్టెన్ ఏర్పాటుచేశాను. పంట బాగుంది. రూ.35వేల వరకు మిగిలే అవకాశముంది.
– బంధం చిన్న వీరాస్వామి, ఐ.పోలవరం గ్రామం, రంపచోడవరం మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా



కాఫీ సాగుకు తోడ్పాటు అందుతోంది

రెండెకరాల్లో కాఫీ తోట పెంచుతున్నాను. ఇందులో అంతర్ పంటగా మిరియాలు సాగుచేస్తున్నాను. కాఫీ సాగులో ప్రభుత్వ ప్రోత్సాహం, కాఫీ బోర్డు, ఐటీడీఏ సహకారం బాగుంది. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) కొనుగోలుతో బయట మార్కెట్‌లోను పోటీ పెరిగి మంచి ధర దక్కుతోంది. ఈ ఏడాది రూ.3 లక్షలు ఆదాయం వస్తుంది.
– తమర్బ వెంకటేశ్వరనాయుడు, ఇరడాపల్లి గ్రామం, పాడేరు మండలం



గిరిజన రైతులకు భరోసా అందిస్తున్నాం

గిరిజన రైతులకు ఏటా రూ.13,500 చొప్పున వైఎస్సార్ రైతుభరోసా సాయాన్ని అందిస్తూ విత్తన రాయితీ, సాంకేతిక పరిజ్ఞానం, ఇతర వనరులను సమకూరుస్తున్నాం. సీఎం నేతృత్వంలో 2019 ఆగస్టు నుంచి 1,20,361 మంది గిరిజనులకు 2,09,615 ఎకరాల ఆర్వోఎఫ్ఆర్ పట్టాలను, 26,287 మందికి 39,272 ఎకరాల డీకేటీ పట్టాలు అందించాం. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా భూములు చదును చేయడం, బోరు బావులు తవ్వడం వంటివి ప్రభుత్వం చేపట్టింది.
– పీడిక రాజన్నదొర, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి



గిరిజన ఉత్పత్తుల కొనుగోలుపై ప్రత్యేక శ్రద్ధ

గిరిజన కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వారు సేకరించిన అటవీ ఫల సాయంతోపాటు అటవీ ఉత్పత్తులను కూడా జీసీసీ మద్దతు ధరలకు కొనుగోలు చేసి ప్రోత్సహిస్తోంది. అటవీ ఫలసాయం సేకరణతోనే గిరిజనులు సరిపెట్టుకోకుండా వ్యవసాయం, ఉద్యాన పంటలను సాగుచేస్తున్నారు.
– శోభా స్వాతిరాణి, చైర్‌పర్సన్, గిరిజన సహకార సంస్థ (జీసీసీ)

వివాదాస్పదంగా గురజాడ పురస్కారం

- గురజాడ గౌరవయాత్ర పేరుతో నిరసన ర్యాలీ
- ఒక కోణంలోనే ప్రచారం చేయడం సరికాదంటున్న సమాఖ్య ప్రతినిధులు



గురజాడ విగ్రహానికి అసమ్మతి పత్రాన్ని అందజేస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ విశిష్ట పురస్కారాన్ని ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడాన్ని నిరసిస్తూ గురజాడ గౌరవ యాత్ర పేరిట పలు సాహితీ సంస్థల ప్రతినిధులు గురజాడ విగ్రహానికి అసమ్మతి పత్రాన్ని అందజేశారు. గురజాడ స్వగృహంలో ఆదివారం నిరసన వ్యక్తం చేస్తూ ఆయన స్వగృహం నుంచి కోట, మూడులాంతర్లు, గంటస్తంభం, ఎంఆర్ కళాశాల రోడ్డు మీదుగా గురజాడ విగ్రహం వద్దకు చేరుకున్నారు. శ్రీకాకుళం సాహితీ, కథానిలయం సంస్థకు చెందిన సాహితీవేత్త అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ ఆధ్యాత్మిక రచనలు చేసిన ప్రవచనకర్తకు పురస్కారం ఇవ్వడం సమంజసం కాదన్నారు. సాహితీ స్రవంతి చీకటి దివాకర్, వెలుగు సంస్థ స్వామి, విశ్వసాహితీ నరసింహారావు అరసం బాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్ని వెంకట సుబ్బయ్య (ఒంగోలు), వర్మ, త్రిమూర్తులు రెడ్డి (విశాఖ), మాజీ ఎమ్మెల్సీ శర్మ, గంటేడ గౌరునాయుడు, ద్వారం దుర్గాప్రసాదరావు తదితరులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, విజయ భావన ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు, సాహితీవేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ, కౌముదీ పరిషత్ మానాప్రగడ సాహితీ, ఆత్రేయ స్మారక కళాపీఠం, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో పుట్టిన రోజు వేడుక

- ఆహ్లాదభరిత వాతావరణంలో ప్లాస్టిక్ రహితంగా నిర్వహణ
- చిత్తూరులో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నగరపాలక సంస్థ



డంపింగ్ యార్డులో నిర్వహిస్తున్న పుట్టిన రోజు వేడుక

చిత్తూరు అర్బన్: డంపింగ్ యార్డు అంటేనే కాలుష్యం.. దుర్వాసన.. అపరిశుభ్రత గుర్తొస్తాయి. కానీ.. ఇందుకు భిన్నంగా చిత్తూరు నగరపాలక సంస్థకు చెందిన స్థానిక సంతపేటలోని డంపింగ్ యార్డును ఆహ్లాదకరంగా మార్చి.. వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నగరానికి చెందిన షర్ఫన్, ఉమర్ దంపతుల కుమార్తె రియా మొదటి పుట్టిన రోజు వేడుకలను ఆదివారం డంపింగ్ యార్డ్ ఆవరణలో 'జీరో వేస్ట్' కార్యక్రమంగా.. ప్లాస్టిక్ రహితంగా ఘనంగా నిర్వహించారు. ఇందుకోసం నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు డంపింగ్ యార్డులో అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక్కడే భోజనాలు తయారు చేసి అతిథులకు వడ్డించారు. భోజనాల కోసం స్టీల్ ప్లేట్లు, అరటి ఆకులు, నీటి కోసం కాగితపు గ్లాసులను వినియోగించారు. కార్యక్రమానికి వచ్చిన వారికి కాటన్ బ్యాగులు పంపిణీ చేశారు. ఆహ్లాదకర వాతావరణంలో 'జీరో వేస్ట్' అంశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, లోకనాథం పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణం మధ్య..

ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణ ఆధ్వర్యంలో జాతీయ హరిత ట్రిబ్యునల్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ మార్గదర్శకాల మేరకు డంపింగ్ యార్డ్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ముగ్గురి ప్రాణాలను కాపాడిన ట్రాక్‌మన్

- ఆడపిల్లలు పుట్టారని వివాహితకు అత్తారింట వేధింపులు
- రైల్వే ట్రాక్‌పై ఇద్దరు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్యాయత్నం
- రెప్పపాటులో ముగ్గురినీ ప్రమాదం నుంచి బయటపడేసిన ట్రాక్‌మన్

పిఠాపురం: వరుసగా ఆడపిల్లలనే కన్నావని అత్తవారు వేధించడంతో ఓ వివాహిత తన పిల్లలతో ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. ఇద్దరు బిడ్డలతో కలిసి, రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించింది. ట్రాక్‌మన్ అప్రమత్తంగా వ్యవహరించి ఆ ముగ్గురినీ కాపాడాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ రైల్వే స్టేషన్ సమీపాన ఆదివారం ఈ ఘటన జరిగింది. జిల్లాలోని పోతులూరుకు చెందిన శివకు, చేబ్రోలుకు చెందిన వెంకటలక్ష్మిలకు భవ్యశ్రీ, పార్థు అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వివాహమై 11 ఏళ్లు అయినా మగ పిల్లవాడు పుట్టలేదని వెంకటలక్ష్మిని భర్త, అత్త కాసులమ్మ వేధించేవారు. విడాకులు ఇవ్వాలంటూ ఒత్తిడి తెచ్చేవారు. రోజూ ఆమెను చిత్రహింసలు పెట్టేవారు. గత శుక్రవారం అదనపు కట్నం తేవాలని బాధితురాలిపై దాడి చేయగా పెద్దలు వెళ్లి తగువు తీర్చారు. తన మీదకు పెద్దలను తీసుకువస్తావా అంటూ కోపోద్రిక్తుడైన భర్త శివ ఆమెను కొట్టాడు. తీవ్ర మనస్తాపానికి గురైన వెంకటలక్ష్మి తన ఇద్దరు బిడ్డలతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలని భావించి, దుర్గాడ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తల్లీబిడ్డలను కౌన్సెలింగ్‌కు తరలిస్తున్న పోలీసులు

కూతురే కాపాడింది...

అదే సమయంలో విశాఖ- విజయవాడ సూపర్‌ఫాస్ట్ రైలు వస్తోంది. ట్రాక్‌మన్ పిమిడి వెంకటేశ్వరరావు ట్రాక్‌ను పరిశీలిస్తూ 655వ మైలు రాయి వద్ద తిరుగుతున్నాడు. వెంకటలక్ష్మి తన బిడ్డలతో కలిసి రైల్వే ట్రాక్‌పై వెళ్లడాన్ని గమనించి వారిని అడ్డుకున్నాడు. తనకు తెలిసిన వారు కొంత దూరంలో ఉన్నారని, దగ్గర దారి కావడంతో ఇలా వెళుతున్నానని వెంకటలక్ష్మి ట్రాక్‌మన్‌కు చెప్పింది. ఇంతలో అమ్మను నాన్న కొట్టాడని, అందుకే అమ్మ తమను తీసుకుని ఇలా వచ్చేసిందని వెంకటలక్ష్మి కుమార్తె భవ్యశ్రీ అతడికి చెప్పింది. దీంతో వెంకటేశ్వరరావు ఆ ముగ్గురినీ ట్రాక్‌పై నుంచి బయటకు తోసేసి వారి ప్రాణాలను కాపాడాడు. అప్పటికే ట్రైన్ అతి సమీపంలోకి రావడంతో రెప్పపాటులో ముగ్గురూ ప్రమాదం నుంచి బయటపడ్డారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఘటనా స్థలికి చేరుకుని బాధితురాలిని కాకినాడ తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇప్పించి, బంధువులకు అప్పగించారు.

చైనీస్ ఫైడ్ కాకి ప్రత్యక్షం

జి.మాడుగుల (అల్లూరి సీతారామరాజు జిల్లా): అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో చైనీస్ ఫైడ్ కాకి (ఫైడ్ క్రో) ప్రత్యక్షమైంది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనుక ఉన్న ఎం.శిరీష ఇంటి వద్ద ఆదివారం చక్కర్లు కొట్టింది. నలుపు, తెలుపు రంగుల్లో ఉన్న ఈ కాకిని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.



దూసుకొచ్చిన మృత్యువు

కారు ఢీకొని ముగ్గురు మృతి



మృతులు కుమారి, శివాజీ (ఫైల్)

యలమంచిలి (అనకాపల్లి జిల్లా): మితిమీరిన వేగంతో కారు దూసుకుపోయిన ఘటనలో ముగ్గురు మృత్యువాతపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం రేగుపాలేనికి సమీపంలో 16 నంబర్ జాతీయ రహదారిపై ఈ ఘోరం చోటుచేసుకుంది. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం జగపతి నగరం గ్రామానికి చెందిన మొల్లేటి శివాజీ (40), అతని వియ్యంకురాలు భీశెట్టి కుమారి (38) కుటుంబ సభ్యులతో కలసి అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడ గ్రామంలో జరిగిన ఓ శుభ కార్యక్రమానికి హాజరయ్యారు. తిరిగి ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. వాహనాన్ని అతని కుమారుడు రాము నడుపుతుండగా.. మార్గమధ్యలో యలమంచిలి మండలం రేగుపాలెం హైవే వద్ద పోలీసులు కేసులు రాస్తుండటంతో మొల్లేటి శివాజీ, భీశెట్టి కుమారి బండి దిగి పోయారు. వారితోపాటు యలమంచిలి మండలం పద్మనాభరాజుపేట గ్రామానికి చెందిన ఎడ్ల గోవిందరావు (48) రోడ్డు పక్కగా నడిచి వెళ్తుండగా విశాఖపట్నం నుంచి తుని వైపు అతి వేగంగా వెళ్తున్న కారు వెనుక నుంచి వారిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందారు. ఘటనా స్థలంలో ఉన్న హైవే పోలీసులు సకాలంలో స్పందించలేదని, కారు డ్రైవరుపై ఏ చర్యలూ తీసుకోకుండా వదిలేశారని మృతుల బంధువులు ఆరోపించారు. మృతదేహాలను శవ పంచనామాకు తీసుకెళ్లనివ్వకుండా జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో జాతీయ రహదారిపై సుమారు గంటసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసరావు మృతుల బంధువులతో మాట్లాడి ఆందోళనను విరమింపచేశారు.

న్యాయవాదులకు విలువలు ముఖ్యం

- నిరంతర అధ్యయనం అవసరం
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి

ఏలూరు (టూటౌన్): న్యాయవాద వృత్తిలో ఉన్నవారు నిబద్ధత, నైతిక విలువలు కలిగి ఉండాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి అన్నారు. ఏపీ బార్ కౌన్సిల్, ఏలూరు బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు, బార్ కౌన్సిల్ సభ్యులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి మాట్లాడుతూ నిరంతర అధ్యయనంతోనే న్యాయవాద వృత్తిలో రాణించగలరని చెప్పారు. వివిధ కేసుల్లో న్యాయమూర్తుల తీర్పులను బాగా చదవాలని, ప్రాథమిక హక్కులు, చట్టాన్ని అన్వయించే పద్ధతి, కేసుల విస్తృతి, సీనియర్లు వాదించే తీరుపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పౌర శిక్షాస్మృతి పరిధిలోని మధ్యంతర పిటిషన్లు, సమగ్ర విచారణ, కేసు తీరుతెన్నులను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ నేర శిక్షాస్మృతి పునశ్చరణ అంశంపై ప్రసంగించారు. నేర సంబంధిత కేసుల్లో సమగ్ర పరిశీలన అవసరమని తెలియజేస్తూ 161 సీఆర్‌పీసీకి సంబంధించిన అంశాలను వివరించారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి న్యాయవాదులకు లీగల్ అవేర్‌నెస్, స్టాండర్డ్స్ గురించి వివరించారు. న్యాయవాదుల సందేహాలను న్యాయమూర్తులు నివృత్తి చేశారు.

పేకాడుతూ పట్టుబడిన తెలుగు తమ్ముళ్లు !

- హనుమాన్‌జంక్షన్‌లో పేకాట శిబిరంపై పోలీసుల మెరుపుదాడి
- టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి బచ్చుల అనుచరులే నిర్వాహకులు
- నగదు బదులుగా కాయిన్లతో హైటెక్ పేకాట
- కేసు మాఫీకి విశ్వయత్నం

హనుమాన్‌జంక్షన్ రూరల్ (గన్నవరం): ఓ పేకాట శిబిరంపై పోలీసులు చేసిన మెరుపుదాడిలో తెలుగుదేశం పార్టీ నేతలు పట్టుబడిన ఘటన సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. టీడీపీ బాపులపాడు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అట్లూరి శ్రీనివాసరావు, గార్లపాటి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్ సమీపంలోని పామాయిల్ తోటల్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట శిబిరం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ వాసా వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి ఆదివారం ఆకస్మికంగా దాడి



పేకాటలో పట్టుబడిన టీడీపీ నేతలతో పోలీస్ అధికారులు

చేశారు. దీంతో టీడీపీ నాయకులు, నిర్వాహకులు అట్లూరి శ్రీనివాసరావు, గార్లపాటి రాజేశ్వరరావుతో పాటు గా మేడికొండ రామకృష్ణ, కనకమేడల సుదర్శనరావు, తోట శ్రీరామ్, పత్రివట కృష్ణమోహన్ (గుడివాడ), యలమంచిలి వెంకటేశ్వరరావు, అల్లాడిశెట్టి రాఘవరావు, కనకమేడల వెంకటేశ్వరరావు, యలమంచిలి రవీంద్రకుమార్ పట్టుబడ్డారు. వారి వద్ద రూ.10,500 స్వాధీనం చేసుకున్నారు. అయితే పోలీసులను తప్పుదారి పట్టించేందుకు నగదు బదులుగా కాయిన్‌లతో పేకాట నిర్వహిస్తుండడంతో ఘటనాస్థలంలో దొరికిన కాయిన్ల ఆధారంగా రూ.లక్షల్లోనే పందేలు జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కాయిన్లను స్వాధీనం చేసుకుని ఆ దిశగా విచారణ చేపట్టారు.

పోలీసుల వైఖరిపై అనుమానాలు..

టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు ప్రధాన అనుచరులైన అట్లూరి శ్రీనివాసరావు, గార్లపాటి రాజేశ్వరరావు పట్టుబడటంతో పోలీసులపై కేసు మాఫీ చేసేందుకు తీవ్రమైన ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. పేకాట శిబిరంపై దాడి చేసి టీడీపీ నేతలను అదుపులోకి తీసుకున్న తర్వాత వివరాలు బహిర్గతం చేయకుండా పోలీసులు తాత్సారం చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. పేకాట శిబిరం వద్ద పెద్ద మొత్తంలో డబ్బు దొరికినప్పటికీ కేవలం రూ.10 వేలు మాత్రమే కేసులో చూపించారనే ఆరోపణలు పోలీసులపై వస్తున్నాయి

క్యాసినో కింగ్ చికోటి ప్రవీణ్‌తో సంబంధాలు!


హనుమాన్‌జంక్షన్ సమీపంలో పేకాట శిబిరం నిర్వహిస్తూ పోలీసులకు పట్టుబడిన టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అట్లూరి శ్రీనివాసరావు, గార్లపాటి రాజేశ్వరరావుకు క్యాసినో కింగ్ చికోటి ప్రవీణ్‌తో సంబంధాలు ఉన్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే పలుమార్లు జంక్షన్ ప్రాంతం నుంచి పలువురిని గోవా, నేపాల్, బ్యాంకాక్, హాంకాంగ్‌కు జూదం ఆడించేందుకు వీళ్లు పలువురిని తీసుకెళ్లినట్లుగా తెలుస్తోంది.

రిషి తోటలో రూ.12 కోట్ల శిల్పం



లండన్: బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ లండన్‌లోని డౌనింగ్ స్ట్రీట్‌లోని తన అధికార నివాసం తోటలో దాదాపు రూ.12.83 కోట్ల విలువైన శిల్పాన్ని ఏర్పాటు చేయడం వివాదాస్పదంగా మారింది. ప్రముఖ శిల్పి హెన్రీ మూర్ రూపొందించిన ఈ శిల్పాన్ని గత నెలలో క్రిస్టీ సంస్థ నిర్వహించిన వేలంలో బ్రిటన్ ప్రభుత్వ సంస్థ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఒక వైపు దేశంలో జీవన వ్యయం పెరిగిపోయి, జనం కష్టాలు పడుతున్న వేళ పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్మును ఇలా ఖర్చు చేయడమేంటంటూ విమర్శలు చుట్టుముడుతున్నాయి.

ఐరాస ప్రధాన కార్యాలయం వద్ద గాంధీజీ విగ్రహం



ఐక్యరాజ్యసమితి: న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయానికి భారత్ మహాత్మా గాంధీ విగ్రహాన్ని బహూకరించింది. డిసెంబర్ 14వ తేదీన భద్రతా మండలి అధ్యక్ష పదవి బాధ్యతలు చేపట్టనున్న సందర్భంగా విదేశాంగ మంత్రి జైశంకర్ ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ప్రముఖ భారతీయ శిల్పి, పద్మశ్రీ అవార్డు గ్రహీత రామ్ సుతార్ ఈ శిల్పాన్ని మలిచారు. ఈయనే గుజరాత్‌లో నర్మదా నది తీరంలో ఏర్పాటు చేసిన సర్దార్ పటేల్ విగ్రహం 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ'ని డిజైన్ చేశారు. ఐరాస ప్రధాన కార్యాలయం ప్రతిష్ఠాత్మక నార్త్ లాన్‌లో దీనిని ఏర్పాటు చేయనున్నట్లు ఐరాసలో భారత్ శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ తెలిపారు. ఐరాస ప్రధాన కార్యాలయం ఆవరణలో భారత్ 1982లో ఇచ్చిన ఏకైక కానుక 11వ శతాబ్దం నాటి నల్లరాతి సూర్య విగ్రహం, జర్మనీ అందజేసిన బెర్లిన్ గోడలో ఒక భాగం, దక్షిణాఫ్రికా బహూకరించిన నెల్సన్ మండేలా కాంస్య విగ్రహం, పాబ్లో పికాసో వేసిన గుయెర్నికా చిత్రం తదితరాలున్నాయి.

కృష్ణ బిలం వినిపించింది!

వాషింగ్టన్: అంతరిక్షంలో ఉండే కృష్ణ బిలాలు(బ్లాక్ హోల్స్) గురించి మనకు తెలుసు. వాటిలోనుంచి నిరంతరం శబ్దాలు వెలువడుతూ ఉంటాయి. అవి ఎలాంటి శబ్దాలు అన్న సంగతి తెలియదు. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' సైంటిస్టులు ఈ విషయంలో కొంత పురోగతి సాధించారు. బ్లాక్ హోల్ నుంచి చిన్నపాటి ప్రతిధ్వనులను రికార్డు చేసి, స్పష్టమైన శబ్దంగా మార్చారు. ఇందుకోసం సానిఫికేషన్ టెక్నాలజీ ఉపయోగించినట్లు చెబుతున్నారు. సంబంధిత శబ్దంతో కూడిన వీడియోను తాజాగా విడుదల చేశారు. ఇది భూమికి 7,800 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న వీ404 సైగ్నీ అనే బ్లాక్‌హోల్‌కు సంబంధించినదని వెల్లడించారు. నాసా విడుదల చేసిన వీడియోకు సోషల్ మీడియాలో భారీ స్పందన లభించింది. కొన్ని గంటల వ్యవధిలోనే 40 లక్షల మందికిపైగా జనం వీడియోను తిలకించారు. కృష్ణ బిలం శబ్దం కొత్తగా ఉందంటూ నెటిజన్లు పోస్టు చేశారు. ఇసుకపై నుంచి దూసుకొచ్చే సముద్ర అలల ధ్వనిలా ఉందని కొందరు పేర్కొన్నారు.



తిరగబడ్డ చైనా

ప్రభుత్వంపై ప్రజాగ్రహం ● కరోనా కట్టడిపై కట్టలు తెంచుకున్న ఆక్రోశం

- భారీగా వీధుల్లోకి వచ్చి నిరసనలు
- అరెస్టులు చేస్తున్నా ఆగని ఆందోళనలు
- పోలీసులతో యువత బాహాబాహీ
- అట్టుడుకుతున్న యూనివర్సిటీలు

బీజింగ్: చైనా తిరగబడింది. కరోనా కట్టడి పేరుతో జిన్‌పింగ్ సర్కారు విధించిన మితిమీరిన ఆంక్షలపై జనం కన్నెర్రజేశారు. దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ వీధుల్లోకి వెల్లువెత్తుతూ నిరసనలకు దిగుతున్నారు. స్వేచ్ఛ కావాలంటూ నింగినంటేలా నినదిస్తున్నారు. పాలక కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ)కి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తిస్తున్నారు. అధ్యక్షుడు జిన్‌పింగ్ తక్షణం తప్పుకోవాలంటూ ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నారు! చిన్నపాటి నిరసనలను కూడా ఉక్కుపాదంతో అణచేసే డ్రాగన్ దేశంలో అత్యంత అరుదుగా కన్పించే ఈ మూకుమ్మడి జనాగ్రహ జ్వాలలను ప్రపంచమంతా అబ్బురపాటుతో వీక్షిస్తోంది. జనాందోళనలకు సంబంధించిన వీడియోలు ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారాయి. వాటితో సోషల్ సైట్లన్నీ హోరెత్తుతున్నాయి. పలుచోట్ల యువతీ యువకులు నేరుగా పోలీసులతోనే బాహాబాహీ తలపడుతున్నారు! దేశవ్యాప్తంగా యూనివర్సిటీల క్యాంపస్‌లన్నీ నిరసన కేంద్రాలుగా మారుతున్నాయి. స్టూడెంట్లు కూడా భారీగా రోడ్లెక్కుతున్నారు. సోషల్ డిస్టెన్సింగ్ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు తదితర అడ్డంకులన్నింటినీ బద్దలు కొడుతూ కదం తొక్కుతున్నారు. నిరసనకారులను పెద్ద సంఖ్యలో అరెస్టు చేస్తున్నా ఆందోళనలు నెమ్మదించడం లేదు. మతిలేని లాక్‌డౌన్ నిబంధనలను ఎత్తేయాలన్న డిమాండ్ దేశమంతటా ప్రతిధ్వనిస్తోంది. నిరసనల ధాటికి పలుచోట్ల ప్రభుత్వమే వెనక్కు తగ్గుతుండటం విశేషం! జిన్‌జియాంగ్ ప్రావిన్స్ రాజధాని ఉరుంఖిలో కఠిన లాక్‌డౌన్ ఆంక్షల వల్ల ఫ్లాట్లలో బందీలుగా మారిన వారిలో పది మంది అమాయకులు అగ్నిప్రమాదానికి నిస్సహాయంగా బలయ్యారన్న వార్తలు అగ్నికి మరింత ఆజ్యం పోస్తున్నాయి! దీనిపై వెల్లువెత్తిన జనాగ్రహానికి వెరచి ఉరుంఖిలోనే గాక రాజధాని బీజింగ్‌తో పాటు పలుచోట్ల లాక్‌డౌన్ ఆంక్షలను సడలించాల్సి వచ్చింది!! జీరో కోవిడ్ విధానంపై జనం నుంచి ఇంతటి ప్రతిఘటన ఎదురవుతుందని ప్రభుత్వం ఊహించలేదని పరిశీలకులు భావిస్తున్నారు. ఇటీవలే పార్టీ నియమావళిని సవరించి మరీ వరుసగా మూడోసారి అధ్యక్షునిగా ఎన్నికైన జిన్‌పింగ్‌కు ఈ ఉదంతం అగ్నిపరీక్షగా మారింది. మరోవైపు కరోనా కల్లోలం కూడా చైనాలో నానాటికీ పెరుగుతూనే వస్తోంది. ఆదివారం 40 వేలకు పైగా కొత్త కేసులు నమోదయ్యాయి!!

మార్మోగుతున్న షాంఘై

కరోనా నేపథ్యంలో మూడేళ్లుగా ఏదో ఒక రూపంలో చైనాలో ఆంక్షలు కొనసాగుతూనే వస్తున్నాయి. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కొద్ది రోజులుగా మళ్లీ జీరో కోవిడ్ విధానం అమలవుతోంది. దీనిపై కొంతకాలంగా జనంలో పెల్లుబుకుతున్న వ్యతిరేకత రెండు రోజులుగా కట్టలు తెంచుకుంటోంది. అతి పెద్ద నగరమైన షాంఘై ఆందోళనలతో అట్టుడుకుతోంది. ప్రజలు భారీ సంఖ్యలో రోడ్లపైకొచ్చి నిరసన ప్రదర్శనలకు దిగారు. సీపీసీకి, జిన్‌పింగ్‌కు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ప్రభుత్వం మారాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. "షాంఘైలో ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలను కల్లో కూడా ఊహించలేం! అలాంటిది ఇంత భారీ సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి రావడం, అధ్యక్షుడు దిగిపోవాలంటూ బాహాటంగా నినాదాలు చేయడం నమ్మశక్యంగా లేదు. ఇది మా జీవితకాలంలో ఎన్నడూ చూడనిది" అంటూ స్వయానా నిరసనకారులే ఆశ్చర్యానందాలకు లోనవుతున్నారు. బీజింగ్‌లోని ప్రతిష్ఠాత్మక సిన్‌హువా యూనివర్సిటీ విద్యార్థుల ఆందోళనలతో అట్టుడుకుతోంది. ప్రభుత్వ సెన్సార్‌షిప్‌కు వ్యతిరేకంగా తెల్ల కాగితాలను ప్రదర్శిస్తూ ప్రతీకాత్మకంగా నిరసన తెలుపుతున్నారు. మరోవైపు ఉరుంఖిలో వారం రోజులుగా జరుగుతున్న ఆందోళనల్లో కమ్యూనిస్టు ప్రభుత్వం చేతుల్లో ఏళ్లుగా తీవ్ర అణచివేతకు గురవుతున్న ఉయ్‌గర్ ముస్లింలు భారీగా పాల్గొంటున్నారు!



పోలీసులతో తలపడుతున్న యువత




అగ్నిప్రమాద మృతులకు నివాళులు

అపార్ట్‌మెంట్లో మరణమృదంగం

అగ్ని ప్రమాదానికి పదిమంది బలి
ఫ్లాట్లను సీల్ చేయడమే కారణం!

కరోనా ఆంక్షలున్న చోట్ల ఇళ్లలోంచి జనం బయటికి రాకుండా అధికారులు బయటినుంచి తాళాలు వేసి సీల్ చేస్తున్నారు! ఈ చర్య జిన్‌జియాంగ్ ప్రావిన్స్ రాజధాని ఉరుంఖిలో పది మంది ఉసురు తీసింది. గురువారం ఓ అపార్ట్‌మెంట్లో అగ్నిప్రమాదం సంభవించడంతో ఫ్లాట్లలో ఉన్న పది మంది ఎటూ తప్పించుకోలేక పొగకు ఉక్కిరిబిక్కిరై నిస్సహాయంగా చనిపోయారు. దీనిపై జనం తీవ్రంగా ఆగ్రహించారు. వేలాదిగా వీధులకెక్కి ప్రదర్శనలకు దిగారు. తీవ్ర పదజాలంతో ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశారు. దాంతో ఆంక్షలను అధికారులు కాస్త సడలించారు. మితిమీరిన ఆంక్షలే వారి ఉసురు తీశాయన్న ఆరోపణలను ప్రభుత్వం ఖండించినా స్థానిక అధికారులు మాత్రం ఈ ఘటనకు క్షమాపణ చెప్పడం విశేషం! నెలల తరబడి కొనసాగుతున్న లాక్‌డౌన్‌తో ఇళ్లకు పరిమితం కావాల్సి రావడంతో పిచ్చెక్కిపోతోందని జనం వాపోతున్నారు.







అగ్నిప్రమాదం జరిగిన అపార్ట్‌మెంట్. ఫ్లాట్లకు బయట నుంచి అధికారులు వేసిన తాళాలు

10 మంది సేవకులు

జైల్లో జైన్‌కు రాజభోగాలు

న్యూఢిల్లీ: తీహార్ జైల్లో ఉన్న ఢిల్లీ ఆప్ మంత్రి సత్యేంద్ర జైన్‌కు అందుతున్న రాజభోగాలపై రోజుకో వీడియో వెలుగులోకి వస్తోంది. తాజాగా ఒక వ్యక్తి ఆయన గదిని శుభ్రం చేయడం, పక్క శుభ్రంగా సర్దడం వంటి దృశ్యాలు కనిపించాయి. జైన్‌కు కావల్సినవన్నీ చేసి పెట్టడానికి దాదాపుగా 10 మంది సేవకుల్ని కేటాయించినట్టుగా తీహార్ జైలు వర్గాలు వెల్లడించాయి. గది శుభ్రం చేయడం , మంచంపై దుప్పట్లు మార్చడం, బయట నుంచి ఆహారం, పళ్లు, మినరల్ వాటర్ తేవడం, బట్టలుతకడం వంటి పనుల కోసమే ఎనిమిది మంది ఉన్నారు. వారందరూ సరిగా పనులు చేస్తున్నారా లేదా అని పర్యవేక్షించడానికి మరో ఇద్దరు వ్యక్తులు ఉంటారని తీహార్ జైలు వర్గాలు జాతీయ చానెళ్లకు వెల్లడించాయి. జైల్లో సత్యేంద్ర జైన్‌కు అందుతున్న సకల సదుపాయాలపై ఢిల్లీ కోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. మరోవైపు తాను ఉల్లి, వెల్లుల్లి లేని జైన్ ఫుడ్ మాత్రమే తీసుకుంటానని, అది తనకు జైల్లో ఇవ్వడం లేదంటూ సత్యేంద్ర జైన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పళ్లు, డ్రై ఫ్రూట్స్ ఇవ్వడం లేదన్న ఆ పిటిషన్‌ను ప్రత్యేక న్యాయమూర్తి వికాస్ ధల్ తోసిపుచ్చారు.



జైల్లో జైన్‌కు పడక సిద్ధం చేస్తున్న సిబ్బంది

క్లుప్తంగా...

కాంగ్రెస్‌కు గిరిజనులంటే గౌరవం లేదు: మోదీ

నెత్రంగోడా: కాంగ్రెస్ పార్టీకి గిరిజనులంటే ఏమాత్రం గౌరవం లేదని ప్రధాని మోదీ ఆరోపించారు. ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతి అభ్యర్థిత్వాన్ని సైతం ఆ పార్టీ బలపరచలేదని పేర్కొన్నారు. 'బిర్సా ముండా, గోవింద్ గురు వంటి గిరిజన నేతలను కాంగ్రెస్ పట్టించుకోలేదు. ముర్ముకు మద్దతివ్వాలని రాష్ట్రపతి ఎన్నికల సమయంలో ఆ పార్టీని చేతులు జోడించి వేడుకున్నా కాదన్నారు. గిరిజన పుత్రికను రాష్ట్రపతిని చేసేందుకు సర్వశక్తులూ ధారపోయాల్సి వచ్చింది' అన్నారు. గుజరాత్‌లోని ఖేడా, భరుచ్ జిల్లాల్లో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచార ర్యాలీల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే మొబైల్ బిల్లు నెలకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ఉండేదన్నారు. దేశంలో భారీ ఉగ్రదాడుల సమయంలో మౌనంగా ఉండటం ద్వారా కాంగ్రెస్, సారూప్య పార్టీలు తమ ఓటు బ్యాంకును కాపాడుకుంటున్నాయని ఆరోపించారు. 'కాంగ్రెస్ మారలేదు. దేశాన్ని కాపాడుకోవాలంటే అలాంటి పార్టీలను దూరంగా ఉంచాలి'అని ప్రధాని పేర్కొన్నారు.

గుజరాత్ ఎన్నికల్లో గెలుపు మాదే: కేజ్రీవాల్


అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) గెలుపు ఖాయమని ఆ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. వచ్చే ఏడాది జనవరి 31వ తేదీ నాటికి పాత పింఛను విధానాన్ని అమల్లోకి తీసుకువస్తామని, తమకు ఓటేసి గెలిపించాలని ప్రభుత్వ ఉద్యోగులను ఆయన కోరారు. సూరత్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ఢిల్లీ, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల విషయంలో మాదిరిగానే గుజరాత్ విషయంలోనూ అంచనాలు నిజమవుతాయని, ఆప్ అధికారంలోకి వస్తుందంటూ ఆయన కాగితంపై రాసి చూపారు. 27 ఏళ్ల తర్వాత గుజరాత్ ప్రజలు బీజేపీ దుష్టపాలన నుంచి విముక్తి కాబోతున్నారని అన్నారు. పాత పింఛను విధానం సహా ఇతర డిమాండ్లను తీరుస్తామని, తమ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు సహకరించాలని ప్రభుత్వ ఉద్యోగులను కోరారు.

కిమ్ వారసురాలు ఆమే?

సియోల్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ రెండో కుమార్తె జుయే తరచూ బహిరంగ ప్రదేశాల్లో కనిపిస్తూ ఉండడం చర్చనీయాంశంగా మారింది. కిమ్ వారసురాలు ఆమేనంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. జుయే వయసు కేవలం పదేళ్లు మాత్రమే. తన తోటి వయసు పిల్లల కంటే పొడవుగా పెద్దదానిలా జుయే కనిపిస్తుందని గతంలోనే దక్షిణ కొరియా మీడియా వెల్లడించింది. అంత చిన్న వయసున్న జుయే ఖండాంతర క్షిపణి పరీక్షల ప్రయోగాలకు హాజరు కావడం విస్మయ పరుస్తోంది. ఆ ప్రయోగాల సమయంలోనే తొలిసారిగా మీడియా కంటపడింది. తాజాగా ఆదివారం కిమ్, తన కుమార్తెతో కలిసి శాస్త్రవేత్తలు, ఇతర అధికారులతో చర్చిస్తున్న ఫోటోలను అధికారిక మీడియా విడుదల చేసింది.

కెనడాలో రోడ్డు ప్రమాదం.. హరియాణా విద్యార్థి మృతి

సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా ఢీకొట్టి, లాక్కెళ్లిన పికప్ ట్రక్



టొరంటో: కెనడా రాజధాని టొరంటోలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హరియాణా విద్యార్థి ఒకరు దుర్మరణం చెందారు. శుక్రవారం మధ్యాహ్నం సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన పికప్ ట్రక్కు ఢీకొట్టి, అతడిని లాక్కెళ్లింది. ఎమర్జెన్సీ సిబ్బంది ట్రక్కు నుంచి అతికష్టమ్మీద అతడిని వేరు చేశారు. అప్పటికే అతడు చనిపోయాడు. మృతుడిని హరియాణాలోని కర్నాల్‌కు చెందిన కార్తీక్ సైని(20)గా గుర్తించారు. టొరంటోలోని షెరిడాన్ కాలేజీలో జాయినయ్యేందుకు 2021 ఆగస్టులో అతడు కెనడా వెళ్లినట్లు అతడి సోదరుడు పర్వీన్ సైని చెప్పారు.



భారత్ జోడో యాత్రలో బుల్లెట్‌పై రాహుల్

'అంతరిక్షం'లో నూతన సూర్యోదయం

మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ

- విక్రమ్-ఎస్ ప్రయోగం గర్వకారణం
- జీ20కి సారథ్యం గొప్ప అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ: 'విక్రమ్-ఎస్' రాకెట్ ప్రయోగం మన దేశంలో ప్రైవేట్ అంతరిక్ష రంగంలో నూతన సూర్యోదయమని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఈ ప్రయోగంతో దేశ అంతరిక్ష రంగంలో నూతన శకం మొదలైందన్నారు. ఆదివారం 95వ 'మన్‌కీ బాత్'లో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. జీ20కి సారథ్యం వహిస్తున్న దేశంగా ప్రపంచం ముందున్న సవాళ్లకు పరిష్కార మార్గాలు కనిపెట్టాల్సిన బాధ్యత భారత్‌పై ఉందని చెప్పారు. మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

'స్పేస్'లో ప్రైవేట్ పాత్ర భేష్

స్పేస్ టెక్నాలజీలో ప్రైవేట్ రంగం పాత్ర ప్రశంసనీయం. స్పేస్ సెక్టార్‌లో నవంబర్ 18న 'కొత్త చరిత్రకు' ప్రజలంతా సాక్షిభూతంగా నిలిచారు. దేశీయంగా ప్రైవేట్ రంగంలో డిజైన్ చేసి, రూపొందించిన తొలి రాకెట్ 'విక్రమ్-ఎస్' నింగిలోకి విజయవంతంగా దూసుకెళ్లింది. ప్రతి భారతీయుడి గుండె గర్వంతో ఉప్పొంగిపోయింది. ఈ రాకెట్‌ను తక్కువ ఖర్చుతో రూపొందించడం గొప్ప విషయం. స్పేస్ టెక్నాలజీలో భారత్ పరిమిత ఖర్చుతోనే ప్రపంచ స్థాయి ప్రమాణాలకు చేరుకుంది. విక్రమ్-ఎస్ రాకెట్‌లో కొన్ని కీలక భాగాలను 3డీ ప్రింటింగ్ ద్వారా తయారు చేశారు. ఈ రాకెట్ ప్రయోగం ప్రైవేట్ స్పేస్ సెక్టార్‌లో నూతన సూర్యోదయం. కాగితాలతో విమానాలు తయారు చేసి, గాల్లోకి ఎగురవేసిన మన పిల్లలు ఇప్పుడు అసలైన విమానాలు తయారు చేసే అవకాశం దక్కించుకుంటున్నారు. కాగితాలపై ఆకాశం, చంద్రుడు, నక్షత్రాలను గీసిన మనవాళ్లు ఇప్పుడు రాకెట్లు తయారు చేస్తున్నారు. విక్రమ్-ఎస్ ప్రయోగం భారత్-భూటాన్ సంబంధాలకు బలమైన నిదర్శనం.



దేశమంతటా జీ20 కార్యక్రమాలు

శక్తివంతమైన జీ20 కూటమికి భారత్ నాయకత్వం వహించనుండడం ప్రతి భారతీయుడికి గొప్ప అవకాశం. వసుధైక కుటుంబ భావనను ప్రతిబింబించేలా జీ20కి 'ఒకే భూగోళం, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే థీమ్ ఇచ్చాం. జీ20కి సంబంధించిన కార్యక్రమాలు దేశమంతటా నిర్వహిస్తాం. ఇందులో భాగంగా విదేశీయులు మన రాష్ట్రాలను సందర్శిస్తారు. మన విభిన్నమైన సంస్కృతి సంప్రదాయలను విదేశాలకు పరిచయం చేయొచ్చు. జీ20 కార్యక్రమాల్లో ప్రజలు.. ముఖ్యంగా యువత పాలు పంచుకోవాలి.

యువత పరుగును ఆపడం కష్టం

మన యువత గొప్పగా ఆలోచిస్తున్నారు, గొప్ప ఘనతలు సాధిస్తున్నారు. అంతరిక్షం, సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణల విషయంలో సహచర యువతను కలుపుకొని ముందుకెళ్తున్నారు. స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నారు. డ్రోన్ల తయారీలోనూ భారత్ వేగంగా పరుగులు తీస్తోంది. హిమాచల్ ప్రదేశ్‌లో ఇటీవలే యాపిల్ పండ్లను డ్రోన్ల ద్వారా రవాణా చేశారు. నూతన ఆవిష్కరణ ద్వారా అసాధ్యాలను సుసాధ్యం చేస్తుండడం సంతోషకరం మన యువత పరుగును ఆపడం ఇక కష్టం.

ప్రపంచం నలు మూలలకూ మన సంగీతం

సంగీత రంగంలోనూ భారత్ గణనీయ ప్రగతి సాధిస్తోంది. ఎనిమిదేళ్లలో సంగీత పరికరాల ఎగుమతి మూడున్నర రెట్లు పెరిగింది. భారతీయ సంగీత ఖ్యాతి ప్రపంచ నలుమూలలకూ చేరుతోంది. తమ కళలు, సంస్కృతి, సంగీతాన్ని చక్కగా పరిరక్షించుకుంటున్న నాగా ప్రజలను ఆదర్శంగా తీసుకోవాలి'' అని మోదీ సూచించారు. యూపీలోని బన్సా గ్రామంలో 'కమ్యూనిటీ లైబ్రరీ, రిసోర్స్ సెంటర్'ను స్థాపించిన జతిన్ లలిత్ సింగ్, జార్ఖండ్‌లో 'లైబ్రరీ మ్యాన్'గా గుర్తింపు పొందిన సంజయ్ కశ్యప్‌పై ప్రధాని మోదీ ప్రశంసల వర్షం కురిపించారు.

సోషల్ శరణం గచ్ఛామి!

గుజరాత్‌లో మూడు పార్టీల డిజిటల్ ప్రచారం

గుజరాత్ ఎన్నికలు దగ్గరకొచ్చేశాయి. ర్యాలీలు, రోడ్ షోలు, బహిరంగ సభలతో ప్రధాని మోదీ, ఆప్ నేత కేజ్రీవాల్ ప్రచారంలో దూసుకుపోతూంటే కాంగ్రెస్ నుంచి రాహుల్ గాంధీ మాత్రం ఒక్క రోజు ప్రచారంతో సరిపెట్టారు. మరోవైపు మూడు పార్టీలు డిజిటల్ ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. సోషల్ మీడియా ప్రచారానికి తొలుత శ్రీకారం చుట్టిన బీజేపీ ఈ ప్రచారంలోనూ తానే ముందుంది. కాంగ్రెస్ పార్టీ కాలేజీ విద్యార్థులనే సోషల్ మీడియా ప్రచారంలో భాగస్వాముల్ని చేసింది. కాంగ్రెస్‌లో గాంధీ కుటుంబానికి చెందిన వారెవరూ ప్రచారానికి రాకపోవడంతో ఆ లోటు పూరించేలా క్షేత్ర స్థాయిలో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ఓటర్లకు దగ్గరయ్యే ప్రయ త్నం చేస్తోంది. ఇక ఆప్ సీఎం అభ్యర్థిని ఎంపిక చేయడం దగ్గర్నుంచి ప్రచారం దాకా సోషల్ మీడియా మీదే ఆధారపడింది.

- సాక్షి, నేషనల్ డెస్క్



గుజరాత్ సమరం

బీజేపీ

- గుజరాత్ ఆత్మ గౌరవ ప్రచారానికి ప్రాధాన్యమిస్తోంది. 15 యాప్‌లు వినియోగిస్తోంది.
- సోషల్ మీడియాలో ఆర్నెల్లుగా వారానికో హ్యాష్ ట్యాగ్‌తో ప్రచారం చేస్తోంది.
- మోదీ 20 ఏళ్ల పాలన, వందే భారత్, ఈ గుజరాత్ నేనే నిర్మించాను వంటి ట్యాగ్ లైన్‌లతో విస్తృతంగా ప్రచారం.
- సోషల్ మీడియా ప్రచారానికి ఎక్కువగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వినియోగిస్తోంది.
- బీజేపీకి ఫేస్‌బుక్‌లో 35 లక్షల పైగా, ఇన్‌స్టాగ్రామ్‌లో 58 లక్షలు, ట్విటర్‌లో 15 లక్షలు, యూట్యూబ్‌లో 50 వేల ఫాలోవర్లున్నారు.
- 20 వేల మంది వర్కర్లు, 60 వేల మంది వాలంటీర్లు ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.
- బీజేపీ డిజిటల్ వార్ రూమ్‌లో కంటెంట్ ఇస్తున్న వారంతా 20 నుంచి 22 ఏళ్ల మధ్య వయసున్న యువ టెక్కీలే.

కాంగ్రెస్

- వాట్సాప్ ద్వారా బాగా ప్రచారం చేస్తోంది. 27 ఏళ్లుగా బీజేపీ ఏమేం చెయ్యలేదో, తమ హయాంలో ఏం చేశామో చెబుతోంది.
- అసెంబ్లీ స్థానాల వారీగా ఫేస్‌బుక్ పేజీలు ఏర్పాటు చేసి సమస్యలపై, తాము చేయబోయే పరిష్కారంపై ప్రచారం చేస్తోంది.
- 50 వేల వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసింది.
- ఠాకూర్లు, పటీదార్లు, ఆదివాసీలు ఇలా.. కులాలు, వర్గాల వారీగా కూడా వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారాన్ని హోరెత్తిస్తోంది.
- కాంగ్రెస్ పార్టీకి ఫేస్‌బుక్‌లో 7 లక్షల మందికి పైగా ఫాలోవర్లు, ఇన్‌స్టాగ్రామ్‌లో 64 లక్షలు, ట్విటర్‌లో 2 లక్షలు, యూ ట్యూబ్‌లో 9 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు.
- కొన్ని టెక్కీ సంస్థల్ని అద్దెకు తీసుకొని ప్రచారానికి అవసరమైన కంటెంట్ తయారు చేస్తోంది.
- పార్టీలో అధికారులు కాకుండా, క్షేత్ర స్థాయిలో 10 వేల నుంచి 12 వేల మంది వాలంటీర్లు పని చేస్తున్నారు.


ఆప్

- ఢిల్లీ మోడల్, మేనిఫెస్టో హామీలు ఓటర్లకు చేరేలా వాట్సాప్‌ను అధికంగా వినియోగిస్తోంది.
- ఆప్‌కు ఫేస్‌బుక్‌లో 6 లక్షలు, ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షలకు పైగా ఫాలోవర్లున్నారు. నేషనల్ యూ ట్యూబ్‌లోనూ ప్రచారం చేస్తోంది. దీనికి 43 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు.
- ఆప్ సోషల్ మీడియా ప్రచార బాధ్యతల్ని 25 మంది యువ ఇంజనీర్లు తమ భుజస్కంధాల మీద మోస్తున్నారు. 20 వేలమంది సోషల్ మీడియా వారియర్లను కూడా నియమించింది.
- ఆప్ మద్దతుదారుల ద్వారా కూడా అన్ని యాప్‌లలో విస్తృతంగా ప్రచారం చేస్తోంది.
- ప్రతీ గ్రామానికి ఒక వాట్సాప్ గ్రూప్ పెట్టి ప్రచారం నిర్వహిస్తోంది.
- సీఎం అభ్యర్థి ఇసుదాన్ గఢ్వీ ఎంపిక కూడా సోషల్ మీడియా ఓటింగ్ ద్వారా నిర్వహించి కొత్త ట్రెండ్ సృష్టించింది.

కోటిన్నర నగలు కొట్టేశారు

బాలల నిర్వాకం, 4 గంటల్లో ఆటకట్టు

చెన్నై: చెన్నైలోని ఓ దుకాణం నుంచి రూ.1.50 కోట్ల విలువైన బంగారం, వజ్రాల ఆభరణాలను ఎత్తుకుపోయిన ముగ్గురు బాలురను పోలీసులు నాలుగు గంటల్లోనే పట్టుకున్నారు. అస్సాంకు చెందిన ఈ ముగ్గురు నగల దుకాణానికి సమీపంలోని జ్యూస్ షాప్‌లో పనిచేసేవారు. పథకం ప్రకారం వారు.. లిఫ్టు పక్కనున్న ఖాళీ స్థలం గుండా దుకాణంలోకి ప్రవేశించారు. వారు లోపలికి చేరుకున్న వెంటనే సెక్యూరిటీ వ్యవస్థ ద్వారా దుకాణం యజమానికి వెంటనే ఉదయం 5 గంటలకు అలెర్ట్ చేరింది. అప్రమత్తమైన యజమాని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దుకాణం వద్దకు చేరుకున్న పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా అప్పటికే పరారైన ముగ్గురి కోసం వేట మొదలుపెట్టి, నాలుగు గంటల్లోనే వారి ఆటకట్టించారు.





మాయదారి కష్టాలు!
జాతీయ రహదారితో పాటు అంతరరాష్ట్ర కూడలి కావడంతో రామభద్రపురం మండలకేంద్రం నుంచి పలు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.
- 8లో



ఎన్‌సీసీలో చేరితే భవిష్యత్‌
విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి ఉత్తమ ప్రతిభ కనబరచడం ద్వారా ఉజ్వల భవిష్యత్‌ లభిస్తుందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ అన్నారు.
- 8లో



ఖోఖో పోటీలకు జిల్లా జట్లు సిద్ధం
రాష్ట్రస్థాయిలో జరగనున్న జూనియర్స్‌ బాల, బాలికల ఖోఖో పోటీలకు జిల్లా జట్లు సిద్ధమయ్యాయి.
- 8లో

న్యూస్‌రీల్‌

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



స్థానాచార్యులుకు చెక్కును అందజేస్తున్న దాతలు

నెల్లిమర్ల రూరల్‌: రామతీర్థం శ్రీ సీతారామ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయనగరం పట్టణానికి చెందిన దాతలు నరేళ్ల తారకేశ్వరరావు, సూర్యనారాయణ, చంద్రశేఖర్‌, రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఆదివారం స్వామి వారిని దర్శించుకున్న అనంతరం దేవస్థాన అర్చకులకు ఆ మొత్తం చెక్కును అందజేశారు. శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి పర్వదినాల్లో భక్తులకు అన్నసమారాధన చేపట్టేందుకు విరాళం అందజేసినట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, సాయిరామాచార్యులు పాల్గొన్నారు.

కనులపండువగా కావడి అట్టం



కావడి మోస్తున్న దీక్షాపరులు

విజయనగరం టౌన్‌: స్థానిక పూల్‌బాగ్‌లో ఉన్న వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దీక్షలు చేపట్టిన దీక్షాపరులు ఆదివారం సాయంత్రం కావడి అట్టం ఊరేగింపు నిర్వహించారు. వందల మంది దీక్షాపరులు కావడి మోస్తూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. విచిత్ర వేషాలు, కాళికామాత వేషధారణలతో భక్తిప్రపత్తులతో జై శరవణభవ అంటూ దీక్షాపరులు కావడి మోస్తూ, నృత్యం చేస్తూ చూపరుల్లో భక్తిభావాన్ని పెంచారు. ర్యాలీ కొత్తపేట నీళ్లట్యాంక్‌, అంబటిసత్రం, గంటస్తంభం, ఫైర్‌ ఆఫీస్‌, హుకుంపేట మీదుగా తిరిగి ఆలయానికి చేరు కుంది. ఆలయ వ్యవస్థాపకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌ వర్సిటీని సందర్శించిన కేర్‌ డైరెక్టర్‌



రాజుతో మాట్లాడుతున్న కేర్‌ సంస్థ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్‌: మండలంలోని టెక్కలి సెంచూరియన్‌ విశ్వవిద్యాలయాన్ని తమిళనాడులోని మధురైకి చెందిన కేర్‌ రీసెర్చ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ సరసు ఆదివారం సందర్శించారు. వర్సిటీలో నిర్వహిస్తున్న నైపుణ్య కోర్సులు, ప్రయోగశాలలను పరిశీలించారు. వర్సిటీలో నూతన ఆవిష్కరణలు చేసేందుకు అనువైన వాతావరణం ఉందని ప్రశంసించారు.

కూరగాయల... సాగు భళా

కూరగాయల ధరల కట్టడికి ప్రభుత్వం సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళ్తోంది. అదే సమయంలో సాగు చేసే రైతులకు లాభం చేకూరేలా కూడా చర్యలకు శ్రీకారం చుట్టింది. స్థానికంగా కూరగాయల సాగు వైపు రైతులను ప్రోత్సహించి ఆర్థికంగా బలోపేతం చేసేలా హైబ్రీడ్‌ వెజిటబుల్‌ కల్టివేషన్‌ పేరుతో కొత్త పథకాన్ని అమల్లోకి తెచ్చింది. దీంతో రైతులు స్థానికంగా కూరగాయలు సాగు చేసి ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు ప్రజలకు అందుబాటులోకి ధరలు తెచ్చే బృహత్తర ప్రణాళిక సిద్ధం చేసింది.

- ధరల పెరుగుదల కట్టడికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- కూరగాయలు, ఆకుకూరల సాగు వైపు రైతులకు ప్రోత్సాహం
- దిగుబడి పెరిగితే మార్కెట్లోకి మరింత సరుకు రాక
- జిల్లాలో 15వేల ఎకరాల్లో కూరగాయల సాగు
- ఈ ఏడాది సుమారు 620 ఎకరాల్లో హైబ్రీడ్‌ కల్టివేషన్‌ పథకం
- ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేల చొప్పున రైతులకు ఆర్థిక సాయం

సాక్షి ప్రతినిధి, విజయనగరం :

ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరుగుతోంది. అందుకు తగ్గట్లుగా కూరగాయలు, ఆకుకూరల వినియోగం రోజురోజుకు అధికమవుతోంది. ఈ డిమాండుకు తగినట్లుగా జిల్లాలో పంట లేదు. దీంతో వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. రవాణా చార్జీలు, వారి కమీషన్ల భారం పడుతోంది. ఫలితంగా కూరగాయల ధరలు ఒక్కోసారి ఆకాశాన్ని అంటుతున్నాయి. ఆ ధరల నియంత్రణకు ప్రభుత్వమే మార్కెటింగ్‌ శాఖ ద్వారా కొన్ని రకాల కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్న సంగతి తెలిసిందే. అలాకాకుండా స్థానికంగా కూరగాయల సాగు వైపు రైతులను ప్రోత్సహించేందుకు హైబ్రీడ్‌ వెజిటబుల్‌ కల్టివేషన్‌ పేరుతో కొత్త పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది.

దిగుమతులే ప్రధాన ఆధారం...

హైబ్రీడ్‌ వెజిటుబుల్‌ కల్టివేషన్‌ పథకం ద్వారా మంచి రకం కూరగాయల వంగడాలను ఉద్యానశాఖ అధికారులు తీసుకొచ్చి స్థానిక రైతులకు ఇస్తున్నారు. గత రబీ సీజన్‌లో 15 వేల ఎకరాల్లో కూరగాయల సాగు అయింది. ఈ రబీ సీజన్లో మరింత సాగు పెంచాలని అధికారులు కృషి చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చే అరటి, చిక్కుడు, కంద, గోరు చిక్కుడు తదితర కూరగాయలకు రాజాం, విజయనగరం, బొబ్బిలి వంటి పట్టణ ప్రాంతాల్లో వినియోగదారుల నుంచి ఎక్కువ డిమాండు ఉంటోంది. బెంగళూరు నుంచి క్యారెట్‌, క్యాప్సికమ్‌ వంటి హైబ్రీడ్‌ రకాలు, ఉభయ గోదావరి జిల్లాల వంగ, బెండ, కంద, బీర, చిక్కుడు, బీన్‌ తదితర కూరగాయలు జిల్లాకు వస్తున్నాయి.

స్థానికంగా సాగుకు ప్రాధాన్యం

హైబ్రీడ్‌ కల్టివేషన్‌ స్కీంలో పలు రకాల కూరగాయలను రైతులు సాగు చేసేలా ఉద్యానవన శాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో తొలి విడతలో సుమారు 620 ఎకరాల్లో సాగుకు రైతులు ముందుకొచ్చారు. పంటను బట్టి వారికి ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకూ ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఇందుకోసం రైతులు ఈ – క్రాప్‌లో కచ్చితంగా నమోదు చేసుకోవాలి. ఈకేవైసీ చేయించుకోవాలి. ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌ రైతుభరోసా కేంద్రంలో విలేజ్‌ అగ్రికల్చర్‌ అసిస్టెంట్‌లు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ఆర్థిక సాయాన్ని నేరుగా రైతుల ఖాతాకే ప్రభుత్వం జమ చేయనుంది. ఇలా విడతల వారీగా హైబ్రీడ్‌ కూరగాయలు, ఆకుకూరల సాగును విస్తరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.



బొడ్డాం వద్ద ఆధునిక విధానంలో క్యాప్సికమ్‌ సాగు చేస్తున్న రైతు



రాజాం మండలం ఒమ్మి వద్ద క్యాబేజీ సాగు

మరింత మంది రైతులను గుర్తిస్తున్నాం..

స్థానికంగా కూరగాయల సాగు పెంచితే ధరలు అదుపులో పెట్టవచ్చు. హైబ్రీడ్‌ రకం పంటలైతే దిగుబడి పెరుగుతుంది. లాభాలు ఉంటాయి. అందుకే సకాలంలో సాగు చేసేలా రైతులను హైబ్రీడ్‌ వెజిటబుల్‌ కల్టివేషన్‌ స్కీంతో ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మరింత మంది రైతులను ఈ పథకంలోకి తీసుకొచ్చేలా గుర్తిస్తున్నాం.
– కె.శైలజ, సహాయ సంచాలకురాలు, ఉద్యానశాఖ



రామభద్రపురంలో విస్తృతంగా కూరగాయల సాగు

ప్రభుత్వ ప్రోత్సాహంతో సాగు పెంచాం



ఆర్‌బీకే నుంచి అధికారులు వచ్చి మేము సాగు చేస్తున్న పంటల గురించి అడిగారు. క్యాబేజీ, వంగ వంటి హైబ్రీడ్‌ రకాలు బాగా సాగు చేస్తే ప్రభుత్వం నగదు ప్రోత్సాహం ఇస్తుందని చెప్పారు. గతంలో 20 సెంట్ల విస్తీర్ణంలో కూరగాయలు సాగు చేసేవాణ్ని. ఈసారి అర ఎకరా భూమిలో సాగు పెంచాను.
– లోచర్ల చిన్నోడు, రైతు, ఒమ్మి, రాజాం మండలం

హైబ్రీడ్‌ రకాలను సాగు చేస్తున్నాం



ప్రస్తుతం ఎనిమిది ఎకరాల్లో క్యాప్సికమ్‌, దోస, బీర, క్యాబేజీ, టమాటా తదితర హైబ్రీడ్‌ రకాల కూరగాయలను సాగు చేస్తున్నాం. వాటికి స్థానికంగా వినియోగదారుల నుంచి మంచి డిమాండు ఉంటోంది. ప్రభుత్వం నుంచి నగదు ప్రోత్సాహం వల్ల మిగతా రైతులు కూడా కూరగాయల సాగు చేయడానికి మొగ్గు చూపిస్తారు.
– పరశురావు సింహాచలం, బొడ్డాం, రాజాం మండలం

జిల్లాలో మంత్రి జోగి రమేష్‌ పర్యటన రేపు

- గుంకలాం లే అవుట్‌ సందర్శన
- రెండు జిల్లాల అధికారులతో సమీక్ష

విజయనగరం అర్బన్‌: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ ఈ నెల 29న జిల్లాలో పర్యటించనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో గృహ నిర్మాణ ప్రగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి తెలుసుకోవడంలో భాగంగా మంగళవారం జిల్లాకు వస్తున్నట్లు కలెక్టర్‌ ఎ.సూర్యకుమారి తెలిపారు. నవరత్నాల్లో భాగంగా చేపట్టిన జగనన్న ఇళ్ల కాలనీల నిర్మాణ ప్రగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి తెలుసుకోవడం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో గృహనిర్మాణ ప్రగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మంత్రి జోగి రమేష్‌ 29వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు గుంకలాంలో జగనన్న కాలనీ సందర్శించి గృహ నిర్మాణ ప్రగతిని పరిశీలిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు కలెక్టర్‌ కార్యాలయ ఆడిటోరియంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్‌, ప్రజారోగ్య ఇంజినీరింగ్‌, విద్యుత్‌, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖల అధికారులతో సమీక్షించనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు విశాఖపట్నం బయలుదేరి వెళ్తారని తెలిపారు.

డామిట్‌.. కథ అడ్డం తిరిగింది

- చాగంటికి పురస్కారంపై గురజాడకు అసమ్మతి పత్రం
- ఎప్పటిలానే గురజాడ పురస్కారం : గురజాడ సాంస్కృతిక సమాఖ్య



ర్యాలీ నిర్వహిస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్‌: మహాకవి గురజాడ పేరుతో గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతీ ఏటా అందజేస్తున్న గురజాడ విశిష్ట పురస్కారం ఈ ఏడాది వివాదాస్పదంగా మారింది. సాహితీ స్రవంతి, వెలుగు, అరసం, రాజాం రచయితల సంఘం, జన విజ్ఞాన వేదిక తదితర సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఆయా సంస్థల ప్రతినిధులు గురజాడ స్వగృహంలో నిరసన వ్యక్తం చేశారు. అక్కడ నుంచి గురజాడ గౌరవ యాత్ర పేరుతో మూడులాంతర్లు, గంటస్తంభం, ఎంఆర్‌ కళాశాల మీదుగా గురజాడ విగ్రహం వద్దకు చేరుకుని, ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం మహాకవికి అసమ్మతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త శ్రీకాకుళ సాహితీ అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ తాము మౌనంగా ఉంటే బహుశా చాగంటి కోటేశ్వరరావు గురజాడ చెప్పిన భావజాలాల్నే ప్రవచన రూపంలో చెబుతున్నారని లోకం అనుకుంటుందని, అటువంటి ప్రమాదాన్ని నివారించే ప్రయత్నమే ఈ నిరసన అని తెలిపారు. స్నేహ కళాసాహితీ సంస్థ ప్రతినిధి గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ గురజాడ మన మధ్యనే ఉన్నాడని, ఆయన భావజాలానికి భిన్నంగా ప్రవచనాలు చెబుతున్న చాగంటికి పురస్కారం ఇవ్వడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. అరసం జిల్లా శాఖ ప్రతినిధి రత్నాల బాలకృష్ణ మాట్లాడుతూ భౌతికవాదానికి, భావవాదానికి మధ్య జరుగుతున్న సంఘర్షణని వ్యక్తుల మధ్య కాదన్నారు. ప్రముఖ వయోలిన్‌ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాదరావు, మాజీ ఎమ్మెల్సీ శర్మ, ఆంధ్రప్రదేశ్‌ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్ని వెంకట సుబ్బయ్య (ఒంగోలు), సాహితీ స్రవంతి చీకటి దివాకర్‌, చంద్రిక, విజయరావు, దయానంద్‌, త్రిమూర్తులు రెడ్డి, వర్మ, (విశాఖ) తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటిలానే..

మహాకవి గురజాడ విశిష్ట పురస్కారం ప్రతీ ఏటా నిర్వహించినట్టే అందజేస్తామని గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్‌ స్పష్టం చేశారు. స్థానిక గురజాడ స్వగృహంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలకు చెందిన సంస్థలను కలిపి సమాఖ్యగా ఏర్పాటు చేశామన్నారు. ఇది గురజాడ సాంస్కృతిక సమాఖ్య అని, సాహితీ సమాఖ్య ఒక్కటే కాదన్నారు. గురజాడ గ్రంథాల్లో ఎన్నో ఆధ్యాత్మిక రచనలున్నాయన్నారు. చాగంటి కోటేశ్వరరావుకు గురజాడ భావాలు నూటికి నూరు శాతం సరిపోయే వ్యక్తిని తెలిపారు. చాగంటి స్త్రీ ద్వేషి అనడంలో నిజం లేదని, ఎంతో మంది మహిళలు ఆయనను అభిమానిస్తూనే ఉన్నారన్నారు. గతంలో అవార్డులు స్వీకరించిన వారంతా అభ్యుదయవాదులు, నాస్తికులు కారని, ఇప్పుడు ఆక్షేపించడం సరైంది కాదన్నారు. సమావేశంలో విజయ భావన ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ ఎ.గోపాలరావు, కౌముదీపరిషత్‌ మానాప్రగడ సాహితీ, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్‌ జక్కు రామకృష్ణ, ఆత్రేయ స్మారక కళాపీఠం అధ్యక్షుడు ఉసిరికల చంద్రశేఖర్‌, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

కనువిందు

విజయనగరం జిల్లా కేంద్రంలో ఓ సీతాకోకచిలుక చూపరులకు ఆదివారం కనువిందు చేసింది. సాధారణంగా కనిపించే సీతాకోకచిలుకలకు భిన్నంగా పెద్ద రెక్కలతో నలుపు, ఎరుపు రంగులతో ఎగురుతూ అబ్బురపరిచింది. ఆ సమయంలో సాక్షి కెమెరాకు ఇలా చిక్కింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్‌, విజయనగరం



అలరించిన స్వరాభిషేకం



గీతాలాపన చేస్తున్న గాయకులు

విజయనగరం టౌన్‌: సంగీత జీవనదిలో మరిన్ని ఆణిముత్యాలను వెలికితీసేందుకు గురునారాయణ కళాపీఠం ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని సంస్థ వ్యవస్థాపకులు బీఏ నారాయణ పేర్కొన్నారు. స్థానిక ఆనందగజపతి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి స్వరసామ్రాట్‌ డాక్టర్‌ సాలూరు రాజేశ్వరరావు, గాన గంధర్వుడు, పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు శతజయంతి మహోత్సవం సందర్భంగా ప్రముఖ గాయనీ, గాయకులు ఆలపించిన అపాత మధురాలు అలరించాయి. నగర డిప్యూటీ మేయర్‌ కోలగట్ల శ్రావణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రముఖ సినీ, సంగీత నేపథ్య గాయకుడు బీఏ నారాయణ నేతృత్వంలో పవన్‌, చరణ్‌, సురభి శ్రావణి, డాక్టర్‌ జి. సన్యాసమ్మ, సంతోష్‌, హారిక, బేబీ లావణ్యలు ఆలపించిన గీతాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్‌ చైర్మన్‌ మజ్జి శ్రీనివాసరావు, సీఎంఆర్‌ అధినేత మావూరి వెంకటరమణ విశిష్ట అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో డోల మన్మథ కుమార్‌, ఉప్పు ప్రకాష్‌, పీవీ.నరసింహరాజు, ఏఎంసీ చైర్మన్‌ నడిపేన శ్రీనివాసరావు, డాక్టర్‌ ఎ.గోపాలరావు, డాక్టర్‌ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల, జెడ్పీ చైర్మన్‌ మజ్జి శ్రీనివాసరావు తదితరులు

జల కాలుష్యానికి చెక్‌

వ్యర్థ జలాలను శుభ్రపరిచి ఇతర అవసరాలకు వినియోగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు పట్టణాల్లో ప్రత్యేకమైన ప్లాంట్లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేసి స్థల సేకరణకు కూడా చర్యలు మొదలెట్టింది. అవసరమైన నిధులు కూడా మంజూరుకు ముందుకొచ్చింది.

- పట్టణాల్లో ఎస్‌టీపీ ప్లాంట్లు
- అన్ని మున్సిపాలిటీల్లో ఏర్పాటుకు చర్యలు
- స్థల సేకరణలో అధికారులు
- ఒక్కో చోట రూ.30కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు
- మురుగును రీసైక్లింగ్‌ చేసేందుకు చర్యలు

రాజాం :

పట్టణాల్లో వ్యర్థ జలాల సమస్య ప్రజలను వేధిస్తోంది. మురుగు కాలువలు చిన్నపాటి నదులను తలపిస్తున్నాయి. రోజురోజుకు నీటి వినియోగం పెరుగుతుండగా, వ్యర్థజలాల రూపంలో దుర్వినియోగం అధికమౌతుంది. మరోవైపు ఈ జలాలు సాగునీటి చెరువులు, కాలువలు, నదుల్లో కలవడం వల్ల పర్యావరణ కాలుష్యం కూడా సంభవిస్తుంది. వీటి నుంచి విముక్తి పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుంది. వ్యర్థ జలాలను రీసైక్లింగ్‌ ద్వారా మళ్లీ వినియోగించేందుకు చర్యలు ప్రారంభించింది. ప్రతీ పట్టణంలో వ్యర్థ జలాలను రీసైక్లింగ్‌ చేసే ప్లాంట్లు ఏర్పాటుకు కార్యాచరణ రూపొందిస్తుంది.

ఒక్కో చోట పది వరకూ..

జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, రాజాం, నెల్లిమర్ల పట్టణాలు మున్సిపాల్టీలుగా ఉన్నాయి. ఈ పట్టణాల్లో వ్యర్థ జలాలు అధికమవ్వడంతో పాటు ప్లాస్టిక్‌ వినియోగం కూడా పెరిగింది. ఇటీవల చేపట్టిన ప్లాస్టిక్‌ నిషేధ కార్యక్రమాలు ఊరటనిచ్చినప్పటికీ మురుగు కాలువల్లో చెత్త రూపంలో వీటిని వ్యాపారులు, వినియోగదారులు పారబోస్తున్నారు. వీటితో పాటు హోటళ్లు, బేకరీలు, చికెన్‌, మటన్‌ సెంటర్లు, టీ దుకాణాలు, పండ్ల వ్యాపారాలు వద్ద వ్యర్థాలను నేరుగా ఈ మురుగు కాలువల్లో పడేస్తున్నారు. ఇవి ప్రమాదకరమైన విష పదార్థాలుగా మారి సాగు నీటి కాలువలు, చెరువులు, నదుల నీటిని ప్రమాదకరంగా మార్చుతున్నాయి. ఈ వ్యర్థాలు కారణంగా పంట పొలాలు సైతం పాడవుతున్నాయి. వీటిని మెరుగుపరిచేందుకు రాష్ట్ర మున్సిపల్‌ శాఖ శుద్ధ జలాల ప్లాంట్లు పట్టణాల్లో ఏర్పాటు చేయడం ద్వారా ఈ వ్యర్థాలను శుద్ధ జలాలుగా మార్చడంతో పాటు పర్యావరణ ప్రమాదాన్ని నియంత్రించే అవకాశం ఉందని భావించింది. ఫలితంగా ప్రతీ మున్సిపాల్టీలో జనాభా ప్రాతిపదికన చిన్న, పెద్ద కలిపి మొత్తం పది వరకూ శుద్ధ జల ప్లాంట్లు ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు చేస్తుంది.



రాజాంలో శుద్ధ జల ప్లాంట్లు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఐదు నుంచి పదెకరాల స్థలం

శుద్ధ జల ప్లాంట్లును రెండు రకాలుగా విభజించింది. ఇందులో ఎస్‌టీపీ, ఎస్‌ఎస్‌టీపీలుగా విభజించి, తక్కువ వ్యర్థ జలాలు ప్రవహించే ప్రాంతంలో ఎస్‌టీపీ(సీవరేజ్‌ ట్రీట్‌మెంట్‌ ప్లాంట్లు) ప్లాంట్లు, ఎక్కువగా మురుగు నిల్వలు, నీరు ప్రవహించే ప్రాంతాల్లో పెద్దపెద్ద ఎస్‌టీపీ ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు 30 సెంట్లు కనీస స్థలం నుంచి 1.50 ఎకరాల స్థలం వరకూ ఒక్కోచోట అవసరం ఉంది. ఈ ప్లాంట్లు కూడా పట్టణంలోని పలు వార్డుల్లో మురుగు కాలువల నీరు సాగునీటి కాలువలు, చెరువుల్లో కలిసే ప్రాంతాల వద్ద ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీని ఫలితంగా ఆయా ప్రాంతాల్లో మాత్రమే స్థలం సమీకరణ చేయాల్సి ఉంది. ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న భూమి విలువ ఆధారంగా స్థల యజమానులకు నష్టపరిహారం అందించి, భూమిని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ భూములు ఉంటే ఆయా ప్రాంతాల్లో స్థలాన్ని గుర్తించి, నివేదికలు ఉన్నతాధికారులకు అందజేస్తున్నారు. ఈ ప్లాంట్లు ఏర్పాటుతో పాటు ప్రాథమికంగా నిర్వహణకు ఒక్కో పట్టణంలో రూ.30కోట్లు పైబడి వ్యయం అవసరమౌతుండగా, ఆ మేరకు నిధులు కూడా మంజూరీ చేసినట్లు రాజాం మున్సిపల్‌ కమిషనర్‌ డీటీవీ కృష్ణారావు వెల్లడించారు.

వినియోగం ఇలా...

శుద్ధ జల ప్లాంట్లు వద్ద మురుగునీరు మంచినీరుగా మారుతుంది. ఈ నీటిని పట్టణంలో పలు ప్రాంతాలకు సరఫరా చేస్తారు. ప్రాథమికంగా ఈ నీటిని మొక్కల పెంపకానికి, సాధారణ అవసరాలకు వినియోగిస్తారు. ఈ ప్లాంట్లు వద్ద అత్యాధునిక నీటి పరిశీలన కిట్లు ఏర్పాటు చేసి పూర్తిగా మానవ వినియోగానికి పనికి వచ్చేలా నిర్ధారణకు వచ్చిన తరువాతనే వినియోగిస్తారు. మురుగునీటి ద్వారా వచ్చే వ్యర్థాలను విషపూరిత వ్యర్థాలను బయటకు తొలగించి డంపింగ్‌ యార్డులకు తరలిస్తారు. మిగిలిన స్వచ్ఛమైన నీటిని చెరువుల్లోకి, కాలువల్లోకి విడిచిపెడతారు. ఫలితంగా జల కాలుష్యం తగ్గడంతో పాటు పర్యావరణం మెరుగుపడుతుంది.

ప్రతి చోటా పది ప్లాంట్లు

జల కాలుష్యాన్ని తగ్గించేందుకు శుద్ధ జల ప్లాంట్లు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ప్రతీ మున్సిపాల్టీకి పది ప్లాంట్లు మంజూరయ్యాయి. రాజాం పట్టణంలో పది చోట్ల వీటిని ఏర్పాటు చేసేందుకు గుర్తించాం. స్థల సమీకరణ చేస్తున్నాం. భారీ బడ్జెట్‌తో రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపడుతుంది.
– డీటీవీ కృష్ణారావు, మున్సిపల్‌ కమిషనర్‌, రాజాం

క్లుప్తంగా

చిన్నారులను అక్కున చేర్చుకున్న పోలీసులు


చిన్నారులతో వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: గుర్తుతెలియని యువకుడు విజయనగరం ఆర్టీసీ డిపోలో పార్వతీపురం వెళ్లే బస్సులో వదిలేసి వెళ్లిపోయినట్లు డిపో పోలీసులు ఇద్దరు చిన్నారులను జియ్యమ్మవలస మండలం పెదమేరంగి గ్రామానికి చెందిన వారిగా గుర్తించి, వన్‌టౌన్ పోలీసులకు ఆదివారం అప్పగించారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు స్టేషన్‌లో చిన్నారులకు (బాబు,పాప) సపర్యలు చేశారు. చిన్నారుల కుటుంబసభ్యులకు విషయం చేరవేసే విధంగా అన్ని ప్రాంతాల్లో మెసెజ్‌ను సర్క్యులేట్ చేయిస్తున్నారు. ప్రస్తుతం తమ వద్దనే చిన్నారులున్నారని, వారి సంబంధీకులు ఫోన్ 9121109419 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మోటార్ సైకిల్ బోల్తా పడి ఒకరికి గాయాలు

సీతానగరం: మండలంలోని రాష్ట్రీయ రహదారిలో మరిపివలస రోడ్డు మలుపులో అదుపుతప్పి మోటార్ సైకిల్ బోల్తా పడడంతో డ్రైవ్ చేస్తున్న వ్యక్తి గాయాల పాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. బలిజేట మండలం అరసాడ గ్రామానికి చెందిన ఎం.హేమభూషణ్ పార్వతీపుం నుంచి స్వగ్రామానికి ఆదివారం వెళ్తుండగా మరిపివలస దగ్గర మోటార్ సైకిల్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో హేమభూషణ్ తలకు గాయాలు తగలడంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా వాహనం వచ్చి సంఘటనాస్థలంలో బాధితుడికి సపర్యలు చేసి వైద్యసహాయం కోసం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

ఆత్మహత్యా యత్నం చేసిన యువకుడి మృతి

పాలకొండ రూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన స్థానిక ఘటాలడెప్పివీధికి చెందిన ఆడంగి తేజ(25) శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని పాలకొండ ఎస్సై బి.శివప్రసాద్ ఆదివారం తెలిపారు. అనారోగ్యం కారణంగా ఆ యువకుడు ఈ నెల 25వ తేదీన గడ్డి మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. యువకుడికి మెరుగైన వైద్యసేవలు అందించే క్రమంలో కుటుంబసభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించగా చికిత్సపొందుతూ మరణించాడు. తరచూ మూర్ఛవ్యాధి తలెత్తుతుండడంతో మానసికంగా కుంగిపోయినట్లు బంధువులు తెలిపారు. మృతుని తల్లి ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- రూ.21,500 స్వాధీనం

కొత్తవలస: మండలంలోని రాజుపాత్రునిపాలెం గ్రామం సమీపంలో గల మామిడితోటల్లో రహస్యం నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సీఐ ఎస్.బాలసూర్యారావు సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులు పట్టుకుని వారి నుంచి రూ.21,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం కొండదాబాల ఏసుమందిరం వద్ద స్థానికులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

8మంది జూదరుల అరెస్టు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి వస్త్రపురికాలనీ సమీపంలోని తోటలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని ఆదివారం అరెస్టు చేశామని ఎస్సై బీవీ రామకృష్ణ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నామని, వారి నుంచి రూ. 19,200నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశామన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

గజపతినగరం: మండలంలోని పాతశ్రీరంగరాజపురం గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై గంగరాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు.పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.6,505 నగదు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు చెప్పారు.

- పెరుగుతున్న వాహనాల రద్దీ
- ఆక్రమణలకు గురవుతున్న జాతీయరహదారి
- దుకాణాల వద్ద ఇష్టారాజ్యంగా పార్కింగ్
- రోడ్డు దాటేందుకు పాదచారుల ఇక్కట్లు


రామభద్రపురంలో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం.(ఇన్‌సెట్లో) రోడ్డు పక్కన దుకాణాల వద్ద అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

మాయదారి కష్టాలు!

రామభద్రపురం: విశాఖపట్నం–రాయపూర్ జాతీయ రహదారితో పాటు అంతరరాష్ట్ర కూడలి కావడంతో విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం, శ్రీకాకుళం, ఒడిశా, రాయపూర్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు రామభద్ర పురం మండలకేంద్రం నుంచి పలు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఆయా ప్రాంతాలకు రామభద్ర మండలకేంద్రం నుంచి ప్రయాణం చేయాలంటే వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ఆర్‌అండ్‌బీ రహదారిని దుకాణాదారులు, కొందరు భవన నిర్మాణ యజమానులు ఇష్టానుసారం ఆక్రమించిన కారణంతో పాటు ఆటోవాలాలు, ద్విచక్రవాహనదారులు దుకాణాల వద్ద అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు, వాహనదారులతో పాటు స్థానిక ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఈ సమస్యపై ఆర్‌అండ్‌బీ అధికారులతో పలుమార్లు పోలీసు అధికారులు చర్చలు జరిపి రహదారి విస్తరణకు రోడ్డుకిరువైపులా కొలతలు తీశారు. అయినా ఇప్పటికీ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరకలేదు. స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి బొబ్బిలి జంక్షన్ వరకు రహదారికి ఇరువైపులా దుకాణాలు ముందుకు వచ్చేయడంతో రోడ్డు వెడల్పు తగ్గి ఇరుగ్గా తయారైంది.ఆ దుకాణాలలో కొనుగోలుకు వచ్చిన వినియోగదారులు వాహనాలు నిలపడానికి స్థలం లేక జాతీయ రహదారిపై పార్కింగ్ చేయడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఉదయం వేళలో దుకాణాల వద్ద రద్దీ ఎక్కువగా ఉండడం, రైతులు కూరగాయలను మార్కెట్‌కు తీసుకురావవడం ఒకేసారి జరగడంతో గంటల కొద్దీ వాహనాలు రద్దీ నెలకొంటుండడంతో ఏక్షణాన ఏప్రమాదం జరుగుతుందోనని కూరగాయల రైతులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఆక్రమణలను తొలగించి విస్తరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఆక్రమణలు తొలగింపుతోనే ట్రాఫిక్ నియంత్రణ సాధ్యం



అంతరరాష్ట్ర కూడలైన మండలకేంద్రంలో జాతీయ,రాష్ట రహదారుల పక్కన ఉన్న ఆక్రమణలు తొలగిస్తేనే ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమవుతుంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నిత్యం శ్రమిస్తున్నాం. అధికారులు రోడ్డు విస్తరణ పనులు చేపట్టక పోవడం వల్లనే రోడ్డు ఆక్రమణలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డు పక్కన ఉన్న దుకాణ, ఇంటి యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి త్వరలో రహదారి ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. విస్తరణ పనులు చేపడితే ట్రాఫిక్ సమస్య తగ్గి ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయి.

సీఐ తిరుమలరావు,ఎస్సై సురేంద్ర నాయుడు

ఓవరాల్ బాక్సింగ్ చాంపియన్ విశాఖ

- ద్వితీయ స్థానంలో నిలిచిన విజయనగరం
- ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు


ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన విశాఖ జిల్లా క్రీడాకారులు


ద్వితీయస్థానంలో నిలిచిన విజయనగరం క్రీడాకారులు

విజయనగరం: విజయనగరం వేదికగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్స్ బాక్సింగ్ చాపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో 5 బంగారు, 4 వెండి పతకాలు దక్కించుకున్న విశాఖ జిల్లా ఓవరాల్ చాంపియన్ షిప్‌ను దక్కించుకోగా..3 బంగారు, 2 వెండి పతకాలు కైవసం చేసుకున్న ఆతిథ్య విజయనగరం జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట ప్రతినిధులు లక్ష్మణ్ దేవ్, డి.మన్మథకుమార్‌లు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో బెస్ట్ బాక్సర్‌గా 63–66 కేజీల విభాగంలో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించిన ఎస్.అజయ్‌వర్మ నిలిచాడు. బాలికల విభాగంలో విజేతలకు మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులు త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎన్‌సీసీలో చేరితే ఉజ్వల భవిష్యత్

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్


ఎన్‌సీసీ జెండా ఎగురవేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్


మార్చ్‌పాస్ట్ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

చీపురుపల్లి: విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి ఉత్తమ ప్రతిభ కనబరచడం ద్వారా ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన ఎన్‌సీసీ జెండా ఆవిష్కరించి, ఎన్‌సీసీ క్యాడెట్స్ గౌరవ వందనం స్వీకరించారు. అలాగే ఎన్‌సీసీలో ఉత్తమ క్యాడెట్స్, క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో బాటు ఎన్‌సీసీలో చేరడం ఎంతో అవసరమని చెప్పారు. ఎన్‌సీసీలో చేరడం ద్వారా సమైక్యతతో బాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఎన్‌సీసీలో చేరిన వారికి నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని చెప్పారు. అంతేకాకుండా ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు చదువులు, ఉద్యోగావకాశాల్లో 2 శాతం రిజర్వేషన్ కూడా లభిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఒక్క చీపురుపల్లిలో గల బాలుర ఉన్నత పాఠశాలలో మాత్రమే ఎన్‌సీసీ విభాగం ఉండడం ఇక్కడి విద్యార్థులు చేసుకున్న అదృష్టమన్నారు. దాదాపు యాభై సంవత్సరాలుగా చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ విభాగం దిగ్విజయంగా కొనసాగుతోందని ప్రశంసించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, ఇప్పిలి గోవింద, గిరడ రాందాసు, కరణపు ఆది, కంది పాపినాయుడు, హెచ్‌ఎం శ్యామలాసాయి, ఎన్‌సీసీ ఆఫీసర్ మామిడి శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజాంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ టీమ్ ఎంపిక


రాజాం : రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా టీం

రాజాం: స్థానిక జీఎంఆర్ ఐటీ కళాశాల మైదానంలో శ్రీకాకుళం జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల వాలీబాల్ జట్ల ఎంపిక ఆదివారం జరిగింది. వాలీబాల్ అసోసియేషన శ్రీకాకుళం జిల్లా వైస్‌ప్రెసిడెంట్ పాలవలస శ్రీనివాసరావు ఈ ఎంపికలను ప్రారంభించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు రాణించాలని, ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ పోటీలకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నలుమూలల నుంచి 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. మహిళల టీం తరఫున 16 మంది, పురుషుల టీం తరఫున 16 మంది క్రీడాకారులను నిర్వాహక కమిటీ ఎంపికచేసింది. వారిలో 12 మంది చొప్పున ఒక్కో టీం పోటీలకు వెళ్లనున్నారని కమిటీ వెల్లడించింది. ఈ టీంలుడిసెంబర్ 8 నుంచి 11 వరకూ పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంలో పాలకోడూరు వేదికగా జరిగే ఏపీ రాష్ట్రసీనియర్స్ (మెన్, ఉమెన్) వాలీబాల్ చాంపియన్ షిప్–2022పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తరఫున పాల్గొంటాయని ఎంపిక కమిటీ తెలిపింది. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ గట్టి పాపారావు, ప్రధాన కార్యదర్శి యాళ్ల పోలినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి కె.రామచంద్రుడు, ట్రెజరర్ టి.రవి, సంయుక్త కార్యదర్శి ఎన్వీ రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు కె.వెంకటనాయుడ, వి.సతీష్, తవిటినాయుడు, జీఎంఆర్‌ఐటీ పీడీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయిశంకర్ 'కూత' అదుర్స్

- కబడ్డీలో రాణిస్తున్న గజపతినగరం వాసి


కబడ్డీలో రాణిస్తున్న రైతుసాయిశంకర్

గజపతినగరం: మండల కేంద్రంలోని దిగువ వీధికి చెందిన రైతు సాయి శంకర్ కబడ్డీ క్రీడలో ప్రతిభ చాటుతూ జాతీయస్థాయిలో మెరుపుమెరిసి గజపతినగరం మండలానికి పేరు పతిష్ఠలు తీసుకొస్తున్నాడు. ఈనెల15నుంచి20వ తేదీవరకు ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్‌లో జరిగిన 48వ జాతీయ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ప్రతిభ సాధించినట్లు కబడ్డీ కోచ్ తాతబాబు తెలిపారు. ఇంతవరకు ఈ క్రీడాకారుడు నాలుగు సార్లు రాష్ట్రసాయిలో, ఒకసారి యూనివర్సిటీ స్థాయి, స్టార్ స్పోర్ట్స్ నిర్వహించిన ప్రో కబడ్డీ ట్రయల్స్‌కు ఎంపికై ప్రతిభ చూపాడు. తాను కబడ్డీలో రాణించి ఉన్నతమైన స్థానంలో స్థిరపడతానని సాయిశంకర్ తెలిపాడు.

ఖోఖో పోటీలకు జిల్లా జట్లు సిద్ధం

- వచ్చేనెల 9 నుంచి ఆత్మకూరులో రాష్ట్రస్థాయి పోటీలు



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన జిల్లా బాల, బాలికల జట్లు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న జూనియర్స్ బాల, బాలికల ఖోఖో పోటీలకు జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కస్పా ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఎంపికలకు అనూహ్య స్పందన లభించింది. పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 155 మంది క్రీడాకారులు హాజరుకాగా..అసోసియేషన్ చైర్మన్ చిన్నంనాయుడు, కార్యదర్శి సత్యనారాయణల పర్యవేక్షణలో ఎంపిక జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉత్కంఠ భరితంగా సాగిన ఎంపిక పోటీల అనంతరం బాలుర జట్టులోకి 20 మందిని, బాలికల జట్టులోకి 20 మందిని ఎంపిక చేశారు. ఎంపిక చేసిన క్రీడాకారులకు శిక్షణ శిబిరం నిర్వహించి ఉత్తమ ఆటను ప్రదర్శించిన 15 మంది క్రీడాకారులకు మాత్రమే తుది జట్టులోకి స్థానం కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తుది జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 9 నుంచి కర్నూలు జిల్లా ఆత్మకూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీలను అసోసియేషన్ ప్రతినిధులు కమలనాభరావు, కె.గోపాల్, ఆర్.నగేష్, మల్లికార్జునరావు, సత్యనారాయణ, హరీష్‌యాదవ్, రాము మారాజు, ఎస్.లక్ష్మణరావులు పర్యవేక్షించారు.

ఆ ఇద్దరి ఆచూకీ తెలిసేదెన్నడో?

- రెండు నెలల వ్యవధిలో అదృశ్యం
- లబోదిబోమంటున్న కుటుంబసభ్యులు
- భయాందోళనలో గ్రామస్తులు


పెదబుడ్డిడిలో గ్రామస్తులు, బాధిత కుటుంబసభ్యుల నిరసన

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి గ్రామంలో రేవళ్ల సీతారాం(53) ఆగస్టు 8 నుంచి, కంటుమంతి ప్రేమచంద్ అక్టోబరు 17వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. అయితే ఇంతవరకు వారి ఆచూకీ తెలియరాలేదని బాధితుల కుటుంబసభ్యులు, గ్రామస్తులతో కలిసి ఆదివారం నిరసన తెలిపారు. 8వ తరగతి చదువుతున్న ప్రేమచంద్ సైకిల్ బాగు చేయిస్తానంటూ రూ.100 తీసుకుని వెళ్లి ఇంతవరకు తిరిగిరాలేదని తల్లి ధనలక్ష్మి, తండ్రి శ్రీను లబోదిబోమంటున్నారు. రేవళ్ల సీతారాం కూడా కనపించక పోవడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. స్థానిక పోలీసులు ఈ విషయమై స్పందించి అదృశ్యమైన వ్యక్తుల ఆచూకీ తెలుసుకోవడానికి ప్రయత్నించాలని గ్రామస్తులు, కుటుంబసభ్యులు కోరుతున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 540.00
విజయనగరం	రూ. 544.00
శ్రీకాకుళం	రూ. 544.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	52,970–00
బంగారం(22సి. 10గ్రా.)	48,550–00
వెండి (కిలో)	68,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204

రెండు గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం

- వేర్వేరు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు


కొత్తవలస పంచాయతీ కార్యాలయం వెనుకభాగంలో పడి ఉన్న మృతదేహం


లక్కవరపుకోట మండలం మార్లాపల్లి గ్రామం సమీపంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సింహాద్రినాయుడు, ఎస్సై ముకుందరావు

కొత్తవలస: ఎల్.కోట, కొత్తవలస మండలాల్లో రెండు గుర్తు తెలియని మృతదేహాలు ఆదివారం లభ్యం కావడంతో కలకలం రేగింది. వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వెనుకభాగంలో సుమారు 45 సంవత్సరాలు వయస్సు గల గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా సీఐ ఎస్.బాలసూర్యారావు ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహం పక్కన వాటర్ బాటిల్, కొద్దిపాటి తినిబండారాలు ఉన్నాయి. ఆ వ్యక్తి కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలోనే సంచరిస్తూ ఉండేవాడని స్థానికులు తెలుపారు. పోలీసులు శవ పంచనామా చేసి కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో తెలియపరచాలని సీఐ కోరారు. అలాగే లక్కవరపుకోట మండలంలోని మార్లాపల్లి–లింగంపేట రహదారిలో నెక్కలి వారి కళ్లాల వద్ద గల నూతిలో సుమారు 40 సంవత్సరాలు వయస్సుగల మృతదేహాన్ని రైతులు గుర్తించి పోలీసులకు తెలియజేయగా ఎస్.కోట సీఐ ఎస్.సింహాద్రినాయుడు,ఎస్సై ఎస్.ముకుందరావులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానికుల సహాయంతో బయటకు తీసి పరిశీలించారు. మహిళా పోలీస్ ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.

గానగంధర్వుడి విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణ చేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: గానగంధర్వుడు, మధుర గాయకుడు, ఆబాలగోపాలాన్ని తన గాత్రంతో అలరించిన ఎస్పీ బాలసుబ్రమణ్యం శ్రోతల మనస్సులో చిరస్మరణీయంగా నిలిచిపోయారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కొనియాడారు. స్పార్క్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. పూల్‌బాగ్ లో ఏర్పాటు చేసిన బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విగ్రహ దాత సాయిబాబాను సముచిత రీతిలో సత్కరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సాధారణంగా చలనచిత్ర రంగంలో కథానాయకులకు మాత్రమే అభిమానులు ఉంటారని, కానీ సినీ నేపథ్య గాయకుడైన ఎస్పీ బాలుకు అశేష మంది అభిమానులు ఉండడం విశేషమన్నారు. ఎస్పీ బాలు భౌతికంగా మనమధ్యలో లేకపోయినా అమర గాయకుడిగా అందరి హృదయాలలో చిరస్మరణీయుడిగా నిలిచిపోయారని కొనియాడారు. అటువంటి మహా గాయకుడి విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. స్పార్క్ సొసైటీ చేస్తున్న సామాజిక హిత కార్యక్రమాలు అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో స్పార్క్ సొసైటీ కన్వీనర్ పద్మనాభం, డివిజన్ కార్పొరేటర్లు వజ్రపు సత్య గౌరి, బండారు ఆనందరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బాలలపై లైంగిక వేధింపులు అరికట్టాలి


మాట్లాడుతున్న కేసలి అప్పారావు(ఫైల్)

విజయనగరం ఫోర్ట్: ఇటీవల కాలంలో బాలలపై లైంగిక వేధింపుల కేసులు ఎక్కువగా నమోదయ్యాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు వెల్లడించారు. 'భారత దేశంలో బాలలపై లైంగిక వేధింపులు–నివారణకు తీసుకోవాల్సిన చర్యలు' అనే అంశంపై భువనేశ్వర్‌లో ఇటీవల రెండు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సదస్సులో మాట్లాడుతూ బాలల వేధింపులను పూర్తి స్థాయిలో అరికట్టడానికి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అందరి సహాయం, భాగస్వామ్యం, సమన్వయంతో కలిసి నిర్దిష్టమైన ప్రణాళికలతో పర్యవేక్షణ చేస్తూ నిర్మూలనకు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలల కోసం రూపొందించిన చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని, బాలల చదువుతో పాటు వారి ప్రవర్తనపై తల్లిదండ్రుల నిరంతర పర్యవేక్షణ అవసరం ఉందన్నారు. ఈ సదస్సులో 25 రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర స్థాయి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్లు, మాజీ చైర్మన్లు, సభ్యులు, ఐఏఎస్‌లు, న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు, బాలలతో, బాలల కోసం పనిచేస్తున్న వివిధ విభాగాల ప్రముఖులు, అధికారులు, అనధికారులు, రాష్ట్ర స్థాయి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, ఇతర నిపుణులు పాల్గొన్నారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

అల్లిపురం (విశాఖ దక్షిణ): నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం అల్లిపురం కరణాలవీధిలో చోటు చేసుకుంది. స్థానికులు, టూటౌన్ సీఐ కె.వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం కరణాల వీధిలో నిర్మాణంలో ఉన్న భవనం మూడో అంతస్తులో సెంట్రింగ్ షైవుడ్ తీసేందుకు ఆరిలోవ నుంచి ఐదుగురు కార్మికులు వచ్చారు. అందులో ముగ్గురు వెళ్లిపోయారు. ఇద్దరు వ్యక్తులు పని పూర్తి చేసుకుని వస్తామని అక్కడే ఉండిపోయారు. ల్యాండింగ్‌కు సంబంధించి చెక్కలు తీస్తుండగా టియ్యల చిన్నారావు అనే యువకుడు కాలుజారి అదుపుతప్పి భవనం ముందున్న 11కేవీ హై టెన్షన్ వైర్లపై పడటంతో షాక్‌కు గురయ్యాడు. అక్కడ నుంచి దిగువనున్న కాలువలో పడిపోవడంతో తల,మెడపై తీవ్రగాయాలయ్యాయి. విద్యుత్ షాక్ గురికావడంతో కాళ్లు, చేతులు, మెడ భాగం అధిక శాతం కాలిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేశారు. 108లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారావు మృతి చెందాడు. మృతుడు చిన్నారావుది మన్యం పార్వతీపురం జిల్లా, బలిజపేట మండలం, అనసాడి గ్రామం, కొత్త వీధికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. తోటి కార్మికుల ద్వారా అతని సోదరుడు వెంకట రమణకు సమాచారం అందజేశారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటరావు తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

రేపటి నుంచి సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు వెంకటరమణ సిద్ధాంతి, తదితరులు

విజయనగరం టౌన్: సర్వ శుభాలనిచ్చే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి మహోత్సవాలకు భక్తులందరూ తరలిరావాలని పూల్‌బాగ్ శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపకుడు, స్వామి ఉపాసకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆలయ ఆవరణలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ నెల 29 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామని చెప్పారు. డిసెంబర్ ఒకటో తేదీన స్వామివారి లక్ష పుష్పార్చన జరుపుతామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బేతా కృష్ణారావు, ఎస్.అచ్చిరెడ్డి, అగస్త్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కేపే పాల్.. నోరు అదుపులో పెట్టుకో..



విలేకర్లతో మాట్లాడుతున్న రేగాన

నెల్లిమర్ల: ప్రజాశాంతి పార్టీ అధినేత కేపే పాల్ తన నోటిని అదుపులో పెట్టుకోవాలని ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు హితవు పలికారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ. ప్రపంచ దేశాలకు శాంతిదూతగా చెప్పుకునే పాల్ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా, ఎమ్మెల్యే కొడాలి నానిలపై హేయమైన వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఉన్నతమైన పథకాలను అందిస్తున్న ఘనత ఒక్క జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. అటువంటి వారిపై ఆరోపణలు చేసేటప్పుడు ఆలోచించుకోవాలన్నారు. పాల్ వెంటనే క్షమాపణ చెప్పాలని, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

భగవద్గీత శ్లోక పఠన పోటీలు



శ్లోకాలు చెబుతున్న విద్యార్థిని

విజయనగరం టౌన్: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు ఆదివారం భగవద్గీత శ్లోక పఠన పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ప్రొగ్రామింగ్ కోఆర్డినేటర్ జె.శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ 6,7 తరగతుల విద్యార్థులకు జూనియర్ విభాగంలో, 8,9 తరగతుల విద్యార్థులకు సీనియర్ విభాగంలో పోటీలు నిర్వహించామని చెప్పారు. విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు.

వైభవంగా ఆదిత్య హృదయ హోమం



హోమం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఆదిత్య హృదయ హోమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాల భోగం నిర్వహించిన తర్వాత అర్చకులు లోక కల్యాణార్థం యాగశాలలో ఆదిత్య హృదయ హోమాన్ని జరిపించారు. అనంతరం వెండి మంటపం వద్ద స్వామి నిత్య కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. అలాగే గీతా జయంతిని పురస్కరించుకొని భగవత్ గీతా పారాయణాలు స్వామి సన్నిధిలో కొనసాగుతున్నాయి. 11వ రోజు అధ్యాపకులు రాధాకృష్ణమాచార్యులు ప్రవచించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

లక్కవరపుకోట (శృంగవరపుకోట): మండలంలోని ముషిడిపల్లి గ్రామానికి చెందిన ముత్యాల తరుణ్ అండర్-17 విభాగంలో జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థి తన తండ్రి సన్యాసిరావుతో కలిసి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజును ఎస్.కోటలోని ఆయన నివాసంలో ఆదివారం కలిశారు. విద్యార్థిని ఎమ్మెల్సీ అభినందించారు. డిసెంబర్ 1 వతేదీ నుంచి 4 వరకు ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇటీవల కొత్తవలస మండలం ఓపీ జిందాల్ విద్యామందిర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తరుణ్ బంగారు పతకం సాధించాడు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు పాల్గొన్నారు.



అధ్వానంగా ఉన్న గుంపాం రహదారి

గుంపాం రోడ్డుకు మోక్షం..

మండలంలోని గుంపాం నుంచి కొవ్వాడ మీదుగా పూసపాటిరేగ వెళ్లే రహదారి గతంలో గోతులతో అధ్వానంగా ఉండేది. దీంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బంది పడేవారు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు పలుమార్లు కోరినా ఎవ్వరూ పట్టించుకోలేదు. అనంతర కాలంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ నిధులతో గుంపాం నుంచి పూసపాటిరేగ వరకు కొన్నిచోట్ల మరమ్మతులు చేయడంతో పాటు కొత్తరోడ్డు వేశారు.

– పూసపాటిరేగ



కొత్తగా నిర్మించిన రహదారి

చెత్త రీ సైక్లింగ్ ప్రక్రియకు శ్రీకారం

- రింగ్‌రోడ్‌లో కేంద్రాన్ని ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



చెత్త రీ సైక్లింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, కార్పొరేషన్ అధికారులు

విజయనగరం: నగరంలో సేకరించిన పొడి చెత్తను రీసైకిల్ చేసే నూతన ప్రక్రియను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదివారం ప్రారంభించారు. స్థానిక రింగ్‌రోడ్ లో ఉన్న డంపింగ్‌యార్డ్ వద్ద రీ సైక్లింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌ఆర్ ఎన్విరో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ విధానాన్ని నిర్వహించనుంది. తణుకు, రాజమండ్రి వంటి నగరాలతో పాటు విజయనగరంలో కూడా ఈ తరహా విధానాన్ని చేపట్టేందుకు ఎన్విరా సంస్థ ముందుకు వచ్చింది. ఈ విధానం ద్వారా నగరంలో సేకరించిన పొడి చెత్తను రీసైకిల్ చేసి మరలా వినియోగంలోకి తీసుకురానున్నారు. తడిచెత్తను గుణుపూరుపేటలో ఉన్న డంపింగ్‌యార్డ్‌కు తరలించి ఎరువుగా తయారు చేస్తారు. నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, ఎన్విరో మేనేజింగ్ డైరెక్టర్ డీవీకే రాజు, మార్కెటింగ్ డైరెక్టర్ మోహనరావు, ప్రజారోగ్య అధికారి సత్యనారాయణ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద చిన్నారులకు ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న దాతలు

నెల్లిమర్ల: పట్టణానికి చెందిన నిరుపేద చిన్నారులు గంగ, చిన్నతల్లి, సరస్వతికి నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో సేకరించిన నగదును ఆదివారం అందజేశారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో నివశిస్తున్న వీరిని ప్రభుత్వం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఉంచి, చదివిస్తున్న విషయం తెలిసిందే. వారి భవిష్యత్ అవసరాలకు నగర పంచాయతీ వైస్‌చైర్మన్ ఎస్. రామారావు, నాగవంశం కార్పొరేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం. వాసు, ఏఎంసీ డైరెక్టర్ నారాయణ మూర్తి, సీపీఐ నేత సన్నిబాబు ఆధ్వర్యంలో సేకరించిన రూ. 61 వేల నగదును పిల్లల బాధ్యతను చూస్తున్న మొయిద గ్రామానికి చెందిన అట్టాడ శ్రీనుకు అందజేశారు. చిన్నారులకు భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని దాతలు సూచించారు. సన్యాసిరావు, సత్యనారాయణ, రాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే మార్పు సాధ్యం..



అతిథులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న ఈదా ఫౌండేషన్ ప్రతినిధులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సమాజంలో మార్పు యువతతోనే సాధ్యమని, అటువంటి యువతకు దిశ నిర్దేశం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులేదనని ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీచర్స్ రిలేషన్‌షిప్ ఇన్ ఎడ్యుకేటింగ్ ఫర్ నేషనల్ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల రక్షణ, సాంఘిక నేరాల నియంత్రణకు ప్రభుత్వం పటిష్ట చట్టాలు అమలు చేస్తున్నప్పటికీ, విస్తరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానంతో కొంత మంది పెడదోవ పడుతున్నారని చెప్పారు. అనంతరం ముఖ్య అతిథులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



కోట వెనుకభాగంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న సొసైటీ సభ్యులు

విజయనగరం: ప్రతి విద్యార్థి సేవాభావాన్ని అలవర్చుకోవాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కోట వెనుక ప్రాంతంలో గల కందకంలో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను సంస్థ సభ్యులతో కలిసి ఏరివేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 1964లో దక్షిణ కొరియాలో ఉద్భవించిన ఈ సంస్థకు ప్రపంచంలోని 175 దేశాలలో 3.3 మిలియన్ల మంది సభ్యులుగా ఉండడం గొప్ప విషయమన్నారు. నగరాన్ని అభివృద్ధి చేయడంతో పాటు పార్కులను రక్షించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నట్లు చెప్పారు. నగరంలోని పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రమేష్, డేవిడ్, జయశంకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక

చీపురుపల్లి: మండలంలో చేసిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్ పూర్తయిందని, దీనిపై మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2020 ఏప్రిల్ నుంచి 2022 మార్చి 31 వరకు మండలంలోని 18 పంచాయతీల్లో చేసిన పనులు, నిధుల వ్యయం, వేతనాల చెల్లింపు తదితర అంశాలపై సోషల్ ఆడిట్ చేసినట్లు పేర్కొన్నారు. ఆడిట్ నివేదికపై అధికారులు, ప్రజా ప్రతినిధులు, వేతనదారులతో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు బొండపల్లిలో..

బొండపల్లి: మండలంలో ఉపాధి హామీ పథకం పనులపై చేపట్టిన సోషల్ ఆడిట్‌పై ఈనెల29న (మంగళవా రం) మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ బి.కృష్ణవేణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2020- 21, 2021- 22 ఆర్థిక సంవత్సరాల్లో చేపట్టిన పనులను సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు, వేతనాల చెల్లింపుల రికార్డుల పరిశీలన, గ్రామసభల నిర్వహణ పూర్తయిందని పేర్కొన్నారు. గత రెండేళ్లలో రూ.9 కోట్లతో చేసిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించినట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



అలుగోలు ఉన్నత పాఠశాలలో కలుసుకున్న 1982-83 పదో తరగతి విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు ఉన్నత పాఠశాలలో 1982-83లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం కలుసుకున్నారు. డీసీసీబీ వైస్ చైర్మెన్ చనమళ్ల వెంకటరమ ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆత్మీయ కలయక సందడి వాతావరణంలో సాగింది. 40 ఏళ్ల తర్వాత అందరూ ఒకే చోట కలుసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయులు చందక సూర్యనారాయణ, నీలిరోతు సూర్యనారాయణ, పట్నాల ఈశ్వరరావు, బండారు సత్యనారాయణ, రెల్లి అప్పలస్వామి, కుసుమంచి శ్రీనివాస్, కర్రోతు అప్పలనాయుడు, చందక అప్పలనాయుడు, జమ్ము వెంకటరమణ, చంటి రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జ్యోతిరావుపూలే వర్ధంతి

చీపురుపల్లి: మండల వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతీరావు పూలే వర్ధంతిని సోమవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని లావేరురోడ్‌లో జ్యోతీరావుపూలే విగ్రహం వద్ద నిర్వహించనున్న కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరవుతారని, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు హాజరుకావాలని కోరారు.

రామ్‌దేవ్ బాబాపై చర్యలు తీసుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న ఐద్వా నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన యోగా గురువు రామ్‌దేవ్ బాబాపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ డిమాండ్ చేశారు. కణపాకలో ఆదివారం నిర్వహించిన హింసా వ్యతిరేక ర్యాలీలో ఆమె మాట్లాడుతూ, మహిళలు దుస్తులు లేకుండానే అందంగా ఉంటారని సభ్య సమాజం తలదించుకునేలా రాందేవ్ బాబా మాట్లాడారన్నారు. ప్రవక్తలుగా చెప్పుకునే పెద్ద మనుషులు రోజురోజుకూ మహిళలను మానసికంగా కుంగదీసేలా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను శారీరకంగా, మానసికంగా హింసించేవారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రమణమ్మ డిమాండ్ చేశారు. ఐద్వా నాయకులు లక్ష్మి, కృష్ణమ్మ, కరుణ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయంగా..

పథకాల అమలు

- 'గడప గడపకు మనప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు

జామి: పేదల బతుకులు బాగుపరచడం, వారి అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రామయ్యపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజాసమస్యలను క్షేత్రస్థాయిలో నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించాలనే ఉద్దేశంతో గడప గడపకూ వస్తున్నామని చెప్పారు. సీఎం జగన్ పేదల పక్షపాతి అని, పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. పేద విద్యార్థుల చదువుల కోసం జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రుల్లో నాడు-నేడు పథకంలో భాగంగా అభివృద్ధి పనులు చేపట్ట డంతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని వివరించారు. పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు అర్హులంద రికీ పార్టీలకు అతీతంగా పారదర్శకంగా ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు గ్రామాలోన్నే ప్రభుత్వ సేవలు అన్నీ అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామసచివాలయ వ్యవస్థను నేడు దేశ మంతా ఆదర్శంగా తీసుకుం టోందని చెప్పారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే రైతులకు ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నా మని అన్నారు. వైద్యసేవల కోసం ప్రజలు ఇబ్బందులు పడకూడదని గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతీ కుటుం బానికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షే మం, అభివృద్ధి వల్లే నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలునీరాజనాలు పడుతున్నారని, నియోజకవర్గంలో ఇప్పటి వరకు 125 రోజులు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.'గడప గడపకు మన ప్రభుత్వం'లో తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, కార్యక్రమం పూర్తయిన నెలరోజుల తర్వాత స్పందన కార్యక్రమం నిర్వహించి సమస్యల పరిష్కారంపై అధికారులను ఆరా తీస్తున్నామని చెప్పారు. ప్రతీ సచివాలయం పరిధిలో ప్రధాన సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల నిర్వహణకు ప్రభుత్వం రూ.20 లక్షలు చొప్పు న మంజూరు చేస్తోందని పేర్కొన్నారు. ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ డి.సత్యారావు, వైస్ ఎంపీపీ గేదెల వెంకట రావు, సర్పంచ్ పి.మణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యం, చెంచునాయుడు,జొన్నాడ సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వనభోజనాలు



విజయనగరం టౌన్: ఆత్మీయ కలయికలో పాల్గొన్న కాకతీయ కల్చరల్ అసోసియేషన్ పెద్దలు

విజయనగరం: కార్పొరేషన్ ఉద్యోగుల వన భోజన కార్యక్రమం ఆదివారం సందడిగా జరిగింది. కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నెల్లిమర్ల వద్ద ఉన్న దత్తా ఎస్టేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్‌కోలగట్ల వీరభద్రస్వామి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ఉద్యోగులు పాల్గొని ఆనందంగా గడిపారు. ఆటపాటలతో ఉర్రూతలూగించారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మిమ్స్ ఉద్యోగుల వన భోజనాలు

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ ప్రాంగణంలో ఉద్యోగుల వన భోజనాల కార్యక్రమం సందడిగా నిర్వహించారు. మిమ్స్ వైద్య కళాశాల, ఆస్పత్రిలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది తమ కుటుంబాలతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నారులు, పెద్దలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి మిమ్స్ లైఫ్ ట్రస్టీ డాక్టర్ ప్రవీణ్ వర్మ మాట్లాడుతూ, సంస్థ ద్వారా నిరుపేదలకు సైతం మెరుగైన వైద్యసేవలు అందించాలన్నదే లక్ష్యమన్నారు. ఆ దిశగా ఉద్యోగులు సహకారం అందించాలని సూచించారు. మేనేజింగ్ ట్రస్టీ వర్మ, డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్, ఏఓ గణేష్, హెచ్‌ఆర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: వనభోజనాల్లో పాల్గొన్న ఉద్యోగులు, కుటుంబ సభ్యులు

కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

విజయనగరం టౌన్: కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ నగర్ సమీపంలోని సాంబశివరావు తోటలో కమ్మ కులస్తుల ఆత్మీయ కలయిక జరిగింది. మూడేళ్ల తర్వాత వన మహోత్సవం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని సంఘ ప్రతినిధులు అన్నారు. అదేవిధంగా ఇటీవల మృతిచెందిన నటశేఖర కృష్ణకి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు కైవసం చేసుకున్న నెక్కంటి సాయి కౌశిక్‌ను ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిమజ్జనం

వేపాడ: మండలంలోని బాణాది గ్రామంలో గౌరీపరమేశ్వరుల నిమజ్జనాన్ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా ఎంపీటీసీ గొంప తులసి వెంకటరావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గౌరీపరమేశ్వరులను మేళతాళాల మధ్య ఊరేగించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



గౌరీపరమేశ్వరులకు పూజలు చేస్తున్న భక్తులు

గీత కార్మికుడికి ఆర్థికసాయం

లక్కవరపుకోట:

మండలంలోని చందులూరు గ్రామానికి చెందిన గీతకార్మికుడు నెల్లి అప్పలనాయుడు ఇటీవల తాటిచెట్టుపై నుంచి జారిపడిపోవడంతో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమయ్యాడు. బాధితుడికి విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన శ్రీ పైడిమాంబ గీతకార్మికుల సంక్షేమ సంఘం నిత్యావసర సరుకులు, రూ.2,200 నగదును ఆదివారం అందజేసింది. అనంతరం పైడిమాంబ గీత కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిమ్మ అప్పారావు, కార్యదర్శులు సిమ్మ అప్పారావు, జమ్మల అప్పారావు మాట్లాడుతూ గీత కార్మికులు ప్రమాదవశాత్తు మృతి చెందితే అందించే ఎక్స్‌గ్రేషియా ను ప్రభుత్వం ఇటీవల రూ.5లక్షలకు పెంచినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈఏడాదిలో 32 మంది గీత కార్మికులు చెట్టుపై నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డారని, అందులో అయిదుగురు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం కన్వీనర్ కొలుసు శ్రీనివాసరావు, ఉపకార్యదర్శి బత్తల ముత్యాలు, సభ్యులు దుంగ వెంకటరమణ, అప్పారావు, పి.రాజేష్, గంగరాజు పాల్గొన్నారు.



బాధితుడికి నిత్యావసర సరుకులు,నగదు అందజేస్తున్న గీత కార్మికుల సంక్షేమ సంఘ సభ్యులు

'సంకల్ప సిద్ధి' మార్ట్‌లో సోదాలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని సంకల్ప సిద్ధి మార్ట్, గోదాములో ఆదివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పటమట పోలీసులు, రెవెన్యూ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ మార్ట్ పాల్పడుతున్న చెయిన్‌లింక్, మల్టీలెవల్ మార్కెటింగ్ మోసాలు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పటమట సీఐ కాశీవిశ్వనాథ్, ఎస్ఐ పవన్‌కుమార్, వీఆర్వోలు అన్నపూర్ణ, శ్రీనివాసరావుతో కలిసి తనిఖీలు చేశారు. డీవీఎస్ పక్కన ఉన్న మార్ట్‌లో రూ.36 లక్షల విలువజేసే సరుకును, పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న గోదాములో ఎలక్ట్రానిక్స్, నిత్యావసర వస్తువులు (సుమారు రూ.కోటికిపైగా) సీజ్ చేశారు.

ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం

- వైఎస్సార్ జిల్లాలో 16మంది అరెస్ట్


దుంగలను పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

కడప అర్బన్: ఎర్రచందనం స్మగ్లింగ్‌పై వైఎస్సార్ జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. లంకమల్ల అటవీప్రాంతంలో సోదాలు చేసి 16 మందిని అరెస్ట్ చేశారు. వివరాలను కడప ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదివారం వెల్లడించారు. బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని లంకమల్ల అటవీప్రాంతంలో ఎర్రచందనం చెట్లను నరికి తరలించేందుకు సిద్ధంగా ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు సోదాలు చేసి ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తున్న 16 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి టన్ను బరువు ఉన్న 49 ఎర్రచందనం దుంగలు, లారీ, రెండు కార్లు, 8 సెల్‌ఫోన్‌లు, మూడు గొడ్డళ్లు, 5 తూనికరాళ్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన వారిలో తమిళనాడుకు చెందిన వెల్లియాన్ దశరథ, చంద్రయాన్ సేతు, పూచ్ స్వామికాన్, అన్నామలై శేఖర్, అర్జున్‌స్వామికాన్, తంగవేల్ సత్యరాజ్, చిన్నతంబి సెల్వరాజ్, ధర్మన్ వడివేల్, అండికాసి, మురుగేశన్ అజకురాజ్, అన్నామలై సెల్వరాజ్, పెచ్చన్ కమలకన్నన్‌తోపాటు ఆంధ్రాకు చెందిన పాకం శ్రీనివాసులు (అన్నమయ్య జిల్లా, రాజంపేట టౌన్, మన్నూరు), ఎల్లా అంకయ్య (కడప జిల్లా, చెన్నంపల్లి), జంపంగి నవీన్‌కుమార్, యర్రంపల్లి జయపాల్ (బ్రహ్మంగారిమఠం మండలం, టి.రామాపురం) ఉన్నారు. పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఎస్సీలకు సాయంలో ఏపీ ఫస్ట్

కేంద్ర గణాంకాలు, కార్యక్రమాలు అమలు మంత్రిత్వ శాఖ వెల్లడి

- 2021–22లో రాష్ట్రాల్లో వివిధ కార్యక్రమాల పురోగతిపై నివేదిక
- 20 రాష్ట్రాల్లో 37.64 లక్షల ఎస్సీ కుటుంబాలకు సాయం
- ఒక్క ఏపీలోనే 35.92 లక్షల ఎస్సీ కుటుంబాలకు లబ్ధి
- కొత్తగా 8.54 లక్షల స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం
- అంగన్‌వాడీ కేంద్రాలు, ఐసీడీఎస్‌ల పని తీరు సంతృప్తికరం



సాక్షి, అమరావతి : ఎస్సీ కుటుంబాలకు సహాయం అందించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. ఈ విషయాన్ని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక స్పష్టం చేసింది. 2021–22 ఆర్థిక ఏడాదిలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వివిధ పథకాలు, కార్యక్రమాల అమలు పురోగతిపై కేంద్రం విశ్లేషణాత్మక నివేదికను విడుదల చేసింది. లక్ష్యాల కన్నా 90 శాతంపైగా అమలు చేసిన రాష్ట్రాల పనితీరు చాలా బాగుందని, లక్ష్యాల కన్నా 80 శాతం లోపు ఉంటే ఆ రాష్ట్రాల పనితీరు బాగోలేదని నివేదిక విశ్లేషించింది. ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా దేశంలోని 20 రాష్ట్రాల్లో 37,64,308 ఎస్సీ కుటుంబాలకు సహాయం అందించగా, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 35,92,860 ఎస్సీ కుటుంబాలకు సహాయం అందిందని నివేదిక స్పష్టం చేసింది. మరే రాష్ట్రం కనీసం లక్ష మంది ఎస్సీ కుటుంబాలకు కూడా సహాయం అందించలేదని చెప్పింది. ఆంధ్రప్రదేశ్ తర్వాత అత్యధికంగా తమిళనాడులో 29,706 ఎస్సీ కుటుంబాలకు సహాయం అందిందని నివేదిక పేర్కొంది. ఈ నివేదిక ఇంకా ఏం చెప్పిందంటే..

వివిధ రాష్ట్రాల్లో ఎస్సీ ఉప ప్రణాళిక కింద అందిన సాయం

రాష్ట్రం పేరు	ఎస్సీ కుటుంబాల సంఖ్య
ఆంధ్రప్రదేశ్	35,92,860
బిహార్	9,124
ఛత్తీస్‌గఢ్	4,388
గుజరాత్	350
హరియాణ	7,460
హిమాచల్‌ప్రదేశ్	6,262
కర్ణాటక	22,395
కేరళ	16,595
ఒడిశా	370
పంజాబ్	4,059
రాజస్తాన్	23,748
సిక్కిం	1,212
తమిళనాడు	29,706
తెలంగాణ	26,675
ఉత్తరప్రదేశ్	10,089
జమ్మూకశ్మీర్	7,892

స్వయం సహాయక సంఘాలకు భరోసా

- 2021–22 ఆర్థిక ఏడాదిలో లక్ష్యానికి మించి 8,336 శాతం మేర కొత్తగా మహిళా స్వయం సహాయక సంఘాలను ఆంధ్రప్రదేశ్ ప్రోత్సహించింది. దేశ వ్యాప్తంగా 12.41 లక్షల సంఘాలను కొత్తగా ప్రోత్సహిస్తే, అందులో 8.54 లక్షలు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి.
- ఆ తర్వాత ఉత్తరప్రదేశ్‌లో 1.46 లక్షలు, ఇతర రాష్ట్రాలు వేల సంఖ్యలో కొత్త సంఘాలను ప్రోత్సహించాయి. రాజస్థాన్‌లో 48,979, గుజరాత్‌లో 38,028, ఛత్తీస్‌గఢ్‌లో 25,427, ఒడిశాలో 37,777 సంఘాలను ప్రోత్సహించారు.
- ఏపీలో 55,607 అంగన్‌వాడీ కేంద్రాలు నూటికి నూరు శాతం మంచి పనితీరు కనపరిచాయి. 257 ఐసీడీఎస్ బ్లాక్‌లు (సమగ్ర శిశు అభివృద్ధి కేంద్రాలు) వంద శాతం బాగా పని చేశాయి. వ్యవసాయ పంపు సెట్లకు లక్ష్యానికి మించి 272 శాతం విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.
- 2021–22 ఆర్థిక ఏడాదిలో 24,852 పంపు సెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలన్నది లక్ష్యం కాగా, ఏకంగా 67,506 పంపు సెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. పీఎంజీఎస్‌వై కింద రాష్ట్రంలో 1,241 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారుల నిర్మాణం చేపట్టారు.

పెద్ద ప్రాజెక్టుల్లోనూ చిన్న ఫ్లాట్లు

- పట్టణాల్లో నిర్మాణానికి అనువుగా చర్యలు
- ఐదెకరాలకు మించిన ప్రాజెక్టుల్లో సామాన్యులకు చోటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలు ఉపాధికి, ఆర్థిక వృద్ధికి కేంద్రాలుగా మారుతున్నాయి. ఈ క్రమంలో గ్రామాల నుంచి అక్కడకు వలసలు భారీగా పెరుగుతుండడంతో పట్టణీకరణ విస్తరిస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో తక్కువ ధరకే ఇళ్లను నిర్మించే సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా రాయితీలు ప్రకటించింది. తక్కువ ఆదాయం పొందే వర్గాలు కూడా గేటెడ్ కమ్యూనిటీల్లో తమ స్థాయికి తగ్గ ఇంటిని పొందేందుకు వీలుగా ప్రభుత్వం భవన నిర్మాణ నిబంధనలను సవరించింది. నిర్మాణ సంస్థలు తమ ప్రాజెక్టుల్లో సామాన్యులకు చోటుకల్పిస్తే వారికి పలు రకాల ప్రోత్సాహకాలతో పాటు, నిర్మాణ ఫీజులో రాయితీలు సైతం అందిస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, తక్కువ ఆదాయ వర్గాల ప్రజలే కాకుండా ఎవరైనా కొనుగోలు చేసేలా ఇవి ఉండనున్నాయి. ఇలాంటి వారికోసం పెద్ద ప్రాజెక్టుల్లో 645 చ.అడుగుల విస్తీర్ణంలో ఇళ్లను నిర్మించేలా నిర్మాణ సంస్థలను ప్రభుత్వం ప్రోత్సహించనుంది. త్వరలో ఏపీలో ఇవి అందుబాటులోకి రానున్నాయి.

పెద్ద ప్రాజెక్టుల్లో సామాన్యులకూ చోటు

కేంద్ర గృహ, పట్టణ పేదరిక నిర్మూలన మంత్రిత్వ శాఖ సర్వే ప్రకారం.. దేశంలో 18.78 మిలియన్ల నివాసాల కొరత ఉందని, ఇందులో 96 శాతం ఆర్థికంగా వెనుకబడ్డ, తక్కువ ఆదాయ వర్గాలకు చెందినవారే ఇళ్లు లేనివారిగా పేర్కొంది. ఇది గత ఐదేళ్లల్లో మరింత పెరిగినట్లు లెక్కగట్టింది. ఇదే క్రమంలో మందకొడిగా సాగుతున్న నిర్మాణ రంగాన్ని వేగవంతం చేసేందుకు తక్కువ ఆదాయ వర్గాల స్తోమతకు తగ్గట్లుగా పట్టణాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ఆయా సంస్థలను ప్రోత్సహించాలని పేర్కొంది. నగరపాలక సంస్థల పరిధిలో నిర్మించే మూడు, రెండు పడక గదుల ప్రాజెక్టులకు ఎంతో డిమాండ్ ఉంటుంది. సుమారు ఐదెకరాలకు పైబడిన ప్రాంతంలో ఐదు అంతకు మించిన అంతస్తుల్లో 1000 నుంచి 3000 చ.అడుగుల విస్తీర్ణం గల ఫ్లాట్లను నిర్మిస్తుంటారు. వీటి ధర చ.అడుగు రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు ఉంటుంది. అంటే.. వేయి చ.అడుగుల ఫ్లాట్ నికర ధర రూ.70 లక్షల నుంచి రూ.కోటి వరకు.. రిజిస్ట్రేషన్, ఇతర ఖర్చులు కలిపితే ఇంకా అధికంగా ఉంటుంది. అయితే, ప్రస్తుతం పట్టణాల్లో ఇల్లు కొనాలంటే ఏడాదికి రూ.2 లక్షల ఆదాయం పొందేవారికి అసాధ్యమనే చెప్పాలి. ఇకపై ఐదెకరాలకు మించిన స్థలంలో నిర్మించే ప్రాజెక్టుల్లో 15 శాతం స్థలం లేదా మొత్తం యూనిట్లలో 35 శాతం సామాన్యులకు కేటాయించాలి. ఇలాంటి సంస్థలకు ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలు సైతం ఇస్తూ 2017 ఏపీ భవన నిబంధనలను సవరించింది.

● తెలంగాణ

నల్లమలలో కొత్త మొక్క

- గుర్తించిన జడ్చర్ల బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల పరిశోధకులు
- యూఫోర్బియా తెలంగాణేన్సిస్‌గా నామకరణం



జడ్చర్ల టౌన్: నల్లమల అడవుల్లో సరికొత్త మొక్కను కనుగొన్నట్టు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర ప్రొఫెసర్ సదాశివయ్య వెల్లడించారు. ఆ మొక్కకు యూఫోర్బియా తెలంగాణేన్సిస్‌గా నామకరణం చేసినట్టు ప్రకటించారు. శుక్రవారం ఈ వివరాలను విలేకరులకు తెలిపారు. సదాశివయ్య బృందం, ఏపీ రాష్ట్ర జీవవైవిధ్య మండలి సభ్యుడు డాక్టర్ ప్రసాద్, ఉస్మానియా విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగం నుంచి నిర్మలా బాబురావు, రామకృష్ణ సంయుక్తంగా నల్లమలలో గడ్డి జాతులపై పరిశోధన చేస్తున్నారు. ఈ పరిశోధనలో ఒక కొత్త మొక్కను గుర్తించారు. అది రాజస్థాన్‌లో ఉండే యూఫోర్బియా జోధ్పూరెన్సిస్ అనే మొక్కను పోలి ఉందని.. కానీ కొన్ని లక్షణాల్లో వైవిధ్యం ఉండటంతో కొత్త మొక్కగా తేల్చామని పరిశోధక బృందం తెలిపింది. ఈ మొక్కల సంఖ్య చాలా తక్కువగా ఉండటం, కేవలం రెండు ప్రాంతాల్లోనే లభ్యమవుతుండటంతో అంతరించిపోతున్న మొక్కల జాబితా కింద చెప్పవచ్చన్నారు. కొత్త మొక్కను కనుగొన్న పరిశోధక బృందాన్ని ఉన్నతవిద్యా శాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ అభినందించారు.

మరింత అధ్యయనం చేస్తాం..

నల్లమలలో కనుగొన్న కొత్త మొక్కపై మరింత అధ్యయనం అవసరమని సదాశివయ్య చెప్పారు. ఈ మొక్క సుమారు 30 సెంటీమీటర్ల పొడవు పెరిగి, మొత్తం పాల వంటి లేటెక్స్ (చిక్కని ద్రవం)ను కలిగి ఉంటుందన్నారు. ఈ మొక్క ఔషధ గుణాలు కలిగి ఉండే అవకాశాలు ఎక్కువన్నారు.

బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఐటీ దాడులు ఉండవు

రాష్ట్ర కార్మికమంత్రి మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు

గజ్వేల్: భారత్ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) 2024లో అధికారంలోకి వస్తే ఐటీ దాడులు ఉండవని, ప్రస్తుత విధానాల్లో మార్పులు తెచ్చి, ఎవరూ ఎంత సంపాదించుకున్నా స్వచ్ఛందంగా పన్ను కట్టుకునే స్వేచ్ఛ కల్పిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా ములుగు మండలం బైలింపూర్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజకీయాల్లో రాకముందే తాను విద్యాసంస్థలు నెలకొల్పానని, ఏటా తన విద్యాసంస్థల్లో 50 వేలమంది విద్యార్థులుంటారని చెప్పారు. 'నా వద్ద దొంగ పైసలున్నాయని, అక్రమంగా డొనేషన్లు తీసుకుంటున్నానని బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వేధిస్తున్నది' అని మండిపడ్డారు. 'విద్యార్థులు హాస్టల్ ఫీజు, కళాశాల ఫీజు కడతారు, అవి దొంగ పైసలా...?' అని ప్రశ్నించారు. 65 మంది అధికారులు, ఐదారు వందల మంది పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లను పెట్టి దాడులు చేయిస్తే తాను భయపడేది లేదని, సీఎం కేసీఆర్ ఉన్నంతకాలం తనను ఏం చేయలేరని పేర్కొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోకు గ్రీన్‌సిగ్నల్

డిసెంబరు 9న శంకుస్థాపన చేయనున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి మెట్రో రైలు పరుగులు పెట్టేందుకు రంగం సిద్ధమైంది. మైండ్‌స్పేస్ జంక్షన్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రో మార్గం ఏర్పాటుకు డిసెంబర్ 9న సీఎం కేసీఆర్ చేయనున్నారు. ఈ మేరకు వివరాలను మున్సిపల్, ఐటీశాఖల మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. సుమారు 31 కిలోమీటర్ల నిడివి ఉండే ఈ మార్గాన్ని పూర్తి చేసేందుకు సుమారు రూ.6,250 కోట్లు వ్యయం అవుతుందని తెలిపారు. రాయదుర్గం–ఎయిర్‌పోర్టు మెట్రో రైలు ఏర్పాటైతే ఐటీ కారిడార్ నుంచి విమానాశ్రయానికి చేరుకునేవారికి దూరాభారం, సమయం తగ్గుతాయి. ప్రస్తుతం రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి రోడ్డు మార్గంలో చేరుకునేందుకు సుమారు 50 నిమిషాల సమయం పడుతుంది. మెట్రో రైళ్లలో 25 నిమిషాల్లో చేరుకునేందుకు వీలుగా ఎక్స్‌ప్రెస్ మెట్రో కారిడార్‌ను ఏర్పాటు చేసే ప్రతిపాదనలు ఉన్నాయి. ఇప్పటికే ఈ మార్గానికి సంబంధించి ఢిల్లీ మెట్రోరైల్ కార్పొరేషన్ అధికారులు సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్, హెచ్ఎండీఏల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్పెషల్ పర్పస్ వెహికల్‌ను కూడా గతంలోనే ఏర్పాటు చేశారు.

ఆత్మరక్షణ కళను దైవంగా భావించాలి


మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులతో సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆత్మరక్షణ కళ చాలా గొప్పదని.. మార్షల్ ఆర్ట్స్‌ను దైవంగా భావించాలని జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.ఎస్.వి.(హారిక) ప్రసాద్ అన్నారు. ఆదివారం బ్రూస్‌లీ 82వ జయంతి వేడుకలు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తైక్వాండో, ఉషా అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా బ్రూస్‌లీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగన్నాథరావు, కురిటి తారకరామ, రెడ్డి సాయి కుమార్, బంటుపల్లి ఉమామహేశ్వరరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నమో ఆదిత్యాయ

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మార్గశిరమాసం ప్రత్యేక పూజల నేపథ్యంలో స్థానికులతో పాటు దూరప్రాంతాల నుంచి భారీగా భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు తగు చర్యలు చేపట్టారు. అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఉషా పద్మిని చాయా దేవేరులతో శ్రీవారి మూలవిరాట్టును ప్రత్యేక అలంకరించారు. ఇంద్రపుష్కరిణిలో మహిళలు దీపారాధన చేసి ప్రత్యేక ప్రసాదాలను నివేదించారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల రూపంలో రూ.4,41,300, విరాళాల ద్వారా రూ.67,359, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3.10 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

ఫలించిన సమాచార కేంద్ర నిర్వహణ..

తొలిసారిగా ఆలయం బయట అధికారిక సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసి..వీఐపీలకు ప్రత్యేక దర్శనాలకు, కానివారికి రూ.100 దర్శనాల టిక్కెట్లు విక్రయించే చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. గతంలో ఇదే మార్గం వద్ద అనధికారిక వీఐపీల బెడదతో ఆలయ వర్గాలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తాజా పరిణామంతో వీఐపీల పేరుతో వచ్చిన వారిలో ముఖ్యులకు మాత్రమే ప్రధాన ద్వార దర్శనాలను కల్పించేలా ఏర్పాట్లు చేశారు. దీనిపై సామాన్య భక్తులు కూడా హర్షం వ్యక్తం చేశారు.

ఆయుష్మాన్ భవ..!


విజయనగరంలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

- ప్రజల ఆరోగ్యానికి సర్కారు ఆశీర్వాదం
- వైద్యం కోసం కోట్లాది రుపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం
- పేదలకు సంజీవనిలా ఉపయోగపడుతున్న ఆరోగ్యశ్రీ పథకం
- 3 వేలకు పైగా వ్యాధులకు చికిత్స

విజయనగరం ఫోర్ట్: ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. పేద, మధ్యతరగతి ప్రజల కోసం ప్రవేశ పెట్టిన డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం సంజీవనిలా ఉపయోగపడుతోంది. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న లబ్ధిదారులు కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం వైద్యం చేయించుకోలుగుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొన్ని రకాల వ్యాధులకు మాత్రమే వైద్యం చేసేవారు. కానీ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ పథకంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న వ్యాధుల సంఖ్యను రెట్టింపు చేసింది. అంతేకాకుండా దేశంలోని ఏరాష్ట్రంలో లేని విధంగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స చేసుకున్న తర్వాత చికిత్సనాంతర భృతిని కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోంది. ఫలితంగా ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతోంది.

3,251 వ్యాధులకు చికిత్స:

డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రస్తుతం 3,251 వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. 2019 వరకు కేవలం 1000 వ్యాధులకు మాత్రమే చికిత్స అందేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పథకంలో చికిత్స కోసం 2,446 వ్యాధులను పెంచారు. వాటికి అదనంగా మరో 805 వ్యాధులను చేర్చారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం కుటుంబాలు 7 లక్షలు ఉన్నాయి. వారిలో అధికశాతం మంది పేద, మధ్య తరగతి ప్రజలే కావడం వల్ల ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఉచితంగా సేవలు పొందుతున్నారు.

ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులు

జిల్లాలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, రెండు ప్రాంతీయ ఆస్పత్రులు, ఘోషాఆస్పత్రి, 5 సీహెచ్‌సీలు, 38 పీహెచ్‌సీలు, 16 ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం అమల్లో ఉంది. అదేవిధంగా పార్వతీపురం మన్యం జిల్లాలో జిల్లా ఆస్పత్రి, ఒక ఏరియా ఆస్పత్రి, రెండు ప్రైవేట్ ఆస్పత్రులు, 3 సీహెచ్‌సీలు, 27 పీహెచ్‌సీల్లో ఆరోగ్యశ్రీ పథకం అమల్లో ఉంది.

ఏటా వేలాది మందికి చికిత్స

ఏటా వేలాది మంది రోగులు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఆరోగ్యశ్రీ పథకం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు గొప్ప భరోసాను ఇస్తోంది. ఆసరా వల్ల శస్త్రచికిత్స చేసుకున్న తర్వాత రోగులు మంచి పౌష్టికాహారం తీసుకుంటున్నారు.

– డాక్టర్ ఉప్పు అప్పలరాజు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

ఆరోగ్యశ్రీ ఆదుకుంది



తీవ్రమైన హెర్నియా రావడంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 10 రోజుల క్రితం చేరాను. ఆస్పత్రిలో చేరిన మరుసటి రోజే ఆపరేషన్ చేశారు. నెలరోజులుగా నొప్పి ఎక్కువగా రావడంతో భరించలేకపోయేవాడిని. ఆపరేషన్ చేయడం వల్ల తగ్గింది. మాది చాలా పేద కుటుంబం. కూలి ఆడితేగాని కుండ ఆడని నన్ను ఆరోగ్యశ్రీ పథకం నన్ను ఆదుకుంది.

– పి.సత్యం, ఆరోగ్యశ్రీ లబ్ధిదారు, పెదవేమలి గ్రామం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గాల పరిశీలకుల నియామకం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు సంబంధించి నియోజకవర్గాల వారీగా పరిశీలకులను వైఎస్సార్ సీపీ కేంద్ర కమిటీ నియమించింది. అందుకు సంబంధించిన వివరాలను ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. నియోజకవర్గాల వారీగా నియమితులైన పరిశీలకుల పేరు ఇలా ఉన్నాయి.


సూరిబాబు


కరిమి రాజేశ్వరరావు


డాక్టర్ నిమ్మాన దాసు


నరేష్‌కుమార్ అగర్వాల్


పాలవలస విక్రాంత్


పేరాడ తిలక్

విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ పరిశీలకులు

నియోజకవర్గం	పరిశీలకుని పేరు
రాజాం (ఎస్సీ)	పేరాడ తిలక్
బొబ్బిలి	కరిమి రాజేశ్వరరావు
చీపురుపల్లి	డాక్టర్ నిమ్మాన దాసు
నెల్లిమర్ల	అందవరపు సూరిబాబు
గజపతినగరం	పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీ
విజయనగరం	నరేష్‌కుమార్ అగర్వాల్
శృంగవరపు కోట	తైనాల విజయ్‌కుమార్

పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్ సీపీ పరిశీలకులు

నియోజకవర్గం	పరిశీలకుని పేరు
పాలకొండ (ఎస్టీ)	దోల జగన్
కురుపాం (ఎస్టీ)	మామిడి శ్రీకాంత్
పార్వతీపురం (ఎస్సీ)	శోభా హైమావతి
సాలూరు (ఎస్టీ)	మీసాల నీలకంఠంనాయుడు


విజయ్‌కుమార్


దోల జగన్


మామిడి శ్రీకాంత్


శోభా హైమావతి


నీలకంఠంనాయుడు

యోగా, నడకతో ఒత్తిడి దూరం


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్: ప్రస్తుత ప్రపంచంలో మనిషిని మానసిక ఒత్తిడి నుంచి దూరం చేసేది యోగా, నడక మాత్రమేనని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్–స్టార్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో వాకర్స్‌క్లబ్ భవనం శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ఎన్నో ఒడిదుడుకులు, ఒత్తిళ్ల నడుమ మనిషి జీవనం సాగిస్తున్నాడని, వీటిని అధిగమించాలంటే యోగా, నడక, వ్యాయామంతోనే సాధ్యమన్నారు. ఎంతో విశిష్టత కలిగిన యోగ సాధనకు భవనం నిర్మించేందుకు వాకర్స్ ఇంటర్నేషనల్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం శంకుస్థాపన పూజలు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎం.వి.నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణానికి సహకరించిన స్పీకర్ తమ్మినేని, మంత్రి ధర్మాన, ప్రభుత్వ కళాశాల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యోగా రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రొక్కం సూర్యప్రకాశరావు, డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఐ.గునేశ్వరరావు, పొట్నూరు గోవింద గుప్త, కాసపు జోగినాయుడు, గేదెల ఇందిరాప్రసాద్, హారికా ప్రసాద్, గుడ్ల సత్యన్నారాయణ, కూన వెంకట రమణమూర్తి, కామేశ్వరరావు, చలపాక సూర్యారావు, సంతోష్‌కుమార్, బి.దేవిప్రసాద్, ఎం.మల్లిబాబు, జామి రాధాకృష్ణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మేలు చేసేవి వాకర్స్ సంస్థలే

శ్రీకాకుళం అర్బన్: సమాజంలో నివసించే అందరి ఆరోగ్యానికి ఎంతో రక్షణగా నిలిచే సంస్థలు వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్స్ మాత్రమేనని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.వి.నేతాజీ సుబ్బారెడ్డి అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 102 కాన్ఫరెన్సు ఆదివారం శ్రీకాకుళంలో జరిగింది.

ఉల్లాసంగా..ఉత్సాహంగా!


మొగదాలపాడు బీచ్‌లో సందర్శకులు

గార: మండలంలోని మొగదాలపాడు, కళింగపట్నం బీచ్‌లో ఆదివారం పిక్నిక్ సందడి నెలకొంది. జీడితోటలు, సముద్ర తీరాల్లో సందడి చేశారు. శాలిహుండం బౌద్ధారామాలు, వేణుగోపాలస్వామి కొండపైనా సందర్శకుల తాకిడి కనిపించింది. మొగదాలపాడు తీరం వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ మధుసూదనరావు ఆధ్వర్యంలో 15 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించగా, మెరైన్ పోలీసులు పలు చోట్ల గస్తీ కాశారు.

క్లుప్తంగా

దగాపడ్డ రైతులకు న్యాయం చేయాలి

- 791వ రోజు రిలే దీక్షల్లో బహుజన నాయకులు



తాడికొండ: రాజధాని పేరిట చంద్రబాబు చెప్పిన దగాకోరు మాటలు విని మోసపోయిన రైతులకు న్యాయం చేయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు కోరారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 791వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో ఆదివారం పలువురు మాట్లాడారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పేదలకు ఎన్ని లక్షల ఇళ్ల స్థలాలు, గృహాలు కేటాయించాడో చెప్పి ప్రజాక్షేత్రంలో తిరగాలని డిమాండ్ చేశారు. నేడు పేదలకు 32 లక్షల ఇళ్లస్థలాలు కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అద్భుతమన్నారు. అమరావతిలో అసైన్డ్ రైతులకు బాబు చేసిన అన్యాయం అంతా ఇంతా కాదని, భూములను పదింతల ధరకు అమ్ముకుని కోట్ల రూపాయలు సొమ్ము చేసుకున్నాడని మండిపడ్డారు. పేదల హక్కులను హరిస్తూ అడుగడుగునా కోర్టుల్లో తప్పుడు కేసులు వేసి అభివృద్ధికి అడ్డుతగులుతున్న కులవాదులకు రాష్ట్రంలో కాలం చెల్లిందని చెప్పారు. కులవాదాన్ని నెత్తినెత్తుకున్న కొంతమంది వ్యక్తులు ఎస్ఆర్ఐలు బినామీలు ఇచ్చే రూ.కోట్ల చందాల కోసం చేస్తున్న దొంగ ఉద్యమాన్ని ప్రజలు నమ్మడం లేదన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే 175 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టండి

- పవన్‌కు మంత్రి రోజా సవాల్



సాక్షి, హైదరాబాద్: పవన్‌కళ్యాణ్‌కు దమ్ముంటే వచ్చే ఎన్నికల్లో జనసేన తరఫున 175 మంది అభ్యర్థులని బరిలోకి దింపాలని ఏపీ మంత్రి రోజా సవాల్ విసిరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన ఏమీచేయలేరన్నారు. రోడ్లపై రౌడీలా రోడ్డు షోలు చేయటమేంటని పవన్‌ను ప్రశ్నించారు. పాలిటిక్స్ అనేవి యుద్ధంలాంటివని, ఈ యుద్ధంలో ఎవరైతే ప్రజల మనసును గెలుచుకుంటారో వారే శాసనసభలోకి అడుగుపెట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. రోజా ఆదివారమిక్కడ జరిగిన 'శాసనసభ' సినిమా ట్రైలర్ ఆవిష్కరణలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

జగన్‌మోహన్‌రెడ్డి గారే గుర్తుకొచ్చారు..

'శాసనసభ' ట్రైలర్ ఆవిష్కరణ సందర్భంగా రోజా మాట్లాడుతూ... ఈ చిత్రంలోని డైలాగులు బాగున్నాయని కితాబునిచ్చారు. ''ఈ సినిమా ట్రైలర్‌లోని 'ప్రతివాడు యుద్ధంలో గెలవాలనే చూస్తాడు. కానీ ఎవడో ఒక్కడే గెలుస్తాడు. వాడినే వీరుడంటారు...' అన్న ఈ డైలాగ్ విన్నప్పుడు నాకు జగన్‌మోహన్‌రెడ్డి గారే గుర్తుకొచ్చారు'' అని చెప్పారు. మరో డైలాగ్ 'ఓటు వేసిన రోజునే..'ను ఉద్దేశించి రోజా మాట్లాడుతూ.. ''మునపటిలా ఏసీ రూముల్లో కూర్చొని ఐదేళ్లకోసారి ప్రజల్లోకి వెళ్లాలనుకునే రోజులు పోయాయి. ఓటు వేసిన రోజు నుంచి మళ్లీ ఓటు వేయించుకునేంతవరకు ఎమ్మెల్యేలు, ఎంపీలు గడప గడపకు వెళ్లి... జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న సంక్షేమఫలాలు అందుతున్నాయా? లేదా? అని కనుక్కుంటూ ఆ ప్రాంతం అభివృద్ధి కోసం రోజూ తిరుగుతున్నాం. ప్రజల్లో మార్పు వచ్చింది. అందుకు తగ్గట్టుగానే రాజకీయ నాయకులు కూడా మారాలి'' అని అన్నారు. 'కులం చూసి ఓట్లు వేసే రోజులు పోవాలి. మా వాడు, మా కులం అని ఓట్లు వేసి ఆ తరవాత వాడు ఏం చేయలేదని బాధపడేకన్నా మంచి వ్యక్తికి ఓటు వేసి గెలిపించుకుంటే కచ్చితంగా మంచి జరుగుతుంది. కాబట్టి కులం, మతం, ప్రాంతం అనే వాటిని పక్కన పెట్టండి' అని ఆమె చెప్పారు.

నాన్నకు ఎంతో రుణపడి ఉన్నా..

- సూపర్‌స్టార్ కృష్ణ పెద్దకర్మలో మహేశ్‌బాబు



హైదరాబాద్: సినీ నటుడు సూపర్‌స్టార్ కృష్ణ పెద్దకర్మ కార్యక్రమంలో మహేశ్ బాబు ఉద్వేగానికి లోనయ్యారు. 'నాన్న నాకు చాలా ఇచ్చాడు. ఆయనకు ఎప్పుడూ రుణపడి ఉంటాను' అని అన్నారు. పెద్దకర్మను మాదాపూర్‌లో కుటుంబసభ్యులు, అభిమానుల మధ్య ఆదివారం నిర్వహించారు. మహేశ్‌బాబు మాట్లాడుతూ.. 'నాన్న భౌతికంగా లేకపోయినా ఆయన ఎల్లప్పుడూ మన మధ్యనే ఉంటారు. మీ అభిమానం, ఆశీస్సులు ఎప్పుడూ ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నా' అన్నారు. కార్యక్రమంలో సినీనటులు నమ్రత, మంజుల, సుధీర్‌బాబు, జీవిత రాజశేఖర్, డైరెక్టర్లు త్రివిక్రమ్, గోపీచంద్ మలినేని, సినీహీరోలు, నిర్మాత సురేష్‌బాబు, అభిమానులు పాల్గొన్నారు.

యువత 'రంగం' రియల్ ఎస్టేట్





స్థిరాస్తి రంగంలో పెట్టుబడులకు దేశ యువత అత్యధిక ప్రాధాన్యం

- 59 శాతం ఈ రంగంలోనే పెట్టుబడులు.. తర్వాతి స్థానంలో 28 శాతంతో స్టాక్ మార్కెట్
- డిపాజిట్లు పెడతామంటున్నది 7 శాతమే
- అత్యల్పంగా 6 శాతం మంది మాత్రమే బంగారంపై పెట్టుబడి
- సీఐఐ-అన్‌రాక్ సర్వేలో వెల్లడి

▪ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురానికి చెందిన పట్నాల నగేష్ వ్యాపారం చేస్తుంటారు. ఇటీవల వ్యాపారంలో వచ్చిన లాభాలను స్థిరాస్తి రంగంలో పెట్టుబడిగా పెడుతున్నారు. వ్యాపారిగా ప్రతి పైసాకు లెక్క వేసే తాను రియల్ ఎస్టేట్‌లోనే పెట్టుబడులు పెడుతున్నట్లు చెప్పారు. 'బ్యాంకు వడ్డీరేట్లు చాలా తక్కువగా ఉన్నాయి. బంగారం ధరలు భారీగా పెరిగాయి. అందువల్లే వాటిలో పెట్టుబడి పెట్టడంలేదు. చాలా మంది స్టాక్ మార్కెట్ బాగుందంటున్నా, దానిపై నాకు అంతగా అవగాహన లేదు. అందుకే వచ్చిన లాభాలను స్థిరాస్తి రంగంలోనే పెడుతున్నా' అని నగేష్ చెప్పారు.

▪ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు మేలని కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన కవులూరి ఆదిత్య అంటున్నారు. 'గతంలో మా నాన్నగారు నా పేరు మీద పోస్టాఫీసులు, బ్యాంకుల్లో డిపాజిట్లు చేశారు. ఈ మధ్యనే నాకు బాబు పుట్టాడు. నేనూ డిపాజిట్లు పెడతామని అనుకున్నా. పోస్టాఫీసులు, బ్యాంకులకు వెళ్తే వడ్డీ రేట్లు చాలా తక్కువగా ఉన్నాయి. పెరుగుతున్న ధరలు (ద్రవ్యోల్బణం) పరిగణనలోకి తీసుకుంటే వాటిపై రాబడి లేకపోగా నష్టపోతున్నా మనిపించింది. అందుకే రిస్క్ ఉన్నా మా బాబు భవిష్యత్తు కోసం ఇప్పటి నుంచే ప్రతి నెలా సిప్ విధానంలో మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తున్నా' అని వివరించారు.

- సాక్షి, అమరావతి

వీరిద్దరూ చెప్పింది వాస్తవమే. స్థిరాస్తి రంగం, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులకే నేటి యువత ప్రాధాన్యతనిస్తోంది. మరీ ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. దేశ యువత పెట్టుబడి తీరులో వచ్చిన స్పష్టమైన మార్పుకు ఇది నిదర్శనమని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బంగారం వంటి సురక్షితమైన పెట్టుబడుల వైపు మొగ్గు చూపేవారు. ఇప్పుడు రిస్క్ (నష్ట భయం) ఉండే రియల్ ఎస్టేట్, స్టాక్ మార్కెట్ వంటి ఈక్విటీ సాధనాల్లో పెట్టుబడులకు మొగ్గు చూపుతున్నట్లు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ), అన్‌రాక్ సంస్థలు దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా 14 పట్టణాల్లో వివిధ ఆదాయ తరగతులకు చెందిన 5,500 మందిపై ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు నిర్వహించిన సర్వేలో పలు అంశాలు వెలుగు చూశాయి. కోవిడ్ సంక్షోభం తర్వాత ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బంగారం వంటి సంప్రదాయ పెట్టుబడులు తగ్గాయని, రియల్ ఎస్టేట్, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెరిగాయని సర్వే తెలిపింది.

'రియల్'నే నమ్ముతున్నారు

యువత పెట్టుబడుల్లో రియల్ ఎస్టేట్‌దే అగ్రస్థానమని సర్వే వెల్లడించింది. 59 శాతం మంది రియల్ ఎస్టేట్‌లోనే పెట్టుబడికి మొగ్గు చూపుతున్నట్లు తెలిపింది. 28 శాతం మంది స్టాక్ మార్కెట్‌పై ఆసక్తి చూపించారు. కోవిడ్ వచ్చిన సంవత్సరం 2020 జనవరి – జూన్ మధ్య రియల్ ఎస్టేట్‌లో ఇన్వెస్ట్ చేసే వారి సంఖ్య 48 శాతం ఉండగా, ఈ ఏడాది జనవరి – జూన్ మధ్య 11 శాతం పెరిగిందని సర్వే తెలిపింది. అత్యధికంగా 33 శాతం మంది సొంతింటి కలను నెరవేర్చుకోవడం కోసం స్థిరాస్తి కొంటున్నట్లు తెలిపారు. 22 శాతం మంది అత్యవసర సమయాల్లో స్థిరాస్తి అక్కరకు వస్తుందని భావిస్తున్నారు. 17 శాతం మంది భవిష్యత్తులో వ్యాపారం మొదలు పెట్టడానికి ముందస్తుగా ఇన్వెస్ట్ చేస్తుంటే, 15 శాతం మంది రిటైర్మెంట్ తర్వాత అండగా ఉంటుందని భావిస్తున్నారు. ఈక్విటీ పెట్టుబడులు కోవిడ్ ఏడాదికి, ఈ ఏడాదికి 3 శాతం పెరిగి 25 శాతం నుంచి 28 శాతానికి చేరినట్లు తేలింది. ఇదే సమయంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు 18 శాతం నుంచి 7 శాతానికి పడిపోగా, బంగారంలో పెట్టుబడి పెట్టే వారి సంఖ్య 9 శాతం నుంచి 6 శాతానికి తగ్గిపోయింది. వడ్డీ రేట్లు తగ్గి కనిష్ట స్థాయికి చేరడం ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఆసక్తి చూపకపోవడానికి ప్రధాన కారణంగా వెల్లడైంది. ఇప్పుడు మళ్లీ వడ్డీ రేట్లు పెరుగుతుండటంతో డిపాజిట్లలో ఇన్వెస్ట్ చేసే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంటున్నారు. అలాగే బంగారం ధరలు కూడా గరిష్ట స్థాయిలో ఉండటంతో ఈ సమయంలో ఇన్వెస్ట్ చేయడానికి అంతగా ఆసక్తి చూపడంలేదని సర్వేలో వెల్లడైంది.

నాటిన ప్రతి మొక్క.. చెట్టవ్వాల్సిందే!



కొత్త గ్రీనింగ్ పాలసీకి అటవీ శాఖ కసరత్తు

- సంఖ్య కాదు.. నాణ్యతకే ప్రాధాన్యం
- శాస్త్రీయ పద్ధతిలో మొక్కల పెంపకానికి పరిశోధనలు
- ఏ ప్రాంతంలో ఏ తరహా మొక్కలు నాటాలనే దానిపై అధ్యయనం



సాక్షి, అమరావతి: మొక్కల పెంపకాన్ని మొక్కుబడిగా కాకుండా.. ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని రాష్ట్ర అటవీ శాఖ నిర్ణయించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉండే వాతావరణం, నేల స్వరూపాలకు తగినట్లుగా మొక్కలను పెంచేలా కొత్త గ్రీనింగ్ పాలసీ తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఎన్ని మొక్కలు నాటామనే సంఖ్యకు కాకుండా.. నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని అటవీ శాఖ నిర్ణయించింది. గ్రో మోర్ వుడ్. యూజ్ మోర్ వుడ్(ఎక్కువ కలప పెంచు.. ఎక్కువ కలప ఉపయోగించు) అనే నినాదానికి అనుగుణంగా కొత్త పాలసీకి రూపకల్పన చేస్తోంది. గతంలో కలపతో చేసిన వస్తువుల వినియోగం ఎక్కువగా ఉండేది. దీంతో కలప తరిగిపోయి.. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పెరిగింది. ఇప్పుడు ప్లాస్టిక్ వల్ల ప్రమాదమని గ్రహించిన ప్రజలు మళ్లీ చెక్క వస్తువుల వైపు చూస్తున్నారు. అలాగే వాతావరణంలో కూడా కర్బన ఉద్గారాలు పెరిగిపోయాయి. పచ్చదనం పెరిగితే తప్ప ఆక్సిజన్ ఉత్పత్తికి వేరే మార్గం లేదని తేలిపోయింది. ఇందుకు తగ్గట్టుగా మొక్కలు నాటే విధానాన్ని ఆధునికంగా, శాస్త్రీయంగా మార్చాలనే ప్రయత్నాలు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయి. ఏపీలోనూ ఇందుకు అనుగుణంగా అడుగులు పడుతున్నాయి. అడవులతో పాటు వాటి వెలుపల, రోడ్లు, కాలువల పక్కన, పార్కులు, ఇతర ప్రాంతాల్లో అక్కడి వాతావరణం, నేల స్వభావం, నీటి వనరుల లభ్యత, కలప అవసరాలకు అనుగుణంగా.. ఏ జాతి మొక్కలు నాటాలో నిర్ణయించేలా రాష్ట్ర అటవీ శాఖ చర్యలు చేపట్టింది.

ప్రతి జిల్లాలో వాణిజ్య నర్సరీలు

రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలోని నర్సరీల స్వరూపాన్ని కూడా పూర్తిగా మార్చివేయాలని భావిస్తున్నారు. ప్రతి జిల్లాలో ఒకటి, రెండు వాణిజ్య నర్సరీలను ఆధునిక రీతిలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నర్సరీల్లో స్థానికంగా పెరిగే వృక్ష జాతులు, జన్యుమార్పిడి చేసిన మొక్కలు లభించేలా అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్రంలో రెండు, మూడు చోట్ల పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. అత్యాధునికంగా మొక్కలు పెంచే విధానం, వేగంగా పెరిగే మొక్కలు తదితర కోణాల్లో పరిశోధనలు జరిగేలా చర్యలు చేపడుతున్నారు.

సరికొత్తగా పచ్చదనం..



అడవులతో పాటు గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో.. ప్రతి చోటా అక్కడి వాతావరణానికి తగినట్లుగా ఏ మొక్కలు నాటాలి, వాటి నిర్వహణ తదితరాలపై శాస్త్రీయంగా పరిశోధనలు చేయిస్తాం. ఎలాంటి మొక్కలు నాటాలో చెప్పడంతో పాటు.. అవి సక్రమంగా పెరిగేలా చూసేందుకు చర్యలు తీసుకుంటాం. కొత్త గ్రీనింగ్ పాలసీ ప్రకారం రాష్ట్రంలో పచ్చదనం పెంపు సరికొత్తగా, నాణ్యంగా ఉండేలా చూస్తాం.

– వై.మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర అటవీ దళాల అధిపతి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్

ముగింపా? కొనసాగింపా?

3న ఆర్ఎంసీ ఇచ్చే నివేదికపైనే కృష్ణా జల వివాదాల భవితవ్యం

సాక్షి, అమరావతి: కృష్ణా నదీజలాల వినియోగంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య తరచుగా వివాదాలకు దారితీస్తున్న సమస్యల పరిష్కారానికి రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్ఎంసీ) వచ్చే నెల 3న నివేదిక ఇవ్వనుంది. ఈ నివేదికతోనైనా జల వివాదాలకు తెరపడుతుందా లేదా అన్న విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్‌ల నిర్వహణ నియమావళి, విద్యుదుత్పత్తి, మళ్లించిన వరదజలాలను కోటాలో కలపడం ప్రధానమైన మూడు సమస్యలని మే 6న జరిగిన కృష్ణా బోర్డు 16వ సర్వ సభ్య సమావేశంలో బోర్డు చైర్మన్ ఎంపీ సింగ్ గుర్తించారు. ఆ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇచ్చేందుకు బోర్డు సభ్యులు ఆర్కే పిళ్లై అధ్యక్షతన రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలు, జెన్‌కోల సీఈలు సభ్యులుగా ఆర్ఎంసీని ఏర్పాటు చేశారు.

సమస్య –1: రూల్ కర్వ్‌పై తలో మాట

బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపుల ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌కు 512, తెలంగాణకు 299 టీఎంసీలు నీటిని కేటాయిస్తూ కేంద్రం తాత్కాలిక సర్దుబాటు చేసింది. దీని ఆధారంగా శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో ఏ ప్రాజెక్టు ఆయకట్టుకు ఎప్పుడు నీటిని విడుదల చేయాలనే నియమావళి (రూల్ కర్వ్) ముసాయిదాను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) రూపొందించింది. ఈ రూల్ కర్వ్‌పై ఆర్ఎంసీ చర్చించింది. సీడబ్ల్యూసీ రూపొందించిన రూల్ కర్వ్‌ను ఏపీ ప్రభుత్వం ఆమోదించగా, తెలంగాణ వ్యతిరేకించింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 114 టీఎంసీలు (చెన్నైకి తాగునీరు, ఎస్సార్బీసీ, తెలుగుగంగ, గాలేరు-నగరి) బచావత్ ట్రిబ్యునల్, విభజన చట్టం కేటాయింపులు చేశాయని ఏపీ ప్రభుత్వం గుర్తు చేస్తోంది. ఆ మేరకు నీటి కేటాయింపులు ఉండాల్సిందేనని స్పష్టం చేస్తోంది. సీడబ్ల్యూసీ కూడా ఏపీ వాదననే సమర్థిస్తోంది.

సమస్య–2: విద్యుదుత్పత్తిపై తకరారు

సాగర్, కృష్ణా డెల్టా ఆయకట్టులో సాగు, తాగునీటి అవసరాలున్నప్పుడు, కృష్ణా బోర్డు కేటాయించిన నీటిని మాత్రమే శ్రీశైలం నుంచి దిగువకు విడుదల చేస్తూ విద్యుదుత్పత్తి చేయాలన్నది నిబంధన. శ్రీశైలంలో ఉత్పత్తయ్యే విద్యుత్ నీటి కేటాయింపుల మేరకు 64% వాటా తమకు రావాలని ఏపీ స్పష్టం చేస్తుండగా.. తెలంగాణ మాత్రం తమకు 76% వాటా కావాలని ప్రతిపాదిస్తోంది.

సమస్య–3: వరద జలాల మళ్లింపు..

శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతలలో నీటి మట్టం గరిష్ట స్థాయిలో ఉండి, దిగువకు విడుదల చేస్తున్నప్పుడు.. ప్రకాశం బ్యారేజ్ ద్వారా కడలిలో జలాలు కలుస్తున్నప్పుడు.. అంటే వరద రోజుల్లో రెండు రాష్ట్రాలు ఏ మేరకు జలాలు మళ్లించినా వాటిని కోటాలో కలపకూడదని ఏపీ ప్రభుత్వం ఆది నుంచి ప్రతిపాదిస్తోంది. దీన్ని తెలంగాణ వ్యతిరేకిస్తోంది.

సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ప్రభుత్వానికి కళ్లు, చెవులు

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్రస్థాయి ప్రథమ మహాజన సభలో మంత్రి బొత్స

భవానీపురం (విజయవాడపశ్చిమ): క్షేత్రస్థాయి నుంచే పాలన తీసుకురావాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మానసపుత్రిక అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. 2019 ఎన్నికల ప్రణాళికలోనే ప్రతి నాలుగువేల మంది జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేస్తామని నాటి ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్ ప్రజలకు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత వారికి ఇచ్చిన మాటను నెరవేర్చారని చెప్పారు. దీనికి సహకారిగా వలంటీర్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేశారన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఆదివారం నిర్వహించిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్రస్థాయి ప్రథమ మహాజన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు ప్రభుత్వానికి కళ్లు, చెవులు వంటివన్నారు. ప్రభుత్వంలో ఏ శాఖకు సంబంధించిన సమాచారమైనా సచివాలయ ఉద్యోగులు అందిస్తారని, ఈ ఉద్యోగులంతా ఉన్నత విద్యావంతులు కావడమే అందుకు కారణమని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో 20 శాతం మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులే ఉన్నారన్నారు. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ నాడు ప్రతిపక్ష నేతగా చేసిన సుదీర్ఘ పాదయాత్రలో జగన్‌మోహన్ రెడ్డి కోట్లాదిమంది ప్రజలను కలుసుకుని వారి సమస్యలను ఆలకించి వాటి పరిష్కారదిశగా ఏర్పాటు చేసినదే సచివాలయ వ్యవస్థ అని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో 15 వేల సచివాలయాలను ఏర్పాటు చేసి ఒక్కోదాన్లో 500 రకాల సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీల్లో 98 శాతం నెరవేర్చటంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పాత్ర కీలకమని చెప్పారు.



నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ కమిటీ ప్రమాణస్వీకారం

ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత ఏపీ అమరావతి జేఏసీకి అనుబంధ సంస్థగా ఏర్పాటు చేసిన ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థకు ఎన్నుకున్న కమిటీని జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రకటించి, వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. సంస్థ లోగోను మంత్రి బొత్స సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ మహాజనసభలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఏపీ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నవరత్నాల కమిటీ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, ప్రభుత్వ సలహాదారు ఎం.చంద్రశేఖరరెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నర్సరీలకు మహర్దశ

దేశంలోనే తొలి నర్సరీ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఏర్పాటు

- కంపెనీ పరిధిలో 300కు పైగా నర్సరీలు భాగస్వామ్యం
- విదేశీ వెరైటీలు దేశీయంగా ఉత్పత్తి, మార్కెటింగ్
- మూడేళ్లలో రూ.100 కోట్ల వ్యాపార లక్ష్యం



నర్సరీలకు మహర్దశ పట్టనుంది. ప్రభుత్వ తోడ్పాటుతో దేశంలోనే తొలి నర్సరీ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ (ఎఫ్‌పీసీ) ఏర్పాటుకు రాష్ట్రంలో బీజం పడింది. ఇప్పటికే ఈ రంగాన్ని వ్యవస్థీకృతం చేసేందుకు ఏపీ రిజిస్ట్రేషన్ ఆఫ్ హార్టీకల్చర్ నర్సరీస్ యాక్ట్- 2010ని సవరించి దేశంలోనే తొలిసారి రాష్ట్రంలోని నర్సరీలన్నిటినీ చట్టపరిధిలోకి తెచ్చారు. వాటికి లైసెన్సులు జారీ చేస్తున్నారు. మరోవైపు ఈ రంగాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన ఆర్థిక చేయూతనిస్తూ ఎఫ్‌పీవోలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. - సాక్షి, అమరావతి

అత్యుత్తమ శ్రేణి.. తక్కువ ధర నినాదంతో

రాష్ట్రంలో 3,550 నర్సరీల్లో ఏటా 422 కోట్ల మొక్కలను ఉత్పత్తి చేస్తుండగా.. ఏటా రూ.2,482 కోట్ల టర్నోవర్ జరుగుతోంది. ప్రత్యక్షంగా 4.50 లక్షల మంది, పరోక్షంగా లక్షమంది ఉపాధి పొందుతున్నారు. సొంతంగా మొక్కల్ని ఉత్పత్తి చేసే నర్సరీలు, స్థానికంగా ఉత్పత్తి చేసే మొక్కల రకాలు చాలా తక్కువనే చెప్పాలి. దశాబ్దాలుగా వేళ్లూనుకున్న ఈ రంగం నేటికీ పూణే, కేరళ, బెంగాల్‌తో పాటు విదేశాలపై ఎక్కువగా ఆధారపడుతోంది. పొరుగు రాష్ట్రాలు, విదేశాల నుంచి స్థానిక నర్సరీలు తీసుకొచ్చే మొలకలు, విత్తనాలపై ఆధారపడే పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పైగా రవాణ, నిర్వహణ చార్జీల పేరిట ఒక్కొక్కరూ ఒక్కో రీతిలో అమ్ముతున్నారు. నాణ్యమైన మొక్కలు అందని ద్రాక్షగా మారింది. నాసిరకం మొక్కల బారినపడి ఏటా వందలాది కోట్ల పెట్టుబడిని రైతులు నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో అత్యుత్తమ శ్రేణి.. తక్కువ ధర (హై క్వాలిటీ.. లో ప్రైస్) నినాదంతో నాణ్యమైన దేశీ, విదేశీ మొక్కలను స్థానికంగా ఉత్పత్తి చేసి, తక్కువ ధరకు అందించడమే లక్ష్యంగా రాష్ట్రంలోనీ నర్సరీలన్నీ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వ తోడ్పాటుతో నర్సరీ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీని ఏర్పాటు చేశాయి. రూ.3 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటైన ఈ కంపెనీలో ఇప్పటికే 300 నర్సరీలు షేర్ హోల్డర్స్‌గా చేరాయి.

ఉత్పత్తిదారులుగా నర్సరీ రైతులు



నర్సరీ రంగాన్ని వ్యవస్థీకృతం చేయడంతోపాటు స్థానికంగా ఉత్పత్తిని పెంచడం, నర్సరీ రైతుల ప్రయోజనాలను పరిరక్షించడమే లక్ష్యంగా కంపెనీని ఏర్పాటు చేశాం. మాతో కలిసి వచ్చే ప్రతి నర్సరీ రైతుని ఉత్పత్తిదారులుగా తీర్చిదిద్దడం తద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం. తద్వారా నర్సరీ రంగంలో ఏపీని నంబర్ వన్‌గా నిలపడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

– గోపాలం రవీంద్ర, చైర్మన్, నర్సరీ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ

ప్రభుత్వ తోడ్పాటు మరువలేనిది



కంపెనీ ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటు మరువలేనిది. ఆంధ్రప్రదేశ్ నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన నర్సరీ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీకి వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్థన రెడ్డి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు.

– ఆకుల చలపతిరావు, మేనేజింగ్ డైరెక్టర్, నర్సరీ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ

మూడు చోట్ల సేవా కేంద్రాలు

కంపెనీ ఏర్పాటులో తొలి ప్రయత్నంగా విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరుల్లో అత్యున్నత ప్రమాణాలతో నర్సరీ సేవా కేంద్రాల పేరిట ఉమ్మడి మార్కెట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా నర్సరీ రైతులకు మొక్కలతో పాటు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచుతారు. దేశీయ, విదేశీ రకాలను స్థానికంగా అత్యున్నత ప్రమాణాలతో ఉత్పత్తి చేయడంతో పాటు వాటిని ఒకేచోట చేర్చి రైతులకు, వినియోగదారులకు అందుబాటులోకి తెస్తారు. ఈ మార్కెట్ల ద్వారా కొత్త రకాల మొక్కల ఉత్పత్తి గణనీయంగా పెరగనుంది. దేశీయ మొక్కల మార్కెట్లో ప్రతి నర్సరీ ఉత్పత్తిదారులుగా మారడంతోపాటు డిమాండ్ తగినట్టుగా ఉత్పత్తిని పెంచి లాభాలు ఆర్జించనున్నారు.

మూడేళ్లలో రూ.100 కోట్ల వ్యాపారం

కంపెనీ ద్వారా నర్సరీలను ప్రత్యామ్నాయ వ్యాపార కేంద్రాలుగా అభివృద్ధి చేయడం, నర్సరీ అనుబంధ పరిశ్రమలు, వ్యవసాయ ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చే పరిశ్రమలను ఏర్పాటుతో పాటు రైతులతో కాంట్రాక్టు వ్యవసాయాన్ని ప్రోత్సహించనున్నారు. కంపెనీ ద్వారా తొలి ఏడాది రూ.10 కోట్లు రెండో ఏడాది రూ.50 కోట్లు, మూడో ఏడాది రూ.100 కోట్ల మార్క్‌ను అందుకోవాలని.. తద్వారా మొక్కల ఉత్పత్తిలో ఆంధ్ర ప్రదేశ్‌ను దేశంలో మొదటి స్థానంలో నిలపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే సవరించిన నర్సరీల చట్ట పరిధిలోకి శాశ్వత పండ్ల మొక్కలను ఉత్పత్తి చేసే నర్సరీలతో పాటు షేడ్ నెట్/పాలీ హౌస్ నర్సరీలను తీసుకురావడంతోపాటు 2,930 నర్సరీలకు ప్రభుత్వం లైసెన్సులు జారీ చేసింది.


కీర్తి

రన్నరప్ భారత బాక్సింగ్ బృందం

ప్రపంచ యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బృందం రన్నరప్‌గా నిలిచింది. భారత కాలమానం ప్రకారం స్పెయిన్‌లో శనివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో భారత్ మొత్తం 11 పతకాలు సాధించింది. ఇందులో నాలుగు స్వర్ణాలు, మూడు రజతాలు, నాలుగు కాంస్య పతకాలు ఉన్నాయి. చివరిరోజు బరిలోకి దిగిన భారత బాక్సర్ కీర్తి మహిళల ప్లస్ 81 కేజీల విభాగం ఫైనల్లో 0–5తో సిలోనా డార్సీ (ఐర్లాండ్) చేతిలో ఓడిపోయి రజతం సాధించింది. ఈ టోర్నీలో 73 దేశాల నుంచి 600 మంది బాక్సర్లు పోటీపడ్డారు.

భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలిగా పీటీ ఉష



దిగ్గజ అథ్లెట్ పీటీ ఉష భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలిగా ఎన్నిక కానుంది. 58 ఏళ్ల ఉష ఆదివారం అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేసింది. నామినేషన్ల సమర్పణకు ఆదివారమే ఆఖరి రోజు కావడం... మరెవరూ ఈ పదవికి నామినేషన్ దాఖలు చేయకపోవడంతో పీటీ ఉష ఏకగ్రీవ ఎన్నిక ఖాయమైంది. అయితే ఐఓఏలోని మిగతా 12 పదవుల కోసం 24 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వచ్చే నెల 10న ఐఓఏ ఎన్నికలు జరుగుతాయి.

మొరాకో'రల్లో చిక్కిన బెల్జియం

ప్రపంచ రెండో ర్యాంకర్ జట్టుపై సంచలన విజయం సాధించిన మొరాకో

ర్యాంకింగ్... గత రికార్డు... అనుభవం... స్టార్ ఆటగాళ్లు... ఏ రకంగా చూసినా బెల్జియం జట్టు దరిదాపుల్లోలేని ఆఫ్రికా కూన మొరాకో జట్టు ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో పెను సంచలనం సృష్టించింది. ప్రపంచ రెండో ర్యాంకర్, గత వరల్డ్ కప్‌లో మూడో స్థానంలో నిలిచిన బెల్జియం జట్టును బోల్తా కొట్టించి ఔరా అనిపించింది. ఆరోసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న మొరాకో జట్టుకిది ఓవరాల్‌గా మూడో విజయం కాగా... 14వసారి ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన బెల్జియం తాజా ఓటమితో నాకౌట్ చేరాలంటే చివరి మ్యాచ్‌లో గత ప్రపంచకప్ రన్నరప్ క్రొయేషియా జట్టును తప్పక ఓడించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు కెనడాతో జరిగే చివరి మ్యాచ్‌ను మొరాకో 'డ్రా' చేసుకుంటే ప్రిక్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధిస్తుంది.


మొరాకోకు రెండో గోల్ అందించిన జకారియా

దోహా: తొలి మ్యాచ్‌లో గత ప్రపంచకప్ రన్నరప్ క్రొయేషియాను 0–0తో నిలువరించిన ప్రపంచ 22వ ర్యాంకర్ మొరాకో జట్టు తమ రెండో మ్యాచ్‌లో అద్భుతం చేసింది. గ్రూప్ 'ఎఫ్'లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మొరాకో 2–0 గోల్స్ తేడాతో టైటిల్ ఫేవరెట్స్‌లో ఒకటైన బెల్జియం జట్టును బోల్తా కొట్టించింది. ఈ మ్యాచ్‌లో ఆధిపత్యం పూర్తిగా బెల్జియం కనబరిచినా తుది ఫలితం మాత్రం మొరాకోను వరించింది. 67 శాతం బంతి బెల్జియం ఆధీనంలో ఉన్నా... 651 సార్లు పాస్‌లు చేసినా... మొరాకో మాత్రం గోల్ చేసేందుకు వచ్చిన నాలుగు అవకాశాల్లో రెండింటిని సద్వినియోగం చేసుకుంది. అంతకుముందు బెల్జియం ఆటగాళ్లు హజార్డ్, మెర్‌టెన్స్ కొట్టిన రెండు షాట్‌లను మొరాకో గోల్‌కీపర్ మునీర్ సమర్థంగా అడ్డుకున్నాడు. అనంతరం 73వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్ అబ్దెల్ హమీద్ సాబిరి సంధించిన ఫ్రీ కిక్ గింగిరాలు తిరుగుతూ బెల్జియం గోల్‌కీపర్ కుర్టియోస్‌ను బోల్తా కొట్టించి లక్ష్యానికి చేరింది. అనంతరం స్టాపేజ్ సమయంలో (90+2వ ని.లో) జియెచ్ అందించిన పాస్‌ను 'డి' ఏరియాలో ఉన్న జకారియా గోల్‌గా మలిచాడు. దాంతో మొరాకో శిబిరంలో సంబరాలు మిన్నంటాయి.

క్రొయేషియా ఘనవిజయం

గ్రూప్ 'ఎఫ్'లోనే జరిగిన మరో మ్యాచ్‌లో క్రొయేషియా 4–1 గోల్స్ తేడాతో కెనడాను ఓడించింది. మ్యాచ్ మొదలైన 68 సెకన్లకే కెనడా తరఫున అల్ఫోన్సో డేవిస్ తొలి గోల్ చేసి క్రొయేషియాకు షాక్ ఇచ్చాడు. నెమ్మదిగా తేరుకున్న క్రొయేషియా ఆ తర్వాత నాలుగు గోల్స్ సాధించి విజయాన్ని ఖాయం చేసుకుంది. క్రమారిచ్ (36వ, 70వ ని.లో) రెండు గోల్స్ చేయగా... లివాజా (44వ ని.లో), మాజెర్ (90+4వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.

కోస్టారికా కేక... జపాన్‌పై 1–0తో గెలుపు


ఫుల్లర్

నాలుగుసార్లు విశ్వవిజేత జర్మనీపై తొలి మ్యాచ్‌లో సంచలన విజయం సాధించిన జపాన్ జట్టుకు కోస్టారికా షాక్ ఇచ్చింది. గ్రూప్ 'ఇ'లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 24వ ర్యాంకర్ జపాన్ 0–1తో 31వ ర్యాంకర్ కోస్టారికా చేతిలో పరాజయం చవిచూసింది. ద్వితీయార్థంలో కోస్టారికా స్ట్రయికర్ కెషెర్ ఫుల్లర్ (81వ ని.లో) గోల్ చేశాడు.

అర్జెంటీనా నిలిచింది

తొలి మ్యాచ్‌లో సౌదీ అరేబియా చేతిలో ఎదురైన అనూహ్య ఓటమి నుంచి అర్జెంటీనా వెంటనే తేరుకుంది. ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీ లో నాకౌట్ దశకు అర్హత పొందే అవకాశాలు సజీవంగా ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఈ మాజీ చాంపియన్ జట్టు సమష్టి ప్రదర్శనతో రాణించింది. తనదైన రోజున ఎంతటి మేటి జట్టునైనా ఓడించే సత్తా గల మెక్సికోను ఏమాత్రం తేలిగ్గా తీసుకోకుండా ఆడిన అర్జెంటీనా రెండు గోల్స్ తేడాతో విజయం సాధించి ఊపిరి పీల్చుకుంది. పోలాండ్‌తో జరిగే చివరి మ్యాచ్‌లో అర్జెంటీనా గెలిస్తే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. ఒకవేళ మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంటే సౌదీ అరేబియా–మెక్సికో మ్యాచ్ ఫలితంపై అర్జెంటీనా జట్టు నాకౌట్ అవకాశాలు ఆధారపడి ఉంటాయి. పోలాండ్ చేతిలో ఓడితే మాత్రం అర్జెంటీనా లీగ్ దశలోనే ఇంటిముఖం పడుతుంది.




మెస్సీ గోల్ చేశాడిలా...

- మెక్సికోపై 2–0తో విజయం
- గోల్ కొట్టిన కెప్టెన్ మెస్సీ

దోహా: టైటిల్ ఫేవరెట్స్‌లో ఒక జట్టుగా ఖతర్‌కు వచ్చిన అర్జెంటీనా తొలి మ్యాచ్‌లో సౌదీ అరేబియా చేతిలో ఓడిపోవడంతో అందరూ ఆశ్చర్యపోయారు. కానీ తొలి మ్యాచ్‌లో ఎదురైన పరాభవం నుంచి తేరుకున్న అర్జెంటీనా రెండో మ్యాచ్‌లో స్థాయికి తగ్గట్టు ఆడింది. గ్రూప్ 'సి'లో భాగంగా మెక్సికోతో భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన మ్యాచ్‌లో అర్జెంటీనా 2–0 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ఆట 64వ నిమిషంలో కెప్టెన్ లయనెల్ మెస్సీ గోల్‌తో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లిన అర్జెంటీనా... 87వ నిమిషంలో ఎంజో ఫెర్నాండెజ్ గోల్‌తో విజయాన్ని ఖాయం చేసుకుంది. నాకౌట్ చేరే అవకాశాలు సజీవంగా ఉండాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో అర్జెంటీనా జాగ్రత్తగా ఆడింది. మరోవైపు మెక్సికో ఫార్వర్డ్ అలెక్సిక్ వెగా అవకాశం వచ్చినప్పుడల్లా అర్జెంటీనా రక్షణ శ్రేణి ఆటగాళ్లకు ఇబ్బంది పెట్టాడు. 45వ నిమిషంలో వెగా కొట్టిన షాట్‌ను అర్జెంటీనా గోల్‌కీపర్ సమర్థంగా అడ్డుకున్నాడు. రెండో అర్ధభాగంలో అర్జెంటీనా ఆటగాళ్లు తమ దాడుల్లో పదును పెంచారు. చివరకు 64వ నిమిషంలో కుడివైపు నుంచి డిమారియా ఇచ్చిన పాస్‌ను అందుకున్న మెస్సీ 25 గజాల దూరం నుంచి షాట్ కొట్టగా మెక్సికో గోల్‌కీపర్ డైవ్ చేసినా బంతిని గోల్‌పోస్ట్‌లోనికి పోకుండా అడ్డుకోలేకపోయాడు. దాంతో అర్జెంటీనా బోణీ కొట్టింది. ఖాతా తెరిచిన ఉత్సాహంతో అర్జెంటీనా మరింత జోరు పెంచింది. మెస్సీ అందించిన పాస్‌ను ఎంజో ఫెర్నాండెజ్ అందుకొని షాట్ కొట్టగా బంతి మెక్సికో గోల్‌పోస్ట్‌లోనికి వెళ్లింది. దాంతో ప్రపంచకప్ చరిత్రలో అర్జెంటీనా చేతిలో మెక్సికోకు నాలుగో ఓటమి ఎదురైంది.

ప్రపంచకప్‌లో నేడు

కామెరూన్ X సెర్బియా
మధ్యాహ్నం గం. 3:30 నుంచి
దక్షిణ కొరియా X ఘనా
సాయంత్రం గం. 6:30 నుంచి
బ్రెజిల్ X స్విట్జర్లాండ్
రాత్రి గం. 9:30 నుంచి
పోర్చుగల్ X ఉరుగ్వే
అర్ధరాత్రి గం. 12:30 నుంచి
స్పోర్ట్స్ 18, జియో సినిమా చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

భారత్, కివీస్ రెండో వన్డే వర్షార్పణం

హామిల్టన్: న్యూజిలాండ్ పర్యటనలో మరో మ్యాచ్‌ను వర్షం తుడిచి పెట్టింది. భారత్, కివీస్‌ల మధ్య ఆదివారం జరగాల్సిన రెండో వన్డే వర్షంతో రద్దయ్యింది. అయితే నేపియర్‌లో తొలి టి20లా కాకుండా ఇక్కడ కాసేపు మ్యాచ్ జరిగింది. క్రీజులో ఉన్నంతసేపు భారత బ్యాటర్లు శుబ్‌మన్ గిల్ (42 బంతుల్లో 45 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), సూర్యకుమార్ (25 బంతుల్లో 34 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) ధాటిగా ఆడారు. దీంతో మ్యాచ్ ఆగిపోయే సమయానికి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 12.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 89 పరుగులు చేసింది. కెప్టెన్ ధావన్ 3 పరుగుల వద్దే నిష్క్రమించాడు. ఉదయం కురిసిన వర్షం వల్ల మ్యాచ్ ఆలస్యంగానే మొదలైంది. కివీస్ కెప్టెన్ టాస్ గెలవడంతో ఫీల్డింగ్ ఎంచుకోగా భారత్ బ్యాటింగ్ చేపట్టింది. అయితే ఓ 20 నిమిషాలు జరిగిందో లేదో మళ్లీ వాన కురిసింది. అప్పటికి భారత్ 4.5 ఓవర్లలో 22/0 స్కోరు చేసింది. కానీ ఏకంగా 4 గంటల సుదీర్ఘ అంతరాయం తర్వాత 29 ఓవర్ల మ్యాచ్‌గా తిరిగి ప్రారంభమైంది. 13వ ఓవర్‌లో మళ్లీ వానజోరు ఇక ఆటకు అవకాశమివ్వలేదు. కటాఫ్ సమయానికి కనీసం 20 ఓవర్ల ఆటయిన జరిపే వీలు లేకపోవడంతో మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. బుధవారం క్రైస్ట్‌చర్చ్‌లో ఆఖరి వన్డే జరుగుతుంది.


సూర్య, గిల్

అందులో టీమిండియా గెలిస్తే 1–1తో సమం చేసుకుంటుంది. లేదంటే తొలి వన్డే కోల్పోయిన భారత్ సిరీస్‌నూ కోల్పోతుంది.

ఆసీస్ చేతిలో మళ్లీ ఓడిన భారత్

అడిలైడ్: ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్‌ల హాకీ సిరీస్‌లో భారత పురుషుల జట్టు వరుసగా రెండో ఓటమి చవిచూసింది. ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని టీమిండియా 4–7 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైంది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ (3వ, 60వ ని.లో) చేయగా... హార్దిక్ సింగ్ (25వ ని.లో), మొహమ్మద్ రాహిల్ (36వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఆస్ట్రేలియా తరఫున బ్లేక్ గోవర్స్ (12వ, 27వ, 53వ ని.లో) మూడు గోల్స్‌తో హ్యాట్రిక్ నమోదు చేశాడు. జాక్ వెల్చ్ రెండు గోల్స్ (17వ, 24వ ని.లో) సాధించగా... జేక్ వెటన్ (49వ ని.లో), జేకబ్ అండర్సన్ (48వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఈ సిరీస్‌లోని మూడో మ్యాచ్ బుధవారం జరుగుతుంది.



'గిన్నిస్ బుక్'లో నరేంద్ర మోదీ స్టేడియం

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం 'గిన్నిస్ బుక్' ప్రపంచ రికార్డుల్లోకెక్కింది. 1,10,000 మంది ప్రేక్షకుల సామర్థ్యంతో ఈ స్టేడియాన్ని నిర్మించారు. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ) కంటే 10,000 సీట్లు ఎక్కువ. ఆసీస్ అధికారిక లెక్కల ప్రకారం ఎంసీజీ సామర్థ్యం 1,00,024 సీట్లు. అయితే ఈ ఏడాది మే 29న రాజస్తాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య జరిగిన ఐపీఎల్ ఫైనల్‌ను ప్రత్యక్షంగా 1,01,566 మంది చూశారు. ఇలా అత్యధిక ప్రేక్షకులతో మోదీ స్టేడియం 'గిన్నిస్ బుక్' రికార్డులో నిలిచింది.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్‌బీఐ, ముంబైలో మేనేజర్ పోస్టులు

ముంబైలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ రిక్రూట్‌మెంట్–ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్ స్పెషలిస్ట్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 09
» **పోస్టుల వివరాలు:** మేనేజర్(ప్రాజెక్ట్స్–డిజిటల్ పేమెంట్)–05, మేనేజర్(ప్రొడక్ట్స్–డిజిటల్ పేమెంట్/కార్డు)–02, మేనేజర్(ప్రొడక్ట్స్–డిజిటల్ ప్లాట్‌ఫాం)–02.
» **అర్హత:** బీఈ, బీటెక్ లేదా ఎంసీఏ, ఎంబీఏ, పీజీడీఎం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 28 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.63,840 నుంచి రూ.78,230 చెల్లిస్తారు.
» **పని ప్రదేశం:** ముంబై.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటరాక్షన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు చివరితేది:** 12.12.2022
» **వెబ్‌సైట్:** www.sbi.co.in

ఎస్‌బీఐ, ముంబైలో 55మేనేజర్ పోస్టులు

ముంబైలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ రిక్రూట్‌మెంట్–ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్ స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్స్(క్రెడిట్ అనలిస్ట్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 55
» **అర్హత:** డిగ్రీ, ఎంబీఏ (ఫైనాన్స్) /పీజీడీబీఏ /పీజీడీబీఎం /ఎంఎంఎస్ (ఫైనాన్స్)/సీఏ/సీఎఫ్ఏ/ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. » **వయసు:** 30.06.2022 నాటికి 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.63,840 నుంచి రూ.78,230 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటరాక్షన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు చివరితేది:** 12.12.2022
» **వెబ్‌సైట్:** www.sbi.co.in

హెచ్‌సీయూలో వివిధ ఉద్యోగాలు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్.. స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ తాత్కాలిక పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03
» **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ అసోసియేట్–01, ఫీల్డ్ అసిస్టెంట్–02.
» **అర్హత:**డిగ్రీ(సోషల్ సైన్సెస్),పీజీ(ఉమెన్స్ స్టడీస్/పబ్లిక్ హెల్త్/సోషల్ సైన్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు ఆర్ఏ పోస్టులకు రూ.25,000, ఎఫ్ఏ పోస్టులకు రూ.15,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డా.షీలా సూర్యనారయణన్, సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్, మల్లాది సుబ్బమ్మ భవనం, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, గచ్చిబౌలి, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.11.2022
» **వెబ్‌సైట్:** uohyd.ac.in

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో నాన్ టీచింగ్ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్.. వివిధ విభాగాల్లో డిప్యుటేషన్/షార్ట్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03
» **పోస్టుల వివరాలు:** ఫైనాన్స్ ఆఫీసర్–01, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్–01, యూనివర్శిటీ ఇంజనీర్–01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:**యూనివర్శిటీ ఇంజనీర్ పోస్టుకు 56ఏళ్లు, మిగిలిన పోస్టులకు 58ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.12.2022
» **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 06.01.2023
» **వెబ్‌సైట్:** uohyd.ac.in

ఎయిమ్స్, భోపాల్‌లో 125 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

భోపాల్(మధ్యప్రదేశ్)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. తాత్కాలిక ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 125
» **విభాగాలు:** అనాటమీ, అనెస్తీషియాలజీ, బయోకెమిస్ట్రీ,బర్న్స్–ప్లాస్టిక్ సర్జరీ,కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, కమ్యూనిటీ–ఫ్యామిలీ మెడిసిన్,డెర్మటాలజీ, ఎండోక్రైనాలజీ–మెటబాలిజం,ఈఎన్‌టీ, ఫోరెన్సిక్ మెడిసిన్–టాక్సికాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగాల్లో ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీ, ఎండీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** ఇంటర్వ్యూ తేదీ నాటికి 45 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.67,700 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.11.2022
» **వెబ్‌సైట్:** www.aiimsbhopal.edu.in

బీటెక్.. నాలుగేళ్ల ప్రణాళిక ఇలా

బీటెక్.. నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సు! బీటెక్ పట్టా చేతికందితే కార్పొరేట్ కెరీర్ ఖాయమనే అభిప్రాయం! అందుకే..ఎంట్రన్స్ టెస్ట్‌లో ర్యాంకు కోసం ఇంటర్‌లో చేరిన రోజునుంచే అహర్నిశలు కృషి చేస్తారు. లక్షల మందితో పోటీపడి నచ్చిన కోర్సులో చేరుతారు. ఇలా కాలేజీ క్యాంపస్‌లో అడుగు పెట్టిన విద్యార్థులు.. ఫైనలియర్ పూర్తయ్యే వరకు..అనుక్షణం అప్రమత్తంగా నిర్దిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలి. అప్పుడే కంపెనీలు కోరుకునే నైపుణ్యాలు సొంతమవుతాయి. లేటెస్ట్ స్కిల్స్ ఉంటేనే.. కార్పొరేట్ కొలువుల కల నిజమవుతుంది. ఈ నేపథ్యంలో.. ఇటీవల ఇంజనీరింగ్ కోర్సులో చేరిన విద్యార్థులకు ఉపయోగపడేలా.. నాలుగేళ్ల బీటెక్‌లో రాణించడమెలాగో తెలిపే కథనం...

» నాలుగేళ్లు పక్కా ప్రణాళికతోనే భద్రమైన కెరీర్
» లేటెస్ట్ టెక్ స్కిల్స్ బాటలో సాగితేనే ప్లేస్‌మెంట్స్‌లో సక్సెస్
» ఇంజనీరింగ్‌లో చేరిన విద్యార్థులకు నిపుణుల సలహా



బీటెక్‌లో ప్రవేశానికి నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్‌లో విజయం అనేది లక్ష్య సాధన దిశగా తొలి అడుగు మాత్రమే. ముఖ్యంగా ప్రస్తుత డిజిటల్ టెక్నాలజీ యుగంలో మెరుగైన ఇంజనీర్లుగా రూపొందాలంటే.. ఇంజనీరింగ్ కోర్సులో చేరిన మొదటి రోజు నుంచి నాలుగో ఏడాది పూర్తి చేసుకునే వరకూ.. పూర్తి అంకితభావంతో, పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగాలి అంటున్నారు నిపుణులు.

స్కిల్స్‌కు ప్రాధాన్యం

ఇంజనీరింగ్‌లో సీటు కోసం ఎంతో కష్టపడి చదివిన విద్యార్థులు.. కోర్సులో చేరాక కొంత రిలాక్స్ మూడ్‌లోకి వెళ్లిపోతారు. క్యాంపస్‌లో అడుగుపెట్టడంతోనే తమ స్వప్నం సాకారమైందనే భావనకు వస్తారు. ఇది ఎంత మాత్రం సరికాదు. నేటి పోటీ ప్రపంచంలో..ముఖ్యంగా ఇండస్ట్రీ 4.0 స్కిల్స్ ప్రాధాన్యం పెరుగుతున్న తరుణంలో.. బీటెక్‌లో చేరిన తొలిరోజు నుంచే విద్యార్థులు నిరంతరం తమను తాము తీర్చిదిద్దుకోవాలి. నైపుణ్యాలకు నగిషీలు దిద్దుకోవాలి. టెక్నాలజీ యుగంలో వస్తున్న మార్పులను పసిగట్టి, వాటిపై పట్టు సాధించాలి. అప్పుడే నాలుగేళ్ల తర్వాత సర్టిఫికెట్ చేతికందే సమయానికి జాబ్ మార్కెట్‌కు అవసరమైన స్కిల్స్ సొంతమవుతాయి.

కొత్త వాతావరణం

బీటెక్‌లో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులు కొత్త వాతావరణంలో త్వరగా ఇమిడిపోయే ప్రయత్నం చేయాలి. ప్రధానంగా వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల విద్యార్థులు ప్రవేశాలు పొందే ఐఐటీలు, ఎన్ఐటీల క్యాంపస్‌లలో ఒత్తిడి సమస్య ఎక్కువగా ఉంటుంది. అదే విధంగా రాష్ట్రాల స్థాయిలోని కళాశాలల్లోనూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కొత్త వాతావరణంలో ఒత్తిడికి గురవుతున్నారు. విద్యార్థులు ఇంటర్‌పర్సనల్, క్రాస్ కల్చరల్ స్కిల్స్ పెంచుకునే దిశగా అడుగులు వేయాలి. ఇలాంటి విద్యార్థుల కోసం కాలేజీల్లో ప్రత్యేకంగా కౌన్సెలింగ్ సెల్స్ నిర్వహిస్తున్నారు. ఈ సదుపాయం వినియోగించుకోవాలి.

అకడమిక్స్‌లో రాణింపు

అకడమిక్స్ విషయంలో విద్యార్థులు స్పష్టమైన అవగాహనతో అడుగులు వేయాలి. ఇంటర్ వరకు చదివిన విధానం వేరు. ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌లను అభ్యసించే పద్ధతి, బోధించే తీరు భిన్నం. అందువల్ల విద్యార్థులు ఆందోళన చెందకుండా తొలుత నాలుగేళ్ల సిలబస్‌పై ప్రాథమికంగా అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత మొదటి సంవత్సరం సబ్జెక్టులు, సిలబస్‌పై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టాలి. మొదటి సంవత్సరం సబ్జెక్ట్‌లు.. ఇంజనీరింగ్ కోర్సుకు పునాది వంటివి. వీటిపై పట్టు సాధిస్తేనే తర్వాత మూడేళ్ల అకడమిక్స్‌లో రాణించడం సులువవుతుంది.

ప్రాక్టికాలిటీ, అప్లికేషన్ అప్రోచ్

ఇంజనీరింగ్ విద్యార్థులు ఏ అంశాన్నైనా ప్రాక్టికల్ దృక్పథంతో, అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయడం అలవాటు చేసుకోవాలి. అందుకోసం కాలేజీ లేబొరేటరీల్లో ఆయా సబ్జెక్ట్ అంశాలకు సంబంధించి ప్రాక్టికల్స్ శ్రద్ధగా చేయాలి. కేవలం పుస్తకాలకే పరిమితమైతే పరీక్షల్లో ఎక్కువ మార్కులు స్కోర్ చేయొచ్చేమోకానీ.. రియల్ టైం నైపుణ్యాలు మాత్రం లభించవు. ప్రాక్టికల్ నాలెడ్జ్ లేకుంటే.. భవిష్యత్‌లో కెరీర్ అవకాశాల పరంగా ఇబ్బందులు ఎదురవడం ఖాయం. అవసరమైతే లెక్చరర్స్, ప్రొఫెసర్స్ సహాయం తీసుకోవడానికి కూడా వెనుకంజ వేయకూడదు. పలు ఇన్‌స్టిట్యూట్‌లు మెంటారింగ్ సెల్స్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నాయి. తరగతి గదిలో సందేహాలు నివృత్తి చేసుకోవడానికి బిడియపడే విద్యార్థులకు ఇవి ఎంతగానో ఉపయుక్తం.

రెండో ఏడాది నుంచి లోతైన అధ్యయనం

వాస్తవానికి పూర్తిస్థాయిలో ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌ల బోధన రెండో ఏడాది నుంచే మొదలవుతుంది. రెండో సంవత్సరం నుంచి సబ్జెక్టులను లోతుగా అన్ని కోణాల్లో అధ్యయనం చేయడం ప్రారంభించాలి. అందుకోసం మూక్స్, ఎన్‌పీటీఈఎల్ వంటి ఆన్‌లైన్ విధానాలతోపాటు ప్రొఫెసర్స్ రాసిన ప్రామాణిక పుస్తకాలను చదవాలి. ముఖ్యంగా ప్రతి అంశాన్ని వాస్తవ పరిస్థితులతో అనుసంధానిస్తూ అవగాహన చేసుకునే ప్రయత్నం చేయాలి. విద్యార్థులు తమ బ్రాంచ్‌కు సంబంధించిన సబ్జెక్ట్‌లు.. వాటికి అవసరమైన క్షేత్ర నైపుణ్యాలపైనా దృష్టి పెట్టాలి.

ఇంటర్న్‌షిప్స్ దిశగా

రెండో ఏడాది చివరి నుంచే ఇంటర్న్‌షిప్స్‌లో చేరేలా ప్రయత్నాలు సాగించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా రియల్ టైమ్ నైపుణ్యాలు సొంతం చేసుకోవాలంటే.. కనీసం రెండు లేదా మూడు ఇంటర్న్‌షిప్స్ చేయడం మేలు. ఏఐసీటీఈ నూతన కరిక్యులం కూడా ఈ మేరకు మార్గదర్శకాల్ని విడుదల చేసింది. కాబట్టి విద్యార్థులు సంబంధిత పరిశ్రమల్లో ఇంటర్న్ అవకాశాల కోసం అన్వేషించాలి. ఇందుకోసం క్యాంపస్‌లోని ఇండస్ట్రీ ఇంటరాక్షన్ సెల్‌తోపాటు, ఆయా సంస్థల్లో పనిచేస్తున్న సీనియర్ల సహకారం తీసుకోవాలి. ఇంటర్న్‌షిప్ పూర్తిచేయడం ద్వారా తాజా పరిస్థితులపై అవగాహన వస్తుంది. కంపెనీల అవసరాలకు తగ్గట్లు నైపుణ్యాలు మెరుగుపరచుకునే అవకాశం లభిస్తుంది.

భవిష్యత్తు లక్ష్యాల దిశగా

మూడో ఏడాది నుంచి తమ భవిష్యత్తు లక్ష్యాల సాధన దిశగా స్థిరంగా అడుగులు వేయాలి. క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ఆఫర్స్ సొంతం చేసుకోవాలనుకునే విద్యార్థులు.. అందుకు అనుగుణంగా ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న టెక్నాలజీలు, నైపుణ్యాలను అందిపుచ్చుకునే మార్గాలను అన్వేషించాలి. ఉన్నత విద్యకు వెళ్లాలనుకునే అభ్యర్థులు గేట్, క్యాట్ వంటి పరీక్షల ప్రిపరేషన్‌కు శ్రీకారం చుట్టాలి.

సర్టిఫికేషన్స్‌తో సమర్థవంతంగా

ప్రస్తుతం జాబ్ మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే.. ఇండస్ట్రీ 4.0 స్కిల్స్‌గా పేర్కొనే ఆటోమేషన్, మెషిన్ లెర్నింగ్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, రోబోటిక్స్, 3–డి డిజైన్ ప్రింటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ స్కిల్స్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. కంపెనీలు తమ కార్యకలాపాల నిర్వహణలో నిత్యం కొత్త టెక్నాలజీని ప్రవేశపెడుతున్నాయి. వీటిని కరిక్యులంలో భాగంగా అభ్యసించే వీలుండదు. ఇలాంటి లేటెస్ట్ టెక్నాలజీకి సంబంధించి సర్టిఫికేషన్ కోర్సులు చేయడం లాభిస్తుంది. విద్యార్థులు ఆయా సర్టిఫికేషన్ కోర్సులు పూర్తి చేయడం ద్వారా జాబ్ మార్కెట్‌లో ముందంజలో నిలిచే వీలుంటుంది.

మూక్స్‌తో లేటెస్ట్ టెక్నాలజీ

నేటి ఇంటర్నెట్ యుగంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు వరం మూక్స్(మాసివ్‌లీ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సెస్). అంతర్జాతీయంగా పలు ప్రముఖ యూనివర్సిటీలు ఆయా అంశాలకు సంబంధించి ప్రత్యేకంగా ఆన్‌లైన్ విధానంలో కోర్సులను అందిస్తున్నాయి.ఇంజనీరింగ్ విద్యార్థులు మూక్స్ ద్వారా తమ సబ్జెక్టులతోపాటు లేటెస్ట్ టెక్నాలజీపైనా అవగాహన పెంచుకోవచ్చు. మన దేశంలోనూ ఎన్‌పీటీఈఎల్ ద్వారా ప్రముఖ ప్రొఫెసర్స్ బోధించే పాఠాలను ఆన్‌లైన్‌లో వినే అవకాశముంది. వీటిల్లో విద్యార్థులకు ఉపయోగపడే వర్చువల్ ల్యాబ్స్ సౌకర్యం సైతం లభిస్తుంది. ఫలితంగా విద్యార్థులు తాజా పరిశోధనలు, టెక్నాలజీ, పరిణామాలు, ప్రాక్టికల్ అంశాలపై అవగాహన పెంచుకోవచ్చు.

సొంతంగా ప్రాజెక్ట్ వర్క్

మొత్తం ఇంజనీరింగ్ కోర్సులో అత్యంత కీలకమైనది.. ప్రాజెక్ట్ వర్క్. దీన్ని నాలుగో ఏడాదిలో చేయాల్సి ఉంటుంది. విద్యార్థులు రియల్ టైమ్ ప్రాజెక్ట్ వర్క్ చేసేందుకే ప్రాధాన్యం ఇవ్వాలి. సొంతంగా ప్రాజెక్టు వర్క్ పూర్తిచేస్తే..సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు ప్రాక్టికల్ నైపుణ్యాలు అలవడతాయి.సదరు ప్రాజెక్ట్ వర్క్ రియల్ టైమ్ అవునా?కాదా?అని ప్లేస్‌మెంట్ ప్రతినిధులు ఇట్టే పసిగట్టేస్తారని గుర్తించాలి.

వ్యక్తిత్వ వికాసం

ఇంజనీరింగ్ విద్యార్థులు పెంపొందించుకోవాల్సిన మరో లక్షణం.. వ్యక్తిత్వ వికాసం(పర్సనాలిటీ డెవలప్‌మెంట్). కంపెనీలు తమ నియామకాల సమయంలో అభ్యర్థి వ్యక్తిత్వాన్ని కూడా పరిశీలిస్తున్నాయి. కాబట్టి విద్యార్థులు కాలేజీలో ఉన్నప్పుడే వ్యక్తిత్వ లక్షణాలు సైతం మెరుగుపరచుకోవాలి. ముఖ్యంగా కమ్యూనికేషన్, లాంగ్వేజ్ స్కిల్స్, టీమ్ వర్కింగ్ వంటి నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. ఇందుకోసం కాలేజ్‌లో నిర్వహించే సెమినార్లకు హాజరవడం, తోటి విద్యార్థులతో గ్రూప్ డిస్కషన్స్ వంటి వాటిలో పాల్గొనాలి. అదే విధంగా కాలేజ్‌లో నిర్వహించే కల్చరల్ యాక్టివిటీస్‌లోనూ భాగస్వాములయ్యే విధంగా వ్యవహరించాలి. ఫలితంగా ఇంటర్ పర్సనల్ స్కిల్స్ మెరుగవుతాయి.

సెల్ఫ్ లెర్నింగ్‌తో ఎక్సలెన్స్

బీటెక్ విద్యార్థులు మొదటి నుంచి సెల్ఫ్ లెర్నింగ్ అలవాటు చేసుకోవాలి. దీనికోసం ఇన్‌స్టిట్యూట్‌లో ఉన్న అన్నిరకాల వనరులను ఉపయోగించుకోవాలి. లైబ్రరీ, డిజిటల్ లైబ్రరీలను వినియోగించుకోవాలి. తద్వారా తమ కోర్ సబ్జెక్ట్‌లకు సంబంధించి తాజా పరిణామాలపై అవగాహన పొందాలి. అదే విధంగా రియల్ టైమ్ ప్రాబ్లమ్స్, వాటికి ఆ రంగంలోని నిపుణులు కనుగొన్న పరిష్కారాలను అధ్యయనం చేయడం ద్వారా మరింత అవగాహన లభిస్తుంది. ఇలాంటి రియల్ టైమ్ సొల్యూషన్స్ కోసం రీసెర్చ్ జర్నల్స్, రీసెర్చ్ పేపర్స్‌ను చదవడం అలవర్చుకోవాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	21	62,294
నిఫ్టీ ▲	29	18,513

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	11,226	▽	59
డోజోన్స్	34,347	▲	153
ఎఫ్‌టీఎస్ఈ 100	7,487	▲	20
డాక్స్	14,541	▲	2
షాంఘై	3,102	▲	12
నికాయ్	28,283	▽	100

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

అనుభవమా.. రాబడా.. ఏది కావాలి?






- పెట్టుబడికి ముందు తగినంత అధ్యయనం చేయాలి
- ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో స్పెక్యులేషన్ వద్దు
- మార్పునకు సిద్ధంగా ఉండాల్సిందే
- కొని, మరిచిపోయే కంపెనీలు ఉండవు
- మార్కెట్ కంటే కంపెనీ ఫండమెంటల్స్ ముఖ్యం
- తప్పుల నుంచి నేర్చుకుంటేనే లాభాలు

పెట్టుబడులకు కొన్ని విధానాలు అంటూ ఉంటాయి. ఆచరణీయ సూత్రాలు ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లలో సంపదను సృష్టించుకున్న ప్రతీ ఇన్వెస్టర్ విజయం వెనుక కచ్చితంగా వీటి పాత్ర ఉంటుంది. అనుభవం మీద కానీ, వీటి గురించి ఇన్వెస్టర్లకు తెలియదు. 'డబ్బులతో మార్కెట్లోకి అడుగుపెడితే అనుభవం మిగులుతుంది. అనుభవంతో మార్కెట్లోకి ప్రవేశిస్తే సంపద సృష్టి జరుగుతుంది' అని చెబుతుంటారు. అందుకని మార్కెట్ పండితులు అనుసరించిన విధానాలను ముందే తెలుసుకుంటే, విలువైన సమయం ఆదా చేసుకోవడంతోపాటు, కాంపౌండింగ్ ప్రయోజనాన్ని మూటగట్టుకోవచ్చు. అమెరికాకు చెందిన సర్ జాన్ టెంపుల్‌టన్ ప్రపంచంలోని దిగ్గజ ఇన్వెస్టర్లలో ఒకరు. 38 ఏళ్ల పాటు ఏటా తన పెట్టుబడులపై 15 శాతం చొప్పున కాంపౌండింగ్ రాబడులను ఆయన సంపాదించగలిగారు. ఆయన అనుసరించిన సూత్రాలను, అనుభవ పాఠాలను ఈ ప్రాఫిట్ ప్లస్ కథనంలో తెలుసుకుందాం.

పెట్టుబడుల నిర్ణయాలు తీసుకునే ముందు ద్రవ్యోల్బణం, పన్నులను పరిగణనలోకి తీసుకోవాలి. ఎవరికి వారు తమకు అనుకూలమైన పెట్టుబడుల విధానాన్ని అనుసరించాలి. పెట్టుబడుల తర్వాత ప్రశాంతత కోల్పోయేలా ఉండకూడదు. వాస్తవ రాబడులు అంటే ఇక్కడ.. వచ్చిన రాబడి నుంచి పన్నులు చెల్లించగా మిగిలే మొత్తం. అలాగే, ద్రవ్యోల్బణాన్ని సైతం రాబడి నుంచి మినహాయించి చూడాలి. పన్నులు, ద్రవ్యోల్బణం ప్రభావం పట్టించుకోని ఏ పెట్టుబడి అయినా వైకల్యంతో సమనమేనని టెంపుల్‌టన్ అంటారు.



స్పెక్యులేషన్ వద్దు..

ఈక్విటీ మార్కెట్లో స్పెక్యులేషన్ (అంచనాల ఆధారంగా చేసే ట్రేడింగ్) అన్నది వేగంగా నష్టపోయే మార్గం. స్టాక్ మార్కెట్ క్యాసినో కాదు. తరచూ స్టాక్స్ కొని విక్రయిస్తుండడం, ఆప్షన్లను షార్ట్ సెల్ చేస్తుండడం, ఫ్యూచర్ కాంట్రాక్టుల్లో ట్రేడ్ చేయడం ఇదంతా క్యాసినోనే అని టెంపుల్‌టన్ అంటారు. ఇక్కడ అంతిమంగా ఇన్వెస్టర్ సంపాదించేదేమీ ఉండదన్నది ఆయన నమ్మే సిద్ధాంతం. మార్కెట్ పెరుగుతుందని, తగ్గుతుందని అంచనాల ఆధారంగా చేసే ట్రేడ్లు ఎప్పుడూ సక్సెస్ కావాలని లేదు. వీటిల్లో పెట్టుబడి నష్టానికి అదనంగా.. కమీషన్లు, చార్జీల రూపంలోనూ నష్టపోవాల్సి వస్తుంది.

•••

వాల్‌స్ట్రీట్ లెంజెడరీ ఇన్వెస్టర్ లూసీన్ హూపర్ నిర్వచనం ప్రకారం.. స్టాక్స్‌కు దీర్ఘకాల యజమానులుగా ఎంత ప్రశాతంగా ఉంటామన్నదే ముఖ్యం. ఇన్వెస్టర్ ఎంత ప్రశాంతంగా ఉంటే కనీస విలువల గురించి మరింతగా అర్థం చేసుకోగలడు. సహనంతో, భావోద్వేగాలకు లోను కాకుండా ఉండగలడు. తక్కువ మూలధన లాభాల పన్ను చెల్లిస్తాడు. అనవసర బ్రోకరేజీ కమీషన్లు చెల్లించే పని ఉండదు. జూదగాళ్ల మాదిరిగా ఆలోచించడు.

మార్పునకు సిద్ధం..


ప్రతి పెట్టుబడుల విధానంలోనూ అనుకూల, ప్రతికూలతలు ఉంటాయి. తనకు అనుకూలమైన విధానాన్ని అనుసరిస్తూ, అవసరమైతే అందులో మార్పులు చేసుకునేందుకు సానుకూల దృక్పథంతో కొనసాగాలి. బ్లూచిప్ స్టాక్స్, సైక్లికల్ స్టాక్స్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్, కార్పొరేట్ బాండ్స్.. ఇలా ఒక్కో విభాగంలో పెట్టుబడులకు అనుకూల, ప్రతికూల సందర్భాలు ఉంటాయి. అంతేకాదు, అవసరమైతే నగదు రూపంలోనే కొనసాగాల్సిన పరిస్థితులు కూడా ఎదురవుతుంటాయి. ఎందుకంటే నగదు ఉంచుకోవడం వల్ల మంచి అవకాశాలను సొంతం చేసుకోగలరు. అందుకే ఏదో ఒక్క పెట్టుబడి విధానం అన్నది అత్యుత్తమం అని చెప్పలేం. కొన్ని సందర్భాల్లో కొన్ని విభాగాలకు ఎంతో ఆదరణ లభిస్తుంది. అది తాత్కాలికం కావచ్చు. అటువంటప్పుడు లాభాలు దీర్ఘకాలం పాటు కొనసాగలేవు. అందుకని మార్పునకు సదా సిద్ధంగా ఉండాలి. మార్కెట్ పెట్టుబడి సూత్రాలకూ ఇది వర్తిస్తుంది. కాలంతోపాటు ఈ విధానాల్లోనూ మార్పులు రావచ్చు. స్మార్ట్ ఇన్వెస్టర్ అయితే దీన్ని గుర్తిస్తాడు.

కనిష్ట స్థాయి

కనిష్ట స్థాయిల్లో కొనుగోలు చేసి, గరిష్ట స్థాయిల్లో విక్రయించడమన్నది వినడానికి చాలా సులభంగా అనిపిస్తుంది. కానీ, ఆచరణ అంత ఈజీ కాదు. సాధారణంగా స్టాక్స్ ధరలు పెరుగుతున్నప్పుడే ఎక్కువ మంది ఇన్వెస్టర్లు ఆకర్షితులై, ఇంకా పెరుగుతుందన్న అంచనాతో కొనుగోలుకు ముందుకు వస్తుంటారు. షేరు ధర పడిపోతుంటే, ధైర్యం చేసి పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రారు. ఎందుకంటే తాము ఇన్వెస్ట్ చేసిన తర్వాత, అది మరింత పడిపోతుందేమో, ఇక ఎప్పటికీ పెరగదేమో? అన్న భయం వారిని వెనక్కి లాగుతుంటుంది. నిజానికి అమ్మకాల ఒత్తిడి ఉందంటే నిరాశావాదం పెరిగినట్టు. కొనుగోళ్లకు అదే సరైన సమయం. అంతేకానీ, మార్కెట్లు ఇంకా పడిపోతాయని, ఆ తర్వాతే కొనుగోలు చేద్దామని అనుకోవద్దు. నిరాశావాదం ఎక్కువగా ఉన్నప్పుడే స్టాక్స్ ఎక్కువ నష్టాలు చూస్తాయి. దాన్నే తెలివైన ఇన్వెస్టర్ అనుకూలంగా మలుచుకోవాలి. కానీ, ఎక్కువ మంది దీనికి విరుద్ధంగా అధిక స్థాయిల్లో కొనుగోలు చేసి, తక్కువ ధరల వద్ద విక్రయిస్తుంటారు. మార్కెట్లలో ఆశావాదం పెరిగినప్పుడు విక్రయించి, నిరాశావాదం ఎక్కువగా ఉన్నప్పుడు కొనుగోలు చేయాలని విఖ్యాత ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ సైతం చెబుతుంటారు.

నాణ్యమైన స్టాక్స్

ఒక కంపెనీ వ్యాపారం ఎంత నాణ్యమైనది అనేది రాబడులకు కీలకం అవుతుంది. నాణ్యమైన వ్యాపారమే ఎక్కువ అమ్మకాలను నమోదు చేయగలదు. కస్టమర్ విశ్వాసాన్ని గెలుచుకుంటుంది. ఆయా రంగంలో టెక్నాలజీ పరంగా కంపెనీ బలమైన స్థానంలో ఉండాలి. బలమైన యాజమాన్యం, వ్యాపారాన్ని మెరుగ్గా నిర్వహించిన ట్రాక్ రికార్డ్ ఉండాలి. కంపెనీ వద్ద నిధుల సమస్య ఉండకూడదు. ఒక కంపెనీ తక్కువ ధరకే ఉత్పత్తి చేసినంత మాత్రాన నాణ్యమైనదిగా భావించడం సరికాదు. కానీ, టెక్నాలజీ పరంగా ఆధునికమైన, పటిష్టమైన కంపెనీ అయితే.. మరో కంపెనీ వచ్చి ఆ వ్యాపారాన్ని దెబ్బతీయడం అంత తేలిక కాదు.



మార్కెట్ కాదు.. కంపెనీ ముఖ్యం

విడిగా కంపెనీలను, వాటి వ్యాపార బలాలను చూడాలే కానీ, మార్కెట్ గమనాన్ని కాదు. ఎలాంటి స్టాక్ అయినా బుల్ మార్కెట్లలో పరుగులు పెట్టగలదు. కానీ, బేర్ మార్కెట్లో పెరిగే స్టాక్స్ కూడా ఉంటాయి. బుల్ మార్కెట్లో పతనాన్ని చూసేవీ ఉంటాయి. మార్కెట్లు అనేవి ఎన్నో పరిణామాల ఆధారంగా చలిస్తుంటాయి. కానీ, ఇన్వెస్టర్ పెట్టుబడులకు నాణ్యమైన కంపెనీలు, బలమైన వ్యాపారాలు, పటిష్టమైన యాజమాన్యాలనే సూత్రాలను అనుసరించాలి. మార్కెట్ గమనాన్ని కాదు.

వైవిధ్యం..

పెట్టుబడులు అన్నింటిని తీసుకెళ్లి ఒకే చోట పెట్టేయరాదు. భవిష్యత్తును ఎవరూ అంచనా వేయలేరు. ఎవరూ నియంత్రించలేరు. అందుకని పెట్టుబడుల పరంగా వైవిధ్యం అవసరం. సరఫరా దారు వైపు సమ్మె ఏర్పడవచ్చు. తుఫాను లేదా భూకంపం.., పోటీ కంపెనీ అసాధారణ స్థాయిలో టెక్నాలజీ పరంగా పై చేయి సాధించొచ్చు. లేదంటే ఓ ఉత్పత్తిని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వం ఆదేశించొచ్చు. ఇలాంటి పరిణామాలు కంపెనీలకు పెద్ద ఎత్తున నష్టాన్ని తీసుకొస్తాయి. అలాంటి పరిస్థితుల్లో మెరుగ్గా నడుస్తున్న కంపెనీ సైతం సమస్యల్లోకి కూరుకుపోయే ప్రమాదం ఉంటుంది. అందుకని వివిధ రంగాల మధ్య పెట్టుబడులను వైవిధ్యం చేసుకోవాలి. ఆ తర్వాత అంతర్జాతీయం మార్కెట్లలోనూ గొప్ప పెట్టుబడుల అవకాశాలు కనిపిస్తాయి. వాటిని సైతం పరిశీలించొచ్చు.

తగినంత కసరత్తు

పెట్టుబడులు పెట్టే ముందు తగినంత పరిశోధన అవసరం. విజయవంతమైన కంపెనీలకు సాయపడిన అంశాలు ఏంటన్నవి తెలుసుకోవాలి. కంపెనీల ఎర్నింగ్స్ (లాభాలు), ఆస్తులన్నవి స్టాక్ ధరలను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కంపెనీ ఎర్నింగ్స్ భవిష్యత్తులో మరింత పెరుగుతాయనే అంచనాలతో ఎక్కువ మంది ఇన్వెస్ట్ చేస్తుంటారు. స్టాక్ ధరలు కూడా భవిష్యత్తు లాభాల అంచనాలకు తగ్గట్టే చలిస్తుంటాయి. కనుక, భవిష్యత్తులో ఇవి తారుమారు అయితే? స్టాక్స్ ధరలు కూడా పతనమవుతాయి. ఈ రిస్కును ముందే దృష్టిలో పెట్టుకుని అధ్యయనం తర్వాతే అడుగులు వేయాలి.



కొని, మర్చిపోవద్దు..

బేర్ మార్కెట్ శాశ్వతం కాదు. అలా అని బుల్ మార్కెట్ శాశ్వతం కాదు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కొన్ని సందర్భాల్లో స్పందించాల్సి వస్తుంది. కొనుగోలు చేసి, మర్చిపోయే స్టాక్స్ అన్నవి చాలా అరుదు. ఏ కంపెనీ అయినా కానీ వెలుపలి పరిణామాలకు ప్రభావితం అవుతుంటుంది. అందుకని పెట్టుబడులను ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ, అవసరమైతే మార్పులకు వెనుకాడొద్దు.

భయపడిపోవద్దు..

అందరూ ఆశావాదంతో ఎగబడి కొంటున్న వేళ విక్రయించాలని చెప్పుకున్నాం. కానీ, ఆ సమయంలో అమ్ముకోకపోయి ఉండొచ్చు. ఆ తర్వాత మార్కెట్లు పడిపోవచ్చు. 2008, 2020లో మన స్టాక్ మార్కెట్ పతనాలు గుర్తున్నాయి కదా. ఒక్కో స్టాక్ ఒక రోజులో 20% వరకు నష్టపోయింది. ఆ సమయంలో భయపడిపోయి వచ్చినంత చాలనే ధోరణితో అమ్ముకోవడం సరికాదు. పతనానికి ముందే విక్రయించాలి. అది చేయలేకపోతే, ఒకసారి పోర్ట్‌ఫోలియోలోని స్టాక్స్‌ను అధ్యయనం చేయాలి. ఏ అంశాల ఆధారంగా వాటిని కొనుగోలు చేశారో, వాటిల్లో మార్పు రానంత వరకు మార్కెట్ పడిపోతుందని విక్రయించాల్సిన పనిలేదు. వేరే స్టాక్స్ ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయని, ఉన్నవి అమ్మేసుకుని వాటిని కొనుగోలు చేసుకోవడం కూడా సరికాదు.



తప్పులే పాఠాలు

పెట్టుబడుల పరంగా తప్పులు చేస్తున్నామని, అసలు ఇన్వెస్ట్ చేయకపోవడం అన్నది మరింత పెద్ద తప్పిదం అవుతుంది. తప్పులను చూసి నిరుత్సాహపడాల్సిన అవసరం లేనే లేదు. నష్టపోయిన మొత్తాన్ని తిరిగి సంపాదించాలనే ధోరణితో మరింత రిస్క్ తీసుకోవద్దు. ప్రతి తప్పు నుంచి అనుభవాన్ని పొందే ప్రయత్నం చేయాలి. ముందు చేసిన పెట్టుబడుల్లో నష్టాలకు దారితీసిన అంశాల గురించి తెలుసుకోవాలి. వాటిని తదుపరి పెట్టుబడుల్లో మళ్లీ చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అసలు కారణాలకు బదులు, నష్టానికి వేరే వాటిని ఆపాదించుకుంటే, మళ్లీ అదే నష్టమే ఎదురవుతుంది. పెట్టుబడుల్లో విజేతలు, పరాజితుల మధ్య తేడా.. తప్పుల నుంచి పాఠాలను తెలుసుకోవడమే.

మార్కెట్‌ను మించి రాబడులు..

మార్కెట్ కంటే మెరుగ్గా పెట్టుబడులపై రాబడులు రావాలంటే అందుకు మిగిలిన వారితో పోలిస్తే భిన్నంగా వ్యవహరించాల్సిందే. ఇందుకు మంచి మార్గదర్శకుడిని ఎంపిక చేసుకోవాలి. తగిన పెట్టుబడుల విధానాన్ని రూపొందించుకోవాలి. నిపుణులైన ఫండ్ మేనేజర్ల కంటే మెరుగైన పెట్టుబడుల నిర్ణయాలతోనే, గొప్ప ఫలితాలు సాధించడం సాధ్యపడుతుంది. ఏ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ అయినా మార్కెట్ కంటే అన్ని సమయాల్లోనూ మెరుగైన ఫలితాలను చూపిస్తుందంటే, అది ఇన్వెస్టర్ కంటే గొప్పగా పనిచేస్తున్నట్టే. కనుక అవసరమైతే అలాంటి సంస్థల సాయాన్ని తీసుకునేందుకు వెనుకాడొద్దు.

గుడ్డి విధానం వద్దు

మీకు మొదటిసారి ఉద్యోగం ఇచ్చిన కంపెనీ షేరు, లేదంటే మీరు కొనుగోలు చేసిన మొదటి కారు కంపెనీపై అభిమానంతో షేరులో పెట్టుబడులు పెట్టడం సరైనది అనిపించుకోదు. మీరు ఆ ఉత్పత్తిని కొనుగోలు చేసినంత మాత్రాన అది పెట్టుబడులకు మంచి కంపెనీ అవ్వాలని లేదు. ఆ షేరు అందుబాటు ధరలోనూ లేకపోవచ్చు. ఇక క్రేజీ ఉన్న ఐపీవోల్లో ఇన్వెస్ట్ చేయడం కూడా సరికాదు. ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటున్నారని, లిస్టింగ్ రోజు లాభానికి విక్రయిద్దామని ఐపీవోలో దరఖాస్తు చేసుకోవడం అన్నది పెట్టుబడి కాదు, స్పెక్యులేషన్ అవుతుంది. కంపెనీకి మంచి భవిష్యత్తు ఉండి, దీర్ఘకాలం పాటు కంపెనీతో కొనసాగుతానని అనుకున్నప్పుడే ఐపీవోకు దరఖాస్తు చేసుకోవాలి. ఒకరి సలహాపై ఆధారపడి ఇన్వెస్ట్ చేయడం కూడా సరికాదు. ఎందుకంటే చెప్పిన వారి అనుభవం, పరిశీలన, అధ్యయనం మీకు సాయానికి రావు. సొంత అధ్యయనం తర్వాత, తమ పెట్టుబడుల సూత్రాలకు అనుకూలంగా ఉంటేనే ముందుకు వెళ్లాలి.

ప్రతికూల ధోరణి విడిచి పెట్టాలి

రిస్క్ భయంతో తరచూ ప్రతికూల ధోరణితో మార్కెట్‌ను చూడడం సరికాదు. పెట్టుబడికి ఎంపిక చేసుకునే ముందే ప్రతికూల కోణంలోనూ పరిశోధన చేయడం మంచి చర్య అవుతుంది. ఒక్కసారి అన్ని అంశాల్లో స్పష్టత వచ్చి, పెట్టుబడి పెట్టిన తర్వాత.. రంధ్రాన్వేషణ ఫలితమివ్వదు. అప్పుడు చిన్న అంశాలు సైతం పెద్దవిగా అనిపిస్తాయి. ప్రతీ పెట్టుబడి రాబడులనే ఇస్తుందన్న గ్యారంటీ కూడా లేదు. వాస్తవికంగా, సానుకూల ధోరణితో వ్యవహరించడం ద్వారానే దీర్ఘకాలంలో ఈక్విటీల్లో సంపదను సృష్టించుకోగలరు.

స్టాక్స్ వ్యూ

కోఫోర్జ్ లిమిటెడ్ | చాయిస్ ఈక్విటీ బ్రోకింగ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 3,934 టార్గెట్: రూ. 4,925



ఎందుకంటే: ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) రెండో త్రైమాసికంలో ఐటీ సేవల కంపెనీ కోఫోర్జ్ అంచనాలకు తగిన పనితీరు చూపింది. స్థిర కరెన్సీ ప్రాతిపదికన ఆదాయం జులై–సెప్టెంబర్(క్యూ2)లో 24.69 కోట్ల డాలర్లను తాకింది. వార్షికంగా 22 శాతం, త్రైమాసికవారీగా 6.2 శాతం వృద్ధి ఇది. వెరసి 24 శాతం(7.1 శాతం) అధికంగా రూ. 1,959 కోట్లకుపైగా టర్నోవర్ సాధించింది. నిర్వహణ మార్జిన్లు 1.9 శాతం బలపడి 14.4 శాతానికి చేరాయి. ఇందుకు ప్రధానంగా విదేశీ(ఆఫ్‌షోర్) ఆదాయం సహకరించింది. 30.4 కోట్ల డాలర్ల విలువైన కాంట్రాక్టులను సాధించింది. వీటిలో 3 కోట్ల డాలర్లకుపైగా విలువైన(టీసీవీ) రెండు ఆర్డర్లపై సంతకాలు చేసింది! రానున్న 12 నెలల్లో పూర్తి చేయవలసిన(లాక్డ్ ఇన్) ఆర్డర్ల విలువ 80.2 కోట్ల డాలర్లను తాకింది. గత త్రైమాసికంలో ఇది 74.6 కోట్ల డాలర్లుగా నమోదైంది. దీంతో మధ్యకాలానికి కంపెనీ ఆదాయ సముపార్జనపై హామీ లభిస్తోంది. క్యూ2లో కొత్తగా 11 సంస్థలను క్లయింట్లుగా పొందింది. 94 శాతం రిపీట్ బిజినెస్‌ను సాధించడం ప్రస్తావించదగ్గ అంశం! అంటే నాణ్యమైన సేవలందించడం ద్వారా పాత క్లయింట్ల ద్వారానే కొత్త బిజినెస్‌ను సాధిస్తోంది. కంపెనీకి పట్టున్న ఫైనాన్షియల్ సర్వీసులు, ట్రావెల్ ఇండస్ట్రీల నుంచే గ్లోబల్ టర్నోవర్‌లో 75 శాతాన్ని అందుకుంటోంది. స్థూలఆర్థిక పరిస్థితులు అనిశ్చితంగా ఉన్నప్పటికీ బిజినెస్‌ను సాధించడంలో సామర్థ్యం చూపుతోంది.

ధనుకా అగ్రిటెక్ | సెంట్రమ్ బ్రోకింగ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 702 టార్గెట్: రూ. 942



ఎందుకంటే: ఈ ఏడాది(2022–23) రెండో త్రైమాసికంలో ధనుకా అగ్రిటెక్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో వార్షికంగా ఆదాయం 24 శాతం, అమ్మకాల పరిమాణం 16 శాతం, నికర లాభం 15 శాతం చొప్పున ఎగశాయి. కంపెనీ పనితీరును ప్రభావితం చేసిన అంశాలలో అధిక ధరలు, రుతుపవనాల ఆలస్యం తదితరాలున్నాయి. అయితే నిల్వల వ్యయాలు పెరగడంతో స్థూల మార్జిన్లు 2.9 శాతం క్షీణించి 34 శాతానికి పరిమితమయ్యాయి. రూపాయి పతనంతో దిగుమతుల భారం పెరిగింది. వీటికితోడు సంస్థాగత(బల్క్) అమ్మకాలే అధికంగా నమోదయ్యాయి. ఇబిటా మార్జిన్లు 0.7 శాతం నీరసించి 18 శాతానికి చేరాయి. నిర్వహణ లాభం 19 శాతం ఎగసి రూ. 97.5 కోట్లను తాకింది. దహేజ్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ప్లాంటు చివరి దశకు చేరింది. 2023 మార్చిలో ప్రారంభమయ్యే వీలుంది. ప్రస్తుతం కంపెనీ రూపొందిస్తున్న ఫార్ములేషన్ ప్రొడక్టులపై విదేశాల నుంచి ఆసక్తి వ్యక్తమవుతోంది. వెరసి దహేజ్ ప్లాంటు కార్యకలాపాలు ప్రారంభమైతే కంపెనీకి అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఫలితంగా ఎగుమతుల డిమాండుతో అమ్మకాలు ఊపందుకోనున్నాయి. దీంతో రుతుపవనాలపై ఆధారపడుతున్న దేశీ బిజినెస్‌కు జతగా.. ఎగుమతుల విభాగం కంపెనీకి అండగా నిలిచే వీలుంది. ముడివ్యయాలు సాధారణ స్థితికి చేరడం, ప్రొడక్టు పోర్ట్‌ఫోలియో బలపడనుండటంతో క్యూ4 నుంచి మార్జిన్లకు బూస్ట్ లభించనుంది.

గమనిక: షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే..

మహీంద్రా మాన్యులైఫ్ స్మాల్ క్యాప్ ఫండ్

ప్రధానంగా స్మాల్ క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసేలా మహీంద్రా మాన్యులైఫ్ ఫండ్ తాజాగా స్మాల్ క్యాప్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది డిసెంబర్ 5తో ముగుస్తుంది. ఈ ఫండ్‌ద్వారా సేకరించిన నిధుల్లో కనీసం 65 శాతం మొత్తాన్ని స్మాల్ క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తారు. రాబోయే దశాబ్ద కాలంలో భారత్.. ప్రపంచంలోనే దిగ్గజ ఎకానమీగా ఎదగనుందని సంస్థ ఎండీ, సీఈవో ఆంథోనీ హెరిడియా తెలిపారు. దీనితో వివిధ రంగాలు, వ్యాపార సంస్థలకు అసాధారణ స్థాయిలో అవకాశాలు రానున్నాయని చెప్పారు. దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు ఈ ప్రయోజనాలను అందిపుచ్చుకోవడానికి స్మాల్ క్యాప్ ఫండ్ తోడ్పడగలదని వివరించారు. తమ విభాగాల్లో మార్కెట్ లీడర్లుగా ఎదిగే సత్తా గల చిన్న కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసే స్మాల్ క్యాప్ మ్యుచువల్ ఫండ్‌లు దీర్ఘకాలంలో అధిక రాబడులు అందించగలవని సీఆర్‌వీజీ ఇన్వెస్ట్‌మెంట్ సర్వీసెస్ ఎండీ పి. రాజి రెడ్డి తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-11-2022	
విశాఖ	540–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	539–00
విజయవాడ	539–00
రిటైల్ ధర (డజను)	78.00
27-11-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	541–00
వరంగల్	544–00
రిటైల్ ధర	6.00

ఐడీబీఐ ప్రైవేటీకరణపై స్పష్టత

- పబ్లిక్ వాటాగా మిగిలిన 15 శాతం
- 5.28 శాతం వాటాకే ఓపెన్ ఆఫర్
- తాజాగా వెల్లడించిన ఆర్థిక శాఖ



న్యూఢిల్లీ: బీమా దిగ్గజం ఎల్‌ఐసీ, ప్రభుత్వ వాటాల విక్రయం తదుపరి ఐడీబీఐ బ్యాంకు దేశీ ప్రయివేట్ రంగ సంస్థగా కొనసాగనున్నట్లు ఆర్థిక శాఖ తాజాగా స్పష్టతనిచ్చింది. వ్యూహాత్మక విక్రయం తదుపరి మిగిలిన 15% ప్రభుత్వ వాటాను పబ్లిక్ షేర్ హోల్డింగ్‌గా పరిగణించనున్నట్లు తెలియజేసింది. పబ్లిక్‌కు కనీస వాటా(ఎంపీఎస్) విషయంలో బ్యాంకు కొత్త యాజమాన్యానికి అధిక గడువును అనుమతించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. అంతేకాకుండా బ్యాంకును గెలుపొందిన బిడ్డర్ అనుబంధ సంస్థల పునర్వ్యవస్థీకరణను చేపట్టడంలో ఎలాంటి ఆంక్షలు ఉండబోవని స్పష్టం చేసింది. బ్యాంకు కొనుగోలులో భాగంగా ముందస్తు ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) సందేహాలకు సమాధానమిచ్చే ప్రక్రియకింద ఆర్థిక శాఖ నిర్వహణలోని దీపమ్ ఈ అంశాలపై వివరణ ఇచ్చింది. ఐడీబీఐ బ్యాంకు విక్రయానికి ప్రభుత్వం అక్టోబర్ 7న బిడ్స్‌కు ఆహ్వానం పలికింది. డిసెంబర్ 16కల్లా కొనుగోలుదారులు ఈవోఐలను దాఖలు చేయవలసి ఉంటుంది.

సంయుక్తంగా విక్రయం

ఐడీబీఐ బ్యాంకులో 60.72 శాతం వాటాను ప్రభుత్వం, ఎల్‌ఐసీ సంయుక్తంగా విక్రయించనున్నాయి. ప్రస్తుతం ఈ రెండింటికీ ఐడీబీఐ బ్యాంకులో 94.72 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఎల్‌ఐసీకి 49.24 శాతం, ప్రభుత్వానికి 45.48 శాతం చొప్పున వాటా ఉంది. పబ్లిక్ వాటా 5.2 శాతంగా నమోదైంది. దీంతో కొనుగోలుదారుడు 5.28 శాతం వాటా కోసం ఓపెన్ ఆఫర్‌ను ప్రకటించవలసి వస్తుంది. విక్రయంలో భాగంగా ఎల్‌ఐసీ 30.24 శాతం, ప్రభుత్వం 30.48 శాతం చొప్పున వాటాలు ఆఫర్ చేయనున్నాయి. విక్రయానంతరం ప్రభుత్వం 15%, ఎల్‌ఐసీ 19% చొప్పున వాటాలను కలిగి ఉంటాయి.

విలువైన స్టాక్స్ గుర్తించడం ఎలా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



గ్రాట్యుటీతో గృహ రుణం తీర్చేయడం సరైనదేనా? నాకు గృహ రుణం ఉంది. మరో 5 ఏళ్లకు ఇది పూర్తవుతుంది. గ్రాట్యుటీ రూపంలో పెద్ద మొత్తంలో రానుంది. ఈ గ్రాట్యుటీతో గృహ రుణాన్ని తీర్చివేయాలా లేక ఎక్కడైనా ఇన్వెస్ట్ చేసుకోవాలా? –క్రిష్

రుణాలలో గృహరుణం ఒక్క దానిని కొనసాగించుకోవచ్చు. అధిక వడ్డీ రేటు ఉండే ఇతర రుణాలకు దూరంగా ఉండాలి. ఒకవేళ ఇతర రుణాలు తీసుకుని ఉంటే, అప్పుడు వాటిని ముందుగా తీర్చేయడాన్ని పరిశీలించొచ్చు. గృహ రుణం కొనసాగించడం వల్ల నష్టం లేదనడానికి పలు కారణాలు ఉన్నాయి. ఒకటి అద్దె రూపంలో కొంత ఆదా చేస్తుంటారు. రుణంపై వడ్డీ చెల్లింపులకు పన్ను ప్రయోజనం ఉంది. పైగా చాలా తక్కువ రేటుకు వచ్చే రుణం ఇది. గృహ రుణం రేటుతో పోలిస్తే పెట్టుబడులపై దీర్ఘకాలంలో అధిక రాబడి వస్తుంది. కనుక గృహ రుణం లాభదాయకమే. భవిష్యత్తులో వచ్చే ఆదాయం గురించి ఆందోళన చెందుతుంటే లేదా గృహ రుణం చెల్లించడం ద్వారా ప్రశాంతంగా ఉంటానని అనుకుంటే గ్రాట్యుటీ ద్వారా వచ్చే మొత్తంతో ఆ పనిచేయవచ్చు. అలా కాకుండా గృహ రుణాన్ని భారంగా భావించకపోతే, భవిష్యత్తు ఆదాయంపై నమ్మకం ఉంటే గృహ రుణాన్ని కొనసాగించుకోవచ్చు.

అంతర్గతంగా ఎంతో విలువ దాగి ఉన్న స్టాక్స్‌ను గుర్తించడం ఎలా? – కపిల్

వాస్తవ విలువ కంటే తక్కువలో ట్రేడ్ అవుతున్న (అండర్ వ్యాల్యూడ్) స్టాక్‌ను గుర్తించం అన్నది ఆర్ట్, సైన్స్‌తో కూడుకున్నది. డిస్కౌంటింగ్ సూత్రాన్ని ఇక్కడ అమలు చేసి చూడాల్సి ఉంటుంది. అంటే వచ్చే ఐదు, పదేళ్ల కాలంలో కంపెనీ ఆదాయాలు ఏ మేరకు వృద్ధి చెందుతాయో చూడాలి. అలాగే, యాజమాన్యం ఎంత ఉత్తమమైనది? అన్నది కూడా చూడాలి. కంపెనీ నుంచి నిధులను మింగేస్తారా? విశ్వసనీయత కలిగిన వారేనా? అలాగే, ఆ కంపెనీ పనిచేస్తున్న రంగంలో మంచి వృద్ధికి అవకాశం ఉందా? భవిష్యత్తు ఉన్నదేనా? అవకాశాలను అనుకూలంగా మార్చుకోగలదా? వీటిని విశ్లేషించుకోవాలి. అలాగే, మీకు మంచిగా కనిపించిన కంపెనీల గురించి ఎన్నో ప్రతికూల వ్యాఖ్యానాలు వినిపిస్తుంటాయి. వాటన్నింటినీ తట్టుకుని పెట్టుబడులను కొనసాగించే బలం కూడా కావాలి.

లేడీ 'గేమ్స్'బాండ్స్

ఐటీ రంగంలో గేమింగ్ డెవలప్‌మెంట్ ఉద్యోగులకు 25 శాతానికి పైగా అధిక జీతాలు

వేగంగా విస్తరిస్తున్న ఆన్‌లైన్ గేమింగ్‌ను ఉపాధి మార్గంగా ఎంచుకుంటోంది యువత. ఆన్‌లైన్ గేమింగ్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, యానిమేషన్‌ను వృత్తిగా మార్చుకుని డబ్బులు సంపాదించుకుంటున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ఈ విషయంలో పురుషుల కంటే మహిళలే అధికంగా ఉంటున్నారు. ప్రముఖ కంప్యూటర్ సంస్థ 'హెచ్‌పీ ఇండియా' దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది.

- ఆన్‌లైన్ గేమ్స్ ప్రోగ్రామింగ్, డిజైనింగ్‌లో దూసుకుపోతున్న మహిళలు
- ఈ రంగంలో పురుషుల సంఖ్య 44 శాతం కాగా.. మహిళల సంఖ్య 56 శాతం
- భారత్‌లో 50.70 కోట్లకు చేరిన ఆన్‌లైన్ గేమ్స్ చందాదారుల సంఖ్య
- ప్రస్తుతం రూ.20,800 కోట్లుగా ఉన్న ఆన్‌లైన్ గేమింగ్ మార్కెట్
- 2027 నాటికి రూ.68,800 కోట్లకు చేరుతుందని అంచనా



సాక్షి, అమరావతి: కేవలం మానసిక ఉల్లాసానికి.. ఆలోచన శక్తి పెంచుకోవడానికి మాత్రమే ఆన్‌లైన్ గేమింగ్‌ను పరిమితం చేయకుండా.. దీనిని ఓ వృత్తిగా మలుచుకుంటోంది నేటి యువత. కొందరు గేమింగ్ సాఫ్ట్‌వేర్ డెవలపర్స్‌గా మారుతుండగా.. మరి కొందరు గేమింగ్ యానిమేటర్స్‌గా మారుతున్నారు. ఈ రంగంలో పురుషుల కంటే.. మహిళల శాతమే అధికంగా ఉంటోంది. ఈ రంగంలో 56 శాతం మంది మహిళలు ఉండగా.. 44 శాతం మంది మాత్రమే పురుషులు. ఆన్‌లైన్ గేమింగ్‌ను పూర్తిస్థాయిలో కొందరు, పాక్షికంగా మరికొందరు.. గిగ్ వర్కర్‌గా ఇంకొందరు సంపాదన మార్గంగా ఎంచుకుంటున్నట్టు హెచ్‌పీ ఇండియా 'ఇండియా గేమింగ్ స్టడీ 2022' పేరిట విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మరో విషయం ఏమిటంటే.. మిగిలిన ఐటీ జాబ్స్‌తో పోలిస్తే గేమింగ్ రంగంలోని ఉద్యోగులకు 25 శాతానికి పైగా అధికంగా జీతాలు లభిస్తున్నాయి. ఎందుకంటే.. గేమింగ్ రంగంలో ఆలోచనశక్తి అధికంగా ఉన్నవారు మాత్రమే నిలబడగలుగుతారని, అందుకే వారికి జీతాలు అధికంగా ఇస్తున్నారని ఐటీ రంగ నిపుణులు వెల్లడిస్తున్నారు.

వచ్చే ఐదేళ్లలో రూ.68,800 కోట్లకు చేరనున్న మార్కెట్

భారత్‌లో ఆన్‌లైన్ గేమింగ్ వేగంగా విస్తరిస్తోంది. ప్రస్తుతం 50.70 కోట్ల మంది ఆన్‌లైన్ గేమింగ్ ఆడుతున్నట్టు ఋఇంటరాక్టివ్ మీడియా వెంచర్ క్యాపిటల్ ఫండ్ లుమికియా' వెల్లడించింది. ప్రస్తుతం దేశీయ ఆన్‌లైన్ గేమింగ్ మార్కెట్ విలువ రూ.20,800 కోట్లు ఉండగా.. వచ్చే ఐదేళ్లలో మూడు రెట్లు పెరిగి రూ.68,800 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇందులో ఉపాధి అవకాశాలపై యువత ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది. సాఫ్ట్‌వేర్ రంగంలోనే 18 శాతం మంది గేమింగ్ సాఫ్ట్‌వేర్ డెవలపర్స్‌గా మారుతుండగా.. మరో 2 శాతం మంది గేమింగ్ యానిమేటర్స్‌గా ఉపాధి పొందుతున్నారు. కాగా, ఆన్‌లైన్ గేమింగ్ ఆడుతున్న వారిలో అత్యధికంగా 92 శాతం మంది వినోదం, మానసిక ఉల్లాసం కోసం ఆడుతున్నట్టు సర్వేలో తేలింది. మొబైల్ ఫోన్‌లో కంటే కంప్యూటర్‌లోనే గేమింగ్ ఆడేవారి సంఖ్య క్రమేపీ పెరుగుతోందంట. మొబైల్ కంటే పర్సనల్ కంప్యూటర్‌లోనే ఆటలు ఆడటానికి 68 శాతం మంది మొగ్గు చూపుతున్నారు. మొబైల్ కంటే కంప్యూటర్‌లో ఆడితే అనుభూతి అధికంగా ఉంటోందని, అందుకనే ఈ మధ్య కాలంలో 39 శాతం మంది మొబైల్ నుంచి కంప్యూటర్‌లోకి ఆటలు ఆడటానికి మారినట్టు సర్వేలో వెల్లడైంది.

ఆన్‌లైన్ గేమ్స్‌తోనే పిల్లల్లో చురుకు

"ఈ కాలంలో పిల్లలు బయటకు వెళ్లి ఆడుకోలేని పరిస్థితి ఉండటంతో వారి మెదడు చురుకుగా పనిచేయడానికి కనీసం రోజుకు గంట లేదా గంటన్నర ఆన్‌లైన్ గేమ్స్ ఆడుకోనివ్వాలి. ఇందుకోసం నీతిఆయోగ్ ఏర్పాటు చేసిన అటల్ థింకరింగ్ ల్యాబ్స్ (ఏటీఎల్) చక్కటి ఫలితాలను అందిస్తున్నాయి. విశాఖలోని శ్రీశారద విద్యాలయంలో గల ఏటీఎల్‌లో పిల్లలను 3, 4 వారాలపాటు ఆన్‌లైన్ గేమ్స్ ఆడుకోవడానికి వదిలేసి పరిశీలిస్తున్నారు. ఎవరైతే ముందుకు వెళ్లలేకపోతున్నారో గుర్తించి వాళ్లకు అనుగుణంగా గేమింగ్‌లో కోడింగ్ మార్చుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఇప్పుడు మ్యాథ్స్, ఫిజిక్స్ వంటి సబ్జెక్టులను గేమింగ్ రూపంలో చెప్పడం వల్ల పిల్లలకు సులభంగా అర్థమవుతోంది.

– రాజశేఖర్ వాసా, ఫౌండర్, స్కెచ్ ఈప ఐటీ, వైజాగ్

పీసీ గేమింగ్‌పై దృష్టి



మారుతున్న అభిరుచులకు అనుగుణంగా ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ పీసీ గేమింగ్‌లో మరిన్ని ఆవిష్కరణలు తీసుకువచ్చే దిశగా కృషి చేస్తున్నట్టు హెచ్‌పీ ఇండియా సీనియర్ డైరెక్టర్ విక్రమ్‌బేడి తెలిపారు. రాష్ట్రంలో కూడా ఆన్‌లైన్ గేమింగ్ అవకాశాలను అందిపుచ్చుకుంటూ పలు ఐటీ సంస్థలు ఏర్పాటవుతున్నాయని, విజయవాడ, రాజమండ్రి, విశాఖ కేంద్రంగా 8కి పైగా ఐటీ సంస్థలు ఆన్‌లైన్ గేమింగ్‌లకు వివిధ సేవలను అందిస్తున్నాయని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటాప్) ప్రెసిడెంట్ శ్రీధర్ కోసరాజు 'సాక్షి'కి తెలిపారు. ఇప్పుడు లెర్నింగ్ ఆధారిత గేమ్స్‌కు బాగా డిమాండ్ ఉండటంతో ఈ రంగంలో అవకాశాలను యువత అందిపుచ్చుకుంటోందన్నారు. వీఎఫ్ఎక్స్ యానిమేటర్స్, మెటావర్స్‌లో ఏఆర్, వీఆర్, ఎక్స్ఆర్ వంటి టెక్నాలజీలకు డిమాండ్ అధికంగా ఉందన్నారు.

'వండర్' వరలక్ష్మి

- సాఫ్ట్‌బాల్ క్రీడలో సత్తా చాటుతున్న సిక్కోలు విద్యార్థిని
- ఏసియన్ యూనివర్సిటీ మహిళల సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక
- డిసెంబర్ 17 నుంచి 21 వరకు బ్యాంకాక్‌లో పోటీలు



శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు విద్యార్థిని కూటికుప్పల వరలక్ష్మి సాఫ్ట్‌బాల్‌లో అంచలంచెలుగా ఎదుగుతూ సంచలనాలు సృష్టిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ సత్తా చాటుతోంది. తాజాగా ఏసియన్ యూనివర్సిటీ మహిళల(సీనియర్స్) సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2022 పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకుంది. ఈ పోటీలు డిసెంబర్ 17 నుంచి 21 వరకు బ్యాంకాక్‌లో జరగనున్నాయి. త్వరలో భారత జట్టు సభ్యులతో కలిసి ఆమె శిక్షణ తీసుకోనుంది.

కొత్తవలస నుంచి బ్యాంకాక్‌కు..

వరలక్ష్మి స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలంలోని కొత్తవలస. ఆమె తల్లిదండ్రులు కూటికుప్పల రాజు, భారతి దినసరి కూలీలు. పనికి వెళ్తే తప్ప పూట గడవని పరిస్థితి. తొగరాంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న సమయంలో వరలక్ష్మి సాఫ్ట్‌బాల్ క్రీడపై ఆసక్తి కనబరిచింది. అక్కడి ఫిజికల్ డైరెక్టర్ మొజ్జాడ వెంకటరమణ ఆమెకు సాఫ్ట్‌బాల్ క్రీడలో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించారు. దీంతో ఆమె జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచి.. రాష్ట్రస్థాయికి ఎంపికైంది. సాఫ్ట్‌బాల్ క్రీడలో పిక్చర్(బౌలింగ్) చేయడంలో వరలక్ష్మి దిట్ట. 2012లో అనంతపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటిసారి పాల్గొన్న వరలక్ష్మి తన అద్భుత ఆటతీరుతో.. జాతీయ పోటీలకు ఎంపికైంది. అక్కడి నుంచి వెనుదిరిగి చూడలేదు. తాను పాల్గొన్న ప్రతి పోటీలోను రాణించింది. 2019–20లో రాజస్తాన్‌లో జరిగిన సౌత్‌జోన్ సీనియర్ నేషనల్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో వరలక్ష్మి ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ జట్టు రజత పతకం సాధించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో యానాంలో జరిగిన ఆసియా కప్ సెలెక్షన్స్‌లో కూడా పాల్గొని ప్రతిభ కనబరిచి ప్రాబబుల్స్‌లో చోటు దక్కించుకుంది. వీరికి మధ్యప్రదేశ్‌లో శిక్షణా శిబిరం నిర్వహించగా.. వరలక్ష్మి సత్తా చాటి బ్యాంకాక్‌లో జరిగే ఏసియన్ యూనివర్సిటీ మహిళల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొనే భారత జట్టుకు ఎంపికయ్యింది. వరలక్ష్మి మరోవైపు చదువులోనూ ప్రతిభ కనబరుస్తోంది. తొగరాం ప్రభుత్వ జూనియర్ కాలేజీలోనే ఇంటర్ పూర్తిచేసిన ఆమె.. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని రాయలసీమ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రభుత్వ కాలేజీలో డిప్లమో ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పూర్తి చేసింది. ప్రస్తుతం ఆంధ్ర యూనివర్సిటీలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ప్రతిభకు పేదరికం ఏ మాత్రం అడ్డుకాదని వరలక్ష్మి నిరూపిస్తోందని గ్రామస్తులు, పలువురు ప్రముఖులు ప్రశంసించారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..



మాది నిరుపేద కుటుంబం. మా అమ్మ, నాన్న కూలి పనులకు వెళ్తుంటారు. మా అమ్మా, నాన్నతో పాటు మా గురువు, పీడీ వెంకటరమణ ప్రోత్సాహం వల్లే నేను ఆటలో ముందుకెళ్లా. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించారు. జాతీయ సీనియర్ జట్టుకు ఎంపిక కావడమే నా లక్ష్యం.

– కూటికుప్పల వరలక్ష్మి, సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి

ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా రెండో విడత సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: 2022–23 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీలో భాగంగా రెండో దశ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు జాబితాను ఆదివారం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. విద్యార్థులు తమకు కేటాయించిన కళాశాలల్లో మంగళవారం సాయంత్రంలోగా రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లు 3,487 ఉన్నాయి. రెండో దశ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు అనంతరం 3,471 సీట్లు భర్తీ అయ్యాయి. స్పోర్ట్స్ కోటా 16 సీట్లు ఇంకా భర్తీ చేయాల్సి ఉంది.

ఫ్రీ ఎగ్జిట్‌కు అవకాశం:
ఎంబీబీఎస్ కోర్సులో రెండో విడత కన్వీనర్ కోటా కౌన్సెలింగ్‌లో సీట్ దక్కించుకున్న విద్యార్థులెవరైనా యాజమాన్య కోటా తొలి దశ కౌన్సెలింగ్‌లో సీట్ పొంది, ఆ కళాశాలలో అడ్మిషన్ పొందినట్లైతే వారికి విశ్వవిద్యాలయం ఫ్రీ ఎగ్జిట్‌కు అవకాశం కల్పించింది. ఇలాంటి విద్యార్థులు సోమవారం సాయంత్రం నాలుగు గంటల లోగా సంబంధిత కళాశాల ప్రిన్సిపల్‌కు ఫ్రీ ఎగ్జిట్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు, ట్యూషన్ ఫీజును యాజమాన్యాలు తిరిగి ఇచ్చేయాలని అన్ని ప్రైవేట్ కళాశాలలను విశ్వవిద్యాలయం ఆదేశించింది.

ముగిసిన ఆర్జీయూకేటీ సీట్ల భర్తీ కౌన్సెలింగ్

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో స్పోర్ట్స్ కోటా, జనరల్ కలిపి మొత్తం 145 సీట్లు భర్తీ అయ్యాయి. ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి తుది విడత కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంపికై న అభ్యర్థులను, వెయిటింగ్ జాబితాలో ఉన్న అభ్యర్థులను కౌన్సెలింగ్‌కు పిలిచారు. దీంతో మొత్తం సీట్లు భర్తీ అయ్యాయి. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి గుర్తింపు కార్డులను అందజేశారు. తుది కౌన్సెలింగ్‌లో నాలుగు ట్రిపుల్ ఐటీల్లోని సీట్లన్నీ భర్తీ అయ్యాయి. కౌన్సెలింగ్ ప్రక్రియను అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్.ఎస్.ఎస్.వి.గోపాలరాజు పర్యవేక్షించారు.



అడ్మిషన్ పొందిన విద్యార్థికి గుర్తింపు కార్డును అందజేస్తున్న చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.